సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 166
శనివారం 6-9-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'


భారత్ భారీ విజయం
థాయ్‌లాండ్‌తో జరిగిన ఆసియా కప్ హాకీ మ్యాచ్‌లో 11–0తో గెలుపు -17లో


ఈ-కామర్స్‌లో కొలువుల పండుగ
3.8 లక్షల ఉద్యోగాల కల్పన. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రాలో హైరింగ్ -17లో


స్మార్ట్ టీచర్ల అవసరమే ఎక్కువ
విద్యార్థుల పురోభివృద్ధిని కనిపెడుతూ వారికి చదువుపై ఆసక్తిని పెంచే స్మార్ట్ టీచర్ల అవసరం ఎంతో ఉందని రాష్ట్రపతి ముర్ము చెప్పారు.
వివరాలు 6లో ▸


థాయ్ ప్రధానిగా అనుతిన్
థాయ్‌లాండ్ తదుపరి ప్రధానిగా అనుతిన్ చర్న్‌విరకుల్ ఎన్నికయ్యారు. అనుతిన్‌కు 311 మంది ఎంపీలు ఓటేశారు.
వివరాలు 6లో ▸


పాక్ నుంచి 400 కిలోల ఆర్డీఎక్స్
ముంబైలోకి 14 మంది ఉగ్రవాదులొచ్చారని, 400 కిలోల ఆర్డీఎక్స్‌తో మానవ బాంబులు సిద్ధంగా ఉన్నారంటూ బెదిరింపులొచ్చాయి.
వివరాలు 6లో ▸


'సరిహద్దు' అతిపెద్ద సవాల్
భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ చైనాతో సరిహద్దు వివాదమేనని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పాలకుల నెగెటివ్ మైండ్‌సెట్‌తో అభివృద్ధి ఎలా సాధ్యం?

పాలకులు సానుకూల దృక్పథంతో కాకుండా నెగెటివ్ మైండ్ సెట్‌తో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'కాళేశ్వరం'లో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.
- వివరాలు 12లో▶

రైళ్లలో గుట్టుగా గంజాయి..!

రైళ్లలో గంజాయి తరలింపు సాధారణ విషయంగా మారింది. రోడ్డు మార్గాన తరలిస్తుంటే పట్టుబడుతున్నామన్న ఉద్దేశంతో గంజాయి సరఫరా చేసేవారు రైళ్లను ఎంచుకుంటున్నారు. రెండున్నరేళ్లలో 7 వేల కిలోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- వివరాలు 5లో▶

రైతువేదికల వద్ద యూరియా అదనపు కౌంటర్లు

యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతువేదికల వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.
- వివరాలు 13లో▶

రిచ్‌మండ్ విల్లాస్ లడ్డూ.. రూ. 2.31 కోట్లు

గణనాథుడి లడ్డూల వేలం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ పరిధిలో ఉన్న కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూ వేలంలో రూ.2.31 కోట్ల ధర పలికింది.
- వివరాలు 18లో▶

'దొంగ'ముద్ర చెరుపుకోండి..

గత ప్రభుత్వ పాలకుల భూదోపిడీ విధానాన్ని ప్రజలకు వివరించండి: సీఎం రేవంత్‌రెడ్డి

వీఆర్వోలు, వీఆర్‌ఏలులేని లోటు 20 నెలల పాలనలో కనిపించింది

- ధరణితో పట్టిన దరిద్రాన్ని భూభారతితో వదిలించే ప్రయత్నం చేస్తున్నాం
- ఇది ఉద్యోగం కాదు.. భావోద్వేగం.. సమయస్ఫూర్తి, సంయమనంతో మెలగండి
- గ్రామ పాలనాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం... నియామక పత్రాలు అందజేత
- ప్రభుత్వానికి మచ్చ రాకుండా పనిచేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి సూచన



కొత్తగా నియమితులైన జీపీవోకు నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో ప్రసాద్‌కుమార్, సీతక్క, పొంగులేటి, మహేందర్‌రెడ్డి, మల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'రెవెన్యూ శాఖ సిబ్బందిని దొంగలుగా గత ప్రభుత్వం ముద్ర వేసింది. రాష్ట్రాన్ని దోచుకున్న వారిలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఇది మీ ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య. ఇది ఉద్యోగం కాదు.. భావోద్వేగం. జాగ్రత్తగా ఉండండి. సమయస్ఫూర్తి, సంయమనంతో వ్యవహరించండి. మీపై వేసిన ముద్రను తొలగించుకోవడమే కాకుండా నాటి పాలకులు దోపిడీకి పాల్పడిన విధానాన్ని ప్రజలకు వివరించే విధంగా ప్రతిజ్ఞ చేయండి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పరిపాలన చేయలేనంటూ తనపై చేస్తున్న ఆరోపణలు, పాలనలో దోపిడీకి పాల్పడ్డారని రెవెన్యూ సిబ్బందిపై వేసిన ముద్ర తప్పని నిరూపించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి
మిగతా 3వ పేజీలో ▶

విద్యారంగాన్ని సంస్కరిద్దాం
ప్రైవేటుకు మించి ప్రభుత్వ స్కూళ్లు రాణించాలి
ప్రక్షాళన కోసమే విద్యాశాఖను నేను తీసుకున్నా
గురుపూజోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
2లో

డేంజరస్ చైనాతో.. దోస్తీయా?

భారత్, రష్యాపై ట్రంప్ రుసరుసలు




- డ్రాగన్ దుష్ట కౌగిలికి దాసోహం అయ్యాయంటూ భగ్గు
- కొత్త పొత్తులు ఎంతకాలమో చూద్దామంటూ సవాళ్లు
- ఎస్‌సీఓ ఫొటో షేర్‌చేస్తూ నిష్ఠూరాలు
- ట్రంప్‌నకు దీటుగా బదులిస్తున్న రష్యా, చైనా
- విక్టరీ పరేడ్ వేదికగా చైనా బలప్రదర్శన
- ఉక్రెయిన్‌లోకి వచ్చే ఏ దేశమైనా మా శత్రువే: పుతిన్

చైనాకు రష్యా, భారత్ సన్నిహితం కావటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భగ్గుమంటున్నారు. దుష్ట చైనాతో చేతులు కలుపుతారా? అంటూ రుసరుసలాడుతున్నారు. చైనా అంధకారంలోకి మీరూ పడిపోతున్నారంటూ శాపనార్థాలు పెడుతున్నారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశంలో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ కలిసి ఉన్న ఫొటోను సోషల్‌మీడియాలో షేర్‌చేస్తూ అక్కసు వెళ్లగక్కారు. మరోవైపు అమెరికాకు దీటుగా చైనా తన సైనిక, ఆయుధ శక్తిని ప్రదర్శిస్తుంటే.. ఉక్రెయిన్‌లోకి ఏ ఇతర దేశం బలగాలు వచ్చినా దాడి చేస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు.
- వివరాలు 2లో▶

పొదుపు.. చేసి చూపించండి
డబ్బుల విషయంలో తల్లిదండ్రులు ముందు ఆర్థిక పాఠాలు నేర్చుకోవాలి.. ఆచరించాలి..వాటిని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి! ఇంతకీ వాటిని ఎలా చెప్పాలి?
2లో


విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు
ఆన్‌లైన్ సర్వేలు
వెబ్‌సైట్‌లో ఉంచిన జాతీయ టాస్క్‌ఫోర్స్
- విద్యార్థులకు వివిధ ప్రశ్నలతో ప్రత్యేక సర్వే..
- తల్లిదండ్రులూ, విద్యా సంస్థల ప్రతినిధులకూ..
- 'సుప్రీం' మార్గదర్శకాలతో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్


12లో

రాష్ట్రం మీ జాగీరా?



కమీషన్ల కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మీ వాళ్లకు పందేరం చేస్తారా?

ఏపీ సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- ప్రజల ఆస్తులను దోచుకున్న వ్యక్తిగా ఇదివరకే మీకు పేరుంది
- 2019కి ముందే మూడు దఫాలుగా సీఎంగా ఉన్న మీరు ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా పెట్టారా?
- కనీసం ఆ ఆలోచనైనా చేశారా?.. మా ఐదేళ్ల కాలంలోనే మేము పెట్టిన 17 కాలేజీల్లో 5 చోట్ల క్లాసులు ప్రారంభం.. ఎన్నికలు ముగిశాక మరో చోట అడ్మిషన్లు
- మిగిలిన పనులు మీరు బాధ్యతగా ముందుకు తీసుకెళ్లకుండా రాష్ట్రానికి ద్రోహం చేశారు..
- అలా తీసుకెళ్లుంటే గతేడాది మరో 5, ఈ ఏడాది మరో 7 కాలేజీల్లో క్లాసులు ప్రారంభమయ్యేవి కాదా?
- మేం పెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్కాంల కోసం ప్రైవేటుపరం చేస్తారా?.. ఇది అవినీతిలో మీ బరితెగింపునకు నిదర్శనం కాదా?
- ఇన్ని పాపాలు చేస్తున్న మిమ్మల్ని ప్రజలు క్షమించరు
- మేం అధికారంలోకి రాగానే ఈ నిర్ణయాలను రద్దు చేస్తాం
- ఈ కాలేజీలను మళ్లీ ప్రభుత్వ రంగంలోకే తెచ్చుకుంటాం

13లో

సంక్షేమాన్ని అమ్ముకునే పార్టీ బాగుపడదు



బీఆర్‌ఎస్ విషయంలో అదే జరిగింది
- ఇందిరమ్మ ఇళ్లలో చేతివాటం ప్రదర్శిస్తే తీవ్ర చర్యలు
- బీసీ రిజర్వేషన్ల విషయంలో ఆఖరి ఆప్షన్‌ను కూడా వినియోగించుకుంటాం.. వారం రోజుల్లో మండల, జిల్లా కమిటీలు, అక్టోబర్‌లో నామినేటెడ్ పోస్టులు
- టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమై ఏడాదైన సందర్భంగా మీడియాతో మహేశ్‌కుమార్‌గౌడ్

12లో

ఇదండీ సంగతి



భూ చిక్కులకు భూభారతి చెక్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు భూభారతి చట్టంతో పరిష్కారం లభించనుందని ప్రభుత్వం చెబుతోంది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్దుతూ ప్రస్తుత భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, సమావేశాల్లో లక్షలాదిగా దరఖాస్తులు వచ్చాయి. సర్వే నంబర్లు, ఇంటి పేరు, భూ యజమాని పేరు తప్పుగా ఉండటం, విస్తీర్ణం తక్కువగా నమోదవడం, నిషేధిత భూముల జాబితాలో పట్టా భూమి సర్వే నంబర్లు రావడం, సర్వే నంబర్లు మిస్ కావడం, సాదాబైనామా, మ్యుటేషన్, అసైన్డ్ ల్యాండ్ పట్టా, వారసత్వ పట్టా వంటివి దాదాపు 20 కేటగిరీల్లో దరఖాస్తులొచ్చాయి. అత్యధికంగా సాదాబైనామా, అసైన్డ్ భూముల దరఖాస్తులే ప్రభుత్వానికి వచ్చాయి. సాదాబైనామాలపై గతంలో విధించిన స్టేను హైకోర్టు ఇటీవల తొలగించడంతో తెల్లకాగితాలపై భూముల క్రయవిక్రయాలు చేసిన రైతులకు ఊరట లభించనుంది. 1969 నుంచి పేదలకు అసైన్డ్ భూములను కేటాయిస్తుండగా లబ్ధిదారులు విక్రయించడానికి వీల్లేకుండా 1977లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పీఓటీ చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ చాలామందికి అవగాహన లేక భూములు చేతులు మారాయి. ఈ సమస్య పరిష్కారానికి కూడా భూభారతి చట్టం దారి చూపనుంది. ఇప్పటికే అమ్మకం, కొనుగోలుదారులకు నోటీసులు జారీ చేయగా త్వరలోనే జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించనున్నారు.

రెవెన్యూ వ్యవస్థకు జవసత్వాలు

భూముల సమస్యల పరిష్కారానికి ఉన్న చట్టాల అమల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం. గతంలో మండలానికి ఒకే ఒక్క సర్వేయర్, వీఆర్‌ఏ, వీఆర్వో దరఖాస్తులు పరిశీలించేవారు. 2020లో అప్పటి
మిగతా 12వ పేజీలో ▶

రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యలపై లక్షల్లో దరఖాస్తులు
సాదాబైనామా, అసైన్డ్ భూములపైనే అత్యధికం

ఇన్నాళ్లూ క్షేత్రస్థాయి యంత్రాంగం లేక కదలని ప్రక్రియ

జీపీఓలు, సర్వేయర్ల నియామకంతో పరిశీలనకు మార్గం సుగమం



పొదుపు.. చేసి చూపించండి!



ఈ తరం పిల్లలు.. చాలా స్పీడు. వాళ్ల జోరుకు తగ్గట్టు తల్లిదండ్రులు వారికి మంచీ చెడూ చెప్పాలి. చెప్పడం కాదు.. తల్లిదండ్రులు స్వయంగా అలా నడుచుకోవాలి. ఎందుకంటే పిల్లలు ముందు అనుసరించేదీ, అనుకరించేదీ పేరెంట్స్‌నే. డబ్బుల విషయంలో మరీనూ! అందుకే, తల్లిదండ్రులు ముందు ఆర్థిక పాఠాలు నేర్చుకోవాలి.. ఆచరించాలి..వాటిని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి! ఇంతకీ వాటిని ఎలా చెప్పాలి?

ఆర్థిక పాఠాలు తల్లిదండ్రుల నుంచే

ఇంటి పెద్దలను అనుకరించే పిల్లలు | వారసత్వంగా ఖర్చులు, పొదుపు తీరు



మీ పిల్లలకు చెప్పండి..

50–30–20.. బడ్జెట్ విషయంలో అందరూ పాటించాల్సిన నియమం ఇది. దీని గురించి పిల్లలకు తప్పనిసరిగా చెప్పండి.

మొత్తం ఆదాయంలో 50 శాతం నిత్యావసరాలు, రవాణా, ఇంటి నిర్వహణ వంటి అవసరాలకు కేటాయించాలి.	30 శాతం.. హాబీలు, అప్పుడప్పుడూ సినిమాలు, రెస్టారెంట్లలో భోజనం వంటి కోరికల కోసం ఖర్చు చేయవచ్చు.

మిగతా 20 శాతాన్ని మీ కుటుంబ భవిష్యత్ లక్ష్యాలైన సొంతిల్లు, చదువులు, ఆడపిల్లల పెళ్లి వంటి వాటికోసం పొదుపు చేయాలి లేదా పెట్టుబడులు పెట్టాలి. ఏదైనా తీవ్రమైన అనారోగ్యమో, ఆర్థిక ఇబ్బందో వస్తే ఆదుకునేందుకు అత్యవసర నిధికి కూడా ఇందులోంచే కొంత కేటాయించాలి.

సాక్షి, స్పెషల్ డెస్క్

	మాటలకు.. చేతలకు..	నిత్యం 'డబ్బు' గొడవలు	ఆర్థిక విషయాల దాటవేత	పాకెట్ మనీ	మీ తరం.. ఈ తరం..
	విచ్చలవిడిగా ఖర్చు చేయకూడదని మీ పిల్లలకు చెప్పి.. మీరు మాత్రం డిస్కౌంట్ సేల్ ఉందని కొనుగోలు చేశారా? ఆర్థిక అత్యవసర సమయంలో ఇంట్లో ఎవరికీ తెలియకుండా ఏ లోన్ యాప్ లోనో లేదా స్నేహితుల దగ్గరో అప్పు చేసేశారా? మీ ఆదాయం ఎంతో పిల్లలకు తెలిసినప్పుడు.. మీరు చేస్తున్న ఖర్చు ఎక్కువన్న విషయాన్ని మీ పిల్లలు గమనించడం లేదనుకుంటే ఎలా?	భార్యాభర్తలిద్దరూ సంపాదించే వారైతే.. డబ్బు గురించి గొడవలు జరిగే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. భార్యాభర్తల్లో ఒకరు ఎక్కువగా ఖర్చు చేస్తూ మరొకరు పొదుపుగా ఉండే కుటుంబాలు కూడా ఎన్నో. ఇలాంటి కారణాల వల్ల ప్రతి ఆర్థిక నిర్ణయం గురించి వాదించుకుంటూ, ఇద్దరూ తరచుగా తగాదాలకు దిగుతుంటారు.	చాలామంది భారతీయులు పిల్లలతో డబ్బు గురించి మాట్లాడటం సరికాదని భావిస్తారు. మరీ ముఖ్యంగా ఆర్థిక సమస్యలను పిల్లలకు చెప్పకుండా దాచేస్తారు. 	చాలామంది తల్లిదండ్రులు.. ఒక వయసు దాటాక కూడా పిల్లల ప్రతి ఆర్థిక నిర్ణయంలో తలదూరుస్తుంటారు. వారిపై నమ్మకం ఉంచరు. పిల్లలకు పాకెట్ మనీ ఇవ్వడానికి ఇష్టపడరు. ఒకవేళ ఇచ్చినా.. దాని గురించి సవాలక్ష ప్రశ్నలు, ఎలా ఖర్చు చేశారంటూ విచారణలు!	మీ తల్లిదండ్రుల తరంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ భిన్నంగా ఉంది. తరాలు మారుతున్నా.. ఆర్థిక వ్యవస్థ మారుతున్నా.. అది గుర్తించకుండా ఇప్పటికీ చాలామంది తల్లిదండ్రులు పాత పాఠాలే చెప్తుంటారు.
పిల్లలపై ప్రభావం?	మీ మాటలకు, చేతలకు పొంతన లేకపోతే ఆర్థిక విషయాల్లో పిల్లలకు గందరగోళం ఏర్పడుతుంది. మీరు ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి, ప్రతినెలా వాటికే మీ జీతంలో ఎక్కువ మొత్తం ఖర్చు చేస్తున్నారని వారికి తెలిస్తే వారిలో ఆర్థిక క్రమశిక్షణ తప్పిపోతుంది. మీరు చెప్పే మాటలను పిల్లలు నమ్మకపోవచ్చు.	తల్లిదండ్రుల గొడవల వల్ల పిల్లల్లో డబ్బు గురించి ఆందోళన, ఒత్తిడి పెరుగుతాయి. ఆర్థిక విషయాలంటే పిల్లల దృష్టిలో.. గొడవలకు దారితీసేవిగా మారిపోవచ్చు. దీంతో డబ్బు గురించి చర్చ అంటేనే భయపడవచ్చు. 	దీనివల్ల పిల్లలకు డబ్బు గురించి అవగాహన లేకుండా పోతుంది. డబ్బు గురించి ఏమీ తెలియకపోవడం వల్ల.. దాని గురించి మాట్లాడాలంటేనే సిగ్గు, ఎవరికీ తెలియకుండా రహస్యంగా ఆర్థిక లావాదేవీలు చేయాలన్న ఆలోచనలు పెరుగుతాయి.	ఇది మంచి–చెడు గురించి నేర్చుకోకుండా చేయడమే కాకుండా భవిష్యత్తులో వారు తల్లిదండ్రులపై ఆర్థికంగా ఆధారపడేలా చేస్తుంది. ఆ అసంతృప్తి.. తెలిసీ తెలియని వయసులోనే 'అప్పుల'వైపు వారి మనసును మళ్లేలా చేయవచ్చు.	పాతకాలం నాటి సిద్ధాంతాలతో మీ ఎంపికలను గుడ్డిగా అమలు చేయడం వల్ల పిల్లలు కొత్త ఆర్థిక పాఠాలు నేర్చుకోలేరు. అదే సమయంలో వారి స్నేహితుల్లో కొందరు ఆర్థిక విషయాల్లో చురుగ్గా వ్యవహరిస్తుండటం వీరి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. ఆర్థిక విషయాలను మీకు చెప్పాలన్నా సంకోచిస్తారు.
ఎలా నివారించాలి?	మీ పిల్లలు తెలివిగా ఖర్చు చేయాలనుకుంటే మీరు బడ్జెట్‌ను ఎలా తయారు చేస్తారో వారికి ప్రత్యక్షంగా చూపించండి. ముందుగా అత్యవసరమైన వస్తువులకే ప్రాధాన్యత ఇవ్వండి. ఖర్చు చేయదగ్గ డబ్బులు మిగిలితే తక్కువ అవసరం ఉన్న వస్తువులను ఎంచుకోండి. ప్రతినెలా పొదుపు చేయడమూ నేర్పించండి.	ఆర్థిక విషయాల గురించి భార్యాభర్తలు కూర్చుని మాట్లాడుకోవాలి. కుటుంబ సాధారణ లక్ష్యాలు, పిల్లల చదువుకు పొదుపు చేయడం, ఇంటికి కావాల్సిన ముఖ్యమైన వస్తువులు ప్రాధాన్యతగా ఉండాలి. ఇదే విషయాన్ని పిల్లలకు చెప్పడం అవసరం.	పిల్లల వయసుకు తగ్గట్టుగా వారితో ఆర్థిక విషయాలు చర్చించాలి. ఇంట్లో ప్రతినెలా ఎంత ఆదాయం వస్తోంది, ఏయే విషయాలకు ఎంత ఖర్చు చేస్తున్నారు.. ఇవన్నీ చర్చించాలి. డబ్బు జీవితంలో ఎంత ముఖ్యమైనదో వారికి అర్థమైతే.. ఆర్థిక క్రమశిక్షణ దానంతట అదే వస్తుంది.	పాకెట్ మనీ పిల్లలకు కొద్దిగా ఇవ్వండి. దీనిని వారు ఎలా ఖర్చు చేస్తున్నారో.. ఏదో ఇంటరాగేషన్ చేస్తున్నట్టు కాకుండా, సరదా సంభాషణల్లో తెలుసుకోవాలి. దీనివల్ల వారిలో ఆత్మవిశ్వాసం,మీపై నమ్మకం, గౌరవం పెరుగుతాయి. స్వతంత్ర ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటూ డబ్బును బాధ్యతగా ఖర్చు చేస్తారు.	ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడున్న ఆర్థిక సాధనాల గురించి ముందుగా మీరు కొంతైనా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సొంత నిర్ణయాలు తీసుకోవడానికి వారిని అనుమతించండి. చిన్న చిన్న ఆర్థిక వ్యవహారాల్లో వాళ్లు తప్పులు చేసినా ఫర్వాలేదు. వాటి నుంచి నేర్చుకుంటారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి చేయండి

- సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: పట్టుదలతో రాష్ట్ర పాల ఉత్పత్తి రంగాన్ని లాభాల్లోకి తీసుకొచ్చి.. ఆ మొత్తాన్ని పాడి రైతుల సంక్షేమానికి వెచ్చించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఏడాది పదవీకాలం పూర్తి చేసుకున్న గుత్తా అమిత్‌రెడ్డి.. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను సత్కరించారు. ప్రతినెలా రూ.10 కోట్ల నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని.. ఏడాది కాలంలోనే లాభాల్లోకి తీసుకువచ్చామని వివరించారు. మరో ఏడాదిలో విజయ డెయిరీ అమ్మకాలను మరింత పెంచుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, సి.రోహిణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖేలో ఇండియా 8వ ఎడిషన్‌ను తెలంగాణకు ఇవ్వాలి

కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఖేలో ఇండియా ఎనిమిదో ఎడిషన్‌ను తెలంగాణకు కేటాయించాలని,క్రీడా రంగ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కలసి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం వాకిటి శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ, 'సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఖేలో ఇండియా నిర్వహణ అంశంపై కేంద్రమంత్రిని కలసి విజ్ఞప్తి చేశారు. తాజాగా నేను కూడా మరోసారి ఈ విషయాన్ని వివరించాను. తెలంగాణ అన్ని విధాలుగా అనువైన ప్రదేశమని చెప్పి, వచ్చే ఏడాది ఖేలో ఇండియా 8వ ఎడిషన్ క్రీడలను తెలంగాణకే కేటాయించాలని కోరాం'అని తెలిపారు. హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్, వనపర్తి సహా రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అవసరమని మంత్రి వాకిటి వివరించారు. స్పోర్ట్స్ వర్సిటీకి సహకారం అందించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి వెల్లడించారు.

విద్యా రంగాన్ని సంస్కరిద్దాం

- ప్రైవేటుకు మించి ప్రభుత్వ స్కూళ్లు రాణించాలి
- ప్రక్షాళన కోసమే విద్యాశాఖను నేను తీసుకున్నా
- తెలంగాణకు ప్రత్యేక విద్యా విధానం కోసం కమిటీ వేశాం
- టీచర్లు బాగా పనిచేస్తే నేను మళ్లీ సీఎం అవుతా
- విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు
- గురుపూజోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్యారంగాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని, దీని కోసం ప్రతి ఒక్కరూ కలిసి నడవాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రానికి సరికొత్త విద్యా విధానం రూపొందించేందుకే ప్రత్యేక అధ్యయన కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ రంగానికి మించిన నాణ్యతతో ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందించాలని కోరారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలకోపన్యాసం చేశారు. గత పదేళ్లలో విద్యాశాఖ నిర్వీర్యమైందని, చారిత్రక ప్రాధాన్యత గల ఉస్మానియా యూనివర్సిటీ మూతపడే దశకు చేరిందన్నారు. విద్యా శాఖను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యా విధానంలో సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షించాలన్న ఉద్దేశంతోనే దానిని తన వద్ద ఉంచుకున్నానని సీఎం తెలిపారు. దీనిపై కొంతమంది చేస్తున్న విమర్శలు అర్థం లేనివని కొట్టిపారేశారు. పదేళ్లుగా ఈ శాఖ అస్తవ్యస్తమైందని విమర్శించారు. ప్రొఫెసర్లను నియమించకుండా యూనివర్సిటీలను నీరుగార్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే టీచర్ల బదిలీలు, 55 రోజుల్లోనే 11 వేల మంది టీచర్ల నియామకాలు చేపట్టామని చెప్పారు.



ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల స్టాల్‌ను పరిశీలిస్తూ.. ముచ్చటిస్తున్న సీఎం

టీచర్లు బాగా పనిచేస్తే మేము మళ్లీ గెలుస్తాం

తెలంగాణ ఉద్యమాన్ని పల్లెలకు తీసుకెళ్లిన ఘనత టీచర్లదేనని సీఎం అన్నారు. 'ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి ముఖ్యమంత్రి కావడానికి విద్యాభివృద్ధే కారణం. నాలోనూ ఆ స్వార్థం ఉంది. టీచర్లు బాగా పనిచేస్తేనే నేను రెండోసారి సీఎం అవుతాను. ఉపాధ్యాయ సంఘాలు ఎప్పుడొచ్చినా సమస్యలు విని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నా. ప్రైవేట్ కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువ విద్యావంతులు, సామాజిక బాధ్యత తెలిసినవారు. టీచర్లకు జీతాలిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు. మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. పాఠశాలల నిర్వహణకు ఏటా రూ.130 కోట్లు మంజూరు చేస్తున్నాం'అని తెలిపారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేయండి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొన్నిసార్లు విషపూరితం కావటం దురదృష్టకరమని సీఎం అన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలతో కలసి ఉపాధ్యాయులు భోజనం చేయాలని కోరారు. అప్పుడే తప్పులు జరగకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు. అప్పుడప్పుడు తాను కూడా విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల చేరికలు పెరిగాయని చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ కన్నా మంచి విద్యను అందిస్తామని టీచర్లు ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు.

బలమైన పునాది అవసరం

విద్యకు బలమైన పునాది అవసరమని సీఎం అన్నారు. 'విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవడం కీలకం. దీని దృష్టిలో ఉంచుకునే వరల్డ్ బెస్ట్ మోడల్‌గా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నాం. నిరుద్యోగ యువతకు నైపుణ్యాన్ని అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. 65 ఐటీఐలను టాటా కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్‌గా ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశాం. దేశ ప్రతిష్టను పెంచేలా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నాం'అని వివరించారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్ తెస్తున్నామని ప్రకటించారు. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురుపూజోత్సవ విశిష్టతను, గురువులకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, ఎమ్మెల్సీలు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సాంకేతిక విద్య కార్యదర్శి దేవసేన తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అవార్డులు అందించారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు.

డేంజరస్ చైనాతో.. దోస్తీయా?

భారత్, రష్యాపై ట్రంప్ రుసరుసలు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులు.. ధీటుగా చైనా, రష్యా సవాళ్లతో ప్రపంచం ఉద్రిక్తంగా మారుతోంది. మధ్యేమార్గం అనేది మాయమై.. ప్రపంచం రెండు ముక్కలుగా చీలుతోంది. అమెరికా బెదిరింపులకు గురైనవారిని తాను కాపాడుతాను అన్నట్లుగా చైనా తన సైనిక బలాన్ని ప్రదర్శించటంతో రెండు ప్రపంచ మహాశక్తులు యుద్ధానికి ఎదురెదురుగా నిలబడినట్లయ్యింది. ఈ అసాధారణ పరిణామానికి ఈసారి భారత్ కేంద్ర బిందువుగా, బాధితురాలిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల చైనాలో నిర్వహించిన షాంఘై సహకార సమాఖ్య (ఎస్‌సీఓ) సమావేశంలో కనిపించిన ఒకే ఒక్క దృశ్యం ఇప్పుడు ప్రపంచ దృక్పథాన్ని మార్చివేస్తోంది.

ట్రంప్ నిష్ఠూరాలు

ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాను లొంగదీసుకునేందుకు భారత్‌ను వాడుకోవాలని భంగపడి.. సుంకాల పేరుతో బెదిరింపులకు దిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఎస్‌సీఓ సమావేశంపై భయపడుతూనే నిష్ఠూరాలు ఆడారు. ఆ సమావేశంలో భారత ప్రధాని నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ నవ్వుతూ మాట్లాడుకుంటున్న ఫొటోను తన సొంత సోషల్‌మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో షేర్ చేస్తూ భారత్, రష్యాను తాము కోల్పోయామని రాసుకొచ్చారు. 'చూడబోతే మేము అంధకార అగాధమైన చైనాకు భారత్, రష్యాలను కోల్పోయినట్లు కనిపిస్తోంది. వారి భవిష్యత్తు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నా' అని వ్యంగ్యంగా రాసుకొచ్చారు. దుష్ట చైనాతో చేతులు కలిపితే అంధకారంలోకి వెళ్లినట్లేనని భావాత్మకంగా చెప్పారు. అదే సమయంలో తన దారికి తెచ్చుకోవాలనుకున్న రష్యా, భారత్‌లు తన ప్రత్యర్థి అయిన చైనా వైపు వెళ్లిపోయాయన్న భయం కూడా ఆయన మాటల్లో కనిపించిందని నిపుణులు పేర్కొంటున్నారు.

యుద్ధమా? శాంతా?

ప్రపంచంపై అమెరికా ఆధిపత్యానికి ముగింపు పలికే సుముహూర్తం ఇదేనని చైనా భావిస్తోంది. ఈ నెల 3న ఆ దేశం విక్టరీ పరేడ్‌లో చేసిన బలప్రదర్శన ప్రపంచానికి ఈ అంశంలో స్పష్టమైన సందేశం ఇచ్చింది. అమెరికా పేరు ప్రస్తావించకుండానే 'శాంతియా? యుద్ధమా?'తేల్చుకోవాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టమైన హెచ్చరిక జారీచేశారు. ఆ సమావేశానికి అమెరికా ఆగర్భ శత్రువులైన ఉత్తరకొరియా, ఇరాన్ దేశాల అధినేతలు కూడా హాజరయ్యారు. అమెరికా బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, కాపాడేందుకు తాను ఉన్నానన్న భావన జిన్‌పింగ్ ప్రకటనలో కనిపించిందని నిపుణులు పేర్కొంటున్నారు. జిన్‌పింగ్ ప్రకటనకు కొనసాగింపు అన్నట్లుగా రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా అలాంటి ప్రకటనే చేశారు. ఉక్రెయిన్‌తో ఏ దేశం తన బలగాలను మోహరించినా వాటిపై దాడులు చేస్తామని శుక్రవారం హెచ్చరిక జారీచేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గురువారం యూరోపియన్ దేశాధినేతలతో సమావేశమై సైనిక మద్దతు కోరిన నేపథ్యంలో పుతిన్ ప్రకటన సంచలనంగా మారింది. ఎందుకంటే అమెరికాతోపాటు దాదాపు యూరప్ దేశాలన్నీ నాటోలో భాగస్వాములుగా ఉన్నాయి. ఒకవేళ నాటో బలగాలు ఉక్రెయిన్‌లోని అడుగుపెడితే.. వాటితో ముఖాముఖి యుద్ధానికి సిద్ధమని పుతిన్ తేల్చి చెప్పారు. దీంతో ప్రాంతీయ ఘర్షణలన్నీ కలిసి నిర్ణయాత్మక ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా? అన్న ఆందోళన ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది.



పుతిన్, జిన్‌పింగ్, నరేంద్రమోదీ ఉన్న ఫొటోను పోస్ట్ చేసిన ట్రంప్

భారతే కీలకం

దశాబ్దాలుగా మధ్యేవాద విధానంతో ప్రపంచ ప్రధాన శక్తులన్నింటితో సుహృద్భావ సంబంధాలు కొనసాగిస్తున్న భారత్.. ప్రస్తుతం ఎటో ఒకవైపు మొగ్గాల్సిన సంకట స్థితిలో పడింది. తన ప్రమేయం లేకుండానే అమెరికా– చైనా శక్తుల మధ్య కేంద్ర బిందువుగా, బాధితురాలిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. భారత్ జోక్యం చేసుకుంటేనే రష్యా– ఉక్రెయిన్ యుద్ధం ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే వాదిస్తున్నారు. అందుకు భారత్ స్పందించకపోవటంతో భారత వస్తువులపై 50 శాతం ప్రతీకార సుంకాలు విధించారు. దీంతో అనివార్యంగానే మనదేశం.. చైనా, రష్యాకు మరింత దగ్గర కావాల్సి వస్తోందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు అమెరికాను దెబ్బకొట్టాలంటే చైనా, రష్యాలకు కూడా భారతే కీలకంగా మారింది. ఎస్‌సీఓ సమావేశానికి 10 సభ్య దేశాధినేతలు, మరికొన్ని ఆహ్వానిత దేశాల నేతలు విచ్చేసినా.. అందరి దృష్టి భారత ప్రధాని నరేంద్రమోదీపైనే కేంద్రీకృతమైంది. ఈ సమావేశం తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై సొంత దేశంలో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. భారత్‌ను అనవసరంగా దూరం చేసుకున్నామన్న బాధ ఆ విమర్శల్లో కనిపిస్తోంది. అయితే, చైనాతో భారత సంబంధాలు తక్షణం గొప్పస్థాయికి వెళ్తాయన్న నమ్మకం లేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. సరిహద్దు సమస్యే భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ప్రధాన అడ్డంకి అన్న చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ మాటలను గుర్తుచేస్తున్నారు.

ఉపాధ్యాయులపై మంత్రి అసహనం

- 'టీచర్స్ డే' సభలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడే సమయానికి భోజనానికి వెళ్లిన ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని చిన్నవెంకటరెడ్డి ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించే కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. అయితే మంత్రి మాట్లాడే సమయానికి సభలో సగం మంది ఉపాధ్యాయులు భోజనానికి వెళ్లడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. 'నాకు హైదరాబాద్‌లో పని ఉన్నా ఉపాధ్యాయ దినోత్సవానికి కచ్చితంగా హాజరు కావాలని వచ్చాను. నేను ఎంతో మాట్లాడాలని వస్తే మీరు సభలోనే ఉండకుండా ఇలా వ్యవహరించడం బాధ కలిగించింది. నేను మాట్లాడకుండా వెళ్లిపోదామనుకున్నా. కలెక్టర్ రిక్వెస్టుతో ఆగిపోయాను. మీ గౌరవం నిలబెట్టడానికే ఉన్నాను' అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సొంత పార్టీపైనే పోరాడి మంత్రి పదవికి రాజీనామా చేశానని, తనకు పదవులు ముఖ్యం కాదని మంత్రి చెప్పుకొచ్చారు. 'సభ ప్రారంభమై అరగంట కాలేదు. మనం ప్రోగ్రాం పెట్టుకున్నాం. నేను మాట్లాడతానని తెలిసి కూడా 50 శాతం మంది బయటకు వెళ్లడం బాధాకరం. మీరేం చేస్తున్నారో ఆలోచించాలి'అని ఉపాధ్యాయులను కోరారు. సభలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, ఎస్పీ శరత్‌చంద్రపవార్ తదితరులు పాల్గొన్నారు.

రండి.. పెట్టుబడులు పెట్టండి

- డెన్మార్క్ రాయబారితో ఉత్తమ్ భేటీ



సాక్షి, హైదరాబాద్: డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టెన్సన్ శుక్రవారం నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో రెండు దేశాలు మరింత బలపడాలని ఉభయులూ ఆకాంక్షించారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉంటుందని ఉత్తమ్ స్పష్టం చేశారు. సమాచార, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆధునిక వసతులు, ఫార్మా రంగంలో పురోగతిని వివరించారు. ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పారిశ్రామికవేత్తలు తరలివస్తున్నారని చెప్పారు. డెన్మార్క్ కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఉత్తమ్ ఆహ్వానించారు.

హైదరాబాద్‌లో సింగరేణి ఆస్పత్రి

- కార్మికులకు 'సూపర్' వైద్యసేవలు అందించేలా ఏర్పాటు
- సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణకు నోటిఫికేషన్ జారీ
- ఆస్పత్రి లీజు లేదా పూర్తిస్థాయిలో కొనుగోలుకు యత్నాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి సంస్థ తన కార్మికులు, ఉద్యోగుల కోసం హైదరాబాద్‌లో సొంతంగా ఆస్పత్రి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం వైద్యరంగంలో కొనసాగుతూ సింగరేణికి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్న సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 12లోగా తమ ఆసక్తిని తెలపాలని కోరింది. సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆస్పత్రిలో 150 నుంచి 200 వరకు పడకల సామర్థ్యం ఉండాలని పేర్కొంది. ఆసక్తి ఉన్న సంస్థల నుంచి ఆస్పత్రిని పూర్తిగా కొనుగోలు చేయడం లేదా లీజుకు తీసుకుంటామని తెలిపింది. సింగరేణి సంస్థ తన ఉద్యోగులు, కార్మికులకు ఏటా వైద్య సేవలపై రూ.500 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఇంత ఖర్చుచేసినా కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సొంతంగా హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభించాలని నిర్ణయించింది. దీనివల్ల 42 వేల మంది రెగ్యులర్, 34 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులతోపాటు 50 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఒకేచోట వైద్య సేవలు అందనున్నాయి.

కార్మికుల ఆరోగ్యం కోసమే...



రూ.కోట్లు వెచ్చిస్తున్నా రిఫరల్ ఆస్పత్రుల సేవలపై కార్మికులు, యాజమాన్యం సంతృప్తిగా లేదు. రామగుండం, కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ స్థాయి సేవలు అందించే నిపుణుల కొరత ఉంది. అందుకే హైదరాబాద్‌లో సొంత ఆస్పత్రి ప్రారంభించాలని నిర్ణయించాం. కేన్సర్ మినహా ఆర్థో, గుండె, న్యూరో, లివర్, వెన్నుపూస, కిడ్నీ, ఊపిరితిత్తులు, ఈఎన్‌టీ, గైనిక్, కంటి విభాగాల్లో సూపర్ స్పెషాలిటీల సేవలు అందించాలనేది లక్ష్యం.

– బలరామ్‌నాయక్, సీఎండీ, సింగరేణి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి అవార్డును అందుకుంటున్న పవిత్ర, ప్రొ.గోయల్, వినీత్, స్నేహలత



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న

పవిత్ర, ప్రొ.గోయల్, వినీత్

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన ముగ్గురికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందజేశారు. పాఠశాల విద్యా విభాగంలో మారం పవిత్ర, ఉన్నత విద్యలో గోయల్, వినీత్ బాలసుబ్రమణ్యం ఈ అవార్డులు అందుకున్నారు. కాగా, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ట్రైనర్ స్నేహలత సైతంఅవార్డు అందుకున్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి దేశవ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డులను అందించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి మాధబత్తుల తిరుమల శ్రీదేవి, విజయలక్ష్మి, దేవానందకుమార్ రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

‘దొంగ’ ముద్ర చెరుపుకోండి..

▶ మొదటి పేజీ తరువాయి

రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణలో భాగంగా కొత్తగా నియమితులైన గ్రామ పాలనాధికారుల (జీపీవో)కు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ నియామక పత్రాలు అందజేశారు.

భూములు చెరబట్టేందుకే నాడు ధరణి భూతం..

ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో భూమికి, ప్రజలకు ఉన్న అవినాభావ సంబంధం తల్లీబిడ్డ బంధం లాంటిదన్నారు. నాటి పాలకులు ధన, భూదాహంతో తెలంగాణ భూభాగాన్ని చెరబట్టాలనే ఆలోచనతో ధరణి అనే భూతాన్ని తెచ్చారని రేవంత్ దుయ్యబట్టారు. ఆ భూతం ద్వారా కొల్లగొట్టే భూముల లెక్కలు ప్రజలకు తెలియకూడదనే దురాలోచనతోనే వీఆర్వో, వీఆర్‌ఏలను బలి ఇచ్చి ఆ వ్యవస్థలను తొలగించారని ఆరోపించారు. ప్రజల ముందు రెవెన్యూ సిబ్బందిని దోషులుగా నిలబెట్టి నిస్సహాయులను చేశారని విమర్శించారు. దోపిడీదారులంటూ పచ్చబొట్టు లాంటి ముద్ర వీఆర్వోలు, వీఆర్‌ఏలపై వేసిన నాటి పాలకులు కాళేశ్వరం కూలిపోయిందని ఆ పార్టీని రద్దు చేస్తారా? అని ప్రశ్నించారు. వీఆర్వోలు, వీఆర్‌ఏల తరహాలోనే ఆ పార్టీ నేతలను ఉద్యోగాల నుంచి తొలగిస్తారా? అని నిలదీశారు. రూ. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలిపోయిన విషయాన్ని తాను కాదని.. గ్రామాల్లోకి ఇప్పుడు వెళ్తున్న గ్రామ పాలనాధికారులే ప్రజలకు చెబుతారన్నారు.

నాటి పాలకులు కొల్లగొట్టిన భూముల లెక్కలు తీయండి

గతంలో వీఆర్వో వ్యవస్థ రద్దు కారణంగా పేదలకు న్యాయం జరగలేదని.. వీఆర్వోలు, వీఆర్‌ఏలు లేని లోటు తమ 20 నెలల పాలనలో కనిపించిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పుడు గ్రామ పాలనాధికారుల రూపంలో రెవెన్యూ సిబ్బంది పేదలకు సేవ చేస్తారని.. రైతుల సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. నాడు ధరణితో పట్టిన దరిద్రాన్ని భూభారతి చట్టంతో వదిలించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ‘నాటి పాలకులు అంటించిన వైరస్ ధరణి. ఆ వైరస్‌తో కొల్లగొట్టిన భూముల లెక్కలు తొందర్లోనే గ్రామ పాలనాధికారులు బయటకు తీయాలి. ఈ వ్యవస్థను పనిచేయించే బాధ్యత మంత్రి పొంగులేటిదే. మీపై, మంత్రిపై నాకు నమ్మకం ఉంది’ అని సీఎం రేవంత్ అన్నారు.

భూసమస్యలన్నింటినీ పరిష్కరించండి

భూభారతి చట్టం ఫలాలను పేదలకు అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ పాలనాధికారుల నియామకం చేపట్టామని.. సాధారణ భూసమస్యలతో పాటు సాదాబైనామాల సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. నిజాం, రజాకార్లు, భూస్వాములు, జాగీర్దార్లు, జమీందార్లకు పట్టిన గతే ధరణి ముసుగులో భూదోపిడీకి పాల్పడాలనుకునే వారికి కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో గుణపాఠం రూపంలో పట్టిందని రేవంత్ పేర్కొన్నారు. అందుకే ప్రజాపాలన వచ్చిందని.. ఇందిరమ్మ రాజ్యంలో మళ్లీ కొలువుల జాతర మొదలైందన్నారు. ‘ఉద్యోగం ఒకటి కాకపోతే ఇంకొకటి వస్తుంది. ఏదో పని దొరకుతుంది. కానీ మీపై పడిన మచ్చను చెరిపేసుకొనే అవకాశం అరుదుగా వస్తుంది. రెవెన్యూ శాఖపై పడిన మరకను చెరిపేసే బాధ్యత మీ 5 వేల మందిపై ఉంది. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. భుజం తట్టి ప్రోత్సహిస్తుంది. మీరిచ్చిన సూచనలను తీసుకుంటుంది’ అని సీఎం రేవంత్ అన్నారు. కాగా, క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించినందుకు రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, రమేశ్‌పాక, బాణాల రాంరెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి, కె. గౌతమ్ కుమార్, గోల్కొండ సతీశ్ తదితరులు సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉగాది నాటికి 7 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా నియమితులైన జీపీవోలు ప్రభుత్వానికి చిన్న మచ్చ కూడా రాకుండా పని చేయాలని కోరారు. గత సర్కారు ధరణి చట్టానికి మూడేళ్లయినా నియమ, నిబంధనలు రూపొందించలేదని.. భూభారతి చట్టానికి మాత్రం 90–92 రోజుల్లోనే పకడ్బందీగా నియమ, నిబంధనలు రూపొందించి ప్రజలకు అంకితమిచ్చామని ఆయన చెప్పారు. అందరికీ రోల్‌మోడల్‌గా ఉండేలా చట్టం చేసేందుకు సీఎంను చాలా సార్లు విసిగించామని.. ఆయన కూడా 36 గంటలు నిద్రపోలేదని గుర్తుచేసుకున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి పెండింగ్‌లో పెట్టిన సాదాబైనామాల దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని.. నాడు రద్దయిన క్షేత్రస్థాయి రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రాబోయే ఉగాది నాటికి 7 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని వెల్లడించారు. ప్రతి డిసెంబర్ 31న జమాబందీ నిర్వహిస్తామని.. భూభారతి చట్టం చుట్టంలాగా రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా కొత్త జీపీవోలతో మంత్రి పొంగులేటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర నియమానుసారంగా కర్మలు చేస్తూనే
ఈ ప్రపంచంలో నూరేళ్లు నిండుగా బతకాలని కోరుకోవాలి.
ఈ విధంగా త్యాగభావంతో, ఈశ్వరార్థం చేసే కర్మలు నిన్ను అంటవు.
– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి
శనివారం, 6 సెప్టెంబర్ 2025

చైనా కండబలల ప్రదర్శన

రెండో ప్రపంచ యుద్ధంలోనూ, జపాన్ దురాక్రమణను ప్రతిఘటించటంలోనూ విజయం సాధించి ఎనిమిది దశాబ్దాలవుతున్న సందర్భంగా బుధవారం తియనాన్మెన్ స్క్వేర్‌లో నిర్వహించిన సైనిక పరేడ్‌లో చైనా తన రక్షణ పాటవాన్ని ప్రదర్శించటం కన్నా బలప్రదర్శనకు ప్రాధాన్యమిచ్చింది. వ్యూహాత్మక అణ్వస్త్రాలు తన దగ్గరున్నాయని, ఇక రాబోయేదంతా తన యుగమేనని చాటదల్చుకున్నట్టుంది. 1949లో ప్రజా రిపబ్లిక్‌గా ఏర్పడింది మొదలు ఆ దేశం పదేళ్లపాటు ఏటా ఇలాంటి ఆర్భాటాన్ని ప్రదర్శించేది. ఎందుకో ఆ తర్వాత ఆపి, తిరిగి 1984లో పునరుద్ధరించింది. ప్రస్తుత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆ పరేడ్‌ను విక్టరీ డే ఉత్సవంగా మార్చారు. ఈ తరహా పరేడ్‌లకు విదేశీ అతిథుల్ని పిలవటం అందరూ పాటించే ఆనవాయితీ. అయితే చైనా ఒక్కసారి 1959లో మాత్రమే దాన్ని పాటించింది. మళ్లీ అరవై ఆరేళ్ల తర్వాత ఇన్నాళ్లకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ పాల్గొన్నారు. వారిద్దరే కాదు... చైనా సన్నిహితులుగా ముద్రపడిన ఇరాన్, పాకిస్తాన్ తదితర దేశాల నుంచి కూడా అధినేతలు హాజరయ్యారు.

ఈ పరేడ్‌ల సంప్రదాయం ఎవరు మొదలెట్టారోగానీ ఇందులో ప్రదర్శించేవన్నీ మారణాయుధాలు. ఈసారి పరేడ్‌లో చైనా వంద రకాల మారణాయుధాలను ప్రదర్శించింది. యుద్ధతంత్రాన్ని సమూలంగా మార్చగల ఆయుధాలే అందులో ఎక్కువ. సంప్రదాయ యుద్ధంలోనూ, కొత్త తరహా యుద్ధంలోనూ తమ దరిదాపుల్లోకి రాగలవారెవరూ లేరని చైనా చెప్పదల్చుకున్నట్టు స్పష్టంగా కనబడుతోంది. పొరుగునున్న తైవాన్ దురాక్రమణకు ఇదొక రిహార్సల్ కావొచ్చన్న అనుమానాలు అందరిలో ఉన్నాయి. తైవాన్ జోలికెళ్తే అమెరికా దాడికొస్తుందన్న సంశయం చైనాకుండేది. కానీ ఉక్రెయిన్‌పై కత్తిగట్టిన పుతిన్ ముందు అమెరికా, పాశ్చాత్య దేశాలు నిస్సహాయులుగా మిగిలిన వైనం చూశాక తానూ తైవాన్‌లో ఆ మాదిరి ప్రయత్నం చేయొచ్చని చైనా భావిస్తూండవచ్చు. ఈ పరేడ్ ద్వారా చైనా దాన్నే చెప్పదల్చుకుందా?

పరేడ్‌లు చూసి తమ దేశం శక్తిమంతంగా తయారైందని, శత్రువులు వణుకుతున్నారని సంబరాలు చేసుకునేవారు అన్ని దేశాల్లోనూ కనబడతారు. కానీ క్షణాల్లో భూమండలాన్ని భస్మీపటలం చేయగల శక్తి తమకున్నదని చాటుకోవటంలో ఉండే ఆనందమేమిటో సామాన్యులకు అర్థం కాదు. అణ్వస్త్రాన్ని మొదటగా ఉపయోగించబోమని చైనా మొదటినుంచీ చెబుతోంది. కానీ అది ప్రదర్శించిన అణు జలాంతర్గామి తీరు చూస్తుంటే ఆత్మరక్షణ కాదు... ఎదురుదాడికి చైనా సంసిద్ధమైందన్న అభిప్రాయం కలుగుతుంది. చడీచప్పుడూ లేకుండా, అమెరికా గూఢచర్యానికి దొరకకుండా ఏ ఖండంలోని సాగర జలాల్లోనైనా దాన్ని మోహరించ వచ్చంటున్నారు. నీటి అట్టడుగున ఎంత దూరమైనా దూసుకెళ్లగల డ్రోన్లు, 2000 కిలోమీటర్ల శ్రేణిలోని విమాన వాహక నౌకలను ధ్వంసం చేయగల వైజె-21 హైపర్‌సోనిక్ క్షిపణి వగైరాలను పరేడ్‌లో ప్రదర్శించింది. శబ్దవేగం కన్నా పదిరెట్ల వేగం దీని సొంతం.

ఉత్తర కొరియా నుంచి దక్షిణ కొరియాకు ముప్పు ముంచుకురాగలదన్న అనుమానంతో అమెరికా అతి జాగ్రత్తలు తీసుకునేది. ఇకపై దానికి జపాన్ రక్షణ బాధ్యత అదనం. ఇప్పటికే జపాన్ తీరం పొడవునా టైఫూన్, తోమహాక్, ఎస్ఎం-6 క్షిపణుల్ని మోహరించింది. ప్రపంచం గుర్తుపట్టలేనంతగా మారిపోతోంది. జరుగుతున్న పరిణామాలన్నీ ఉద్రిక్తతలను మరిన్ని రెట్లు పెంచేవే. చైనా పరేడ్ కూడా అటువంటిదే. ప్రపంచ శాంతికి దోహదపడతామని ఒకపక్క చెబుతూ కండబలాన్ని ప్రదర్శించటం సరికాదన్న స్పృహ కూడా ఆ దేశానికి లేకపోయింది. ఆహ్వానించిన షీ జిన్‌పింగ్‌తోపాటు అతిథులుగా వచ్చిన పుతిన్, కిమ్‌లు కూడా నియంత లక్షణాలు పుణికిపుచ్చుకున్నవారు. ఎన్నికలు లేకుండానో... బూటకపు ఎన్నికల ద్వారానో అధికారంలోకొచ్చినవారు. వీరికి జనమన్నా, వారి భద్రతన్నా ఏం పట్టింపు ఉంటుంది? సుంకాల యుద్ధంలో తలమునకలై అన్నిటినీ గాలికొదిలిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... జిన్‌పింగ్, పుతిన్‌లు ఉమ్మడిగా అమెరికాపై కుట్ర సాగిస్తున్నారని ఆరోపించారు. కనుక రాగల రోజుల్లో అమెరికా కండబల ప్రదర్శన అందరూ చూడాల్సి రావొచ్చు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.12.56 వరకు తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.11.14 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.5.47నుండి 7.28 వరకు, **అమృత ఘడియలు:** ప.12.50 నుండి 2.24 వరకు, **శ్రీఅనంతపద్మనాభ వ్రతం.**

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

దీక్ష



ఒకే లక్ష్యానికి కట్టుబడి ఉండండి. మధ్యలో వేరే వాటి వైపు మనసును మళ్లించకండి. దీక్షగా మీ ప్రయత్నాలను కొనసాగించండి. లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదల మీలో ఉన్నప్పుడు మిమ్మల్ని ఏదీ ఆపలేదు. ఆఖరికి వైఫల్యం కూడా అడ్డుకోలేదు.

– అమితాబ్ బచ్చన్, సినీ దిగ్గజం

వద్దు



నా విద్యార్థులలో ఒకరు తెల్లవారుజామున 3:49 గంటలకు పూర్తి చేసిన తన అసైన్‌మెంట్‌ను నాకు మెయిల్ చేశారు! అంకిత భావం ప్రశంసనీయమే. అయితే స్టూడెంట్స్ అందరికీ నేను చెప్పేదొకటే... నిద్రను త్యాగం చెయ్యకండి! ముందే చక్కగా ప్లాన్ చేసుకోండి.

– డా॥ కవితా కాంబోజ్, ఢిల్లీ యూనివర్సిటీ బోధకురాలు

ధ్వని



మీకు మీరే బ్రాండింగ్ ఇచ్చుకోవాలి. మిమ్మల్ని మీరే మార్కెటింగ్ చేసుకోవాలి. మొదటైతే మీ ధ్వని ప్రపంచానికి వినిపించాలి. మీకై మీరు విస్తృతంగా ప్రచారం అవ్వాలి. అప్పుడే ఏదైనా సాధించగలరు.

– అలిస్టెయిర్ రిచర్డ్స్, 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్' గ్లోబల్ ప్రెసిడెంట్

వదిలేయాలి!



మీరు ఉదయం మేల్కొనగానే మంచం మీద నుండి వెంటనే లేచి కూర్చోవటం లేదంటే... మీరు ఏం చేస్తున్నా గానీ – ఉద్యోగం, వ్యాపారం, వగైరా – ఆ చేస్తున్న దానిని వెంటనే వదిలేసి వేరేది ఏదైనా ఎంచుకునే సమయం వచ్చేసిందని!

– నవీన్ కె. జైన్, 'ఇన్ఫోస్పేస్' వ్యవస్థాపకుడు

పని-ఆలోచన



వైట్ హౌస్ విందు అయినా, ఛారిటీ ఈవెంట్ అయినా, నా మనసెప్పుడూ చేస్తున్న పని మీద కాకుండా ఆ తర్వాత చేయవలసిన పని మీదే ఉంటుంది. ఎక్కడ నేను విఫలం అవుతానోనన్న భయంతో, చేయబోయే పనుల గురించి ముందు నుంచే ఆలోచిస్తుంటాను.

– జిమ్మీ కిమ్మెల్, అమెరికన్ టీవీ హోస్ట్

కలవండి!



మీరు మీ కెరీర్‌కు సంబంధం లేని వ్యక్తులను కూడా నిత్యం కలుస్తూ ఉండాలి. అందు కోసం కొంత సమయం తీసిపెట్టుకోవాలి. మీ ప్రపంచంలో మీరు ఉండిపోతే, బయట ఇంకా పెద్ద ప్రపంచం ఉందన్న సంగతిని మీరు గుర్తించలేరు!

– జనమేజయ సిన్హా, బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూపు ఛైర్మన్

ఇది సరికొత్త 2.0 ప్రపంచం

విశ్లేషణ



శైలేష్ హరిభక్తి

ఒక నిశ్శబ్ద విప్లవం చాప కింద నీరులా వస్తోంది. అది యుద్ధ భేరీలు మోగించదు. విజయ పతాకాలు ఎగరేయదు. కంటికి కనిపించని, ఊహకు అందని ఉప్పెనలా ఖండాలను ముంచెత్తుతూ వస్తోంది. విధ్వంసం దానికి కొలమానం కాదు. అది సకల సాంకేతికతల మహా కలయిక! ఆలోచనా పరులు, కార్యశీలురు ఆ 'వరల్డ్ 2.0'కి ఊపిరులూదుతున్నారు.

కొత్త ప్రపంచ సమతుల్యత

కోవిడ్ విలయంలో దెబ్బతిన్న ప్రపంచ వాణిజ్య వ్యవస్థను గాడిన పెట్టే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ప్రపంచ దేశాల మధ్య కొరవడిన వాణిజ్య సమతుల్యతను తిరిగి తెచ్చే ఈ ప్రయత్నాలకు పరస్పర అవసరాలే చోదక శక్తి. డాలరు బలహీన పడటం ప్రపంచం కోలుకుంటోందనడానికి గట్టి సంకేతం. అంతర్జాతీయ వాణిజ్యం మీద అతిగా ఆధారపడకుండా డాలరును బలహీన పరచడం మంచిదే. ఈ పరిణామం వల్ల సరుకుల వాణిజ్యంలో స్థిరత్వం, అంతర్జాతీయ వడ్డీరేట్లలో సారూప్యత నెలకొంటాయి.

సాంకేతికతల మీద మార్కెట్ల విశ్వాసం ఆ యా కంపెనీల విలువల్లో ప్రతిబింబిస్తోంది. ఎన్‌విడియా మార్కెట్ విలువ 4 లక్షల కోట్ల డాలర్లకు చేరువైంది. దీన్ని ఆ కంపెనీ వ్యక్తిగత విజయంగా చూడకూడదు. ఏఐ ఆధారిత నూతన వ్యవస్థ వేరూనుకుంటోందనడానికి నిదర్శనం. అమెజాన్, యాపిల్, ఇంకా ఇతర కంపెనీల వృద్ధి వాటికి మాత్రమే పరిమితం కాదు. ఒక బృహత్ పరిణామంలో భాగంగా ఈ మార్పును గుర్తించాలి.

సాంకేతికతల మహా కలయిక

టెక్నాలజీల ముందడుగు కీలక ఘట్టానికి చేరింది. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయో టెక్నాలజీ, అటానమస్ సిస్టమ్స్... ఇవేవీ ఇకమీదట వేటికవి కావు. అన్నీ కలసిపోయి ఒకే ఒక్కటిగా ఆవిర్భవిస్తున్నాయి. ఈ మహా కలయిక మానవ పురోభివృద్ధికి స్వయం చోదిత ఇంజిన్ కాబోతుంది. ఇది నూతన ఆవిష్కరణలను వేగవంతం చేస్తుంది. వ్యయాలను తగ్గిస్తుంది. అందుబాటులో ఉంటుంది.

ఆరోగ్య విప్లవం మరింత ప్రముఖంగా ఉంటుంది. నూతన ఔషధాలను విజయవంతంగా మార్కెట్‌లోకి ప్రవేశపెట్టడానికి ఇప్పుడు దశాబ్దాలు పడుతుండగా, ఇకపై నెలల్లోనే డ్రగ్ డిస్కవరీ జరుగుతుంది. డయాగ్నస్టిక్స్‌లో ఏఐ ప్రవేశించి వ్యాధులను తొట్ట తొలి దశలోనో ఇంకా ముందుగానో నిర్ధారించడం సాధ్యపడుతుంది. 24 గంటలూ దేహాన్ని అంటిపెట్టుకుని ఉంటూ మన ఆరోగ్య మార్పుల్ని నిరంతరం పర్యవేక్షించే పరికరాలు వస్తున్నాయి. వ్యాధి నిర్మూలన నుంచి వ్యాధి నివారణ యుగంలోకి అడుగు పెడుతున్నాము. దీర్ఘాయుష్షు ఇంకెంతో కాలం కొంతమందికే సొంతం



కాదు. అది అందరికీ అందించాల్సిన ప్రభుత్వ లక్ష్యం అవుతుంది.

రూపురేఖలు మారుతున్న విద్యా రంగం

చదువును డిగ్రీలతో కొలిచే రోజులు పోతున్నాయి. పట్టాల కంటే ప్రాసంగికతే ప్రధానం అవుతుంది. వ్యక్తిగత ప్రధానమైన, నైపుణ్యాల ఆధారితమైన విధానం దాన్ని ఆక్రమిస్తుంది. ఏఐ ట్యూటర్లు, వర్చువల్ క్లాస్ రూములు, డిజిటల్ ల్యాబ్‌లు వచ్చాయి. చదువుకు పట్టే సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈ విద్యా విప్లవం 'వరల్డ్ 2.0'కు పునాది అవుతుంది.

వ్యర్థాల సద్వినియోగం

ఇప్పుడు వ్యర్థాలను ముడిసరుకుగా వాడుతున్నారు. కర్బన కాలుష్య వాయువులను పీల్చుకుని నిల్వ చేసే ఇటుకల తయారీ, నాచు ఆధారిత ప్యాకేజింగ్ మెటీరియల్ ఉత్పత్తి, మునిసిపల్ మురుగును, పంటల వ్యర్థాలను హైడ్రోజన్‌గా మార్చి దాంతో విమాన ఇంధనం తయారీ... ఇలా ఎన్నో టెక్నాలజీలు అభివృద్ధి అయ్యాయి. చెత్త కూడా సంపదగా మారింది. ఈ మార్పులో ప్రపంచ శాంతి బీజాలు ఉన్నాయి.

సంపదతోనే ప్రపంచ భద్రత

సంపదతోనే శాంతి అనేది కొత్త మంత్రం కాబోతోంది. డేటా, ఇంధనం, స్వచ్ఛమైన గాలి, వైద్యం, అవకాశాలు... ఇవి అన్ని దేశాలకూ అందుబాటులో ఉండేట్లయితే ఇక దేనికోసం పోరాడాలి? భౌతిక ఆధిపత్యం స్థానే డిజిటల్ సార్వభౌమత్వం రాజ్యమేలే రోజుల్లో, ప్రాదేశిక ఆక్రమణ ఆర్థిక పరంగా అవివేకం అవుతుంది.

ఆధార్, యూపీఐ, డిజీ లాకర్, ఓఎన్‌డీసీ లాంటివాటితో కూడిన ఇండియా డీపీఐ (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నమూనా సమ్మిళిత విధానాలు భద్రతకు ఎలా బాటలు వేయగలవో రుజువు చేస్తున్నాయి. ప్రపంచం ఈ నిశ్శబ్ద పరివర్తనను గమనిస్తోంది.

◆ టెక్నాలజీల ముందడుగు కీలక ఘట్టానికి చేరింది. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయో టెక్నాలజీ, అటానమస్ సిస్టమ్స్... ఇవేవీ ఇకమీదట వేటికవి కావు. అన్నీ కలసిపోయి ఒకే ఒక్కటిగా ఆవిర్భవిస్తున్నాయి. ఈ మహా కలయిక మానవ పురోభివృద్ధికి స్వయంచోదిత ఇంజిన్ కాబోతుంది.

◆ డిజిటల్ సార్వభౌమత్వం రాజ్యమేలే రోజుల్లో, ప్రాదేశిక ఆక్రమణ ఆర్థిక పరంగా అవివేకం అవుతుంది.

◆ కొరతలు యుద్ధాలకు దారి తీస్తాయి. కొరత స్థానంలో సమృద్ధి వచ్చి చేరుతున్నందున శాంతి నెలకొంటుంది.

వరల్డ్ 2.0 తాత్విక చింతన

సమృద్ధి పెరిగే కొద్దీ హింస క్షీణిస్తుంది. పరమార్థం తెలుసుకోవడం మీద ప్రజలు తిరిగి దృష్టి పెడతారు. పనిలో ప్రయోజనం, రాజకీయాల్లో నిజాయతీ, ఆవిష్కరణల్లో నైతికత, సంస్థల్లో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేస్తారు. వారి దృక్పథం మరింతగా అంతర్జాతీయతను సంతరించుకుంటుంది. వారి కార్యకలాపాలు సరిహద్దులను అధిగమిస్తాయి. అమెజాన్ రెయిన్ ఫారెస్టుల నుంచి ఆర్కిటిక్ మంచు నదుల వరకు అన్ని ప్రాంతాల గురించీ ఆలోచిస్తారు. సైన్సును స్పిరిట్‌తో, టెక్నాలజీని హ్యూమానిటీతో అనుసంధానిస్తారు.

శాంతి సాధన కోసం ఆపరేటింగ్ సిస్టం

వరల్డ్ 2.0 ఆవిర్భవిస్తున్న తరుణంలో దాన్ని దాని మానానికి వదిలేయకూడదు. సుస్థిర శాంతి కోసం ఒక ఆపరేటింగ్ సిస్టమ్‌ను డిజైన్ చేసుకోవాలి. పర్యావరణ సాంకేతికత, వ్యవసాయ సాంకేతికత, విద్యా సాంకేతికత, వైద్య సాంకేతికతలు అన్నీ పరస్పరం సహకరించుకునేలా టెక్నాలజీ కన్వర్జన్స్ ప్లాట్‌ఫారాలు రూపొందించుకోవాలి. ఏఐ నైతిక విలువలకు, అంతర్జాతీయ ప్రమాణాలకు లోబడి ఉండే డిజిటల్ పబ్లిక్ గూడ్స్ తయారు చేసుకోవాలి.

అయితే ఈ వరల్డ్ 2.0 ఎలాంటి ఒప్పందం కోసం నిరీక్షించడం లేదు. లక్షల కోట్ల ఎంపికలు, వందల కోట్ల చర్యలు, లక్షల ఆవిష్కరణల ద్వారా అది ఆవిర్భవిస్తోంది. ఓ కొత్త యుగం కళ్ల తెరుస్తోంది. అక్కడ శాంతి అంటే ఏమిటి? శ్రేయస్సు, సమ్మిళితం, అవకాశం, ఉమ్మడి సారథ్యం ఇవన్నీ నెలకొని ఉండటమే! అంతే కానీ, యుద్ధం లేకపోవడం మాత్రమే శాంతి కాదు. వరల్డ్ 2.0 ఇప్పుడు మన ముందుంది. దాన్ని స్వాగతిద్దాం.


వ్యాసకర్త కార్పొరేట్ నిపుణుడు, రచయిత
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

మన గోప్యత బజారుపాలు అవుతోంది!

ఒకప్పుడు, వ్యక్తిగత గోప్యతకు మన సమాజం అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చేది. తిన్నా, తినకపోయినా, ఎన్ని కష్టాలు, నష్టాలు వచ్చినా... అన్నీ నాలుగు గోడల మధ్యనే జరిగిపోయేవి. ఏ ఒక్క విషయమూ గడప దాటి బయటకు పోయేది కాదు. ఒక వేళ బయట వాళ్ళకు తెలిస్తే, తమ కుటుంబ గౌరవానికి, పరువు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లినట్లు బాధపడేవారు. స్నేహితులైనా, హితులైనా ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడి పంపించే వాళ్ళు.

కానీ నేటి అంతర్జాల యుగంలో, డిజిటల్ సాంకేతికతలో వచ్చిన పెను మార్పుల వల్ల మనది అంటూ ఏ ఒక్క రహస్యం కూడా మిగలకుండా పోతోంది. వ్యక్తిగత గోప్యత కోసం మన చుట్టూ మనం కట్టుకున్న గోడలు బద్దలవుతున్నాయి. మనం తినే తిండి దగ్గర నుంచి, మన ఇష్టానిష్టాలు, వ్యాపకాలు, స్నేహాలు, భావాలు, మన అభిరుచులు... ఇలా ఒకటేమిటి అన్నీ బహిర్గతం అయిపోతున్నాయి. మనమందరం ఏఐ సాంకేతికను వాడుకుంటున్నామని సంతోషపడుతున్నాము. కానీ నిజానికి అదే మనల్ని వాడుకుంటోంది. ఇప్పుడు ఏఐ సాంకేతికతకు ముడి సరుకు మనుషులు, వాళ్ళ అలవాట్లే.

ఇప్పుడు అందరం ఆ ఏఐ ఆడించే తోలుబొమ్మలం. ఏఐ ఆధారిత అనువర్తనాలు ఆడిస్తున్నట్లు ఆడతున్నాం. అంతర్జాల వేదిక



లయిన ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి వాటిల్లో మనకు ఖాతా ఉంటే చాలు... మనల్ని మనం అమ్ముకున్నట్టే! మనకు తెలియకుండానే మనల్ని ఎవరో పల్లకీల్లో ఊరేగిస్తుంటారు. మనకు తెలియకుండానే మనల్ని అమ్మేస్తుంటారు.

మన చుట్టూ మనకు తెలియకుండానే ఏఐ అనువర్తనాల నిఘా వ్యవస్థలు సాలెగూడుల్లా అల్లుకుపోయి ఉన్నాయి. పొరపాటున మనం అంతర్జాలంలోని అనువర్తనాల ద్వారా ఏదన్నా వస్తువు కొన్నా, ఇష్టమైన తిండి గురించి చూసినా, నచ్చిన టాపిక్‌పై వార్తలు చదివినా, విన్నా... ఆ సమాచారం మొత్తం సేకరించి మనకు భవిష్యత్తులో ఏమి కావాలో, మనం ఏమి తినాలో, ఏ సినిమా చూడాలో, ఏమి చదవాలో కూడా అవే సూచి(నిర్దేశి)స్తున్నాయి.

వీటివల్ల కేవలం వ్యక్తిగత గోప్యతకు మాత్రమే భంగం వాటిల్లటమే కాదు, సమాజం స్వేచ్ఛగా ఆలోచించే మెదళ్ళను, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే గుండెలను కోల్పోతోంది. గోప్యత అనేది రహస్యాల గురించి కాదు... గోప్యత అనేది మన జీవనంపై మనకుండే నియంత్రణను తెలియచేస్తుంది. కానీ కాలక్రమేణా మనకు తెలియకుండా మనమే మన జీవితంపై నియంత్రణ కోల్పోతున్నాం. గోప్యత లేని ప్రపంచంలో మనకు గౌరవ మర్యాదలు ఉండవు. మనలో మానవత్వం హరించుకుపోయి, మార్కెట్లకు అనుగుణంగా బతకటానికి అలవాటుపడతాము.

గోప్యతను కాపాడుకోవటం మన నైతిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వ బాధ్యత. ఇందుకోసం అందరం బాధ్యత తీసుకుని, మరొకరి గోప్యతకు భంగం వాటిల్లే పనులకు స్వస్తి చెప్పాలి. విద్యా విధానంలో కూడా కేవలం ఆధునిక సాంకేతికతను చొప్పించడమే కాక... నైతిక, మానవతా విలువలను ఇమిడ్చినప్పుడే రేపటి తరానికి జీవితపు విలువ తెలిసివస్తుంది.

– ఈదర శ్రీనివాస రెడ్డి । ప్రొఫెసర్

విద్యార్థుల బకాయిలు చెల్లించాలి!

ఇన్ బాక్స్

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వంటివి విద్యార్థులకు గొప్ప భరోసాగా నిలిచాయి. ఉన్నత విద్యను చదవాలనుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇవి కొండంత అండగా ఉన్నాయి. కానీ, గత కొన్నేళ్లుగా ఈ పథకాలు సమయానికి అమలు కాక పోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బకాయిల మొత్తం రూ. 9,000 కోట్లకు పైగా ఉండటం గమనార్హం.

ప్రతీ సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరుతున్నారు. కోర్సు పూర్తయినా బకాయిలు చెల్లించనందువల్ల కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆపేస్తున్నాయి. విద్యార్థులు లోన్లు తీసుకుని చదువు కొనసాగించాల్సి వస్తోంది. బ్యాంకుల వడ్డీలు, ప్రైవేట్ అప్పులు తల్లితండ్రులపై భారం పెంచుతున్నాయి. చాలామంది విద్యార్థులు మధ్యలోనే చదువును మానేయాల్సి వస్తోంది. దీంతో విద్యార్థుల కలలు, కుటుంబాల ఆశలు ధ్వంసం అవుతున్నాయి.



2019 నుండి ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు సక్రమంగా జరగలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించినా, విడుదలలో ఆలస్యం కారణంగా బకాయిలు పేరుకుపోతున్నాయి. విద్య అనేది ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు. ఒకవైపు 'విద్యావంతమైన తెలంగాణ' అని చెబుతూనే, నిధులను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును చీకటిమయం చేస్తోంది ప్రభుత్వం.

ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ. 9,000 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా 'ఎడ్యుకేషన్ గ్యారంటీ ఫండ్'ను ఏర్పాటు చేయాలి. దరఖాస్తుల పరిశీలన, నిధుల విడుదలలో పూర్తి పారదర్శకత ఉండాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాలను సమయానికి విద్యార్థుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు చదివి ముందుకు వెళితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న సంగతిని ప్రభుత్వం గుర్తుంచుకుని వ్యవహరించాలి.


– రిషి మలిశెట్టి
జేఎన్టీయూ విద్యార్థి, ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

వాటిలో సింహభాగం చైనా నుంచే!

మన దేశ మొత్తం దిగుమతుల్లో 2023–24లో చైనా ఉత్పత్తుల వాటా 15 శాతం. ఆ ఏడాది ఇది 13.76 శాతం. ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్ హార్డ్‌వేర్, బల్క్ డ్రగ్స్ వంటి వాటి విషయంలో మనం చైనాపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాం.



	మొత్తం దిగుమతులు	చైనా వాటా (శాతం)
ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్	36,805	37.94
టెలికం పరికరాలు	22,338	43.40
కంప్యూటర్ హార్డ్‌వేర్, పెరిఫెరల్స్	18,541	49.46
డైరీ పరిశ్రమకు యంత్రాలు, ఇతర పరికరాలు	18,480	45.24
సేంద్రియ రసాయనాలు	16,307	29.60
బల్క్ డ్రగ్స్, డ్రగ్ ఇంటర్మీడియెట్స్	4,638	74.11

ఆధారం: డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్

వర్ణనాతీతం బ్రహ్మం

జ్యోతిర్మయం

బ్రహ్మం అంటే ఏమిటో, సత్యమంటే ఏమిటో తెలుసుకోవటానికి వేద వేదాంగాలను, పురాణేతిహాసాలను చదువుతుంటాం, కొన్ని దశాబ్దాల తర్వాత కొంత పాండిత్యంతో, దానికి తోడుగా వచ్చే అహంభావంతో తిరిగి వస్తుంటాం. బ్రహ్మజ్ఞానం అబ్బిందని భ్రమిస్తాం.

శ్రీరామకృష్ణ పరమహంస ఒక కథ చెప్పారు: గురుకులవాసం నుండి ఇంటికి తిరిగి వచ్చిన ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారునితో తండ్రి 'నాయనా! నువ్వు శాస్త్రాలన్నీ చదివావు కదా! బ్రహ్మం ఎలాంటిదో కాస్త చెప్పు' అని అడిగాడు. అప్పుడతడు వేదాల నుండి ఎన్నెన్నో శ్లోకాలను వల్లిస్తూ బ్రహ్మ స్వరూపాన్ని వర్ణించాడు. తండ్రి అంతా మౌనంగా విన్నాడు. ఆ తర్వాత చిన్న కుమారుణ్ణి దగ్గరకు తీసుకొని, 'నీవు చెప్పు నాన్నా! బ్రహ్మం అంటే ఏమిటి?' అని అడిగాడు. వెంటనే ఆ పిల్లవాడు కళ్ళు మూసుకొని మౌనంగా చాలాసేపు ఉండిపోయాడు గాని నోరు తెరచి ఒక్క మాట కూడా పలుకలేదు. చిన్న కుమారుడి ఆ ప్రవర్తనకు తండ్రి ఎంతో సంతోషించి అతనితో... 'నాయనా! బ్రహ్మాన్ని గూర్చి నువ్వు కొంత తెలుసుకోగలిగావు – బ్రహ్మం ఎలాంటిదో ఎలాంటి గొప్ప మేధావి అయినా నోటితో చెప్పలేడు' అన్నాడు. (పుట 45–శ్రీరామకృష్ణ కథామృతం–1).

బ్రహ్మం అనేది నోటితో చెప్పలేనిది, చెవితో వినలేనిది, మెదడుతో గ్రహించలేనిది, కళ్ళతో చూడలేనిది, ఇతరులకు చూపించలేనిది. మరి దాన్ని గ్రహించడమెలా? కేవలం స్వీయ అనుభవం ద్వారానే అది సాధ్యం. ఆ అనుభవాన్ని పొందటానికే అన్ని సాధనలు, శాస్త్రాలు, అధ్యయనాలు, ప్రవచనాలు! అన్నీ ఆ బ్రహ్మానుభూతిని పొందటానికి మనల్ని ప్రేరేపించటానికే గానీ ఆ అనుభవాన్ని కల్గించటానికి కాదు. అందుకే బ్రహ్మానుభూతి కల్గినవానికి వేద శాస్త్రాల, సాధనల ఆవశ్యకత ఇక ఉండదని పెద్దలు అంటారు. 'బ్రహ్మం అవాఙ్మానస గోచరం' అని చెబుతూ బ్రహ్మను ఒక పెద్ద చక్కెర పర్వతంతో పోలుస్తారు రామకృష్ణ పరమహంస. శుకమహర్షి లాంటి వారు కూడా గండు చీమల వంటివారని, 'వారు ఆ చక్కెర పర్వతంలోని ఏడో, ఎనిమిదో లేక పదో కణాలు నోట్లో పెట్టుకోగలరు, అంతమాత్రమే' అని అంటారు.

– రాచమడుగు శ్రీనివాసులు

పెళ్లయి ముగ్గురు పిల్లలు.. బాలికతో ప్రేమ

- లాడ్జి గదిలో పురుగు మందు తాగి ఇద్దరూ ఆత్మహత్య


రవికుమార్

భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం రావిగూడెంకు చెందిన నడిపింటి రవికుమార్(33)కు ఇప్పటికే వివాహం జరగగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేసే ఆయన ఏడాదిగా భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం పాములపల్లికి చెందిన మైనర్ బాలికతో ప్రేమ వ్యవహారం సాగిస్తున్నాడు. కొద్దినెలల క్రితం వీరిని భద్రాచలంలో చూసిన బాలిక పెద్దనాన్న ఆమెను తమ ఇంటికి తీసుకెళ్లి నచ్చచెప్పాడు. అయినా తీరు మారకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా రవికుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి భద్రాచలం సబ్ జైలుకు తరలించారు. రెండు నెలల శిక్ష అనంతరం బెయిల్‌పై వచ్చిన ఆయన మళ్లీ బాలికను కలుస్తున్నాడు. ఈనెల 3వ తేదీన రాత్రి 9 గంటలకు భద్రాచలంలోని ఓ లాడ్జిలో గది తీసుకున్న ఇద్దరు.. 4వ తేదీ గురువారం ఉదయం ఖాళీ చేసి వెళ్లిపోయారు. మళ్లీ సాయంత్రం వచ్చి రూమ్ తీసుకోగా, శుక్రవారం ఉదయం గది నుంచి అరుపులు రావడంతో నిర్వాహకులు వెళ్లి పరిశీలించగా వారిద్దరూ పురుగు మందు తాగినట్లు చెప్పి ఆస్పత్రికి తీసుకెళ్లాలని కోరారు. దీంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగానే కొంత సేపటికి రవికుమార్ మృతి చెందగా, ఉదయం 11.30 గంటలకు బాలిక మృతి చెందింది. ఈ ఘటనపై భద్రాచలం టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో చండీగఢ్ వర్సిటీకి 19వ స్థానం

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్య ర్యాంకింగ్స్‌లో చండీగఢ్ యూనివర్సిటీ సత్తాచాటింది. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)–2025 10వ ఎడిషన్‌లో దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల్లో చండీగఢ్ యూనివర్సిటీ 19వ స్థానం సాధించినట్లు తెలిపింది. ఇక అన్ని ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఉత్తర భారతదేశంలో మొదటి ర్యాంకులో నిలిచినట్లు వెల్లడించింది. ఇంజనీరింగ్‌లో 31వ ర్యాంకు, మేనేజ్‌మెంట్‌లో 32వ ర్యాంకు, ఫార్మసీలో 15వ ర్యాంకు, ఆర్కిటెక్చర్‌లో 14వ ర్యాంకు సాధించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా చండీగఢ్ యూనివర్సిటీ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్ ఇందర్ సింగ్ సంధూ మాట్లాడుతూ 'తాము 19వ ర్యాంకు సాధించడం గర్వకారణం. వర్సిటీ స్థాపించిన 12 ఏళ్లలోనే ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో అద్భుత పనితీరు కనబరిచాం. విద్యార్థులకు అత్యాధునిక వనరులు, మౌలిక సదుపాయాలు అందిస్తున్నాం' అని తెలిపారు.

రైళ్లలో గుట్టుగా గంజాయి..!

రెండున్నరేళ్లలో దొరికింది 7 వేల కిలోలే..

- రైల్వే సిబ్బందికి చిక్కుతున్నది నామమాత్రమే...
- గంజాయి రవాణాకు ట్రైన్లను ఎంచుకుంటున్న నేరగాళ్లు
- ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్న ఆర్‌పీఎఫ్



సాక్షి, హైదరాబాద్ : రైళ్లలో గంజాయి తరలింపు అనేది సర్వ సాధారణ విషయంగా మారింది. రోడ్డు మార్గాన తరలిస్తుంటే, తనిఖీలు జరిగి పట్టుబడుతున్నామన్న ఉద్దేశంతో గంజాయి సరాఫరా చేసేవారు రైళ్లను ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం ఒడిశా నుంచి హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతున్న గంజాయిలో సింహభాగం రైళ్ల ద్వారానే వస్తోంది. గత రెండున్నరేళ్లలో రైళ్లలో ఏకంగా 7 వేల కిలోలకు పైగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే సరఫరా అవుతున్న గంజాయిలో నామమాత్రంగానే పోలీసులకు చిక్కుతోంది. అంటే నిత్యం వందల కిలోల గంజాయి రైళ్ల ద్వారా హైదరాబాద్‌కు చేరుతోంది. దీంతో రైల్వేశాఖను కేంద్రం తాజాగా అప్రమత్తం చేసింది. దీంతో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) గంజాయిని స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ)తోపాటు స్థానిక పోలీసులతో ప్రత్యేక సమన్వయ వ్యవస్థను సిద్ధం చేసుకుంటోంది.

గంజాయి ఎక్కువగా పట్టుబడుతున్న రైల్వేస్టేషన్లు ఇవే

సికింద్రాబాద్, హైదరాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం, లింగంపల్లి, నల్లగొండ, నిజామాబాద్, వికారాబాద్.

ఎక్కువగా గంజాయి తరలిస్తున్న రైళ్లు

కోణార్క్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, కోరమండల్ ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, నవజీవన్ ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, లక్నో–ఝాన్సీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ పూర్ణ ఎక్స్‌ప్రెస్, రాయచూర్ ఎక్స్‌ప్రెస్, అమృత్‌సర్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, సంబల్‌పూర్–నాందేడ్ ఎక్స్‌ప్రెస్.

ఆయా సంవత్సరాల వారీగా లభించిన గంజాయి

సంవత్సరం	పట్టుబడ్డ గంజాయి(కిలోల్లో)	విలువ	అరెస్టులు
2023	3,902	రూ.24.11 కోట్లు	186
2024	2,604	రూ.6.05 కోట్లు	162
2025	575	రూ.1.75 కోట్లు	49

- లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోకి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ చేరుకుంది.. దిగేందుకు ప్రయాణికులు సిద్ధమయ్యారు.. ఇంతలో ఆర్‌పీఎఫ్ పోలీసులు ఓ కోచ్‌లోకి వచ్చారు. చుట్టూరా పరిశీలిస్తుండగా, ప్రయాణికులు సమీపంలో లేకుండా కొన్ని బ్యాగులు కనిపించాయి.. అనుమానం వచ్చి, వాటిని చెక్ చేయగా, అందులో 85 కిలోల గంజాయి పొడి ఉన్న ప్యాకెట్లు కనిపించాయి. ఇంతలో ఓ ప్రయాణికుడు ఎలాంటి లగేజీ లేకుండా మరో కోచ్‌లోకి హడావుడిగా వెళుతుండగా, గమనించి పట్టుకున్నారు. ఆరా తీస్తే..ఒడిశా నుంచి తానే ఆ గంజాయిని తెచ్చానని, హైదరాబాద్‌లోని ధూల్‌పేటకు తరలిస్తున్నానని చెప్పాడు.
- సాధారణ తనిఖీలు చేస్తుండగా కాచిగూడ రైల్వేస్టేషన్ పార్శిల్ గది నుంచి ఏడు బ్యాగులు తరలిస్తున్న ఐదుగురి కదలికల్లో అనుమానం రావటంతో ఆపి తనిఖీ చేయగా, ఆ ఏడు బ్యాగుల్లో 120 కిలోల గంజాయి వెలుగు చూసింది. ఒడిశా నుంచి తీసుకొచ్చి కాచిగూడ పార్శిల్ ఆఫీసులో ఉంచి అక్కడి నుంచి దాన్ని హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌కు తరలిస్తున్నట్టు వారు వెల్లడించారు. వారంతా స్థానికులే, కానీ, ఆ బ్యాగులను కాచిగూడ స్టేషన్ వరకు తరలించింది మాత్రం ఒడిశాకు చెందినవారు.
- గత ఫిబ్రవరి 22, మార్చి 21.. అంటే నెలరోజుల వ్యవధిలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో రెండు పర్యాయాలు 60 కిలోల చొప్పున గంజాయి దొరికింది. నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని, రెండో కోచ్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

ఫోర్స్ పెంచి... ఫోకస్

కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఆర్‌పీఎఫ్ ప్రత్యేకంగా కొందరు సిబ్బందిని కేటాయించి గంజాయి జాడ కనుక్కునే బాధ్యతను అప్పగించింది. గంజాయి తరలింపే పనిగా పెట్టుకొని మాఫియా పరిధిలో పనిచేస్తున్న వారి ఫొటోలను సిబ్బందికి అందజేసింది. వారి జాడను సులభంగా గుర్తించే ఏర్పాట్లు చేస్తున్నారు.

- సీసీటీవీ కెమెరాల ద్వారా ఆధునిక పరిజ్ఞానాన్ని వాడుతున్నారు.
- కేవలం ప్రయాణికుల రైళ్లలోనే కాకుండా, సరుకు రవాణా రైళ్ల ద్వారా కూడా గంజాయి తరలుతోందని గుర్తించారు. ఇందు కోసం ఇప్పుడు సరుకురవాణా రైళ్లను కూడా తనిఖీ చేస్తున్నారు. ఖాళీ వ్యాగన్లతో వెళ్లే రైళ్లను ఎంచుకొని చాలా చాకచక్యంగా అందులోకి సరుకుతో సహా ఆ వ్యక్తులు చేరి తరలిస్తున్నట్టు గుర్తించారు.
- గంజాయికి అడ్డుకట్ట వేయటం సాధారణ ప్రజల బాధ్యత కూడా ఉందని పేర్కొంటున్న రైల్వే పోలీసులు, రైళ్లలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారి, అనుమానాస్పదంగా ఉన్న బ్యాగేజీ వివరాలను తెలపాలని ప్రయాణికులను కోరుతున్నారు.

బండరాయితో మోది భర్తను చంపిన భార్య

వికారాబాద్ జిల్లా రాంపూర్‌లో ఘటన


రామచంద్రయ్య

బంట్వారం: నిద్రలో ఉన్న భర్తను అర్ధరాత్రి వేళ బండరాయితో మోది చంపింది ఓ భార్య. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం రాంపూర్‌లో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ శైలజ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బి.రామచంద్రయ్య (44), సుజాత దంపతులకు ఇంటర్, టెన్త్ చదివే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రామచంద్రయ్య వ్యవసాయంతో పాటు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసేవాడు. ఇదిలా ఉండగా వేరే ప్రాంతానికి వెళ్లి బతుకుదామంటూ సుజాత కొన్నాళ్లుగా భర్తతో గొడవపడుతోంది. ఇందుకు అతను అంగీకరించకపోవడంతో ఆయన అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో గాఢ నిద్రలో ఉన్న రాంచంద్రయ్య తలపై బండరాయితో మోది హత్య చేసింది. వికారా బాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాములు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మర్పల్లి ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కంటి పాపల్ని చిదిమి..

- తల్లి ఆత్మహత్య

నారాయణఖేడ్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు పిల్లలను చంపిన ఒక తల్లి ఆత్మహత్య చేసుకుంది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలివి. నిజాంపేట్ గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రేమల (22)ను దామర్‌చెరువు గ్రామానికి చెందిన సంగమేశ్వర్‌కు ఇచ్చి మూడున్నర సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వీరికి ధనుష్ (2), 45 రోజుల సూర్యవంశీ సంతానం. ఇటీవల తల్లి గ్రామమైన నిజాంపేట్‌లో సూర్యవంశీ తొట్టెల కార్యక్రమాన్ని సైతం ఘనంగా జరిపించారు. ఈ క్రమంలో దామర్‌చెరువుకు వెళ్లిన ప్రేమల రెండు రోజుల క్రితం నిజాంపేట్‌కు వచ్చింది. శుక్రవారం ఇంట్లో ఇద్దరు పిల్లలను గొంతునులిమి చంపేసి ఉరి వేసుకుంది. ఇందుకు కుటుంబ కలహాలే కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

సముద్రాలకు మనుషులే ముప్పు!

- మానవ కార్యకలాపాలతో దుష్ప్రభావాలు
- కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల వేడెక్కుతున్న సాగరాలు
- అంతరించిపోతున్న జీవజాలం.. తగ్గుతున్న ఉపాధి అవకాశాలు
- దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే 2050 నాటికి ఈ నష్టం రెండింతలు
- యూరప్‌లో జరిగిన తాజా అధ్యయనంలో వెల్లడి





ముక్కలైన మంచు కొండ

ప్రపంచంలోనే అతిపెద్ద మంచు కొండగా రికార్డుకెక్కిన ఏ23ఏ ఐస్‌బర్గ్ విచ్ఛిన్నమైపోయింది. తన రికార్డును కోల్పోయింది. ఈ ఐస్‌బర్గ్ ముక్కలుగా విడిపోయింది. మరికొన్ని వారాల్లోనే పూర్తిగా చెదిరిపోయే అవకాశం ఉందని సైంటిస్టులు చెప్పారు. ఏ23ఏ ఐస్‌బర్గ్ అమెరికాలోని రోడ్ ఐలాండ్ స్టేట్ విస్తీర్ణంతో సమానంగా ఉండేది. దీని బరువు లక్ష కోట్ల టన్నుల పైమాటే. అంటార్కిటికాలో 1986లో ఏర్పడింది. దక్షిణ అట్లాంటిక్ సముద్రంలోని సౌత్ జార్జియా దీవి వైపు ప్రయాణిస్తూ ముక్కలైంది. ప్రస్తుతం ఇది హూస్టన్‌స్టేట్ విస్తీర్ణానికి తగ్గిపోయింది. ఇప్పుడు ప్రపంచంలో అతిపెద్ద మంచు కొండగా డీ15ఏ ఐస్‌బర్గ్ రికార్డుకెక్కింది. ఏ23ఏ నుంచి విడిపోయిన మంచు ముక్కలకు ఏ23డీ, ఏ23ఈ, ఏ23ఎఫ్ అనే పేర్లు పెట్టారు. కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగా సముద్రం వేడెక్కడం వల్ల ఏ23ఏ ఐస్‌బర్గ్ విచ్ఛిన్నమైనట్లు సైంటిస్టులు స్పష్టంచేశారు. ఇలా మంచు కొండలు ముక్కలై కరిగిపోతే సముద్ర మట్టాలు పెరిగే ప్రమాదం ఉంటుంది.

భూగోళంపై అన్ని రకాల జీవుల మనుగడకు సముద్రాలు అత్యంత కీలకం. జీవులకు అవసరమైన ప్రాణవాయువును సముద్రాలే అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్నాయి. కోట్లాది మంది జీవనోపాధి కల్పిస్తున్నాయి. అంతేకాకుండా ప్రపంచ 90 శాతం వాణిజ్యం సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోంది. అయితే, ఆధునిక కాలంలో మానవ కార్యకలాపాల వల్ల అవి పెనుముప్పును ఎదుర్కొంటున్నాయి. మనుషుల వల్ల నానాటికీ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు శాపంగా మారుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2050 నాటికి సముద్రాలపై మనుషుల దుష్ప్రభావం రెండు రెట్లు పెరుగుతుందని యూరప్‌లో తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ఈ వివరాలను 'సైన్స్' పత్రికలో ప్రచురించారు. కాలుష్యం, తద్వారా అధిక ఉష్ణోగ్రతల వల్ల సముద్రాలు క్రమంగా వేడెక్కుతున్నాయి. వాటిలోని జీవజాలం నశించిపోతోంది. మరోవైపు సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. ఆమ్ల ప్రభావంతో సముద్ర జలాలు మరింత ఉప్పుగా మారుతున్నాయి. మొత్తానికి సముద్ర జీవావరణ వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆహ్లాదం పంచే సముద్రాలు ప్రమాదం ముంగిట ఉన్నట్లు అధ్యయనకర్త బెన్ హల్‌పెర్న్ వెల్లడించారు. భూమిపై మనుషుల కార్యకలాపాల వల్ల సముద్రాలకు ఇప్పటికే చాలా నష్టం జరిగిందని, ఇప్పటికైనా మేల్కొనకపోతే 2050 నాటికి ఈ నష్టం రెండింతలు అవుతుందని తేల్చిచెప్పారు. ఇది నిజంగా ఊహించని పరిణామం అని పేర్కొన్నారు. సముద్రాలపై ప్రతికూల ప్రభావాలు వేగంగా పెరుగుతుండడమే అసలు సమస్య అని వివరించారు.

కోలుకోలేని దశకు జీవావరణ వ్యవస్థ

సముద్రాలపై వాతావరణ ప్రభావాలే తప్ప మనుషుల ప్రభావం అంతగా ఉండదని ఇన్నాళ్లూ భావించారు. భూమిపై జనవాసాల కంటే సముద్రాల విస్తీర్ణం ఎన్నో రెట్లు ఎక్కువ కాబట్టి ఇలాంటి అంచనాకొచ్చారు. కానీ, మనుషుల ప్రభావం గణనీయంగా ఉంటున్నట్లు తేలింది. ఉష్ణోగ్రతల పెరుగుదలతో సముద్రాలు వేడెక్కుతుండడం ఒక అంశమైతే.. నియంత్రణ లేని చేపల వేట, సముద్ర వాణిజ్యం వంటివి సమస్య తీవ్రతను మరింత పెంచుతున్నట్లు వెల్లడయ్యింది. మానవుల చర్యల వల్ల సముద్రాలు ఒత్తిడికి లోనవుతున్నాయి. ఉష్ణమండల ప్రాంతాలతోపాటు ధ్రువ ప్రాంతాల్లో జీవావరణ వ్యవస్థ ఇప్పటికే కోలుకోలేని దశకు చేరుకుంది.

పగడపు దిబ్బలు, మడ అడవులు ధ్వంసం

ఆధునిక కాలంలో సముద్ర తీర ప్రాంతాలు సైతం సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. పగడపు దిబ్బలు అంతరించిపోతున్నాయి. మడ అడవులు ధ్వంసమవుతున్నాయి. కాలుష్యం కారణంగా సముద్ర జీవుల వృద్ధికి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. సముద్రాల్లోకి స్వచ్ఛమైన జలం కాకుండా మురికి నీరు చేరుతోంది. స్వచ్ఛమైన జలం, సముద్ర జలం మధ్య సమతూకంలో ప్రతికూల మార్పులు వస్తున్నాయి. ఇవన్నీ సముద్రాలకు నష్టం చేకూర్చడంతోపాటు స్థానికంగా జీవనోపాధి అవకాశాలు తగ్గిపోవడానికి కారణమవుతున్నాయి. ఫలితంగా ఆహారం, ఉపాధి కోసం సముద్రాలపై ఆధారపడే దేశాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. ఈ ముప్పు మరింత పెరుగుతుందే తప్ప తగ్గే అవకాశం లేదని నిపుణులు తేల్చిచెబుతున్నారు. ముప్పు తప్పించుకోవాలంటే వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదలను నియంత్రించాలని, సముద్రాల్లో చేపల వేట నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని, సముద్ర వాణిజ్యంలోనూ నియంత్రణ అవసరమని అంటున్నారు. భవిష్యత్తు వైపు దృష్టి సారిస్తే ఇప్పుడు మనమేం చేయాలో తెలుస్తుందని బెన్ హల్‌పెర్న్ హితవు పలికారు. భవిష్యత్తును నాశనం చేసుకోవాలా? లేక కాపాడుకోవాలా? అనేది మన చేతుల్లోనే ఉందన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

నవారో వ్యాఖ్యలు అసంబద్ధం

ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడారు

- భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఆగ్రహం
- అమెరికాతో సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లను సమర్థించడంతోపాటు భారతీయుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి కేవలం బ్రాహ్మణులు లాభపడుతున్నారంటూ అమెరికా శ్వేతసౌధం ఆర్థిక సలహాదారు పీటర్ నవారో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తీవ్రంగా ఖండించారు. నవారో వ్యాఖ్యలు అసంబద్ధం అంటూ మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడొద్దని నవారోకు సూచించారు. భారత్–అమెరికా సంబంధాలు తమ ప్రభుత్వానికి చాలా అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. ఇరుదేశాలు మధ్య సమగ్ర, ప్రపంచ స్థాయి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయని గుర్తుచేశారు. రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. భారత్–అమెరికా భాగస్వామ్యానికి ఉమ్మడి ప్రయోజనాలు, ప్రజాస్వామ్య విలువలు, ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలే పునాది అని స్పష్టంచేశారు. గతంలోనూ ఎన్నో ప్రతికూల పరిస్థితులు, సవాళ్లు ఎదురైనప్పటికీ భారత్–అమెరికా సంబంధాలు ఏమాత్రం దెబ్బతినలేదని తెలిపారు. బలమైన ద్వైపాక్షిక అజెండాను ముందుకు తీసుకెళ్లడంపై రెండు దేశాలు ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు వివరించారు. పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాలే ఆధారంగా భారత్–అమెరికా అనుబంధం ఎప్పటిలాగే కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు రణధీర్ జైశ్వాల్ వ్యాఖ్యానించారు. రెండు దేశాలు కలిసి పని చేస్తూనే ఉన్నాయని చెప్పారు. కీలక అంశాలపై సంప్రదింపులు జరుపుతున్నాయని చెప్పారు. అమెరికాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని తేల్చిచెప్పారు.

యూకే డిప్యూటీ ప్రధాని రాజీనామా



లండన్: యూకే ఉప ప్రధానమంత్రి, గృహ నిర్మాణ శాఖ మంత్రి ఏంజెలా రేనెర్ పదవి నుంచి వైదొలిగారు. ఇటీవల కొనుగోలు చేసిన ఇంటికి తక్కువ పన్ను చెల్లించినట్లు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. స్పెషలిస్ట్ ట్యాక్స్ సలహా తీసుకోకుండానే తక్కువ స్టాంప్ డ్యూటీని చెల్లించడం ద్వారా నైతిక ఉల్లంఘనకు పాల్పడినట్లు ప్రచారం జరిగింది. అధికార లేబర్ పార్టీలో పలుకుబడి కలిగిన నేతగా పేరున్న ఏంజెల్ తనపై వచ్చిన ఆరోపణలపై మంత్రివర్గ స్వతంత్ర కమిటీతో విచారణ చేయించారు. ఈ కమిటీ దర్యాప్తులో ఆరోపణలు నిజమని తేలింది. దీంతో, పదవికి రాజీనామా చేసినట్లు శుక్రవారం ఏంజెలా వెల్లడించారు. రాజీనామా చేయాలని ఏంజెలా తీసుకున్న నిర్ణయం సరైందేనని ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. సీనియర్ మంత్రిని కోల్పోవడం బాధ కలిగిస్తోందన్నారు.

చైనాతో సరిహద్దు వివాదమే అతిపెద్ద సవాల్

- పాకిస్తాన్ తెరచాటు యుద్ధం కూడా సమస్యాత్మకమే
- పొరుగు దేశాల్లో అస్థిరత మనకు ఆందోళనకరం
- సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వ్యాఖ్యలు


జనరల్ చౌహాన్

న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల తర్వాత చైనాతో భారత్ బంధం క్రమంగా బలపడుతున్న నేపథ్యంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ చైనాతో సరిహద్దు వివాదమేనని చెప్పారు. ఈ వివాదం కొనసాగుతూనే ఉంటుందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పాకిస్తాన్ చేస్తున్న తెరచాటు యుద్ధం కూడా మనకు సమస్యాత్మకంగానే మారిందని తెలిపారు. మన రెండు ప్రత్యర్థి దేశాలు అణ్వాయుధాలు కలిగిన దేశాలేనని గుర్తుచేశారు. ఆయా దేశాలకు వ్యతిరేకంగా ఆపరేషన్లు నిర్వహించే విషయంలో వాటివద్ద నున్న అణ్వాస్త్రాలు మనకు ఒక సవాల్‌గానే ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో శుక్రవారం ఓ కార్యక్రమంలో అనిల్ చౌహాన్ మాట్లాడారు. పొరుగు దేశాల్లో అస్థిర పరిస్థితులు నెలకొనడం భారత్‌కు ఆందోళనకరమేనని చెప్పారు. అక్కడ సామాజిక, రాజకీయ, ఆర్థికపరమైన అస్థిరత, అశాంతి ఏర్పడిందని పేర్కొన్నారు. భారత్‌ను ఎలాగైనా దెబ్బకొట్టాలన్న లక్ష్యంతో పాకిస్తాన్ వ్యవహరిస్తోందని వెల్లడించారు. వెయ్యి సార్లు యుద్ధం చేసైనా భారత్‌కు గాయపర్చాలన్నది పాకిస్తాన్ విధానమని చెప్పారు. ప్రత్యక్షంగా ఎదుర్కొనే ధైర్యం లేక తెరచాటు యుద్ధం చేస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌పై మనమే పైచేయి సాధించామన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పకుండా భారత సైనిక దళాల చేతులు కట్టేశారంటూ వస్తున్న ఆరోపణలను అనిల్ చౌహాన్ ఖండించారు. మన సైన్యానికి ప్రభుత్వం అన్ని స్థాయిల్లో పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని స్పష్టంచేశారు. దాడులకు ప్లానింగ్‌తో పాటు లక్ష్యాలను నిర్దేశించుకోవడాన్ని మన దళాలకే అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ లక్ష్యం పాక్‌పై కేవలం ప్రతీకార దాడి కాదని.. మన సహనానికి రెడ్ లైన్ ఏమిటో ప్రత్యర్థికి చూపించడమేనని వ్యాఖ్యానించారు. ఆ రెడ్ లైన్ దాటితే పరిణామాలు ఎలా ఉంటాయో పాకిస్తాన్‌కు తెలిసొచ్చిందని ఉద్ఘాటించారు.

భవిష్యత్తులో యుద్ధక్షేత్రాల్లోని పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఇప్పటినుంచే సన్నాహాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అనిల్ చౌహాన్ చెప్పారు. ఆధునిక కాలంలో యుద్ధరీతులు నానాటికీ మారిపోతున్నాయని, హైటెక్నాలజీ రంగ ప్రవేశం చేస్తోందని అన్నారు. సైబర్, అంతరిక్ష యుద్ధాలు కూడా జరుగుతాయన్నారు. సవాళ్లు అనేవి ఈ క్షణానికి సంబంధించినవి కాదని... అవి భిన్న కాలాల్లో భిన్న రూపాల్లో ఉంటాయని వ్యాఖ్యానించారు. ఎలాంటి సవాల్ అయినాసరే ఎదిరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

ఇజ్రాయెల్ భీకర దాడి

గాజాలో 12 అంతస్తుల భవనంపై బాంబులు


గాజాలోని భవనంపై దాడి అనంతరం భయంతో పరుగులు తీస్తున్న పాలస్తీనా ప్రజలు

గాజా సిటీ: గాజా నగరంలోని బహుళ అంతస్తుల భవనాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు తెరతీసింది. హమాస్‌కు పట్టున్న ఈ నగరాన్ని స్వాధీనం చేసుకునే లక్ష్యంతో ఇప్పటికే వేలాదిగా ఆర్మీని రంగంలోకి దించడం తెల్సిందే. శుక్రవారం రిమాల్ ప్రాంతంలోని 12 అంతస్తుల ముస్తాహా టవర్‌పై ఫైటర్ జెట్లు రెండు సార్లు దాడి చేశాయి. దీంతో, పెను విస్ఫోటనంతో భవనం నేలమట్టమైంది. చుట్టూ శిథిలాలు, దుమ్మూధూళితో నిండిపోయింది. భవనం చుట్టుపక్కల టెంట్లలో ఉన్న వారంతా ఉన్న ఒక్క నీడా కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. హమాస్‌తో జరుగుతున్న పోరులో ఇప్పటికే పలుమార్లు బాంబులు పడటంతో టవర్ పైభాగం దెబ్బతింది. నేరుగా దాడికి దిగడం ఇదే మొదటిసారి. ముందస్తు హెచ్చరికలతో బయటకు పరుగులు తీస్తూ వస్తున్న జనాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ అడ్డుకుందని ప్రత్యక్ష సాక్ష్యులు పేర్కొన్నారు. దాడితో భవనంలోని వారెందరు ప్రాణాలు కోల్పోయిందీ తెలియరాలేదు. అంతకుముందు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్.. 'గాజాలో నరకానికి తలుపులు తెరుచుకున్నాయి. ఇక ఇవి తెరిచే ఉంటాయి. ఇది ఆరంభం మాత్రమే'అని వ్యాఖ్యానించడం గమనార్హం. ఆ తర్వాత కొద్దిసేపటికే టవర్‌పై దాడి చోటుచేసుకుంది. ఈ టవర్‌ను హమాస్ నిఘాకు వాడుకుంటోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. గాజాపై పూర్తి నియంత్రణకు ముందుకు కదులుతున్న ఇజ్రాయెల్ ఆర్మీ చుట్టుపక్కలున్న ఇలాంటి బహుళ అంతస్తుల భవనాలను లక్ష్యంగా చేసుకోవడం పాలస్తీనియన్లను మరింత భయభ్రాంతులకు గురి చేయడమేనని అంటున్నారు. గాజా నగరాన్ని యుద్ధ జోన్‌గా ప్రకటించిన ఇజ్రాయెల్ ఆర్మీ..ఇందులోని కొన్ని ప్రాంతాలను రెడ్ జోన్లుగా పరిగణిస్తోంది. హమాస్‌కు ప్రాబల్యముండే ఈ ప్రాంతాలను వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేసింది. ఇలా ఉండగా, శుక్రవారం గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఏడుగురు చిన్నారులు సహా 44 మంది చనిపోయినట్లు అల్ జజీరా పేర్కొంది.

పాకిస్తాన్ నుంచి 14 మంది ఉగ్రవాదులు, 400 కిలోల ఆర్డీఎక్స్

- ముంబై పోలీసులకు బెదిరింపు మెసేజీ
- నిమజ్జనోత్సవాల వేళ పరిణామం
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం

ముంబై: గణపతి నిమజ్జనోత్సవ ఏర్పాట్లలో తలమునకలై ఉన్న ముంబై యంత్రాంగాన్ని ఓ బెదిరింపు సందేశం మరింత అప్రమత్తం చేసింది. 'పాకిస్తాన్ నుంచి మహానగరంలోకి 14 మంది ఉగ్రవాదులు ప్రవేశించారు. వివిధ ప్రాంతాల్లో 34 వాహనాల్లో 400 కిలోల ఆర్డీఎక్స్‌తో మానవ బాంబులు సిద్ధంగా ఉన్నాయి. శనివారం అనంత్ చతుర్దశి(గణేశ్ నిమజ్జనోత్సవం) నాడు ముంబై నగరం పేలుళ్లతో దద్దరిల్లిపోతుంది. కనీసం కోటి మంది చనిపోతారు'అని ముంబై ట్రాఫిక్ పోలీసు విభాగం ఫోన్ వాట్సాప్‌కు 'లష్కర్–ఇ–జిహాదీ'పేరుతో శుక్రవారం ఒక మెసేజీ అందింది. దీంతో, హై అలెర్ట్ ప్రకటించినట్లు ముంబై పోలీస్ విభాగం పేర్కొంది. దీనిని కేవలం బెదిరింపుగానే భావిస్తున్నామని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అయినప్పటికీ, సాధ్యమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ సందేశాన్ని పంపించిన వ్యక్తి ఎవరో కనిపెట్టే ప్రయత్నాల్లో ఉన్నామన్నారు. దీనిపై అన్ని కోణాల్లోనూ విచారణ కొనసాగుతోందన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో బందోబస్తును మరింతగా పెంచారు. వివిధ ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. వదంతులను నమ్మొద్దని, అనుమానాస్పద కదలికల గురించిన సమాచారాన్ని వెంటనే తమకు అందజేయాలని ప్రజలను కోరారు. శనివారం జరిగే నిమజ్జన ఉత్సవాల బందోబస్తులో 12 మంది అదనపు కమిషనర్లు, 40 మంది డిప్యూటీ కమిషనర్లు, 61 మంది సహాయ కమిషనర్లు సహా 21 వేల మంది పోలీసులను వినియోగిస్తున్నారు. ట్రాఫిక్ సంబంధ సమస్యలను ముందుగానే కనిపెట్టి హెచ్చరించేందుకు ఈసారి ముంబై పోలీసు యంత్రాంగం కృత్రిమ మేధ సాయం తీసుకుంటోంది. ఇటీవలి కాలంలో ముంబై, థానె పోలీసులకు పలుమార్లు బెదిరింపు సందేశాలు అందడం తెల్సిందే. జూలైలో సైతం ముంబై విమానాశ్రయంలో బాంబు పెట్టామంటూ పోలీసులకు సందేశం అందింది.

థాయ్ ప్రధానిగా అనుతిన్

సీనియర్ నేతను ఎన్నుకున్న పార్లమెంట్ • రాజు ఆమోదం అనంతరం కేబినెట్ ప్రమాణం



బ్యాంకాక్: థాయ్‌లాండ్ తదుపరి ప్రధాన మంత్రిగా సీనియర్ నేత అనుతిన్ చర్న్‌విరకుల్(58) ఎన్నికయ్యారు. శుక్రవారం పార్లమెంట్‌లోని ప్రతినిధుల సభలో జరిగిన ఓటింగ్‌లో పాల్గొన్న 492 మందికి గాను భుమ్‌జైతై పార్టీ తరఫున పోటీకి దిగిన అనుతిన్‌కు అనుకూలంగా 311 మంది ఓటేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వం బలపర్చిన చైకసెం నితిసిరికి 152 ఓట్లు పోలయ్యాయి. అనుతిన్ ఎన్నికపై రాజు మహా వజ్రలంగ్‌కోర్న్ అధికార ముద్ర వేశాక అనుతిన్, ఆయన మంత్రివర్గం ప్రమాణం చేసే అవకాశాలున్నాయి. థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య ఎన్నాళ్లుగానో సరిహద్దు వివాదం నడుస్తోంది. ఈ వివాదాన్ని పరిష్కరించుకునే క్రమంలో జూన్‌లో ప్రధానిగా ఉన్న పెటొంగ్‌టర్న్ షినవత్రా కాంబోడియా సీనియర్ నేత హున్‌సెన్‌తో జరిపిన ఫోన్ సంభాషణ లీకై తీవ్ర సంచలనం రేపింది. షినవత్రా, హున్‌సెన్‌ల సంభాషణ కాంబోడియాకు ప్రయోజనం చేకూర్చేలా ఉందే తప్ప, తమ దేశానికి కాదని దర్యాప్తు చేపట్టిన రాజ్యాంగ న్యాయస్థానం పేర్కొంది. ఆమె తీరు ప్రధాని పదవికి తగినట్లుగా లేదని ఆక్షేపిస్తూ పదవి నుంచి తొలగిస్తూ తీర్పు వెలువరించింది. ఆ వెంటనే షినవత్రా సంకీర్ణ ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నట్లు భుమ్‌జైతై పార్టీ నేత అనుతిన్ ప్రకటించారు. మైనారిటీలో పడిన షినవత్రా సారథ్యంలోని ఫ్యు థాయ్ పార్టీ ఆపద్ధర్మ ప్రభుత్వం పార్లమెంట్ రద్దుకు సిఫారసు చేసింది. ఈ సిఫారసును రాజు కనుసన్నల్లో నడిచే ప్రీవీ కౌన్సిల్ తిరస్కరించింది. ఈ పరిణామంతో పార్లమెంట్‌లో నూతన ప్రధాని ఎన్నిక అనివార్యమైంది.

పార్లమెంట్ రద్దుకు హామీ

అనుతిన్ ప్రభుత్వానికి వెలుపలి నుంచి మద్దతిచ్చేందుకు పీపుల్స్ పార్టీ ముందుకు వచ్చింది. అయితే, నాలుగు నెలల్లో పార్లమెంట్‌ను రద్దు చేయడం, గతంలో సైనిక పాలన సమయంలో తీసుకువచ్చిన రాజ్యాంగాన్ని రద్దు చేసి కొత్త రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు రెఫరెండం విధించడం వంటి షరతులు విధించింది. దీంతో, అనుతిన్ అస్థిర ప్రభుత్వంగానే సాగనుంది. 2023 ఎన్నికల్లో అత్యధిక సీట్లను పీపుల్స్ పార్టీయే గెలుచుకుంది. కానీ, ప్రతినిధుల సభ, సైనిక ప్రతినిధులతో కూడిన సెనేట్ చేపట్టిన ఉమ్మడి ఓటింగ్‌లో ఆ పార్టీకి చెందిన అభ్యర్థి మెజారిటీ ఓట్లను గెలుచుకోలేకపోయారు. పీపుల్స్ పార్టీ తలపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను రాజుకు అనుకూలమైన సెనేట్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఫ్యు థాయ్ పార్టీకి చెందిన శ్రేత్త థవిసిన్ ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. ఆయన్ను కూడా నైతిక ఉల్లంఘన ఆరోపణలపై రాజ్యాంగ న్యాయస్థానం దించేసింది. ఆ తర్వాత మాజీ ప్రధాని థక్సిన్ షినవత్రా కుమార్తె పెటొంగ్‌టర్న్ అతిపిన్న వయస్కురాలైన ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆమె పాలన సైతం ఏడాదిలోనే ముగిసిపోయింది. అనుతిన్ 2023లో అధికారంలోకి వచ్చిన ఫ్యు థాయ్ సంకీర్ణంలో, అంతకుమునుపు మాజీ ప్రధాని ప్రయుత్ చన్ ఓచా కేబినెట్‌లోనూ మంత్రిగా పనిచేశారు.

మళ్లీ దుబాయ్‌కి థక్సిన్

థాయ్‌లాండ్ రాజకీయాల్లో దశాబ్దాలపాటు కీలకంగా ఉన్న మాజీ ప్రధాని థక్సిన్ షినవత్రా(76) మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గురువారం రాత్రి 7 గంటల వేళ బ్యాంకాక్‌లోని డాన్ మ్యుయెగ్ విమానాశ్రయం నుంచి ఆయన ప్రైవేట్ జెట్ విమానం టేకాఫ్ తీసుకుందని అధికారులు తెలిపారు. సింగపూర్ వెళ్తున్నట్లు థక్సిన్ చెప్పారన్నారు. ఆయనకు వ్యతిరేకంగా కోర్టు నుంచి ఎటువంటి ఉత్తర్వులు, అరెస్ట్ వారెంట్లు లేవని, అందుకే అడ్డుకోలేదని అధికారులు పేర్కొన్నారు. అయితే, ఎయిర్ పోర్టులో అధికారులు తన విమానాన్ని రెండు గంటలపాటు నిలిపివేశారని అనంతరం థక్సిన్ ఎక్స్‌లో తెలిపారు. దీంతో, వైద్య చికిత్సల నిమిత్తం సింగపూర్ వెళ్లలేకపోయానని, బదులుగా దుబాయ్‌కి వెళ్తున్నట్లు వెల్లడించారు. గతంలో 2008 నుంచి థక్సిన్ దుబాయ్‌లోనే అజ్ఞాతంలో ఉన్నారు.

జార్జియాలో నిర్బంధంలోకి 475 మంది విదేశీయులు

అక్రమ వలసదార్ల కోసం కొనసాగుతున్న వేట

వాషింగ్టన్: అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్నవారి కోసం వేట కొనసాగుతోంది. చట్ట విరుద్ధంగా వలస వచ్చినవారిని గుర్తించి, వెనక్కి పంపించడానికి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. అమెరికాలోని జార్జియాలో 475 మంది అక్రమవలసదార్లను నిర్బంధించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారి స్టీవెన్ ష్రాంక్ శుక్రవారం వెల్లడించారు. జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యూందాయ్ కంపెనీ ప్లాంట్ ఉంది. ఇక్కడ ఎలక్ట్రిక్ వాహనాలు తయారు చేస్తుంటారు. ఇందులో దక్షిణ కొరియా పౌరులు అక్రమంగా పని చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. తాజాగా నిర్బంధంలోకి తీసుకున్నవారి అక్రమ వలసదార్లతో ఎక్కువ మంది దక్షిణ కొరియా పౌరులే ఉన్నట్లు స్టీవెన్ ష్రాంక్ తెలిపారు. జార్జియాలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు స్థానికులకు దక్కాలి తప్ప అక్రమంగా వలసవచ్చినవారు సొంతం చేసుకోవడం సరైంది కాదని అన్నారు. ఒకేచోట 475 మంది అదుపులోకి తీసుకోవడం హోంల్యాండ్ సెక్యూరిటీ ఆపరేషన్ల చరిత్రలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అమెరికాలో తమపౌరులను అక్కడి అధికారులు నిర్బంధించినట్లు దక్షిణ కొరియా విదేశాంగ శాఖ కూడా ధ్రువీకరించింది. అయితే, ఎంతమంది అనే విషయం బయటపెట్టలేదు. డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు సోదాలు ముమ్మరంచేశారు. ప్రధానంగా విదేశీయులు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ సోదాలు జరుగుతున్నాయి.

స్మార్ట్ టీచర్ల అవసరమే ఎక్కువ

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలతో రాష్ట్రపతి ముర్ము



పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: విద్యార్థుల పురోభివృద్ధిని ఎప్పటికప్పుడు కనిపెడుతూ వారికి చదువుపై ఆసక్తిని పెంపొందించే స్మార్ట్ టీచర్ల అవసరం ఎంతో ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. ఇటువంటి ఉపాధ్యాయులే దేశం, సమాజం అవసరాలకు అనుగుణంగా వ్యవహరించే సమర్థులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతారన్నారు. వివేకవంతులైన ఉపాధ్యాయులు పిల్లల్లో ఆత్మగౌరవం, భద్రతా భావాన్ని పెంపొందించడానికి కృషి చేస్తారన్నారు. శుక్రవారం రాష్ట్రపతి ముర్ము విజ్ఞానభవన్‌లో జరిగిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విశేష సేవలందించిన 60 మందికి పైగా ఉపాధ్యాయులను సన్మానించారు. స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ క్లాసురూంలు, ఇతర అత్యంత ఆధునాతన స్కూళ్లు, ఉన్నత విద్యా సంస్థల కంటే ఎక్కువగా స్మార్టు టీచర్లే ముఖ్యమని అనంతరం ఆమె తెలిపారు. ఉపాధ్యాయినిగా గడిపిన సమయమే తన జీవితంలో అత్యంత అర్థవంతమైందిగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థి నడవడికను తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుని ప్రాథమిక కర్తవ్యమని చెప్పారు.

విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను జీవితాంతం గుర్తుంచుకోవడం, కుటుంబం, సమాజం, దేశానికి ప్రశంసనీయమైన సేవలందించడమే విద్యార్థులిచ్చే అతిపెద్ద కానుక అని రాష్ట్రపతి ముర్ము అన్నారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముందుగా ప్రధాని మోదీ ఉత్తమ అధ్యాపకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా వారితో..'విద్యార్థులకు ఉపాధ్యాయులు హోం వర్క్ ఇవ్వడం సహజం. నేను కూడా మీ అందరికీ ఒక హోం వర్క్ ఇవ్వాలనుకుంటున్నా. అదేమంటే.. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం. మేక్ ఇన్ ఇండియా, ఒకల్ ఫర్ లోకల్ ఉద్యమానికి సారథులుగా ఉండటం..'అని పేర్కొన్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 6 । సెప్టెంబర్ । 2025

600 ప్రత్యేక బస్సులు

నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ట్యాంక్‌బండ్‌కు చేరుకొనేందుకు 600 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కాచిగూడ, రాంనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులతోపాటు హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను హిమాయత్‌నగర్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు నడుపుతారు. ఉప్పల్, సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే బస్సులను ఇందిరా పార్కు వరకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు, మియాపూర్, కూకట్‌పల్లి, తదితర ప్రాంతాల నుంచి నడిచే బస్సులు ఖైరతాబాద్ వరకు రాకపోకలు సాగిస్తాయి. బోడుప్పల్ వైపు నుంచి వచ్చే కొన్ని బస్సులను లిబర్టీ వరకు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. మెహదీపట్నం వైపు నుంచి వచ్చే వాటిని లక్డీకాపూల్ వరకు నడుపుతారు. సమాచారం కోసం 99592 26160, 99592 26154 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ఏర్పాట్ల వివరాలు

నగరంలోని మండపాలు

దాదాపు 50 వేలు
(రిజిస్టర్ అయినవి 11,850)
శుక్రవారం నాటికి
నిమజ్జనమైనవి: 9 వేలకు పైగా
ఊరేగింపు మార్గం: 303 కిమీ

ఇందులో పాల్గొనే భక్తులు

10 లక్షల నుంచి 15 లక్షలు

నిమజ్జనం జరిగే ప్రధాన ట్యాంకులు

ట్యాంక్‌బండ్, రాజన్న బౌలి, మీరాలం ట్యాంక్, ఎర్రకుంట చెరువు, షేక్‌పేట చెరువు, సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్, సఫిల్‌గూడ/మల్కాజ్‌గిరి చెరువులు, హస్మత్‌పేట చెరువు

హుస్సేన్‌సాగర్‌కు వచ్చేవి

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలతో పాటు మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన విగ్రహాలు.

బందోబస్తులో పాల్గొనే విభాగాలు

- శాంతి భద్రతలు, టాస్క్‌ఫోర్స్, ఎస్బీ, సీఏఆర్, సీఎస్‌డబ్ల్యూ, హోంగార్డ్స్, ఇతర జిల్లాల అధికారులు, పొరుగు రాష్ట్రాల పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, టీజీఎస్పీ, ఏఆర్, సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్
- ఆరు యూనిట్ల గ్రేహౌండ్స్, మూడు యూనిట్ల ఆక్టోపస్ బలగాలు అందుబాటులో ఉంటాయి.

వలంటీర్లు

నిమజ్జనం, ఊరేగింపుల్లో సహకరించడానికి 2000 వేల మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లతో పాటు స్వచ్ఛంద కార్యకర్తలూ సహకరించనున్నారు.

పికెట్ల వివరాలు

అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో 310
సమస్యాత్మక ప్రాంతాల్లో 605
మొబైల్ పెట్రోలింగ్ యూనిట్లు: 410

నిఘా కోసం కెమెరాలు

- 12 వేల కమ్యూనిటీ సీసీ కెమెరాలు, అదనంగా 2 వేల సీసీ కెమెరాలు, 250 అద్దె కెమెరాలతో పాటు మరో 600 హ్యాండ్‌హెల్డ్ కెమెరాలు
- సీసీ కెమెరాల కనెక్టివిటీని డీజీపీ కార్యాలయంతో పాటు ఐసీసీసీకి ఇచ్చారు.

బాంబు నిర్వీర్య బృందాలు: 16

యాక్సెస్ కంట్రోల్ టీమ్స్: 2
పోలీసు జాగిలాలు: 34
అదనపు వైర్‌లెస్ సెట్లు:
600 (ప్రస్తుతం ఉన్నవి 4 వేలు)
డ్రోన్లు: 9

క్రేన్ల మోహరింపు ఇలా

విగ్రహాలను వాహనాలు ఎక్కించడానికి, అవసరమైన చోట్ల వాడటానికి 108 మొబైల్ క్రేన్లు సిద్ధం చేశారు.

కంట్రోల్ రూమ్స్

పాతబస్తీలోని సర్దార్ మహల్‌లో జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. దీంతో పాటు కమిషనరేట్, ఎన్టీఆర్ మార్గ్, గాంధీనగర్ ఔట్‌పోస్ట్ వద్ద మరో మూడు ఏర్పాటు.

అర్ధరాత్రి వరకు మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లు

నిమజ్జన ఘట్టం సందర్భంగా ఆర్టీసీ, రైల్వే, మెట్రో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు నడుపనున్నట్లు ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మెట్రో స్టేషన్ల వద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేసినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్ స్టేషన్లలో అదనపు టిక్కెట్ కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అందుబాటులో ఎంఎంటీఎస్ రైళ్లు ..

సికింద్రాబాద్–నాంపల్లి, లింగంపల్లి–సికింద్రాబాద్, నాంపల్లి–లింగంపల్లి, సికింద్రాబాద్–ఫలక్‌నుమా, నాంపల్లి–ఫలక్‌నుమా స్టేషన్ల మధ్య శనివారం అర్ధరాత్రి వరకు ఎంఎంటీఎస్ ప్రత్యేక రైళ్లను నడుపనున్నారు.



ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి తరలివస్తున్న గణనాథులు

అత్యవసర వైద్య సేవలు

నిమజ్జన పాయింట్ లలో మూడు షిఫ్టులలో పని చేసేలా అంబులెన్స్ లతో సహా 7 మెడికల్ క్యాంపులను సిద్ధంగా ఉంచారు.

భక్తుల దాహార్తిని తీర్చడానికి తాగునీటి శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. 123 ప్రత్యేక తాగునీటి శిబిరాలతో పాటు 72 బేబీ పాండ్స్ వద్ద నీటి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సిద్ధి గణపతి

నిమజ్జనానికి సర్వం సిద్ధం!

ఈ క్రతువు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు

- శనివారం తెల్లవారుజామున ఊరేగింపు ప్రారంభం
- ట్యాంక్‌బండ్ చుట్టూ కొత్తగా, అదనపు క్రేన్లు ఏర్పాటు
- నగర వ్యాప్తంగా సీసీ, వీడియో కెమెరాల నిఘా

బందోబస్తు విధుల్లో 29 వేల మంది సిబ్బంది



ఎన్టీఆర్‌మార్గ్ వద్ద క్రేన్లు

సాక్షి, సిటీబ్యూరో

గణేష్ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సామూహిక ఊరేగింపు, నిమజ్జనం శనివారం జరుగనుండటంతో 29 వేల మంది సిబ్బందితో పటిష్ట ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ఘట్టం ఏమాత్రం ఆలస్యం కాకుండా గతం కంటే వీలైనంత త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అదనపు చర్యలు తీసుకుంటున్నారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేశారు. రౌడీషీటర్లతో పాటు అనుమానిత వ్యక్తుల బైండోవర్, వారిపై నిఘా ఉంటుంది. ప్రతి ఏడాది ఈ కార్యక్రమం మరుసటి రోజు మధ్యాహ్నం వరకు సాగుతోంది. దీంతో ఈ ఏడాది మండప నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సహకారంతో శుక్రవారం అర్ధరాత్రి లేదా శనివారం తెల్లవారుజాము లోపు విగ్రహాల ఊరేగింపు ప్రారంభమయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఖైరతాబాద్ మహా గణేషుడి నిమజ్జనం ఊరేగింపు ఉదయం 6.30 గంటలకే ప్రారంభమై... మధ్యాహ్నం 1.30 గంటల లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. విగ్రహాల తరలింపునకు వాహనాల లభించని వారికి పోలీసులే ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలతో పాటు పెద్ద ఎత్తున హ్యాండ్ హెల్డ్ కెమెరాల్నీ వాడి ప్రతి ఘట్టాన్నీ చిత్రీకరించనున్నారు. బందోబస్తు కోసం నగర పోలీసులతో పాటు కేంద్రం, రాష్ట్ర సాయుధ బలగాలనూ మోహరిస్తున్నారు. విధుల్లో ఉండే సిబ్బందికి షిఫ్ట్ విధానం అమలు చేస్తూ వారికి అవసరమైన ఆహారం, మంచినీళ్లు అందిస్తున్నారు. పోలీసు అధికారులు ఇతర విభాగాలతో పాటు శాంతి, మైత్రి సంఘాలతో సమన్వయం కలిగి ఉండి పని చేస్తున్నారు.

గతానికి భిన్నంగా...!

నిమజ్జనం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు కమిషనరేట్ల అధికారులు నిఘా, తనిఖీలు, గస్తీ, సోదాలు ముమ్మరం చేశారు. జనసమ్మర్ద ప్రాంతాలతో పాటు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ వద్ద విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రధాన ఊరేగింపు, నిమజ్జనం జరిగే చెరువుల దగ్గర, నగర వ్యాప్తంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. ప్రతి చిన్న విషయాన్నీ పెద్దదిగా చేసి చూపిస్తూ, వదంతులను పుట్టిస్తూ సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేయడం ఇటీవల కాలంలో పెరిగింది. కొన్ని సందర్భాల్లో ఇవి కొత్త తలనొప్పులను తెచ్చిపెడుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకున్న అధికారులు వదంతులను తీవ్రంగా పరిగణించాలని నిర్ణయించారు. సర్వీస్ ప్రొవైడర్లతోనూ సమన్వయంగా పని చేస్తున్నారు. వదంతులను వ్యాపింప చేస్తున్న ఎస్సెమ్మెస్‌లు, సోషల్‌మీడియాలపై టెక్నికల్ నిఘా ఉంచే ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేశారు. సామూహిక నిమజ్జనాన్ని తిలకించడానికి ప్రతి ఏడాదీ మహిళా భక్తులు సైతం అధిక సంఖ్యలో వస్తుంటారు. దీన్ని అదునుగా చేసుకుని ఆకతాయిలు, స్నాచర్లు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని దష్టిలో పెట్టుకున్న సిటీ పోలీసులు ఈసారి గతానికి భిన్నంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవ్‌టీజర్లుకు చెక్ చెప్పడానికి 100 షీ–టీమ్ బృందాలను వివిధ ప్రాంతాల్లో మోహరిస్తున్నారు. దీంతోపాటు స్నాచర్లకు చెక్ చెప్పేందుకు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్‌లకు చెందిన డెకాయ్ బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. వీరు అనుమానాస్పద, కీలక ప్రాంతాల్లో మఫ్టీల్లో సాధారణ వ్యక్తుల మాదిరి తిరుగుతూ నిఘా వేసి ఉంచుతారు. దాదాపు 40కి పైగా డెకాయ్ టీమ్స్‌ను మోహరిస్తున్న ఉన్నతాధికారులు ఇందులో క్రైమ్ వర్క్‌పై పట్టున్న వారు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో ఎవరికైనా వదంతులతో కూడిన సందేశాలు వస్తే వాటిని తక్షణం పోలీసుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేస్తున్నారు. వీటిని మరో గ్రూపులోకో, వ్యక్తిగతంగానో ఫార్వర్డ్ చేస్తే సాంకేతిక నిఘాతో వారిని కనిపెట్టేలా ఏర్పాట్లు చేశారు. అలాంటి వారిపై ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయనున్నారు. ప్రధానంగా నిమజ్జనం జరిగే హుస్సేన్‌సాగర్ వద్ద పుషింగ్ టీమ్స్ మోహరిస్తున్నారు.

ఎత్తు పెరిగితే రూటు మారుతుంది

మండపాల నిర్వాహకులు పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలి. విగ్రహం, దాన్ని తరలించే వాహనం హైట్ ఆధారంగా ఊరేగింపు మార్గం ఖరారు చేశాం. పోలీసుస్టేషన్ల వారీగా అధ్యయనం తర్వాత ఇవి ఖరారయ్యాయి. ఎక్కడైనా విగ్రహం వాహనంపై పెట్టిన తర్వాత ముందు అనుకున్న ఎత్తే కంటే పెరిగితే తదనుగుణంగా రూటు మార్చాల్సి ఉంటుంది. ఈ విషయం దృష్టిలో పెట్టుకుని మండప నిర్వాహకులు సహకరించాలి. తీవ్ర శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజేలు, పాట్ బ్యాండ్స్‌కు దూరంగా ఉండండి. గతంలో వీటి ప్రభావం వల్ల నిమజ్జనం పూర్తయిన రెండుమూడు రోజులకు కొందరు కన్నుమూశారు. ఊరేగింపు వాహనంలో మద్యం, తదితరాలు లేకుండా చూసుకోండి. దాదాపు 40 గంటల పాటు సాగే శోభాయాత్ర ద్వారా హుస్సేన్‌సాగర్‌లో 50 వేల విగ్రహాలు నిమజ్జనం అవుతాయని అంచనా వేస్తున్నాం.

– సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీసు కమిషనర్

గణేష్ ప్రతిమలను సకాలంలో తరలించాలి

గణేష్ నిమజ్జనం సజావుగా, సాఫీగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.సకాలంలో గణేష్ ప్రతిమలను నిమజ్జనానికి తరలించాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. గణేష్ ప్రతిమల ఊరేగింపు జరిగే మార్గాలలో నిర్దేశించిన గార్బేజి పాయింట్లలోనే చెత్తను వేయాలని ప్రజలను, భక్తులను కమిషనర్ కోరారు. కలర్ కాగితపు ముక్కలు ఊరేగింపులో ఎగురవేయవద్దని భక్తులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీటిని తొలగించడం కష్టతరమని, ప్రయాణికుల కళ్లలో పడతాయని, పర్యావరణానికి హాని చేస్తాయని చెప్పారు.

–కర్ణన్, కమిషనర్

మహాగణపతి నిమజ్జనానికి..

ఖైరతాబాద్ : ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి మహా నిమజ్జనానికి పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేపడుతున్నారు. గురువారం అర్ధరాత్రి వరకే దర్శనాలు నిలిపివేయడంతో శుక్రవారం ఉదయం నుంచే షెడ్డు తొలగించే పనులు ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాగణపతి దర్శనం సందర్భంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పనులను ఆపివేశారు. ఆ తరువాత షెడ్డు తొలగించే పనులు ప్రారంభించారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల దాటగానే అనంత చతుర్దశిలో కలశాన్ని కదిలించి, ఆ తరువాత మహాగణపతిని వాహనంపైకి ఎక్కిస్తారు. ఇరువైపులా ఉన్న విగ్రహాలను కూడా మరో వాహనంపై ఉంచి శనివారం ఉదయం 6.30 గంటలకు శోభాయాత్రను ప్రారంభించి మధ్యాహ్నం 1.30 కల్లా నిమజ్జనం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

మహాగణపతి కోసం భారీ వాహనం..

50 టన్నుల బరువు, 69 అడుగుల ఎత్తు ఉన్న మహాగణపతిని సాగర తీరానికి తీసుకెళ్లేందుకు ఎస్‌టీసీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన భారీ ట్రాయిలర్ వాహనం సిద్ధం చేశారు. 75 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు, 26 టైర్లు ఉన్న వాహనం బరువు 28 టన్నులు. ఈ వాహనం 100 టన్నుల బరువును మోస్తుంది.

రథసారథి మందాటి వెంకట్ రెడ్డి

ఖైరతాబాద్ మహాగణపతిని సాగర తీరానికి చేర్చేందుకు రథసారథిగా ఈ సంవత్సరం సూర్యాపేట జిల్లాకు చెందిన మందాటి వెంకట్‌రెడ్డి వచ్చాడు. గతంలో వెంకట్‌రెడ్డి 2015, 2017, 2022లో మహాగణపతిని నిమజ్జనానికి నిర్విఘ్నంగా తరలించాడు. ఈ సంవత్సరం మరోసారి ఆయనకు అవకాశం దక్కింది.



మహాగణపతిని తరలించనున్న వాహనంతో డ్రైవర్ వెంకట్‌రెడ్డి

రూట్ మ్యాప్

ఖైరతాబాద్ నుంచి మొదలై రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఎక్బాల్ మినార్ చౌరస్తా, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, సచివాలయం ముందు నుంచి ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నెంబర్ 4 వరకు చేరుకుంటుంది. మహాగణపతిని ఖైరతాబాద్ మంటపం వద్ద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన క్రేన్ సాయంతో వాహనంపైకి తరలిస్తారు. నిమజ్జన సమయంలో హైడ్రాలిక్ భారీ సూపర్ క్రేన్ సాయంతో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

సొంత వాహనాలొద్దు...

హుస్సేన్‌సాగర్ వద్ద సామూహిక నిమజ్జనాన్ని వీక్షించడానికి వచ్చే భక్తులు సొంత వాహనాల్లో కాకుండా సిటీ బస్సులు, మెట్రోరైల్, ఎంఎంటీఎస్ వంటి ప్రజారవాణా వ్యవస్థల్ని వినియోగించాలి. శనివారం ఉదయం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. బాలాపూర్ నుంచి చార్మినార్, ఎంజే మార్కెట్, అబిడ్స్, బషీర్‌బాగ్ మీదుగా హుస్సేన్‌సాగర్ వరకు శోభాయాత్ర జరుగుతుంది. ఈ మార్గంలో ఇటు నుంచి అటు వెళ్లడానికి కేవలం రాజేష్ మెడికల్ హాల్, బషీర్‌బాగ్ చౌరస్తాల వద్దే అవకాశం ఉంది. 3200 మంది ట్రాఫిక్ సిబ్బంది రెండు షిఫ్టుల్లో పని చేస్తారు. విమానాశ్రయానికి వెళ్లాల్సిన వాళ్లు ఓఆర్ఆర్, ఇన్నర్ రింగ్ రోడ్, పీవీ నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్ వే వాడుకోవాలి. ట్రాఫిక్‌కు సంబంధించి ఎలాంటి సహాయం కావాలన్నా 040–27852482, 8712660600, 9010203626 నెంబర్లలో సంప్రదించవచ్చు.

– జోయల్ డెవిస్, సిటీ ట్రాఫిక్ చీఫ్

అన్ని శాఖలూ హై అలర్ట్..

శనివారం జరగనున్న గణేశ్ నిమజ్జనాలకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఎకో ఫ్రెండ్లీ విధానంలో ప్రశాంతంగా జరిగేందుకు జీహెచ్ఎంసీ, పోలీస్, ఎలక్ట్రిసిటీ, హెచ్ఎండీఏ, జలమండలి, ఆర్అండ్‌బీ, హైడ్రా, వైద్య– ఆరోగ్య, పర్యాటక, సమాచారశాఖలు 48గంటలు హై అలర్ట్‌గా ఉండనున్నాయి. 20 పెద్ద చెరువులతోపాటు 70కి పైగా తాత్కాలిక కొలనులు, పాండ్స్‌లో నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు.

134 స్థిర క్రేన్లు | 259 మొబైల్ క్రేన్లు

- ఒక బాహుబలి క్రేన్, 10 పెద్ద క్రేన్లు సహా హుస్సేన్ సాగర్ చుట్టూ 20 క్రేన్లు ఏర్పాటు చేశారు. బాహుబలి క్రేన్ నెంబర్ 4 ద్వారా ఖైరతాబాద్ మహా గణేష్ విగ్రహం నిమజ్జనం జరగనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.
- హైడ్రా, పర్యాటకశాఖ సమన్వయంతో హుస్సేన్ సాగర్‌లో 9 బోట్లు, డీఆర్ఎఫ్ టీమ్స్, 200 మంది గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. పోలీసుల సహకారంతో 13 కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారు.
- 134 స్థిర క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు ఏర్పాటు

160 యాక్షన్ టీమ్స్


303.3 కిలోమీటర్ల మేర ప్రధాన ఊరేగింపు మార్గంలో గణేష్ విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర సజావుగా జరిగేందుకు 160 గణేష్ యాక్షన్ టీంలను జీహెచ్ఎంసీ నియమించింది. ఇప్పటికే ఈ మార్గంలో రోడ్ల మరమ్మత్తులు పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు. శోభాయాత్ర సజావుగా సాగేందుకు, ఎలాంటి ఆటంకాల్లేకుండా ఉండేందుకు ఎలక్ట్రిసిటీ, కేబుల్ వైర్లను సరిచేశారు. చెట్లకొమ్మలు తొలగించారు.

- నిమజ్జన కార్యక్రమంలో స్వచ్ఛతకు పెద్దపీట వేస్తూ 15 వేల మంది పారిశుధ్య కార్మికులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు.
- నిమజ్జనం జరిగే ప్రదేశాలలో 39 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు.

విద్యుత్ వెలుగులు..

నిమజ్జనం జరిగే ప్రదేశాలతో పాటు ఊరేగింపు మార్గంలో 56,187 టెంపరరీ లైట్లు ఏర్పాటు చేశారు. నిమజ్జనం పూర్తయ్యేంత వరకు నూరు శాతం లైట్లు పని చేసేలా అధికారులు మానిటర్ చేస్తున్నారు.

నేటి నుంచి విధుల్లోకి మహిళ అశ్వక దళం



నగర పోలీసు విభాగంలో కొత్తగా ఏర్పాటు చేసిన మహిళ అశ్వకదళం (ఉమెన్ మౌంటెడ్ పోలీసు) శనివారం నుంచి అధికారికంగా విధుల్లోకి రానుంది. నిమజ్జనం నేపథ్యంలో క్రౌడ్ కంట్రోల్ కోసం వీరిని మోహరిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రకటించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం నుంచి పది మంది మహిళా కానిస్టేబుళ్లను ఎంపిక చేసిన అధికారులు వీరికి రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. దేశంలోనే ఇదో వినూత్న విధానమని, వీరిని బందోబస్తు, ప్రముఖుల భద్రత, పెట్రోలింగ్ వంటి విధులకు వినియోగిస్తామని ఆనంద్ పేర్కొన్నారు.

ప్రైవేట్ బస్సులకు నో ఎంట్రీ

గణేష్ నిమజ్జనం, శోభాయాత్ర సాఫీగా సాగేలా రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో నేటి (శనివారం) ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు (ఆదివారం) ఉదయం 8 గంటల వరకు హైదరాబాద్ సిటీ లోకి ప్రైవేట్ బస్సులకు అనుమతి లేదని రాచకొండ కమిషనర్ జీ సుధీర్ బాబు తెలిపారు. కేవలం ఔటర్ రింగ్ రోడ్డు మీదుగానే ప్రయాణించాలని సూచించారు. అలాగే సిటీలో ఇప్పటికే ఉన్న భారీ వాహనాలు, ప్రైవేట్ బస్సులు సైతం బయటికి వెళ్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

ఫోన్ విషయంలో గొడవ..యువకుడి హత్య..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని ఆశా ఆస్పత్రి వద్ద ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని గౌరీశంకర్‌కాలనీకి చెందిన ఈ.శ్రీధర్ (30) ఈవెంట్స్‌లో పనిచేస్తుంటాడు. గురువారం ఉదయం అతను తన స్నేహితుడిని బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లో బైక్‌పై దింపి తిరిగి వస్తుండగా ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. దీంతో ఆశా హాస్పిటల్ వాచ్‌మెన్ వెంకటయ్యను ఫోన్ ఇవ్వాలని, తన ఇంటికి అర్జెంటుగా ఫోన్ చేసుకోవాల్సి ఉందని, తన ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని చెప్పాడు. అయితే తన ఫోన్‌లో బ్యాలెన్స్ లేదని వాచ్‌మెన్ వెంకటయ్య చెప్పడంతో నేను అడిగితే ఫోన్ ఇవ్వవా అంటూ శ్రీధర్ అతడితో వాగ్వివాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీధర్‌ను వాచ్‌మెన్ వెంకటయ్యతో పాటు హరికృష్ణ, తరుణ్ అనే వ్యక్తులు సెల్లార్‌లోకి తీసుకెళ్లి చితకబాదారు. అతను అక్కడికక్కడే శ్రీధర్ కుప్పకూలాడు. అప్పటికే బయట వేచి ఉన్న శ్రీధర్ పరిచయస్తులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అతడి భార్య బాధితుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటయ్య, హరికృష్ణ, తరుణ్‌లపై కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి హోల్‌సేల్ వ్యాపారిపై పీడీ యాక్ట్

జియాగూడ: ధూల్‌పేటకు చెందిన లకన్ సింగ్‌పై నగరంలోని పలు ఎక్సైజ్ స్టేషన్లలో 30కి పైగా గంజాయి కేసులు నమోదు అయినందున ధూల్‌పేట ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు శుక్రవారం ఆయనకు పీడీ యాక్ట్ నోటీసులు ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..లకన్ సింగ్ గంజాయి హోల్‌సేల్ వ్యాపారిగా ఒడిశాలోని గంజాయి సాగు, అమ్మకం బడా వ్యాపారులతో సంబంధాలు కొనసాగిస్తూ ఒడిశా నుంచి నేరుగా 25 కిలోల నుంచి 100 కేజీల వరకు గంజాయిని ధూల్‌పేటకు తెప్పించి స్థానిక వ్యాపారులకు అమ్మకాలు జరుపుతుంటాడు. దీంతో లకన్ సింగ్‌పై కలెక్టర్ హరిచందన పీడీ యాక్ట్ ఇంపోస్ చేశారన్నారు. 8 నెలల్లో లకన్ సింగ్ మూడు సార్లు 78 కేజీల గంజాయి ఎక్సైజ్ ఎస్టీఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి బృందానికి పట్టుబడ్డారు. ధూల్‌పేట, నారాయణగూడ పలు పోలీస్‌స్టేషన్లలో గంజాయి పట్టుకొన్న కేసులు నమోదయ్యాయి. అలాగే ధూల్‌పేటలో గంజాయి డాన్ అంగూర్ బాయిపై కూడా పీడీ యాక్ట్ పెట్టడంతో జైలులో ఉన్నారు.

పండగల వేళ పకడ్బందీగా..

సికింద్రాబాద్ స్టేషన్‌లో రద్దీ నియంత్రణకు చర్యలు

- పండుగల దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు
- వేగంగా కొనసాగుతున్న స్టేషన్ పునరాభివృద్ధి పనులు...



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల సదుపాయాలపైన అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశారు. స్టేషన్ పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం సుమారు 60 శాతానికి పైగా నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే పలు రైళ్లను చర్లపల్లి, నాంపల్లి, మల్కాజిగిరి, కాచిగూడ తదితర స్టేషన్లకు మళ్లించిన సంగతి తెలిసిందే. ఇంకా కొన్ని ప్రధాన మార్గాలకు నడిచే రైళ్లు సికింద్రాబాద్ నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నెల చివరి వారం నుంచి వరుసగా రానున్న దసరా, దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి, తదితర పండుగల దృష్ట్యా ప్రయాణికుల రద్దీ పెరగనుంది. ఈ రద్దీని నియంత్రించడానికి దక్షిణ మధ్య రైల్వే ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించింది. సికింద్రాబాద్‌స్టేషన్ నుంచి సాధారణ రోజుల్లో 1.3 లక్షల మంది ప్రయాణం చేస్తారు. పండుగలు, ఇతర వరుస సెలవు రోజుల్లో ప్రతి రోజు 2 లక్షల మందికి పైగా రాకపోకలు సాగిస్తారు. 80 శాతానికి పైగా ప్రయాణికులు ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌నే ఎక్కువగా వినియోగిస్తారు. ఉదయం 5 గంటల నుంచే ప్రయాణికుల రద్దీ మొదలవుతుంది. రాత్రి 11 గంటల వరకు కొనసాగుతుంది. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మార్గంలో గంటకు 10 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తారు. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రద్దీ నియంత్రణ చర్యలు ఇలా.....

- రద్దీ సమయాల్లో కొన్ని రైళ్లను సనత్‌నగర్–అమ్ముగూడ–మౌలాలీ నుంచి చర్లపల్లికి మళ్లిస్తారు. ఆయా స్టేషన్లలో అదనపు హోల్డింగ్ సదుపాయం కల్పించనున్నారు.
- ప్రయాణికులు వేచి ఉండేందుకు ఒకటోనెంబర్, పదోనెంబర్ ప్లాట్‌ఫామ్‌ల వద్ద అదనపు ఏర్పాట్లు చేయనున్నారు. రైలు వచ్చే వరకు ప్రయాణికులు అక్కడ వేచి ఉండవచ్చు. ఈ మేరకు ప్లాట్‌ఫామ్ ఒకటి వైపు రెండు హోల్డింగ్ ప్రాంతాలు ఉంటాయి.1, 2, 5వ నెంబర్ గేట్‌ల వద్ద 1500 మంది ప్రయాణికుల సామర్థ్యంతో ఈ వెయిటింగ్ హాళ్లు ఉన్నాయి.
- 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద 1125 మంది ప్రయాణికుల సామర్థ్యంతో 8వ గేట్ వద్ద ఒక హోల్డింగ్ ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు. స్టేషన్‌లో నావిగేట్ చేసేందుకు ప్రయాణికులు సంకేతాలను వినియోగించవచ్చు.
- ఒకటోనెంబర్ ప్లాట్ ఫామ్ నుంచి సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో స్టేషన్‌కు కొత్తగా ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు.
- వాహనాల పార్కింగ్‌కు 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ఏర్పాట్లు చేశారు. సుమారు 200 లకు పైగా కార్లను నిలిపేందుకు సదుపాయం ఉంది. పదోనెంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి స్టేషన్‌లోకి ప్రవేశించే సమయంలో గతంలో ఏర్పాటు చేసిన 12 నిమిషాల ఎంట్రీ/ ఎగ్జిట్ టోల్‌గేట్‌లను తొలగించారు.దీంతో వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించవచ్చు. అలాగే వాహనాల నియంత్రణకు పోలీసులు విధులు నిర్వహిస్తారు.
- టిక్కెట్ కౌంటర్‌ల వద్ద రద్దీని నియంత్రించేందుకు అదనంగా ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అలాగే సహాయ కేంద్రాలు, రైల్వే ఉన్నతాధికారులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు.
- టికెట్ కౌంటర్‌లను అదనంగా కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

అదనపు సదుపాయాలు..

- రైళ్ల రియల్‌టైమ్ సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయాణికులు 'రైల్‌వన్' మొబైల్ యాప్‌ను వినియోగించవచ్చు.టికెట్‌ల కొనుగోలు, ఫుడ్‌ఆర్డర్లు, ఫిర్యాదుల నమోదుకు కూడా ఈ యాప్‌ను వినియోగించవచ్చు.
- ప్రయాణికులు తప్పనిసరిగా 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ నుంచే ఎక్కువగా రాకపోకలు సాగించాలని దక్షిణమధ్య రైల్వే అధికారులు సూచించారు. ఈ ప్రాంగణం విశాలంగా ఉండడమే కాకుండా అప్రోచ్ రోడ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి , లిఫ్టులు, పార్కింగ్ సదుపాయాలతో ఉన్నట్లు పేర్కొన్నారు.
- ప్రయాణికులు కచ్చితమైన సమయపాలన పాటించడం వల్ల ఎక్కువ సమయం రైళ్ల కోసం స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదు.
- ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు 24 గంటల పాటు నిఘాను కొనసాగించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు సహాయ కేంద్రాలతో పాటు ఆర్పీఎఫ్ పోలీసుల నుంచి కూడా అవసరమైన సహాయాన్ని పొందవచ్చు.



నలుగురు నకిలీ వైద్యులపై కేసులు



సాక్షి, సిటీ బ్యూరో: ఎలాంటి అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్న నలుగురు నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కేసులు నమోదు చేశారు. శివరాంపల్లి, కాటేదాన్, బాలాపూర్ ప్రాంతాల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యుడు ఇమ్రాన్ పలు ఆసుపత్రులు, క్లినిక్‌లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి విద్యార్హత లేని అశోక్ కుమార్, మోహన్‌గౌడ్, నరేష్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అంతేగాక వారు నిబంధనలకు విరుద్ధంగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇవ్వడం, రోగులకు ప్రిస్క్రిప్షన్ రాస్తున్నారని కౌన్సిల్ ఉపాధ్యక్షుడు డా.శ్రీనివాస్ తెలిపారు. గురురాజ్ గురుపాద్ (బీహెచ్ఎంఎస్) అల్లోపతి వైద్యం చేస్తున్నారని, అతడిపై గతంలో కేసు నమోదైనా తీరు మారలేదన్నారు. మరో ముగ్గురు నకిలీ వైద్యులు తమ క్లినిక్‌లకు తాళాలు వేసి పారిపోయినట్లు తెలిపారు. మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి, తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వైద్యం చేస్తున్నట్లు గుర్తిస్తే 9154382727 నెంబర్‌కు వాట్సాప్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

రేపు చిలుకూరు బాలాజీ దేవాలయం మూసివేత

మొయినాబాద్: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం సాయంత్రం 4 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. గ్రహణం ముగిసిన తరువాత ఆలయ సంప్రోక్షణ, అభిషేకం నిర్వహించి భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామన్నారు.

ఇక్ఫాయ్ గుర్తింపు రద్దు చేయాలి

శంకర్‌పల్లి: ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీ గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడటం బాధాకరమైన విషయమన్నారు. నిర్వాహకుల అసమర్థతతోనే ఈదుస్థితి నెలకొందని మండిపడ్డారు. యూనివర్సిటీలో డ్రగ్స్, గాంజా విక్రయాలు, వినియోగం అధికంగా ఉందన్నారు. ఎనిమిది మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా అందరూ డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం ఇక్కడి పరిస్థితిని సూచిస్తోందని తెలిపారు. ఇంత జరుగుతున్నా యాజమాన్యం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదిశగా చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. విషయం తెలుసుకున్న మోకిల సీఐ ఆందోళనకారులను అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు.

హైడ్రా పేరిట టోకరా

పహాడీషరీఫ్: హైడ్రా అధికారులతో మాట్లాడి పొలం పంచాయతీ పరిష్కరిస్తామంటూ మహిళ నుంచి రూ.50 లక్షలు వసూలు చేసిన నలుగురు నిందితులపై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కుగూడలోని 13, 122, 127, 147 సర్వే నంబర్లలో చైతన్య రెడ్డి అనే మహిళకు పట్టా భూమి ఉంది. ఇందులో కొందరు వెంచర్ నిర్వాహకులు 150 ఫీట్ల రోడ్డు వేశారు. ఈ విషయమై ఆమె ప్రశ్నిస్తున్న క్రమంలో ప్రవీణ్, చందూ, శ్రీనివాస్, నరేష్ అనే వ్యక్తులు ఆమెను సంప్రదించారు. తమకు హైడ్రా అధికారులు తెలుసని, మీ స్థలం మీకు ఇప్పిస్తామంటూ రూ.50 లక్షలు వసూలు చేశారు. సమాచారం అందుకున్న హైడ్రా ఏసీపీ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సిటీ పోలీసులోకి 'లాడెన్ జాగిలాలు'

బెల్జియం మలినాయిస్ జాతివి సైతం కొనుగోలు

- తొలిసారి నేరుగా ఖరీదు చేసిన సిటీ పోలీసులు
- 11.5 ఎకరాల్లో కెన్నెల్స్, స్టేబుల్స్: సీవీ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: పాకిస్థాన్‌లోని అబోటాబాద్‌లో దాక్కున్న అల్ ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ ఆచూకీ కనుగొనటం కోసం అమెరికన్ నేవీ సీల్స్ 2011లో వినియోగించిన బెల్జియం మలినాయిస్ జాతి జాగిలాలు నగర పోలీసు విభాగంలో అందుబాటులోకి రానున్నాయి. సిటీ పోలీసులు కొత్తగా ఖరీదు చేసిన 12 జాగిలాల పిల్లల్లో ఆరు బెల్జియం మలినాయిస్ జాతివే ఉన్నాయి. దేశంలోనే ఈ తరహా జాగిలాలను నేరుగా ఎంపిక చేసి, అందుబాటులోకి తీసుకువస్తున్న తొలి పోలీసు విభాగంగా హైదరాబాద్ కమిషనరేట్ కావడం గమనార్హం. పోలీసు విభాగం సుదీర్ఘకాలం జర్మన్ షెపర్డ్, లాబ్రెడార్ తదితర జాతి జాగిలాలకు శిక్షణ ఇచ్చి వినియోగించింది. అయితే మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు నిర్వహిస్తున్న సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్పీఎఫ్) కొన్నేళ్ల క్రితం 300 బెల్జియం మలినాయిస్ జాగిలాలను ఖరీదు చేసి వినియోగించడం ప్రారంభించింది. 2015లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషనల్ విభాగమైన ఆక్టోపస్‌లో వినియోగించడానికి ప్రయోగాత్మకంగా మూడు (రెండు మగ, ఒక ఆడ) బెల్జియం మలినాయిస్ జాగిలాలను ఖరీదు చేశారు. వీటి పనితీరును అధ్యయనం చేసిన నగర పోలీసు అధికారులతో కూడిన కమిటీ సర్వకాల సర్వావస్థల్లోనూ విసుకు, విరామం లేకుండా ఏకధాటిగా పని చేయడం, పౌరుషం తదితర లక్షణాలను పరిగణలోకి తీసుకుంది. దశల వారీగా నగర పోలీసు విభాగంలో బెల్జియం మలినాయిస్, బీగల్ జాతి జాగిలాల సంఖ్యను పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. బెల్జియం మలినాయిస్ జాతి జాగిలం గరిష్ఠంగా 12 ఏళ్లు జీవిస్తుంది. ఇది 22 నుంచి 26 అంగుళాల వరకు ఎత్తు పెరుగుతుంది. 20 నుంచి 30 కేజీల బరువు కలిగి ఉంటుంది. పౌరుషం, సంగ్రహణ శక్తుల్లో ఉత్తమమైన వీటికి శిక్షణ ఇవ్వడం కూడా చాలా తేలిక.

త్వరలో నిర్మాణాలు ప్రారంభిస్తాం

గోషామహల్‌లోని పోలీసుస్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రికి తీసుకోగా మిగిలిన 11.5 ఎకరాల్లో త్వరలో నిర్మాణాలు ప్రారంభించనున్నాం. వీటిలో ఓపక్క అశ్వకదళం (మౌంటెడ్ పోలీసు) కోసం స్టేబుల్స్, మరోపక్క జాగిలాల కోసం కెన్నెల్ నిర్మించనున్నాం. ప్రస్తుతం సిటీ పోలీసు విభాగంలో ఉన్న 50 గుర్రాల్లో మూడు తప్ప మిలినవి అన్నీ యాక్టివ్‌గా ఉన్నాయి. కీలక సందర్భాల్లో క్రౌడ్‌కంట్రోల్‌కు ఇవి అత్యంత కీలకం. 2003లో నేను సెంట్రల్ జోన్ డీసీపీగా ఉండగా చేప ప్రసాదం పంపిణీలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో రోగులు రావడంతో తొక్కిసలాట వరకు విషయం వెళ్లినా... అక్కడ ఉన్న మౌంటెడ్ పోలీసు రంగంలోకి దిగడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

– సీవీ ఆనంద్, నగర కొత్వాల్

మంచినీటి సరఫరాలో 48 గంటలు అంతరాయం

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్–1 పథకంలో భాగంగా ముర్మూర్, మల్లారం, కొండపాక పంపింగ్ స్టేషన్ల పరిధిలో పంపింగ్ మెయిన్ వాల్వుల మార్పిడి పనుల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఈ నెల 9న ఉదయం 6 గంటల నుంచి 48 గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి ప్రకటించింది. ఎస్ఆర్‌నగర్ సనత్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంకట్రావునగర్, ఎల్లారెడ్డిగూడ, సోమజిగూడ, ఫతేనగర్ సెక్షన్లు, జూబ్లీహిల్స్,తాటిఖానా లాలాపేట్, తార్నాక కొంత భాగం, కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భారత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాబానగర్, కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, హస్మత్‌పేట్ సెక్షన్లు, చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గజులరామారం, సూరారం, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ సెక్షన్, అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మచ్చబొల్లారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయి నగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతమ్‌నగర్, సాయినాథ్‌పురం సెక్షన్, మౌలాలి రిజర్వాయర్, చర్ల పల్లి, సాయిబాబానగర్, రాధికా సెక్షన్లు, కైలాసగిరి పాత, కొత్త రిజర్వాయర్ ప్రాంతాలు, హౌసింగ్ బోర్డు సెక్షన్, మల్లాపూర్ కొంత భాగం, కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్, గచ్చిబౌలి, నల్లగండ్ల కొంత భాగం. హఫీజ్‌పేట్, మియాపూర్ సెక్షన్, పాచారం, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూముకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం సెక్షన్, అయ్యప్పకాలనీ రిజర్వాయర్ ప్రాంతాలు., నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, తెల్లాపూర్, బోల్లారం, బౌరాంపేట్ సెక్షన్లు, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మహిళా వర్సిటీ విద్యార్థినులకు ఫోన్ కాల్స్‌పై కేసు నమోదు



సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలోని 100కు పైగా విద్యార్థినుల ఫోన్లు హ్యాక్‌చేసి సైబర్ నేరగాళ్లు వేధింపులకు పాల్పడుతున్నారని శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై సుల్తాన్‌బజార్ పోలీసులు స్పందించారు. ఈ విషయంపై విద్యార్థినుల ఫిర్యాదులు స్వీకరించి కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని ఫోన్‌కాల్స్‌పై తమకు మహిళా యూనివర్సిటీ నుంచి ఫిర్యాదు అందిందన్నారు. విద్యార్థులకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్, వాట్సాప్ కాల్స్ వస్తున్నట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కాల్ చేసేవారు విద్యార్థుల హాజరు, సబ్జెక్ట్ కాంబినేషన్లు, సున్నితమైన వ్యక్తిగత ఆరోగ్య వివరాలను అడిగినట్లు తెలిపారు. వైవాహిక స్థితి, గైనిక్ హెల్త్ సమాచారం, ఫొటోలు, 18 నుంచి 25 ఏళ్ల విద్యార్థినుల ప్రొఫైళ్లను అడిగేవారని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థులను టార్గెట్ చేసుకుని ఫోన్లు చేసి వేధించేవారని తెలిపారు. విద్యార్థుల డేటాను ఎలా హ్యాక్ చేశారనే దానిపై విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ఆందోళన వ్యక్తం చేశారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


100 మందికి పైగా విద్యార్థినుల ఫోన్లు హ్యాక్

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

నగరంలో నేడు

- వినాయకుని నవరాత్రోత్సవాల్లో భాగంగా ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్ మార్గ్‌లలో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమం జరుగుతుంది.
- ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన శోభాయాత్ర ఉదయం 6 గంటలకు ఖైరతాబాద్‌లో ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు నెక్లెస్ రోడ్‌లో బడా గణేషుని నిమజ్జన కార్యక్రమం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బాలాపూర్ గణేశుని శోభాయాత్ర ఉదయం 10 గంటలకు బాలాపూర్‌లో ప్రారంభమై.. చాంద్రాయణగుట్ట, ఫలక్‌నామా, చార్మినార్ మీదుగా ఖైరతాబాద్ నెక్లెస్ రోడ్‌కు చేరుకుంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

టీఎస్ఈఏఈఏ నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్(టీఎస్ఈఏఈఏ) నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. ఈ నెల 2న నిర్వహించిన ఓటింగ్‌లో నాలుగు విద్యుత్ సంస్థలకు చెందిన 2500 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. తాజాగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టింది. జి.పవన్‌కుమార్(అధ్యక్షుడు), కె.కుమారస్వామి(అసోసియేట్ ప్రెసిడెంట్) టి.మహేష్(జనరల్ సెక్రటరీ), కె.రామకృష్ణ(అదనపు జనరల్ సెక్రటరీ), ఎం.చందు(అడ్మిన్ సెక్రటరీ), శ్రీపాల్‌రెడ్డి(ఆర్థిక కార్యదర్శి), హెచ్ రంజిత్‌రెడ్డి(సాంకేతిక కార్యదర్శి), వి.మహిపాల్(ప్రచార కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదే విధంగా జెన్‌కో ఉపాధ్యక్షుడిగా ఆర్ కిరణ్‌కుమార్, కంపెనీ కార్యదర్శిగా జి.శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ట్రాన్స్‌కో ఉపాధ్యక్షుడిగా పి.రజినీకాంత్, కంపెనీ కార్యదర్శిగా బి.నరేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎస్పీడీసీఎల్ ఉపాధ్యక్షుడిగా జి.దయానంద్, కంపెనీ కార్యదర్శిగా సందీప్‌రెడ్డి ఎన్ని కయ్యారు. ఎన్పీడీసీఎల్ ఉపాధ్యక్షునిగా టి.నవీన్, కంపెనీ కార్యదర్శిగా దిలీప్‌కుమార్ ఎన్నికైనట్లు టీఎస్ఈఈఏఈఏ ప్రకటించింది.

బాబీలాన్ పబ్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలను ఉల్లంఘించి గడువు ముగిసిన తర్వాత అర్ధరాత్రి దాకా కొనసాగుతున్న పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36/10లో ఉన్న బాబీలాన్ పబ్ నుంచి గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పెద్ద ఎత్తున శబ్దాలు వినిపిస్తుండడంతో పాటు ప్రజలు గుమికూడడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆరా తీయగా గడువు ముగిసిన తర్వాత కూడా డీజే కొనసాగించడంతో పాటు కస్టమర్లకు మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలింది. దీంతో బాబీలాన్ పబ్ మేనేజర్ ఆసిఫ్‌తో పాటు డీజే ఆర్టిస్ట్ యశ్వంత్‌పై కేసు నమోదు చేసి జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం


సన్ని మృతదేహం

అత్తాపూర్: గణేశ్ నిమజ్జనానికి వెళుతూ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఇటుక లారీ ఢీకొనడంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐలు చిలుకల శ్రీను, జయరాజ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన సన్నీ(15) స్నేహితులతో కలిసి శుక్రవారం తెల్లవారుజామున గణేష్ నిమర్జన కార్యక్రమంలో పాల్గొన్నాడు. పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే 310 పిల్లర్ వద్ద రోడ్డు దాటుతుంగా వేగంగా వచ్చిన ఇటుక లోడ్ లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సన్ని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు.

దేవుడి సన్నిధికి వెళ్తున్నానని..

భార్యకు వాట్సాప్ మెసేజ్ పెట్టి భర్త అదృశ్యం

ఫిలింనగర్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఇంట్లో నుంచి అదృశ్యమైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని ఛత్రపతి శివాజీనగర్‌కు చెందిన నరేష్ ఈ నెల 3న భార్య లలితతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన నరేష్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. భార్య పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అయితే రాత్రి నేను దేవుడి దగ్గరకు వెళ్తున్నానంటూ భార్యకు వాట్సాప్ మెసేజ్ పెట్టాడు. దీంతో ఆందోళనకు గురైన లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నరేష్ కోసం గాలింపు చేపట్టారు.

వైభవంగా ఓనం వేడుకలు



కేర్ హాస్పిటల్‌లో ఓనం వేడుకలు

బంజారాహిల్స్: కేర్ హాస్పిటల్‌లో శుక్రవారం ఓనం వేడుకలను వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూల పందిరిలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ విందులతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది, రోగులు కలిసి ఆనందోత్సాహాల నడుమ పండుగలను ఘనంగా జరిపారు.

క్యూ లైన్‌లో సొమ్మసిల్లి పడిపోయిన భక్తురాలు



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు శుక్రవారం ఉదయం నుంచే భక్తులకు అనుమతి లేకపోవడంతో క్యూ లైన్లలో దూరం నుంచి భక్తులు దర్శించుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో ఓ భక్తురాలు సొమ్మసిల్లి పడిపోవడంతో ఆమెను జీహెచ్‌ఎంసీ ఉద్యోగి అశోక్, ఉత్సవ కమిటీ సభ్యులు మహేష్ యాదవ్ పక్కనే ఉన్న హాస్పిటల్‌కు తరలించారు. వెంటనే చికిత్స అందించడంతో ఆమె కోలుకుంది.

పోలీసుల అదుపులో హెచ్‌వైసీ అధ్యక్షుడు

రహమత్‌నగర్: హెచ్‌వైసీ వ్యవస్థాపక అధ్యక్షుడు సల్మాన్‌ను బోరబండ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. సల్మాన్‌పై గతంలో కొంత మంది బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతడు విచారణకు రాకపోవడంతో బోరబండ పీలీ దర్గా వద్ద హెచ్‌వైసీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన సల్మాన్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా సల్మాన్ హెచ్‌వైసీ నుంచి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

మనది గురువులను గౌరవించే సంప్రదాయం

జీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



గురువులను సత్కరిస్తున్న రాంచందర్ రావు తదితరులు

హిమాయత్‌నగర్: గురువులను గౌరవించే సంప్రదాయం కేవలం భారత దేశంలోనే ఉందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ జ్ఞాపకార్థం టీచర్స్ డేను పురస్కరించుకుని, రామాలయం ఫౌండేషన్, మాతృదేవోభవ సత్సంగ్ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం రామచందర్ రావు మాట్లాడుతూ..ఓయూలోని అధ్యాపకులకు ఒకటో తారీఖు వరకు జీతాలు అందించడం లేదంటే అధ్యాపకులపై రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవం ఏందని ప్రశ్నించారు. రామాలయం ఫౌండేషన్ అధ్యక్షుడు దేవిప్రకాష్ మాట్లాడుతూ.. విద్యార్థులను క్రమశిక్షణ, దేశభక్తితో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, మాతృదేవోభవ ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్, ఫాబో సర్వీసెస్ కో ఫౌండర్ సోమ దివాకర్ల, జి.నరేందర్ రెడ్డి, సూర్యప్రకాష్, కోటేశ్వరరావు, కొండల్ రావు, శివశంకర్, రామానుజం, చంద్రశేఖర్, బాలకృష్ణ, డా.దిలీప్, అక్షర దేవదాసన్ పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్ స్థల సమస్య పరిష్కారానికి కృషి



అజహరుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

రహమత్‌నగర్: బోరబండ ఖబ్రస్తాన్ స్థల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత తొందరలో పరిష్కస్తానని మాజీ ఎంపీ, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ అజహరుద్దిన్ హామీ ఇచ్చారు. బోరబండలో శుక్రవారం ప్రార్థనల అనంతరం శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న ముస్లింలను ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోరబండలో ఖబ్రస్తాన్ స్థలం సమస్య చాలా కాలంగా ఉందని, గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సమస్య జఠిలంగా మారిందన్నారు. తాను స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని స్పష్టం చేశారు.



ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన 10 అడుగుల ఎత్తున్న బారికేడ్లు



ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్లు



వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

శోభాయాత్రకు సర్వం సిద్ధం

- పోలీసుల భారీ బందోబస్తు
- నిఘా నేత్రాల నడుమ ఊరేగింపులు
- మొబైల్ క్రేన్ల ఏర్పాటు



నెక్లెస్ రోడ్డులో విధుల్లో శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు



పీపుల్స్ ప్లాజాలో మహిళల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ టాయ్‌లెట్లు

బంజారాహిల్స్: గత పది రోజుల నుంచి భక్తుల పూజలందుకున్న గణనాథులు శనివారం గంగమ్మ ఒడికి చేరనున్నారు. ఇందుకోసం అటు మండపాల నిర్వాహకులు, ఇటు పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. గణేష్ నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించే దిశలో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో పాటు పోలీసులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, ఎస్‌ఆర్‌నగర్, మధురానగర్, బోరబండ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 1906 విగ్రహాలు ఏర్పాటు చేయగా ఇప్పటికే 60 శాతం విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. శుక్రవారం 269 విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఆఖరి రోజైన శనివారం 553 విగ్రహాలు నిమజ్జనం కానుండగా ఈ మేరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తుండగా జీహెచ్‌ఎంసీ తగిన సౌకర్యాలు కల్పిస్తున్నది. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, హెచ్‌ఎండీఏ తదితర శాఖల అధికారులు సమన్వయంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే శోభాయాత్ర జరిగే రూట్‌మ్యాప్‌లను తయారు చేసిన పోలీసులు ఆ మేరకు పికెటింగ్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జన శోభాయాత్ర సకాలంలో సజావుగా ముందుకు సాగేందుకు వీలుగా పోలీసులు తగిన బందోబస్తు ప్రణాళికను రూపొందించుకున్నారు. అదనపు బలగాలను మోహరించారు. పికెట్లు, పుషింగ్ పార్టీలు, మొబైల్ పార్టీలు, మొబైల్ క్రేన్లను అందుబాటులో ఉంచుతున్నారు. శోభాయాత్ర జరిగే రూట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జనాలలో ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ కూడా పాల్గొంటున్నారని పోలీసులు తెలిపారు.

'ధన్వంతరి' ఆస్తులు అమ్మి బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న అన్నంరాజు నాగరాజు

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ధన్వంతరి ఇంటర్నేషనల్ సంస్థ(డీఏఎఫ్‌ఐ) ఆస్తులు అమ్మి బాధితులకు న్యాయం చేయాలని ధన్వంతరి అగ్రీవ్ ఇన్వెస్టర్స్ అసోసియేషన్(డీఏఐ) కోరింది. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఏఐ అధ్యక్షుడు అన్నంరాజు నాగరాజు, మాజీ అధ్యక్షుడు ఆత్రేయ శర్మ, సెక్రటరీ అచ్యుతానంద రంగారావు, వైస్ ప్రెసిడెంట్ సుసుర్ల నర్సింహ మూర్తి మాట్లాడారు. బాధితులకు అనుకూలంగా నాంపల్లి ఎంఎస్‌జే కోర్టు తీర్పు వెలువరించిందన్నారు. తీర్పు అనుకూలంగా రావడానికి కృషి చేసిన సీసీఎస్ డీసీపీ శ్వేతా, ఏసీపీ ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. సీసీఎస్ అధికారుల సలహా, సూచనల మేరకు డీఎఫ్‌ఐ సంస్థలో పెట్టుబడి పెట్టి మోసపోయిన వివిధ సంస్థలను, వ్యక్తులను ఒక తాటిపై తీసుకొచ్చి 400 మంది సభ్యులతో ఈ అసోసియేషన్ ఏర్పడిందని వివరించారు. 1700 మంది బాధితులు రూ.220 కోట్ల పైగా పెట్టుబడులు పెట్టి మోసపోయామని చెప్పారు. ధన్వంతరి సంస్థ వారు బాధితులతో సామరస్య పూర్వకంగా పరిష్కార దిశగా ప్రయత్నం చేయాలని కోరారు. బాధితులకు మూల ధనంతోపాటు వడ్డీ సొమ్ము చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం.. కేసు నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ప్రభుత్వానికి చెందిన ఐదెకరాల స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన సంస్థలపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లో సర్వేనెంబర్ 403లో ప్రభుత్వానికి చెందిన ఐదెకరాల స్థలం ఉండగా ఇందులో ఉన్న హెచ్చరిక బోర్డులు తొలగించిన కబ్జాదారులు అక్రమంగా బోర్డులు ఏర్పాటుచేశారు. దీంతో షేక్‌పేట తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కింగ్‌డమ్ రియాల్టీ అండ్ ఎస్టేట్స్, వీఆర్ ఇన్‌ఫ్రా అనే సంస్థలపై బీఎన్‌ఎస్ సెక్షన్ 329 (3), 324 (4), 292 కింద కేసు నమోదు చేశారు. విజయ్ భార్గవ్ అనే కబ్జాదారుడు ఈ స్థలాన్ని తరచూ ఆక్రమిస్తూ, హెచ్చరిక బోర్డు తొలగిస్తూ అక్రమంగా తన బోర్డు ఏర్పాటు చేస్తున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విజయ్ భార్గవ్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రేస్ కేన్సర్ అవేర్నెస్ రన్ టీ షర్ట్ ఆవిష్కరణ



టీ షర్ట్‌ను ఆవిష్కరిస్తున్న నటి ఐశ్వర్య రాజేష్, నటుడు అలీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని దశపల్లా హోటల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గ్రేస్ కేన్సర్ అవేర్నెస్ రన్ టీ షర్ట్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాజేష్, నటుడు అలీ ముఖ్యఅతిథిగా హాజరై అక్టోబర్ 12న జరిగే గ్రేస్ కేన్సర్ అవేర్నెస్ రన్‌కు సంబంధించిన టీషర్ట్‌తో పాటు మెడల్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ చిన్నబాబు సుంకవల్లి, డాక్టర్ నరేంద్రనాథ్, ప్రశాంతి, రమేష్ కాజా తదితరులు పాల్గొన్నారు.

మైమరిపించిన గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీధర్ శర్మ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్:8 లోని సప్తపర్ణి సాంస్కృతిక కళా కేంద్రంలో సంగీత క్షీర సాగరం ఆధ్వర్యంలో జరుగుతున్న శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రముఖ సంగీత విద్వాంసులు, దేవీ ఉపాసకులు, వారాహి మాత భక్తులు సుధీర్ శర్మ గాత్ర కచేరి సంగీత అభిమానులను మైమరింపజేసింది. రెండు గంటల పాటు సుధీర్ శర్మ తన గాన మాధుర్యంతో సంగీత అభిమానులను అలరించారు. నాట, జనరంజని, ఫల మంజరి, నాట కురంజి, సహాన తదితర రాగాలలో ఆయన త్యాగరాజ, దీక్షితార్ కీర్తనలను ఆలపించి వీనుల విందైన గాత్రంతో ఆనంద పరవశులను చేశారు. మృదంగంపై సాయి రాఘవన్, వయోలిన్ పై జనార్దన్ ఈ కచేరిని మరింత రక్తి కట్టించారు.

అంబేడ్కర్‌నగర్‌లో అసంపూర్తి నిర్మాణాల పరిశీలన



అసంపూర్తి నిర్మాణాలను పరిశీలిస్తున్న సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ అనితారెడ్డి

ఫిలింనగర్: జూబీహిల్స్ రోడ్డునెంబర్-46లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించగా ఇవి అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ ప్రాంతాన్ని సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాంతో పాటు షేక్‌పేట తహసీల్దార్ వై.అనితారెడ్డి పరిశీలించారు. జీ ప్లస్-3 పద్ధతిలో నిర్మించిన బ్లాక్‌తో పాటు పక్కనే ఉన్న మరో బ్లాక్‌లో 48 మంది వరకు బడుగులు చుట్టూ పరదాలు, షీట్లు ఏర్పాటుచేసుకుని అరకొర సౌకర్యాల మధ్య ఉంటున్నారు. వీటిని ఖాళీ చేస్తే ఇక్కడ మూడు బ్లాక్‌లు నిర్మిస్తామని, మొత్తం 92 ఇళ్లు తయారవుతాయని ఆర్డీఓ వారికి సూచించారు. ఈ అసంపూర్తి నిర్మాణాల్లో చాలామంది అక్రమంగా ఉంటున్నారని, వీరికి ఎలాంటి పట్టాలు లేవని గుర్తించారు. సాధ్యమైనంత త్వరగా వీటిని ఖాళీ చేయాల్సిందిగా సూచించారు. ఓ బ్లాక్‌ను పూర్తిగా ఆక్రమించారని గుర్తించారు. సాధ్యమైనంత త్వరగా వీటిని ఖాళీ చేస్తే నిర్మాణాలు చేపడతామని వారు తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు పాటలు, నృత్యాలు, నాటికలతో ఉపాధ్యాయులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మురళీ ముకుంద్ మాట్లాడుతూ..ఉపాధ్యాయులు ఒంటరిగా కాకుండా సహకారంతో పనిచేయాలని, యాజమాన్యం కూడా ఉపాధ్యాయులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించడానికి కట్టుబడి ఉందన్నారు. డైరెక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ..విద్యార్థులను మార్గనిర్దేశం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల కృషిని, అంకితభావాన్ని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు.



ఉపాధ్యాయులను సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

బంజారాహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని స్పర్శ్ హాస్పిస్ ప్రాంగణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన 11 మంది ఉపాధ్యాయులు వారి విశిష్టమైన సేవలకుగాను సత్కరించారు. కార్యక్రమంలో స్పర్శ్ హాస్పిస్ ట్రస్టీ జగదీష్ రామడుగు, మల్లికార్జున్, దుర్గాప్రసాద్, మోహన్, కౌశిక్ కత్తూరి పాల్గొన్నారు.



టీచర్స్ డే వేడుకల్లో సంస్కార్‌స్కూల్ చిన్నారులు

సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో..

శ్రీనగర్‌కాలనీ: సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో శుక్రవారం టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు టీచర్స్ వేషధారణ వేసుకొని అలరించారు. అనంతరం టీచర్స్, స్టూడెంట్స్ బంధంపై పలు ప్రదర్శనలు చేశారు. స్కూల్ సీఈఓ మోహన వంశీ, డైరెక్టర్ మధుమతి, టీచర్స్ పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం



అన్నదాన కార్యక్రమంలో బొంతు శ్రీదేవి తదితరులు

రహమత్‌నగర్: ప్రతి వ్యక్తి సేవాగుణం కలిగి ఉండాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బొంతు శ్రీదేవి సూచించారు. మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం బోరబండలో నగర మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదారం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమైనవి గుర్తు చేశారు. నాయకులు హిదాయత్ అలీ, దేవేందర్, ఖయ్యూమ్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీటీ నగర్ బస్తీలో లడ్డూలు దక్కించుకున్న భక్తులు





ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజాలలో నిమజ్జనాలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ భారతీనాయక్



ఎర్రగడ్డలో పూజల్లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

విఘ్నరాజాయ.. నమోస్తుతే!

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆయా మండపాల్లోని బొజ్జ గణపయ్యలను భక్తులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో గణపతి లడ్డూ వేలం నిర్వహిస్తున్నారు. గణపతి లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. పలు ప్రాంతాల్లో గణనాథుల నిమజ్జనాలను సందడిగా నిర్వహించారు.

– ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ బృందం



లడ్డూ వేలంలో ఎంపీ కేకే, మేయర్ గద్వాల విజయలక్ష్మి, నిర్వాహకుడు నర్సింగరావు



ఎర్రమంజిల్‌లో..



వెంగళరావునగర్‌లో పూజలు చేస్తున్న ఏఐసీసీకార్యదర్శి విశ్వనాథన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి



వైవిధ్యం..
విలాసవంతం..
నగరంలో ఇంటీరియర్‌ డిజైనింగ్‌ నైపుణ్యం

నగరవాసులు విలాసవంతమైన జీవనశైలికి అలవాటుపడుతున్నారు. దీంతో ఇంటీరియర్‌ డిజైనింగ్‌కి ప్రాధాన్యత పెరుగుతోంది. నగరంలోని ఇంటీరియర్‌ డిజైనింగ్‌ నైపుణ్యం దీనికి ప్రోత్సాహంగా నిలుస్తోంది. ఇంటి విలువలో 70 శాతం అలంకరణకు, హంగులకే వెచ్చిస్తున్నారు ఔత్సాహికులు. దీంతో 45 శాతం అద్దెల పెరుగుదలకు ఇదే కారణంగా నిలుస్తోంది. అధునాతన జీవనశైలిలో భాగంగా ఇంటీరియర్‌ డిజైనింగ్‌ నచ్చకపోతే అద్దెలకు తీసుకునేందుకు కూడా పలువురు వెనుకాడుతున్నారని మ్యాజిక్‌ బ్రిక్స్‌ బియాండ్‌ వాల్స్‌ ట్రెండ్‌ అండ్‌ ప్రొజెక్షన్స్‌ నిర్వహించిన అధ్యయనంలో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి.

– సాక్షి, సిటీబ్యూరో

విలాసవంతమైన గృహాలంకరణే నేటి న్యూ ట్రెండ్‌	ఇంటి విలువలో 70 శాతం అలంకరణకు, హంగులకే	45 శాతం అద్దెల పెరుగుదలకు ఇదే కారణం
అధునాతన జీవనశైలికి అలవాటుపడుతున్న నగరవాసులు	మ్యాజిక్‌బ్రిక్స్‌ బియాండ్‌ వాల్స్‌ ట్రెండ్స్‌ అండ్‌ ప్రొజెక్షన్స్‌ అధ్యయనంలో వెల్లడి	

ప్రస్తుత నగరజీవన శైలిలో ఇంటీరియర్‌ డిజైనింగ్‌ ప్రత్యేక ఆకర్షణను సంతరించుకుంది. అయితే ఈ ఇంటీరియర్‌ డిజైనింగ్‌ కేవలం అధునాతన జీవన శైలికి, విలాసవంతమైన సౌకర్యాలకు ప్రతీకలు మాత్రమే కాదు.. ఆ ఇంటికి భవిష్యత్‌ విలువను పెంచుతుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. నగరంలోని 80 శాతం ఇంటి యజమానులు ఫుల్‌ హోమ్‌ డిజైన్‌ (ఎఫ్‌ హెచ్‌ డీ)ని కోరుకుంటున్నారని, ఈ సంస్కృతి మోడ్రన్‌ లివింగ్‌ స్టైల్‌లో భాగంగా మారిందని 'బియాండ్‌ వాల్స్‌: ట్రెండ్స్‌ అండ్‌ ప్రొజెక్షన్స్‌ ఇన్‌ ఇండియాస్‌ హోమ్‌ ఇంటీరియర్స్‌ మార్కెట్‌' అనే అధ్యయన సంస్థ వెల్లడించింది. హైదరాబాద్‌తో పాటు పలు నగరాల్లో మ్యాజిక్‌ బ్రిక్స్‌ ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు.

ఇంటీరియర్‌, ఆర్కిటెక్చర్‌..

నగరంలోని బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, గచ్చిబౌలి, హైటెక్‌ సిటీ వంటి ప్రాంతాల్లోని ఇళ్లు చూపరులకు మిరుమిట్లుగొలుపుతాయి. కళ్లు చెదిరే ఇంటీరియర్‌ డిజైనింగ్‌కు ఇవి వేదికలుగా నిలుస్తున్నాయి. అయితే గత కొన్నేళ్లుగా మారుతూ వస్తున్న జీవన పరిస్థితులకు అనుగుణంగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో అందమైన, ఆకర్షణీయమైన ఇంటి నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నారు. సైనిక్‌పురి, కూకట్‌పల్లి, హిమాయత్‌నగర్‌ వంటి ప్రాంతాలతో పాటు నగరం నలుమూలలా ఎక్కడ చూసినా ఇంటీరియర్‌ కోసం లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. ఇందులో ఇంటీరియర్‌ డిజైన్‌, ప్లాంటేషన్‌, ఆర్ట్‌ ఫామ్స్‌, వినూత్న ఆర్కిటెక్చర్‌ వంటి అంశాలను జత చేస్తున్నారు.



మెట్రో నగరాల సరసన..

హైదరాబాద్‌ నగర జీవనశైలిలో ఇంటీరియర్‌ డిజైనింగ్‌ ఖర్చు సగటున చదరపు అడుగుకు 490 ఐఎన్‌ ఆర్‌ ఉంది. ఇదే సూచి ఢిల్లీ 560, బెంగళూరు 520 ఐఎన్‌ ఆర్‌తో కొనసాగుతోందని అధ్యయనం చెబుతోంది. నగరంలో మోడ్రన్‌ లివింగ్‌ స్టైల్‌ పేరుతో చేస్తున్న ఇంటీరియర్‌ ఖర్చుల ప్రాధాన్యతలను చూస్తే.. బెడ్‌ రూమ్స్‌, కిచెన్‌లపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది మొత్తం ఖర్చులో 54 శాతం వరకూ ఉంది. నగరంలోని సోషల్‌ మీడియా ప్రభావం, లైఫ్‌స్టైల్‌ యాడ్స్‌ తదితరాల నేపథ్యంలో ఇంటిని అందంగా మార్చుకోడానికి పూర్తిగా ఎంచుకునే ధోరణిని ఫుల్‌ హోమ్‌ డిజైన్‌ (ఎఫ్‌ హెచ్‌ డీ) అని అంటారు. ఈ డిజైనింగ్‌కు సిటీలో 80 శాతం డిమాండ్‌తో దూసుకుపోతోందని మ్యాజిక్‌ బ్రిక్స్‌ సీఈఓ సుధీర్‌ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఇంటీరియర్స్‌ ఎక్స్పో ఫెస్ట్‌ ఇటువంటి ఆవిష్కరణలను నగర జీవనశైలిలో భాగం చేస్తుందని అన్నారు.





ఇంపోర్టెడ్‌ ఉత్పత్తులకు ప్రాధాన్యత..

కొందరైతే ఏకంగా ఇంపోర్టెడ్‌ కళాత్మక ఉత్పత్తుల కోసం నిర్మాణంలోనే ప్రత్యేకంగా డిజైన్‌ ప్లాన్‌ చేసుకుంటున్నారు. లివింగ్‌ రూం, ఆర్ట్‌ రూం, ఇంటీరియర్‌ జిమ్‌, నేచురల్‌ ఓపెన్‌ స్పేస్‌, విండో స్కై వ్యూ వంటి పద్ధతులను ఎంచుకుంటున్నారు. హైదరాబాద్‌ వంటి నగరాల్లో ఇంటి పునఃవిక్రయ విలువలను 70 శాతం వరకూ పెంచడానికి, 45 శాతం వరకూ ఎక్కువ అద్దెలు వసూలు చేయడానికీ ఈ అధునాతనంగా డిజైన్‌ చేయబడిన ఇంటీరియర్స్‌ ప్రధానపాత్ర పోషిస్తుందని మ్యాజిక్‌ బ్రిక్స్‌ బియాండ్‌ వాల్స్‌ అధ్యయనం తెలిపింది. ఈ నివేదిక ప్రకారం నగరంలో 2, 3 బీహెచ్‌ కే యూనిట్స్‌కు డిమాండ్‌ భారీగా పెరిగింది. నగరంలో ఇవి 90 శాతానికి పైగా ఉండటం విశేషం. ఇందులో భాగంగానే దేశంలో హోమ్‌ ఇంటీరియర్స్‌ మార్కెట్‌ 2030 నాటికి 24.52 బిలియన్‌ డాలర్లకు రెట్టింపు అవుతూ అభివృద్ధి చెందడానికి సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రస్తుత 12.33 బిలియన్ల విలువ కలిగిన మార్కెట్‌ సుమారు 12 శాతం కాంపౌండ్‌ వార్షిక వృద్ధితో (సీఏజీఆర్‌) దూసుకుపోతోంది. పెరుగుతున్న డిస్పోజబుల్‌ ఆదాయలు, వేగవంతమైన పట్టణీకరణ, లివింగ్‌ స్పేస్‌ కోసం పెరుగుతున్న వినియోగదారుడి ఆకాంక్షలు ఈ అభివృద్ధికి కారణం అవుతున్నాయి.



పసిగడతాయి..
పనిపడతాయి!

హైదరాబాద్‌ పోలీసు విభాగంలో అంతర్భాగంగా ఉన్న సిటీ సెక్యూరిటీ వింగ్‌ (సీఎస్‌డబ్ల్యూ) 12 జాగిలాల పిల్లల్ని ఖరీదు చేసింది. వీటికి మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్‌ ఇంటెలిజెన్స్‌ ట్రైనింగ్‌ అకాడమీలో (ఐఐటీఏ) శిక్షణ ఇప్పించనున్నారు. పోలీసు జాగిలాలు పేలుడు పదార్థాలను గుర్తించేలా, నేర పరిశోధనకు, మాదకద్రవ్యాల గుర్తింపునకు, దాడులు చేయడానికి శిక్షణ పొందుతాయి. అయితే ఈ 12 జాగిలాలు మాత్రం కేవలం పేలుడు పదార్థాలు గుర్తించడం పైనే శిక్షణ పొందనున్నాయి. వీటితో కలిపి ప్రస్తుతం సీఎస్‌డబ్ల్యూలోని డాగ్‌ స్క్వాడ్‌లో జాగిలాల సంఖ్య 46కు చేరింది. కొత్తగా వచ్చిన జాగిలాల పిల్లల్ని హైదరాబాద్‌ పోలీసు కమిషనర్‌ సీవీ ఆనంద్‌ పోలీసు విభాగంలో శుక్రవారం విలీనం చేశారు. వీటికి తొమ్మిది నెలల పాటు అనేక కీలకాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



- సిటీ పోలీసు విభాగంలోకి 12 కొత్త జాగిలాలు
- సమకాలీన అవసరాలకు తగ్గట్లు వీటికి శిక్షణ
- మొత్తం శిక్షణా కాలం తొమ్మిది నెలలు
- మచ్చిక చేసుకోడానికే రెండు నెలల సమయం
- హ్యాండ్లర్‌తో సఖ్యతకు మరో రెండు మాసాలు

ప్రతి పోలీసు జాగిలానికీ కనిష్ఠంగా ఇద్దరు నిర్వాహకులు (హ్యాండ్లర్స్‌) ఉంటారు. జాగిలాన్ని ఎంపిక చేసుకున్నప్పుడే వీరినీ ఎంపిక చేస్తారు. జాగిలంతో కలిపే వీరికీ శిక్షణ ఉంటుంది. మొత్తం తొమ్మిది నెలల శిక్షణా కాలంలో రెండు నెలలు హ్యాండ్లర్‌కు జాగిలానికీ మధ్య సఖ్యత కల్పించడానికి, మరో రెండు నెలలు మచ్చిక చేసుకోడానికీ కేటాయించారు. మిగిలిన నాలుగు నెలల్లోనే వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు.



శిక్షణలో నాలుగు రకాలు..

లాబ్రెడార్‌, జర్మన్‌ షెపర్డ్‌, బెల్జియం మలినాయిస్‌, బీగల్‌, గోల్డెన్‌ రిట్రీవర్‌, డాబర్‌మ్యాన్లలోని సహజ లక్షణాలు, పనితీరు, సమకాలీన అవసరాలను పరిగణలోకి తీసుకుని నాలుగు విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ఒక తరహా సేవలకు వినియోగిస్తున్న జాగిలం మరో తరహా వాటికి ఉపకరించదు. పేలుడు పదార్థాలు/అనుమానిత వస్తువుల గుర్తింపు, నేర పరిశోధన, మాదకద్రవ్యాల గుర్తింపు, ముష్కరులపై దాడి చేసే సామర్థ్యం పెంపొందిస్తూ నాలుగు నెలల శిక్షణ ఉంటుంది. ఆఖరి సేవలు అందించే వాటిని ఎటాకర్స్‌గా పిలుస్తారు. ఇవి కేవలం గ్రేహౌండ్స్‌, ఆక్టోపస్‌ బలగాల్లోనే ఉంటాయి.

మూడు అక్షరాలకు మించవు..

ఈ జాగిలాలకు పెట్టే పేర్లు, కమాండ్స్‌.. కాషన్స్‌గా పిలిచే హ్యాండ్లర్లు ఇచ్చే ఆదేశాలు గరిష్ఠంగా మూడు అక్షరాలకు మించకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. జాగిలం గందరగోళానికి గురికాకుండా ఉండేందుకే, తక్కువ సమయంలో ఆదేశం పూర్తిచేస్తారు. జాగిలాలకిచ్చే కమాండ్స్‌ అన్నీ హిందీలోనే ఉంటాయి. ఈ శిక్షణ తొలిసారిగా బీఎస్‌ఎఫ్‌ ఆధీనంలో మధ్యప్రదేశ్‌లోని టేకెన్‌పూర్‌ సెంటర్‌లో ప్రారంభమైంది. అక్కడ జాతీయ భాష అయిన హిందీనే వాడారు. దీంతో అందరూ అదే అనుసరిస్తూ వస్తున్నారు. శిక్షణ, విధి నిర్వహణలో పోలీసు జాగిలాలకు హ్యాండ్లర్లు ఇచ్చే అన్ని కమాండ్స్‌ దాదాపు హిందీలోనే ఉన్నప్పటికీ కేవలం రెండు మాత్రం ఇంగ్లిష్‌లో ఉంటాయి. ఎదుటి వారికి నమస్కరించడానికి 'సెల్యూట్‌', పడుకుని గుండ్రంగా దొర్లడానికి 'రోల్‌' పదాలు వాడతారు.

వీటిలో ఆరితేరతాయి..

- నిత్యం ఇష్టంగా తినే ఆహారమైనా ఎవరు పడితే వాళ్ళు పెడితే ముట్టవు. కేవలం హ్యాండ్లర్‌ లేదా మాస్టర్‌ ఇస్తేనే స్వీకరిస్తాయి. విషప్రయోగాలకు ఆస్కారం లేకుండా ఈ శిక్షణ ఇస్తారు.
- కదులుతున్న వాహనం నుంచి అమాంతం కిందికి దూకడంతో పాటు టార్గెట్‌ను కరిచి పట్టుకుని కదలకుండా చేస్తాయి. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్స్‌లో కమాండోస్‌కు సహకరించేందుకు ఇలా తర్ఫీదు ఇస్తారు.
- హ్యాండ్లర్‌ ఇచ్చిన కమాండ్స్‌ స్పష్టంగా అర్థం చేసుకోవడంతో పాటు తూచ తప్పకుండా పాటిస్తాయి. చివరకు ఒకటి నుంచి నాలుగు వరకూ ఎన్నిసార్లు మొరగమంటే అన్ని సార్లే అరిచేలా ట్రైనింగ్‌ ఉంటుంది.
- చైనా, పాకిస్థాన్‌, ఇంగ్లండ్‌ చిత్రపటాల మధ్య ఉన్న ఇండియా మ్యాప్‌ను స్పష్టంగా గుర్తించడంతో పాటు రెండు కాళ్లూ ఎత్తి నమస్కరించేలా మారుస్తారు. వీటి జ్ఞాపక, సంగ్రహణ శక్తులను పెంపొందించేలా ఈ శిక్షణ ఉంటుంది.
- ప్రముఖులకు పుష్పగుచ్ఛాలు అందించడం, చిన్న చిన్న పనులు చేస్తూ హ్యాండ్లర్లకు సహకరించడం శిక్షణలో భాగమే.

జంతు ప్రేమికులైన అధికారులతో కమిటీ..

నగర పోలీసు విభాగంలో ఒకప్పుడు 36 జాగిలాలు ఉండేవి. పని ఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురై రెండు చనిపోయాయి. దీంతో జంతు ప్రేమికులైన డీసీపీలు రక్షిత మూర్తి, ఎస్‌.శ్వేత, దార కవిత, చంద్రమోహన్‌, గిరిరాజుతో ఓ కమిటీ వేశాం. వీరి సిఫార్సు మేరకు ఈ సంఖ్యను 54కు పెంచాలని నిర్ణయించాం. తొలి విడతలో 12 జాగిలాలను ఖరీదు చేశాం. కురుక్షేత్రలో ఉన్న అభిజిత్‌ ఫామ్స్‌ నుంచి ఖరీదు చేసుకువచ్చాం. నగర విభాగానికి ఇదే తొలిసారి. వీటితో పాటు గుర్రాల ఆరోగ్య పరిరక్షణకు డాక్టర్‌ను నియమించాం. త్వరలో గోషామహల్‌ స్టేడియంలో 60 జాగిలాలకు సరిపోయే విధంగా డాగ్‌ కెన్నెల్స్‌ నిర్మించనున్నాం.

– సీవీ ఆనంద్‌, హైదరాబాద్‌ పోలీసు కమిషనర్‌



వినూత్న విశేషాల.. డిజైన్‌ డెమోక్రసీ..



సాక్షి, సిటీబ్యూరో : విభిన్న రకాల డిజైనింగ్‌ విశేషాలకు పేరొందిన అగ్రగామి ఎక్స్‌పో.. డిజైన్‌ డెమోక్రసీ మాదాపూర్‌లోని హైటెక్స్‌ ఎగ్జిబిషన్‌ సెంటర్‌లో ఏర్పాటైంది. ఈ ప్రదర్శనను నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సోషలైట్‌ పింకీ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఈవెంట్‌లో 120కి పైగా బ్రాండ్స్‌ తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని, 80కి పైగా విభిన్న రంగాలకు చెందిన ప్రభావవంతమైన ఉపన్యాసకుల ప్రసంగాలు ఉంటాయని డిజైన్‌ డెమోక్రసీ వ్యవస్థాపకులు పల్లికా శ్రీవాస్తవ్‌, శైలజా పట్వారీ, అర్జున్‌ రతి తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్రెడాయ్‌ జాతీయ కార్యదర్శి జి.రామిరెడ్డి పాల్గొన్నారు. ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా తెలంగాణ మ్యూజియంతో పాటు అబిన్‌ చౌదరి, స్నేహశ్రీ నంది క్యూరేట్‌ చేసిన గ్యాలరీ ఆఫ్‌ సస్టైనబిలిటీ, ఫరా అహ్మద్‌ క్యూరేట్‌ చేసిన ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి.

ముప్పిడికి మరో రెండు పేటెంట్లు
ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఫ్యాకల్టీ ఘనత
ఇప్పటి వరకూ 16 పేటెంట్లు నమోదు

రాయదుర్గం : ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఫ్యాకల్టీ, ప్రముఖ డిజైనర్‌, విద్యావేత్త డాక్టర్‌ ముప్పిడి రాంబాబు మరో రెండు పేటెంట్లను పొందారు. ఈ రెండు పేటెంట్లతో ఇప్పటి వరకు 16 పేటెంట్లను సాధించారు. తోటి ప్రతినిధుల సహకారంతో ఇది సాధించారు. భారతీయ పేటెంట్‌ కార్యాలయం అధికారిక ప్రకటనపై డాక్టర్‌ రాంబాబు 'సాక్షి'తో శుక్రవారం వివరించారు. మరో రెండు పేటెంట్లు సాధించడం పట్ల ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎన్‌ తేజ్‌లోహిత్‌రెడ్డి, ఫ్యాకల్టీ ప్రతినిధులు శుభజిత్‌సాహా, శైలేంద్ర కీర్తి, లేపాక్షి ఎండీ విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ లక్ష్మీనాథ్‌, ఇతర అధికారులు అభినందించారు. రిడ్జ్‌ గోర్డ్‌ బ్యాంగిల్‌ ఇన్నోవేషన్‌ పేరిట 15వ పేటెంట్‌ పొందారు. ఇది డిజైన్‌ ఫర్‌ సొసైటీ చొరవతో అభివృద్ధి చేశారు. ది పేటెంట్‌ ఆఫీస్‌ జర్నల్‌ నెంబర్‌ 36/2025లో రెండు అదనపు డిజైన్లు ప్రచురించారు. దీంతో పాటు బాటిల్‌ కవర్‌ పేరిట డిజైన్‌ ఇన్నోవేషన్‌కు 16వ పేటెంట్‌ పొందారు.







ఆకట్టుకుంటున్న 'దీప్‌' చిత్రప్రదర్శన

ఆర్ట్‌గ్యాలరీలో కొలువుదీరిన 95 చిత్రాలు	14 వరకూ ప్రదర్శన కొనసాగింపు



మాదాపూర్‌ : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ అర్ట్‌గ్యాలరీలో 'దీప్‌' పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన ఆకట్టుకుంటోంది. చిత్రకళాకారిణి అంజుపొద్దార్‌, రచయిత శీతల్‌ బంగూర్‌ దీనిని ప్రారంభించారు. కళాకారులు వేసిన 95 చిత్రాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన 14వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

డాట్‌వాక్‌ ఆధ్వర్యంలో..
డీప్‌ ఇంటీరియర్స్‌, రిటర్న్‌టు అన్‌ డిస్కవర్డ్‌ సెల్ఫ్‌ అనే థీమ్‌తో కావూరి హిల్స్‌లో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి 33 మంది కళాకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. ఢిల్లీకి చెందిన గ్యాలరీ డాట్‌వాక్‌ ఆధ్వర్యంలో సిబ్‌దాస్‌ సేన్‌ గుప్తా క్యురేట్‌ చేసిన ఈ ప్రదర్శన 13 వరకూ కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

పికిల్‌బాల్‌ ప్రపంచంలోకి సైనా నెహ్వాల్‌..
కీర్తి వారియర్స్‌ జట్టుకు సహ యజమానిగా బాధ్యతలు..



బంజారాహిల్స్‌: బ్యాడ్మింటన్‌ దిగ్గజం, ఒలింపిక్‌ పతక విజేత సైనా నెహ్వాల్‌ పికిల్‌బాల్‌ ప్రపంచంలోకి అడుగుపెట్టారు. హైదరాబాద్‌ పికిల్‌బాల్‌ లీగ్‌ (హెచ్‌పీఎల్‌)లోని కీర్తి వారియర్స్‌ జట్టుకు ఆమె సహ యజమానిగా చేరారు. ఒక జట్టుకు యజమానిగా ఆమె తొలి అడుగు ఇది. ఈ సందర్భంగా సైనా నెహ్వాల్‌ మాట్లాడుతూ చాలా సంవత్సరాల క్రితం బ్యాడ్మింటన్‌ దేశంలో ఏ స్థాయిలో ఉందో, పికిల్‌బాల్‌ ప్రస్తుతం అదే దశలో ఉందన్నారు. హైదరాబాద్‌ పికిల్‌బాల్‌ లీగ్‌, కీర్తి వారియర్స్‌ ఒక మంచి వేదికగా ఈ క్రీడను అభివృద్ధి చేయాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. కీర్తి ఎస్టేట్స్‌ కీర్తిరెడ్డి మాట్లాడుతూ కీర్తి వారియర్స్‌తో సైనా నెహ్వాల్‌ అనుబంధం గ్రామీణ స్థాయిలో పికిల్‌బాల్‌ను ప్రోత్సహించడం, టీం అభివృద్ధికి ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. హైదరాబాద్‌ పికిల్‌బాల్‌ లీగ్‌ అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. దేశంలో మొదటి నగర–ఆధారిత పికిల్‌బాల్‌ లీగ్‌. ఈ లీగ్‌లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు ఉంటాయి. అక్టోబర్‌ 10 నుంచి నవంబర్‌ 28 వరకూ ప్రతి శుక్రవారం రాత్రి మ్యాచ్‌లు జరుగనున్నాయి.

సాక్షి రియల్టీ
శనివారం
06-09-2025



భారత్‌కే.. ఫ్యూచర్

ఫోర్త్ సిటీ భవిష్యత్తు తరాలకు మరో హైటెక్ సిటీ

రేపటి అర్బన్ ఇండియా విజనే భారత్ ఫ్యూచర్ సిటీ. కృత్రిమ మేధస్సు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ తయారీ, పర్యాటకం, స్పోర్ట్స్, చలనచిత్ర నిర్మాణం, ఆరోగ్యం వంటి అన్ని రంగాలకు ప్రత్యేకంగా జోన్‌లను కేటాయిస్తూ.. రేపటి తరాలకు పర్యావరణ హితమైన నగరాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. వచ్చే పదేళ్లలో సుమారు 10 లక్షల ఉద్యోగులు పనిచేయనున్న ఈ ఫోర్త్ సిటీలో ఈ మేరకు హౌసింగ్ డిమాండ్ ఉంటుందని రియల్ ఎస్టేట్ నిపుణులు కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు దక్షిణం వైపున 765 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధి చెందనున్న ఈ సమగ్ర పట్టణ ప్రాంతం భారత్‌కే తలమానికంగా నిలుస్తుందని తెలిపారు.
–సాక్షి, సిటీబ్యూరో

- అభివృద్ధి పనుల ప్రారంభంతో మూడు రెట్లు పెరిగిన ధరలు
- ఓఆర్ఆర్–ట్రిబుల్ ఆర్ గ్రోత్ కారిడార్లలో భూమి బంగారమే..



ఇప్పటికే ఫేజ్–1లో 14 వేల ఎకరాల భూమిని సమీకరించారు. మరో 30 వేల ఎకరాల భూమిని సమీకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో రహదారుల నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. పనుల ప్రారంభమైతే ఆయా ప్రాంతాల్లోని భూమి బంగారంగా మారుతుంది. వచ్చే రెండేళ్లలో ఫ్యూచర్ సిటీలోని ప్రాంతాలలో భూముల ధరలు మూడు రెట్లు పెరగడం ఖాయం. మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, గుమ్మడవల్లి, లేమూరు, యాచారం, కందుకూరు, నందివనపర్తి, కడ్తాల్, ఆమన్‌గల్ ప్రాంతాల్లో అభివృద్ధి జోరుగా ఉంటుంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో ఎకరం రూ.2–5 కోట్లు ఉండగా.. వచ్చే రెండేళ్లలో రూ.10–15 కోట్లకు చేరుతుంది.

గ్రోత్ కారిడార్‌లో బంగారమే..

ఔటర్ రింగ్ రోడ్డుతో అభివృద్ధి హైదరాబాద్‌కే పరిమితమైంది. కానీ, రీజినల్ రింగ్ రోడ్డు, దాని చుట్టూ రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్ట్‌లతో సగం తెలంగాణ ప్రాంతం అభివృద్ధి నెక్ట్స్ లెవల్‌కు చేరుతుంది. ఇప్పటికే ఆయా కీలక ప్రాజెక్ట్‌లపై సర్కారు కసరత్తు చేస్తోంది. ఔటర్‌కు ఇరువైపులా గ్రోత్ కారిడార్ కిలో మీటర వరకే కేటాయించారు. దీంతో మల్టీ పర్పస్ జోన్‌గా మారిన ఆ ప్రాంతంలో హైరైజ్ అపార్ట్‌మెంట్లు, భారీ గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాలు వచ్చాయి. ఇక, ఇరువైపులా 5 కి.మీ. వరకూ గ్రోత్ కారిడార్‌గా పరిగణించనున్న ట్రిబుల్ ఆర్ ప్రాంతంలో అభివృద్ధి ఇంతకు రెట్టింపు స్థాయిలో ఉంటుంది. ఈ కారిడార్లలో ఎక్కడ భూమి కొన్నా బంగారంగా మారడం ఖాయం.

శంషాబాద్ మెయిన్ సిటీ..

బేగంపేట విమానాశ్రయం ప్రారంభించిన తొలినాళ్లలో హైదరాబాద్‌కు శివారు ప్రాంతమది. కానీ, ఇప్పుడు సిటీకి మెయిన్ సెంటర్‌గా అభివృద్ధి చెందింది. ఇదే తరహాలో ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డుల అభివృద్ధితో సమీప భవిష్యత్తులో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కూడా ప్రధాన నగరంగా మారుతుంది. ఫోర్త్ సిటీ నుంచి శంషాబాద్‌కు 20 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ మార్గమంతా శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. హైటెక్ సిటీలతో ఐటీ కంపెనీల రాకతో గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ఎలాగైతే అభివృద్ధి చెందాయో అంతకు రెట్టింపు వేగంతో మహేశ్వరం అభివృద్ధి చెందుతుంది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఎయిరో స్పేస్ కంపెనీల రాకతో రావిర్యాల, ఆదిభట్ల, మహేశ్వరం ప్రాంతాల రూపురేఖలే మారిపోయాయి. బెంగళూరు హైవే, ఫ్యూచర్ సిటీలతో అనుసంధానమై ఉండటం అదనపు అంశాలు.

అనుమతులు వేగం..

గత ప్రభుత్వంలో ఎలాగైతే టీఎస్–బీపాస్ ద్వారా 21 రోజుల్లోనే పారిశ్రామిక పెట్టుబడులు, సంస్థలకు అనుమతులు ఇచ్చారో.. అదే తరహాలో హెచ్ఎండీఏ, హెచ్ఎంఆర్ ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లకు టైం లైన్ పెట్టి అనుమతులను ఇవ్వాలి. దీంతో ప్రాజెక్ట్‌లు చేపట్టేందుకు బిల్డర్లు ముందుకు రావడంతో పాటు పన్నులు, ఫీజుల రూపంలో ప్రభుత్వానికి బోలెడంత ఆదాయం సమకూరుతుంది.

- రూ.60 లక్షలలోపు ధర ఉండే ఇళ్లకు ఆదరణ
- అద్దెను ఈఎంఐగా చెలిస్తే సొంతిల్లు సొంతం
- వెస్ట్ హైదరాబాద్ మినహా అన్ని వైపులా ఈ తరహా నిర్మాణాలు



సొంతింటికి అందుబాటు..

సామాన్య, మధ్య తరగతి గృహాలకు నేటికీ గిరాకీ

గ్రేటర్‌లో సామాన్యుల సొంతింటి కల రోజురోజుకూ దూరమవుతున్న నేపథ్యంలో పలు నిర్మాణ సంస్థలు వాటిని చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. భూముల ధరలు పెరగడం, నిర్మాణ సామగ్రి, కార్మికుల వ్యయాల భారమవడం వంటి పలు కారణాలతో నగరంలో ఇళ్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అయినా పలు నిర్మాణ సంస్థలు ఇప్పటికీ పశ్చిమ హైదరాబాద్ మినహా ఇతర ప్రాంతాల్లో సామాన్య, మధ్యతరగతికి అందుబాటు ధరల్లో గృహాలను నిర్మిస్తున్నాయి. తక్కువ ధర అనో, ప్రీలాంచ్‌లోనో కొనుగోలు చేసి మోసపోకుండా.. కాస్త జాగ్రత్త వహిస్తే సొంతింటి కలను నెరవేర్చుకోవచ్చు.
–సాక్షి, సిటీబ్యూరో



రెండు బెడ్ రూములు, కిచెన్, హాల్, టాయిలెట్స్‌తో 700–800 చ.అ. విస్తీర్ణంలో ఉండే బడ్జెట్ హోమ్స్‌కు ఇప్పటికీ ఆదరణ ఉంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నేపథ్యంలో హైదరాబాద్‌లో అఫర్డబుల్ హౌసింగ్ ప్రాజెక్ట్‌లకు గిరాకీ ఉంది. చిన్న వ్యాపారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, మధ్యస్థాయి ఉద్యోగులు వంటి సామాన్య, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగానే ఉన్నారు. వీరు తమ సొంతింటి కలను బడ్జెట్ హోమ్స్‌తో తీర్చుకుంటారు. అద్దెకు ఉండే బదులు అదే సొమ్మును నెలవారీ వాయిదా(ఈఐఎం) రూపంలో చెల్లిస్తే సొంతిల్లు సొంతమవుతుందనేది వారి కాన్సెప్ట్. దీంతో రూ.60 లక్షల లోపు ధర ఉండే అందుబాటు గృహాలకు డిమాండ్ పెరిగింది.

బిల్డర్లలో ధరల పోటీ..

2–3 ఏళ్ల క్రితం వరకు కూడా దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే గృహాల ధరలు అందుబాటులో ఉండేవి. కానీ, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, ఆధునిక వసతుల కల్పనలో బిల్డర్లు పోటీ పడుతుండటంతో రూ.కోట్లు వెచ్చిస్తేగానీ సొంతింటి కల సాకారం కాని పరిస్థితి. మాదాపూర్, నార్సింగి, నానక్‌రాంగూడ, కోకాపేట వంటి పశ్చిమ హైదరాబాద్ మినహా మిగిలిన మూడు జోన్లలో ఇప్పటికీ సామాన్యులకు రూ.60 లక్షల లోపు ధర ఉండే అఫర్డబుల్ గృహాలు దొరుకుతున్నాయి.

ఏ ప్రాంతాల్లో కొనొచ్చంటే..

ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ రోడ్, హయత్‌నగర్, పోచారం, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట వంటి ప్రాంతాల్లో బడ్జెట్ హోమ్స్ కొనుగోలు చేయవచ్చు. ఔటర్ లోపల ఉండే నివాస ప్రాంతాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో ఎంపిక చేసుకోవడం ఉత్తమం. దీంతో ఇల్లు చిన్నగా అనిపించినా, చుట్టూ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

కొనే ముందు వీటిని పరిశీలించాలి.

- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి విభాగాల నుంచి నిర్మాణ అనుమతులు, రెరా రిజిస్ట్రేషన్ ఉన్న ప్రాజెక్ట్‌లలోనే కొనుగోలు చేయాలి.
- ప్రమోటర్లు, బిల్డర్ల పాత చరిత్ర చూడాలి. ప్రాజెక్ట్‌లను పూర్తి చేసే ఆర్థిక శక్తి నిర్మాణ సంస్థకు ఉందో లేదో పరిశీలించాలి.
- రోడ్లు, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక వసతులు ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు చేయడం ఉత్తమం.
- బడ్జెట్ హోమ్స్ ప్రాజెక్ట్‌లకు సమీపంలో విద్యా సంస్థలు, ఉపాధి అవకాశాలు ఉన్న ప్రాంతాలను ఎంచుకోవడం బెటర్.

చిటికేసినంత సులువు..
ఇంటి కొనుగోలు!
యువ కొనుగోలుదారుల్లో మారిన ఆలోచన, అభిరుచులు

సాధారణంగా ఇల్లు కొనే ముందు సవాలక్ష ఎంక్వైరీలు, చర్చలు, లాభనష్టాల బేరీజులు.. ఇలా చాంతాడంత లిస్టే ఉంటుంది. కానీ, నేటి యువ తరం గృహ కొనుగోలు నిర్ణయాన్ని చిటికేసినంత సులువుగా తీసేసుకుంటున్నారు. నాణ్యత, ప్రాంతం, వసతులు నచ్చితే చాలు ధర గురించి ఆలోచించకుండా ముందుకెళ్లిపోతున్నారు. మూడేళ్ల క్రితం వరకు ఇంటి కొనుగోలు నిర్ణయానికి 33 రోజుల సమయం పడితే.. ఈ ఆర్థిక సంవత్సరం అర్ధ వార్షికం(హెచ్1) నాటికి కేవలం 26 రోజుల్లోనే నిర్ణయం తీసుకున్నారని ప్రాపర్టీ కన్సల్టెన్సీ అనరాక్ అధ్యయనంలో వెల్లడైంది.
–సాక్షి, సిటీబ్యూరో

ఆర్థికంగా సన్నద్ధమయ్యాకే..

మనదేశంలో అత్యంత ప్రాధాన్య పెట్టుబడి స్థిరాస్తి రంగమే. ఆర్థికంగా సన్నద్ధమయ్యాకే ప్రాపర్టీలను కొనేందుకు ముందుకొస్తున్నారు.



గత కొన్ని ఏళ్లుగా మార్కెట్‌లో బ్రాండెడ్ డెవలపర్ల నుంచి గృహాల సరఫరా పెరిగింది. నిర్మాణంలో నాణ్యత, గడువులోగా పూర్తి చేస్తారనే విశ్వాసం ఆయా సంస్థలపై ఉండటంతో కొనుగోలుదారులు త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. 2019, 2024 ఆర్థిక సంవత్సరంలో ఈ కొనుగోలు సమయం కేవలం 25 రోజులుగా ఉంది. 2021 కరోనా మహమ్మారి సమయంలో గరిష్ఠంగా 33 రోజుల సమయం పట్టింది.

వసతులకే ప్రాధాన్యం..

సాధారణంగా గృహ కొనుగోలులో ధరకే అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ, నేటి యువ కస్టమర్లు ధర గురించి పట్టించుకోవట్లేదు. రూ.3 కోట్ల ధర ఉన్న అల్ట్రా లగ్జరీ గృహాల ఎంపికకు అతి తక్కువ సమయం అంటే కేవలం 15 రోజుల్లోనే నిర్ణయం తీసుకుంటున్నారు. రూ.కోటి –3 కోట్ల ధర ఉన్న ఇళ్లకు 27 రోజులు, రూ.50 లక్షల నుంచి రూ.కోటి రేటు ఉన్న యూనిట్ల కొనుగోలుకు 30 రోజులు సమయం తీసుకుంటున్నారు.



ఇటాలియన్..
ఫస్ట్ చాయిస్..
ఇటాలియన్ పేరిట వివిధ దేశాల మార్బుల్స్ విక్రయాలు

అందమైన సొంతింటి కల.. కల కాకూడదంటే ఇంటి నిర్మాణ సమయంలో మనం వేసే అడుగులు కూడా అంతే జాగ్రత్తగా ఉండాలి. ప్రధానంగా ఇంటి అందాన్ని తళుక్కుమనిపించే ఇటాలియన్ మార్బుల్స్ విషయంలో తప్పటడుగులు వేసి నిట్టూర్చే కన్నా దాని గురించి పూర్తిగా తెలుసుకుంటే మీ అందమైన ఇల్లు జిగేల్మంటూ మెరిసిపోవడం ఖాయం.
– శంషాబాద్

- తెలుసుకుని కొనుగోలు చేస్తేనే ఇంటికి అందం
- ఇటాలియన్‌తో సమానంగా మార్కెట్‌లో స్పెయిన్, పోర్చుగల్ మార్బుల్స్
- చైనా.. టర్కీ మార్బుల్స్‌లో నాణ్యత తక్కువే..



విదేశీ మార్బుల్ దిగుమతిలో ప్రథమ స్థానం ఇటలీ నుంచి వచ్చే ఇటాలియన్ మార్బుల్‌దే.. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక దేశాల మార్బుల్స్‌ను ఇటాలియన్ పేరుతో విక్రయిస్తున్నారు. అందుకే ఇటాలియన్‌లో ఉన్న ప్రధాన రకాల గుర్తించి తెలుసుకోవాలి. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నవి సత్వారియో ఇందులో(తెలుపు, గ్రే), కరారా, వెనటినో, గ్రేవిలియం వీటితో పాటు పాత రకాలైన డైనా, పర్లాటో, బోటోచినోతో పాటు ఔట్‌సైడ్ ఎలివేషన్‌కు మాత్రమే ఉపయోగపడే ట్రావెటైన్ రకాలున్నాయి.

నాణ్యత గుర్తించడం ఎలా..?

ఇంటికి కచ్చితంగా ప్రీమియం బ్రాండ్ ఎంచుకోవడమే ఉత్తమం.. ప్రీమియం బ్రాండ్‌లో కొనుగోలు చేసే ముందు తీసుకునే మార్బుల్ కచ్చితంగా స్క్వేర్ ఆకారంలోనే ఉండాలి. అంతేకాకుండా 18ఎంఎం–20ఎంఎం మందం ఉండాలి. రాయికి నాలుగు వైపులా వ్యాకూమ్ చేసిన దాన్ని ఎంచుకోవాలి. రాయి ప్రాసెస్‌లో రెగ్జిన్‌తో చేసిందా లేదా అపాక్సీతో చేసిందా అనే విషయం కూడా తెలుసుకోవాలి. సాఫ్ట్ రాయి కంటే హార్డ్ ఉన్న రాయినే ఎంచుకోవాలి. రాయిలో కెమికల్ ఫిల్లింగ్ ఉంటే కచ్చితంగా తక్కువ క్వాలిటీదిగా గుర్తించాలి. ఇటాలియన్ మార్బుల్స్‌లో కనిష్ఠంగా రూ.300 ఫీట్ మొదలుకొని గరిష్ఠంగా రూ.5 వేల వరకు హైదరాబాద్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

పోటీగా ఉన్నవి ఇవే..

మార్కెట్‌లో ఇటాలియన్‌తో సమానంగా స్పెయిన్ మార్బుల్స్ పోటీలో ఉన్నాయి. ఇందులో బెల్లాచినో, హర్మానివైట్, గ్రేకార్నికో, స్పానిషబెజ్, స్పానిష్ బ్రౌన్, పోర్చుగల్‌కు చెందిన మెకలాంజిలో మార్బుల్స్ అధికంగా విక్రయాలు జరుగుతున్నాయి. వీటితో పాటు గ్రీస్‌కు చెందిన ఒలకాస్, గోర్డెన్ ఇన్‌స్పైడర్, థాసోస్‌వైట్ కూడా ఉన్నాయి. వియత్నాంకు చెందిన వైట్ మార్బుల్స్ కూడా ప్రత్యేకంగా పూజ గదులకు ఎక్కువగా సెలెక్ట్ చేసుకుంటున్నారు. ఇక బ్రెజిల్‌కు చెందిన క్వార్టజైట్ రాళ్లు టేబుల్ టాప్, కిచెన్, క్లాడింగ్, ఎలివేషన్ ఎక్కువగా వినియోగంలో ఉన్నాయి. వీటితో పాటు మార్కెట్‌లో ఇరాన్, ఇరాక్, తునేషియా సంబంధిత దేశాల మార్బుల్స్ కూడా ఉన్నాయి.

చైనా.. టర్కీ..

చైనా వివిధ దేశాల మార్బుల్స్‌ను దిగుమతి చేసుకుని తిరిగి ప్రాసెస్ చేసి విక్రయించే రకాలు కూడా ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నాయి. ఇందులో ప్రీమియంతో పాటు మీడియం క్వాలిటీ రకాలు కూడా ఉన్నాయి. టర్కీ నుంచి వచ్చే మార్బుల్స్ కొంత తక్కువ నాణ్యతతో ఉంటున్నాయి. క్రాక్ ఫిల్లింగ్, అధికంగా కెమికల్ ప్రాసెస్ చేసిన మార్బుల్స్ ఉంటాయి. వీటి రీ పాలిష్ మెయింటెనెన్స్ ఎక్కువగా ఉంటుంది. సో.. సొంతింటిలో మీ అడుగులు అందమైన మార్బుల్స్‌పై వేసే ముందు ఈ జాగ్రత్తలు తీసుకుంటే బెటర్.. ఆల్ ది బెస్ట్..!

రెరా ఏందయా?
వెబ్‌సైట్‌లో 'లాస్ట్ అప్డేట్ కాలమ్' తొలగింపు

గృహ కొనుగోలుదారులకు భద్రత, భరోసా కల్పించాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ–రెరా) గందరగోళంగా మారింది. కస్టమర్లకు తమ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలకమైన సమాచారం 'లాస్ట్ అప్డేట్ కాలమ్'ను టీజీ–రెరా వెబ్‌సైట్ నుంచి తొలగించింది. దీంతో ప్రాజెక్ట్ పురోగతి సమాచారం తెలియక, గృహ కొనుగోలుదారులలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు టీజీ–రెరాలో 9,990 ప్రాజెక్ట్‌లు, 4,436 మంది ఏజెంట్లు నమోదయ్యారు. 2,266 ఫిర్యాదులు అందగా.. 1,302 కేసులను పరిష్కరించారు.
–సాక్షి, సిటీబ్యూరో

- కనిపించని ప్రాజెక్ట్ పురోగతి సమాచారం
- దీంతో గృహ కొనుగోలుదారులలో ఆందోళన



రెరా చట్టంలోని సెక్షన్–11 ప్రకారం మూడు నెలలకు (త్రైమాసికం) ఒకసారి తమ ప్రాజెక్ట్ పురోగతి, విక్రయాలు, ఖాళీలు తదితర వివరాలను టీజీ–రెరా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. దీంతో బిల్డర్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన త్రైమాసిక సమాచారాన్ని బహిర్గతం చేస్తున్నారో లేదో కస్టమర్లు సులభంగా తనిఖీ చేసుకోవచ్చు. బిల్డర్ ఒక ప్రాజెక్ట్ వివరాలను చివరగా ఎప్పుడు అప్డేట్ చేశారో లేదా అప్‌లోడ్ చేశారో ఈ కాలమ్ చూపిస్తుంది. ''గతంలో టీజీ–రెరా వెబ్‌సైట్‌లో నా ప్రాజెక్ట్‌ను తనిఖీ చేస్తున్నప్పుడు, బిల్డర్ క్రమంతప్పకుండా అప్డేట్ చేస్తున్నాడో తెలుసుకోవడం సులభంగా ఉండేది. కానీ, ఇప్పుడు తేదీ లేకుండా, అది ఎప్పుడు అప్డేట్ చేశారో తెలియడం లేదు. ప్రస్తుతం ఉన్న వివరాలు తాజావా లేక పాతవా అనే సమాచారం తెలియడం లేదని'' ఓ గృహ కొనుగోలుదారుడు వాపోయారు.

బహుళ పత్రాలను పరిశీలించాల్సిందే..

- టీజీ–రెరా వెబ్‌సైట్ నుంచి 'లాస్ట్ అప్డేట్ కాలమ్'ను తొలగించడం వల్ల టీజీ–రెరా నియమాలు, 2017 రూల్–16 ప్రకారం ప్రతి త్రైమాసికంలో డెవలపర్లు ప్రాజెక్ట్ వివరాలను అప్డేట్ చేస్తున్నారో లేదో ట్రాక్ చేయడం కష్టతరమైందని ఓ న్యాయవాది అన్నారు.
- గతంలో లాస్ట్ అప్డేడ్ కాలమ్‌తో ప్రాజెక్ట్ పురోగతి సమాచారం సులభంగా తెలుసుకునే వీలుండేది. కానీ, ఇప్పుడు బహుళ పత్రాలను పరిశీలిస్తే గానీ సమాచారంపై స్పష్టత రావడం లేదు. ఈ కాలమ్‌ను తొలగించడంతో డెవలపర్లలో కూడా 'లాస్ట్ అప్డేట్' ఫ్రీక్వెన్సీ తగ్గుతుంది. దీంతో రెరా ఉద్దేశించిన పారదర్శకత లోపించడంతో పాటు అమలు సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది.

అయితే ఈ విషయమైన ఓ టీజీ–రెరా అధికారిని సంప్రదించగా.. వెబ్‌సైట్‌లో పలు సాంకేతిక మార్పులలో భాగంగా తాత్కాలిక కాలం పాటు ఈ కాలమ్‌ను తొలగించామని, పునరుద్ధరణ తర్వాత తిరిగి ఈ ఫీచర్ తిరిగి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

క్లబ్‌హౌస్‌లో కో–వర్కింగ్ ప్లేస్

సాక్షి, సిటీబ్యూరో: గేటెడ్ కమ్యూనిటీల్లో నివాసం ఉండే ఐటీ ఉద్యోగులకు నిర్మాణ సంస్థలు సరికొత్త సౌకర్యం అందుబాటులోకి తెస్తున్నాయి. కరోనాతో మొదలైన వర్క్ ఫ్రం హోమ్ ఇప్పటికీ కొనసాగుతోంది. ఉద్యోగుల ఆసక్తి, నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటం, మెరుగైన ఉత్పాదకత కారణంగా కొన్ని బహుళ జాతి కంపెనీలు ఇప్పటికీ ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. అయితే ఇంట్లో ప్రత్యేకంగా కొంత స్పేస్‌ను ఆఫీస్ కోసం వినియోగిస్తే గృహ కొనుగోలుదారులు ఒప్పుకోవడం లేదు. ఇంట్లో పిల్లల అల్లరి, పెద్దల అవసరాలు, బంధువులు వచ్చినప్పుడు హడావుడి తదితర కారణాలతో ఇంట్లోనే ఆఫీస్ స్పేస్ ఇస్తే ఇబ్బందికరంగా ఉంటోందని ఉద్యోగులు భావిస్తున్నారు. దీంతో నిర్మాణ సంస్థలు గేటెడ్ కమ్యూనిటీల్లోని క్లబ్‌హౌస్‌ల్లో ప్రత్యేకంగా కో–వర్కింగ్ స్పేస్ అందుబాటులో ఉంచుతున్నాయి. హై నెట్ వర్క్ స్పీడ్‌తో వైఫై సేవలను అందిస్తున్నాయి. కూర్చునేందుకు వీలుగా మంచి కుర్చీలు, ఇతరత్రా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఆయా నివాస సముదాయాల్లో వర్క్ ఫ్రం హోమ్ చేసే ఉద్యోగులందరూ ఒకేచోట పనిచేసుకునే వీలు కలుగుతుంది. పైగా అత్యవసర సమయంలో వెంటనే ఇంటికి చేరుకోవచ్చు.

- వేగవంతమైన పట్టణీకరణ, పెరుగుతున్న భవన నిర్మాణ సముదాయాలతో హైదరాబాద్ అర్బన్ జంగిల్‌గా మారిపోతుంది. దీంతో ఆ ఉద్యోగులకు పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం అనుభూతి కలిగించాలంటే ల్యాండ్ స్కేపింగ్ అనివార్యమైపోయింది. కనుచూపు మేర వరకూ పచ్చదనం, అది కూడా సేఫ్టీ, సెక్యూరిటీ ఉండే గేటెడ్ కమ్యూనిటీలోనే ఉండాలని నేటి గృహ కొనుగోలుదారులు కోరుకుంటున్నారు. పురుగు మందులు, రసాయనాలతో గాలి, నేల కాలుష్యం అవుతుంది. దీంతో సేంద్రియ, సస్టయినబుల్ గార్డెనింగ్‌కు ఆదరణ పెరుగుతోంది.



- సువాసన, ఆకర్షణీయమైన పువ్వుల మొక్కలు, చెట్లు, గడ్డితో నివాస సముదాయంలో వాక్, రన్ వేలు, డెక్‌లు, టెర్రస్ వంటి ప్రాంతాల్లో ల్యాండ్ స్కేపింగ్‌లను చేపడుతున్నారు. విశ్రాంతి తీసుకోవడానికి, సమావేశాల కోసం వినూత్న లైట్లతో ప్రత్యేకమైన థీమ్‌లతో అందంగా అలంకరిస్తున్నారు. స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన ల్యాండ్ స్కేపింగ్‌తో బార్బిక్యూ వంటి ఔట్‌డోర్ ఈవెంట్లు, పార్టీలను చేసుకునేందుకు ఆహ్లాదకరమైన వేదికగా ఉంటుంది.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు.. ఆన్‌లైన్ సర్వేలు

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఉన్నత విద్యా సంస్థల్లో చదివే వారి మానసిక ఆరోగ్యాన్ని కాపాడాలని, ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకోకుండా కాపాడాలని ఆదేశించింది. అంతేకాదు, రిటైర్డ్ జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ చైర్మన్‌గా ఒక జాతీయ టాస్క్‌ఫోర్స్‌ని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఆగస్టు 8న టాస్క్‌ఫోర్స్ వెబ్‌సైట్ https://ntf.education.gov.inను ప్రారంభించింది. ఇందులోని విభిన్న సర్వేలు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్






ఉన్నత విద్యా సంస్థల్లో చదివే విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్.. గతంలో ఏర్పాటుచేసిన కమిటీలు, టాస్క్‌ఫోర్సుల కంటే భిన్నమైనది. దేశంలోని అన్ని అత్యున్నత విద్యా సంస్థలూ దీని కిందకు వస్తాయి. ఈ టాస్క్‌ఫోర్స్‌లో క్లినికల్ సైకాలజీ, సామాజిక శాస్త్రం, దివ్యాంగుల హక్కులు.. ఇలా విభిన్న రంగాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు.

వెబ్‌సైట్‌లో ఉంచిన జాతీయ టాస్క్‌ఫోర్స్
- విద్యార్థులకు వివిధ ప్రశ్నలతో ప్రత్యేక సర్వే
- తల్లిదండ్రులూ, విద్యా సంస్థల ప్రతినిధులకూ
- 'సుప్రీం' మార్గదర్శకాలతో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్
- సర్వేలో పాలుపంచుకుంటే మేలంటున్న నిపుణులు

ఈ వెబ్‌సైట్ ఈ కింది వర్గాల వారికి ఒక వేదికగా పనిచేస్తుంది

ఉన్నత విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు	వారి తల్లిదండ్రులు	విద్యాసంస్థల సిబ్బంది	ఆ సంస్థల అధిపతులు
మానసిక ఆరోగ్య సేవలు అందించే నిపుణులు	సామాన్య ప్రజలు	ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఎన్జీఓలు, పాత్రికేయులు	

విద్యార్థులకు ప్రత్యేక సర్వే



ఈ వెబ్‌సైట్ ఆన్‌లైన్ సర్వేలు నిర్వహిస్తోంది. ఇందులో విద్యార్థులు కూడా స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, ఆత్మహత్య ఆలోచనల వంటి పరిస్థితుల నుంచి బయటకు రావడానికి ఉన్నత విద్యా సంస్థల్లో ఎలాంటి వ్యవస్థ ఉండాలో సూచనలు, సలహాలు ఇవ్వొచ్చు. అయితే ఇందులో విద్యార్థులు తమ పేరు, ఫోన్ నంబర్, తమ విద్యా సంస్థ.. ఇలాంటివి చెప్పాల్సిన అవసరం లేదు.

6 సెక్షన్లలో ప్రశ్నలు ..: ఇందులో విద్యార్థులకు మొత్తం 6 సెక్షన్లలో ప్రశ్నలు ఉన్నాయి. విద్యార్థి ఏం చదువుతున్నారు, ఎక్కడ చదువుతున్నారు (గవర్నమెంట్ కాలేజ్ / ప్రైవేట్ కాలేజ్.. ఇలా) వంటి ప్రాథమిక అంశాలకు సమాధానాలు ఇవ్వాలి. రెగ్యులర్ పరీక్షలకు చదవడంతోపాటు కోచింగ్ / ట్యూషన్‌కు వెళ్లడం వల్ల వారిపై ఎంత ఒత్తిడి ఉంటోంది (0-10 స్కేలుమీద నంబర్ చెప్పాలి); తీవ్రమైన మానసిక వేదన, ఆందోళన, ఒత్తిడి వంటివి కలిగినప్పుడు తల్లిదండ్రులు లేదా స్నేహితులు లేదా టీచర్లు.. ఇలా ఎవరైనా దగ్గర ఉంటున్నారా లేదా అని అడిగారు.

ఈ సెల్స్ ఉన్నాయా?.: ముఖ్యంగా కాలేజీలో యాంటీ ర్యాగింగ్ సెల్; లైంగిక వేధింపుల నిరోధకతకు, లింగ వివక్షపై అవగాహన కల్పించే సెల్; క్రమశిక్షణ కమిటీ, ఫిర్యాదుల పరిష్కార సెల్, విద్యార్థుల సంక్షేమ సెల్ వంటివి ఉన్నాయా, ఉంటే వాటి గురించి మీకు తెలుసా అని, వాటిని ఆశ్రయించాల్సిన అవసరం మీకు ఎప్పుడైనా కలిగిందా అంటూ అడిగారు. మీ కాలేజీలో గతంలో విద్యార్థులు ఎవరైనా తోటి విద్యార్థుల వల్ల లింగ వివక్షకు గురయ్యారా? లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసే స్వేచ్ఛ మహిళలకు ఉందా? మతం కారణంగా ఏ విద్యార్థి అయినా వేధింపులకు గురయ్యారా? కులం, భాష.. ఇలాంటి ఇతర అంశాల ఆధారంగా వివక్ష చూపారా?.. ఇలాంటి ప్రశ్నలూ ఉన్నాయి.

విద్యా సంస్థలపై..

మీ క్యాంపస్ సురక్షితం అని భావిస్తున్నారా, మీరు ఏదైనా పెద్ద సమస్యను చెప్తే దాన్ని వాళ్లు పరిష్కరిస్తారన్న నమ్మకం మీకు ఉందా; మీ వ్యక్తిగత అంశాలు పంచుకోగలిగే 2-4 స్నేహితులు మీ క్యాంపస్‌లో ఉన్నారా, మీకు తీవ్ర ఒత్తిడిలాంటిది కలిగినప్పుడు ఫ్యాకల్టీ మెంబర్లలో కనీసం ఒక్కరైనా మీకు సాయం చేయగలరని మీరు నమ్ముతున్నారా.. వంటి ప్రశ్నలు అడిగి క్యాంపస్‌తో పాటూ సిబ్బంది, స్నేహితుల గురించి కూడా తెలుసుకునే ప్రయత్నం చేశారు.

విద్యార్థులకు తోడుగా.. 24 గంటలూ అందుబాటులో ఉండే పలు హెల్ప్‌లైన్ల వివరాలు ఈ వెబ్‌సైట్‌లో ఇచ్చారు.

అంశం	హెల్ప్‌లైన్ పేరు	నంబర్	ఎలా ఉపయోగం
ఎమర్జెన్సీ	అత్యవసర స్పందన	112	పోలీస్, ఫైర్, అంబులెన్స్
మానసిక ఆరోగ్యం	టెలి మానస్	14416 లేదా 1800-891-4416	మానసిక సమస్యలకు సాయం
	మనోదర్పణ్	8448440632	విద్యార్థులకు ఎమోషనల్ సపోర్ట్
రక్షణ	మహిళా హెల్ప్‌లైన్	181	అత్యవసర సాయం
	జాతీయ మహిళా కమిషన్	78271-70170	మహిళల సమస్యల ఫిర్యాదులకు
	యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్	1800-180-5522	ర్యాగింగ్, వేధింపులపై ఫిర్యాదులకు
	సైబర్ క్రైమ్ రిపోర్టింగ్	155260 /1930	ఆన్‌లైన్ వేధింపులు, మోసాలు
న్యాయం/హక్కులు	ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ	14566	కులపరమైన వివక్ష/హింస
	దివ్యాంగ హెల్ప్‌లైన్	14456 (సోమవారం నుంచి శనివారం వరకు-ఉ 9.00- సా. 5.30)	
	ఉచిత లీగల్ హెల్ప్‌లైన్	15100 (సోమవారం నుంచి శుక్రవారం వరకు-ఉ 9.30- సా. 5.00)	

ఆత్మహత్యలకు సంబంధించి

గత ఏడాది కాలంలో మీకు ఎప్పుడైనా.. 'ఈ బతుకు వృథా, ఎవరికీ ప్రయోజనం లేదు, నేను చనిపోవడమే ఉత్తమం' ఇలాంటి ఆలోచనలు వచ్చాయా? ఎప్పుడైనా ఆత్మహత్యాయత్నం చేశారా? గత 30 రోజుల్లో తీవ్ర నిరాశ, తీవ్ర ఒత్తిడికి గురవడం జరిగాయా అంటూ ప్రశ్నించారు. కాలేజీలో రిలాక్స్ అవ్వడానికి లేదా హాబీలపై సమయం కేటాయించడానికి సంబంధించి కూడా ప్రశ్నలు అడిగారు.

వారి దగ్గరి నుంచి కూడా..



విద్యార్థుల నుంచి సేకరించినట్టే తల్లిదండ్రులు, మానసిక ఆరోగ్య సేవలు అందించే కౌన్సెలర్లు, సైకాలజిస్టులు, థెరపిస్టులు, క్లినికల్ సైకాలజిస్టులు, సోషల్ వర్కర్లు, సైకియాట్రిస్టుల వంటి నిపుణులు, విద్యా సంస్థల ప్రతినిధుల నుంచి కూడా సర్వే రూపంలో సమాచారం సేకరించే ఏర్పాటు ఈ వెబ్‌సైట్‌లో ఉంది. విద్యార్థులు సహా అన్ని వర్గాలవారూ ఈ సర్వేలో పాల్గొంటే భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి జస్టిస్ చలపతికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సుద్దాల చలపతి శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ చలపతి, కుటుంబసభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. అంతకుముందు కొండపైన జస్టిస్ చలపతికి కలెక్టర్ హనుమంతరావు తదితరులు స్వాగతం పలికారు.

15న కామారెడ్డిలో కాంగ్రెస్ భారీ సభ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించిన కామారెడ్డిలోనే మరో సభకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఈనెల 15న కామారెడ్డి వేదికగా బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. పీసీసీ అధ్యక్షుడిగా బి.మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ సభను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు తెలుస్తోంది. లక్ష మందితో ఈ సభను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించినట్టు సమాచారం. మహేశ్‌కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడైన తర్వాత ఏడాదిలో పార్టీ పరంగా నిర్వహించిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించేందుకు సభ నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీంతో పాటు రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో వివరిస్తామని, బీసీలకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ల విషయంలో పార్టీ చేసిన కృషిని ఈ సభ ద్వారా ప్రజల ముందుంచుతామని పార్టీ వర్గాలు చెపుతున్నాయి. బీసీల కులగణన, కేబినెట్ తీర్మానం, 42%రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో పెట్టిన రెండు బిల్లులు, గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్సు, ఢిల్లీ వేదికగా చేసిన ప్రయత్నాలు, 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలకు వెళ్లాలన్న పార్టీ ఆలోచన వంటివన్నీ సభ ద్వారా ప్రజలకు వివరిస్తామని చెబుతున్నాయి.

సంక్షేమాన్ని అమ్ముకునే పార్టీ బాగుపడదు

బీఆర్ఎస్ విషయంలో అదే జరిగింది
- ఇందిరమ్మ ఇళ్లలో చేతివాటం ప్రదర్శిస్తే తీవ్ర చర్యలు
- బీసీ రిజర్వేషన్ల విషయంలో ఆఖరి ఆప్షన్‌ను కూడా వినియోగించుకుంటాం
- వారం రోజుల్లో మండల, జిల్లా కమిటీలు, అక్టోబర్‌లో నామినేటెడ్ పోస్టులు
- టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమై ఏడాది పూర్తైన సందర్భంగా మీడియాతో మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు అమలయ్యే సంక్షేమాన్ని అమ్ముకున్న ఏ పార్టీ బాగుపడదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ఆ పనిచేసింది కాబట్టే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని, బీఆర్ఎస్‌లో తిరిగిన వారికి కూడా ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. అయితే, ఒకట్రెండు చోట్ల ఫిర్యాదులు వచ్చాయని, కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఎవరైనా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో చేతివాటం ప్రదర్శిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో పలు అంశాలపై విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...!

- ➤ టీపీసీసీ అధ్యక్షుడిగా ఈ ఏడాది కాలం నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మహత్తరమైంది. మంత్రులతో ముఖాముఖి దేశం దృష్టిని ఆకర్షించింది. కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ సీఎంలు ఈ కార్యక్రమం గురించి నాతో వాకబు చేశారు.
- ➤ వారం రోజుల్లో పార్టీ మండల, జిల్లా కమిటీలు పూర్తి చేస్తాం. అక్టోబర్ నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం. అక్టోబర్‌లోనే పార్టీ సభ్యత్వం చేపడతాం. కార్యకర్తలకు బీమాను పునరుద్ధరిస్తాం.
- ➤ సీబీఐ మీద కాంగ్రెస్ పార్టీకి అనుమానాలున్నాయి. కానీ, కాళేశ్వరం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నామని అంటారు. మాకు సీబీఐ తప్ప వేరే మార్గం లేకనే ఇచ్చాం.
- ➤ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విషయంలో కొంత గందరగోళం ఉంది. ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం ఆ ఇద్దరు అన్నదమ్ములకు అలవాటు.
- ➤ ఈ ఐదేళ్లు రేవంత్‌రెడ్డి సీఎంగా ఉంటారు. వచ్చే ఎన్నికలను ఆయన నేతృత్వంలోనే ఎదుర్కొంటాం. ఆ తర్వాత కూడా ఆయన్నే సీఎంగా ఎమ్మెల్యేలు ఎన్నుకుంటే కొనసాగుతారు. బీసీ ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం.
- ➤ రిజర్వేషన్ల సంగతి తేలిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళతాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో ఉన్న ఆఖరి ఆప్షన్‌ను కూడా ఉపయోగించుకుంటాం. అది కూడా సాధ్యం కాకపోతేనే పార్టీపరంగా రిజర్వేషన్లు కల్పిస్తాం.
- ➤ కవిత చాలా మంచిపని ఒకటి చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెప్పారు. కానీ ఈ మాట అధికారంలో ఉన్న రోజే మాట్లాడి ఉంటే సెల్యూట్ చేసేవాడిని. రాజీనామాను ఆమె ఆవేశంలో ఇచ్చిందా.. నిజంగా ఇచ్చిందా అనేది మండలి చైర్మన్ మాట్లాడితే గానీ తెలియదు.
- ➤ కేసీఆర్ కుటుంబం నుంచి ఎవరు కాంగ్రెస్ పార్టీలోకి వస్తామన్నా తీసుకోబోం. తమపై వస్తున్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కవిత ఎపిసోడ్ నడిపిస్తున్నారేమోననే చిన్న అనుమానం ఏ మూలనో నాకుంది.
- ➤ మొన్నటివరకు కేటీఆర్ టార్గెట్‌గా మాట్లాడిన కవిత, అమెరికా వెళ్లి వచ్చిన తర్వాత ఉన్నట్టుండి హరీశ్‌రావుపై విమర్శలు చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జోక్యం చేసుకొని కవిత మనసు మార్చినట్టున్నారు.

'నిషేధిత భూముల'పై అఫిడవిట్ వేయలేదేం?

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం
- వారంలోగా వేస్తామని విజ్ఞప్తి చేసిన రెవెన్యూ జీపీ
- 10వ తేదీకి విచారణ వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22-ఏ కింద నిషేధ జాబితాలో చేర్చిన లక్షల ఎకరాల భూముల వివరాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అత్యవసర ప్రాతిపదికన పంపాలని.. ఆ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. అఫిడవిట్ దాఖలుకు ఇదే చివరి అవకాశమని.. లేనిపక్షంలో నేరుగా తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని తెల్చిచెప్పింది. ఒకవేళ హాజరుకాకుంటే కఠినచర్యలకు వెనుకాడబోమని హెచ్చరించింది. ఈసారి విచారణకు హాజరు కావాలని చెప్పినా.. రాకపోవడంపై అసహనం వెలిబుచ్చింది. రెవెన్యూ జీపీ కట్రం మురళీధర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ప్రస్తుతానికి చర్యలేవీ తీసుకోకుండా వారం గడువు ఇస్తున్నామని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణకు మినహాయింపు ఉండదని చెబుతూ విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ కాలనీలో ఉన్న 475 గజాల భూమి కొనుగోలుకు సంబంధించి సేల్‌డీడ్ స్వీకరించకపోవడాన్ని సవాల్ చేస్తూ గుప్తా రియాల్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

భూముల డేటా పంపడం సర్కార్ విధి..

గత నెల విచారణ సందర్భంగా న్యాయమూర్తి.. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు అనుగుణంగా జీవో-98 ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాను కలెక్టర్లు ఎప్పటికప్పుడు సబ్-రిజిస్ట్రార్లకు ఎందుకు తెలియజేయలేకపోతున్నారని జీపీని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం పరిశీలిస్తోందని.. 12 వారాల సమయం కావాలని జీపీ కోరారు. 2023లోనే ఈ మేరకు ఆదేశాలిచ్చినందున ఇప్పుడు అంత సమయం ఇవ్వలేమంటూ జడ్జి నిరాకరించారు. మొత్తం జాబితాను 9 వారాల్లో అన్ని జిల్లాల సబ్-రిజిస్ట్రార్లకు చేర్చాలంటూ ఈ ప్రక్రియపై సీఎస్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టారు.

సీఎస్ నుంచి ఇది ఊహించలేదు...

ఈ సందర్భంగా ప్రభుత్వం ఈ నెల ఒకటిన జారీ చేసిన మెమోను మురళీధర్‌రెడ్డి కోర్టు ముందుంచారు. వివిధ సెక్షన్ల కింద నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలు వెంటనే పంపాలని కలెక్టర్‌ను కోరామని.. కలెక్టర్లలోపాటు దేవాదాయ శాఖ, వక్ఫ్‌బోర్డు నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. ఈ వివరాలన్నీ క్రోడీకరించి కమిటీ తదుపరి చర్యలు తీసుకుంటుందని.. అత్యవసర అంశంగా వివరాలు అందజేయాలని మెమోలో పేర్కొన్నామన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకొని.. అఫిడవిట్ దాఖలు చేయకుంటే సీఎస్‌ను రమ్మన్నాం కదా, ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. వారం సమయమిస్తే అఫిడవిట్ దాఖలు చేస్తామని జీపీ విజ్ఞప్తి చేశారు. హాజరుకు మినహాయింపు కోరుతూ పిటిషన్ వేయని సీఎస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సీఎస్ నుంచి ఇలాంటి చర్య ఊహించలేదని, ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు.

పెన్షన్లు పెంచుతారా.. గద్దె దిగుతారా?

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



దుబ్బాక: అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని, ఇప్పటికైనా పింఛన్లు పెంచుతారా? లేదా గద్దె దిగుతారా? చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో చేయూత పెన్షన్‌దారుల సన్నాహక సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సీఎం పదవి చేపట్టి 20 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి పెన్షన్ పెంచలేదన్నారు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు కనీసం మాట్లాడకపోతుండటం దారుణమన్నారు. సీఎం రేవంత్ బంగళాలోనూ, మాజీ సీఎం కేసీఆర్ గడీలోనూ పుట్టి వచ్చిన నాయకులని, అందుకే పెన్షన్‌దారుల పక్షాన వాళ్లు నిలబడటంలేదని విమర్శించారు. 9న హైదరాబాద్‌లో జరిగే చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.



పార్టీలో చేరిన నాయకులతో కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి, సురేశ్‌రెడ్డి తదితరులు

త్వరలో ఉప ఎన్నికలు ఖాయం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఫిరాయింపులపై స్పీకర్ స్పందించకుంటే మరోమారు సుప్రీంకోర్టుకు.. పోచారం పదవి పోయేంత వరకు న్యాయపోరాటం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోర్టు ఆదేశాలపై అసెంబ్లీ స్పీకర్ గడువులోగా స్పందించకుంటే మరోమారు సుప్రీంకోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పదవి పోయేంత వరకు న్యాయ పోరాటం కొనసాగిస్తామన్నారు. శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ '21 నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా కేసీఆర్ పేరును పదేపదే ప్రస్తావిస్తూ, ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారు. గడిచిన 21 నెలల్లో రూ.2.20 లక్షల కోట్లు అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కొత్తగా ఎలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టలేదు. పంటల కొనుగోళ్లు, బోనస్ ఎగవేతకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా యూరియా సరఫరా చేయడం లేదు. హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలి'అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ, బాన్సువాడ నార్ల రత్నకుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు సురేశ్ రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజుల సురేందర్ పాల్గొన్నారు.

అన్నదాతలకు నిరసన తెలిపే హక్కు లేదా?: కేటీఆర్

ఇందిరమ్మ రాజ్యమంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో యూరియా బస్తాలకు కూడా దిక్కులేక రైతులు అల్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మండిపడ్డారు. యూరియా కోసం అన్నదాతలకు కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదా? అని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'అబద్ధపు హామీలు, గారడీ గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి తమ చెప్పుతో తామే కొట్టుకునే దుస్థితి వచ్చిందని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు లక్ష్మణ్ యాదవ్ తన గోసను వెళ్లగక్కితే అక్రమ కేసుల పేరిట వేధిస్తారా'అని కేటీఆర్ ప్రశ్నించారు.

పాలకుల నెగెటివ్ మైండ్‌సెట్‌తో అభివృద్ధి ఎలా సాధ్యం?

- రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినేలా సర్కారు రాజకీయం
- లండన్ బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం మీట్ అండ్ గ్రీట్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: పాలకులు సానుకూల దృక్పథంతో కాకుండా నెగెటివ్ మైండ్ సెట్‌తో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రూ.300-400 కోట్లతో మరమ్మతు అయ్యే మేడిగడ్డ బరాజ్ పనులు చేపట్టకుండా కాళేశ్వరం పథకంలో రూ.లక్ష కోట్లు అవినీతి జరిగిందని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర, రైతుల ప్రయోజనాలు దెబ్బతినేలా రేవంత్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావు.. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూకే విభాగం గురువారం రాత్రి నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్'కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీటిని తీసుకెళ్లేందుకు రూ.7 వేల కోట్లతో రేవంత్ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఆలేరు నియోజకవర్గానికి సాగునీరు అందించే గంధమల్ల ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన చేశారు. కాళేశ్వరం లేకుండానే రికార్డు స్థాయిలో వరి ధాన్యం దిగుబడి వచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ప్రాజెక్టు కూడా కట్టకుండా ఇవన్నీ ఎలా సాధ్యం అవుతున్నాయి? మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్లు కుంగడం మినహా మిగతా పథకం అంతా బాగుందని శాసనమండలిలో ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. మేడిగడ్డలో ఏడో బ్లాక్‌ను మరమ్మతు చేస్తే సరిపోతుందని ఎన్డీఎస్ఏ చెప్పింద'ని హరీశ్‌రావు వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం పాలనపై కాకుండా గోబెల్స్ ప్రచారంపై దృష్టి పెట్టిందని విమర్శించారు.

ఇందిరమ్మ రాజ్యం అంటే వేధించడమా?: కవిత



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులు, బెదిరింపులకు గురి చేయడమేనా? అని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత 'ఎక్స్'వేదికగా ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో.. యూరియా అడిగిన రైతును కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వేధిస్తోందని ఆరోపించారు. 'యూరియా కొరతపై సీఎం రేవంత్‌రెడ్డిని రైతు లక్ష్మణ్ యాదవ్ నిలదీసినందుకు.. పోలీసులు అతని ఇంటికి వెళ్లి వేధించారు. కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదు చేయడమే ఆలస్యం అన్నట్లు.. పోలీసులు చట్టవ్యతిరేక చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి దారుణాలను సహించేది లేదన్నారు. పాలకుల మెప్పు కోసం ప్రజలను ఇబ్బంది పెడితే తగిన మూల్యం చెల్లించక తప్పదని కవిత హెచ్చరించారు.

భూ చిక్కులకు భూభారతి చెక్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో దరఖాస్తుల పరిష్కారం క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా గతంలో ఉద్యాసనకు గురైన 5,101 మంది వీఆర్ఏ, వీఆర్ఓలను జీపీఓ (గ్రామ పాలనాధికారులు)లుగా నియమించింది. అలాగే 7 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేసింది.

మరికొంత సమయం..

భూభారతి ద్వారా భవిష్యత్తులో భూవివాదాలు, ఘర్షణలకు తావులేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. సాదాబైనామాలో తెల్లకాగితాలపై క్రయవిక్రయాలు జరుగుతుండగా భూమిపై ఒకరు, రికార్డుల్లో మరొకరు యజమానిగా ఉంటున్నారు. భూమి మీద ఉన్న వ్యక్తి క్రమబద్ధీకరించాలని భూభారతిలో దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా పరిష్కారానికి కొంత సమయం పట్టనుంది. అలాగే అసైన్డ్ భూముల విషయంలోనూ విక్రయదారు, కొనుగోలుదారులను పిలిపించి ప్రభుత్వం విచారణ చేపట్టనుంది.



ఖమ్మం జిల్లా కల్లూరు మండలం బత్తులపల్లి సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

పలు జిల్లాల్లో అందిన, పరిష్కరించిన దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు	పరిష్కరించినవి	జిల్లా	దరఖాస్తులు	పరిష్కరించినవి
నల్లగొండ	73,294	3,115	కామారెడ్డి	36,817	3,200
సూర్యాపేట	47,480	810	నిజామాబాద్	40,468	1,320
యాదాద్రి భువనగిరి	14,966	1,150	రంగారెడ్డి	22,139	1,011
ఖమ్మం	74,993	693	హనుమకొండ	37,144	1,304
భద్రాద్రి కొత్తగూడెం	61,145	110	జనగామ	18,935	820

భూ భారతితో సమస్యలు పరిష్కారం



రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతులు ధరణి పోర్టల్‌తో సమస్యలు ఎదుర్కొన్నారు. ఆ సమస్యలన్నీ భూభారతితో పరిష్కారమవుతాయి. జీపీఓల నియామకంతో గ్రామ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుంది. త్వరలో చేపట్టే సమగ్ర భూసర్వేతో అన్ని రకాల సమస్యలకు అర్థవంతమైన పరిష్కారం లభిస్తుంది. - గరికె ఉపేంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు, జీపీఓల సంఘం

క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి



నేను యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్/వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్నా. అంతకుముందు 12 ఏళ్ల పాటు రెవెన్యూ శాఖలో పని చేశా. వీఆర్వో వ్యవస్థ రద్దుతో మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరా. మేం తిరిగి రెవెన్యూలోకి వస్తామనుకోలేదు. అలాంటిది జీపీఓగా రావడం ఆనందంగా ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.
- టి.శిరీష, తురకపల్లి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా (జీపీఓ, సిద్దిపేట జిల్లా)

పరిష్కారంపై ఆశతో ఉన్నా..



వారసత్వం కింద నాలుగు ఎకరాలు రాగా.. మరో నాలుగున్నర ఎకరాల భూమి కొన్నా. కొనుగోలు చేసిన భూమి హక్కుల కోసం 2020లో సాదాబైనామా కింద దరఖాస్తు చేసుకున్నా. తహసీల్ చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు. తాజాగా కోర్టు తీర్పుతో పరిష్కారంపై ఆశతో ఉన్నా.
- బంధం వెంకటేశ్వర్లు, ముష్టికుంట్ల, బోనకల్ మండలం, ఖమ్మం జిల్లా

పాస్ పుస్తకంలో నమోదు చేయాలి..



రంగాపేటలో వెల్ది శివారు సర్వే నంబర్ 698ఎ/2/1లో 5.07 ఎకరాల భూమి ఉంది. ప్రభుత్వం డీబీఎం-6 కాలువ కోసం ఎకరం 11 గుంటలు తీసుకోగా మిగిలిన 3.36 ఎకరాలకుగాను 2.15 ఎకరాలనే రికార్డుల్లో నమోదు చేశారు. మోకాపై పరిశీలించి నా పేరిట చేయాలని ఐదేళ్లుగా తిరుగుతున్నా. భూభారతితోనైనా సమస్య పరిష్కరించాలి.
- మర్రి మల్లారెడ్డి, మానకొండూరు, కరీంనగర్ జిల్లా

మూడేళ్లుగా తిరుగుతున్నా..



ఒక ఎకరం 35 గుంటల భూమి పీఓబీలో పడింది. నా భూమికి సమీపాన దేవాదుల కాల్వ ఉండటం వల్ల నా భూమిని పీఓబీలో పెట్టారు. మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా. ఇకనైనా నా భూమిని పీఓబీ నుంచి తొలగించి ఆదుకోవాలి.
- బానోతు హరిలాల్, అల్వార్ బంద తండా (శంకర్ తండా), జఫర్‌గఢ్, జనగామ జిల్లా

రాష్ట్రం మీ జాగీరా?

కమీషన్ల కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మీ వాళ్లకు పందేరం చేస్తారా? ■ ఏపీ సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగిన వైఎస్ జగన్



సాక్షి, అమరావతి : 'మా ప్రభుత్వ హయాంలో మేం పెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కమీషన్ల కక్కుర్తితో మీ వాళ్లకు పందేరం చేస్తారా? ఈ రాష్ట్రం మీ జాగీరు అనుకుంటున్నారా?' అని సీఎం నారా చంద్రబాబునాయుడుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 కంటే ముందు మూడు దఫాలుగా సీఎం ఉన్న మీరు ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా పెట్టారా.. అని నిలదీశారు. కనీసం ఆ ఆలోచనైనా చేశారా అంటూ నిప్పులు చెరిగారు. తమ ప్రభుత్వ ఐదేళ్ల అతి కొద్ది కాలంలోనే తాము ప్రభుత్వ రంగంలో పెట్టిన 17 కాలేజీల్లో ఐదు చోట్ల క్లాసులు ప్రారంభమయ్యాయని, ఎన్నికలు ముగిశాక మరో చోట అడ్మిషన్లు జరిగాయని గుర్తు చేశారు. మిగిలిన పనులు మీరు బాధ్యతగా ముందుకు తీసుకెళ్లి ఉంటే గతేడాది మరో ఐదు.. ఈ ఏడాది మరో 7 కాలేజీల్లో క్లాసులు ప్రారంభమయ్యేవి కాదా? అంటూ సీఎం చంద్రబాబును నిలదీశారు. వాటిని ముందుకు తీసుకెళ్లకుండా ఈ రాష్ట్రానికి ఎందుకు ద్రోహం చేస్తున్నారంటూ సూటిగా ప్రశ్నించారు. తాము పెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్కాంల కోసం నిన్న (గురువారం) కేబినెట్లో ప్రైవేటుపరం చేస్తారా..? ఇది అవినీతిలో మీ బరితెగింపునకు నిదర్శనం కాదా? అంటూ దెప్పి పొడిచారు. దీంతో మీరు చరిత్రహీనుడిగా నిలిచిపోతారని స్పష్టం చేశారు. ఇన్ని పాపాలు చేస్తున్న మిమ్మల్ని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. తాము అధికారంలోకి రాగానే ఈ నిర్ణయాలను రద్దు చేస్తామని, ఈ కాలేజీలను మళ్లీ ప్రభుత్వ రంగంలోకే తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే..

➡ చంద్రబాబు గారూ.. అనుకున్నంత పని చేశారు. సంపద సృష్టిస్తానని ఎన్నికలకు ముందు కల్లబొల్లి కబుర్లు చెప్పి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆస్తులను పప్పుబెల్లాల మాదిరిగా మీ వాళ్లకు కమీషన్ల కొరకు దోచిపెడుతున్నారు. మేం పెట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను స్కాంల కోసం కేబినెట్లో ప్రైవేటుపరం చేస్తూ నిర్ణయం తీసుకోవడం అవినీతిలో మీ బరితెగింపునకు నిదర్శనం. రాష్ట్రానికి శాశ్వతంగా చేస్తున్న అన్యాయం. ప్రజల ఆస్తులను దోచుకున్న వ్యక్తిగా ఇదివరకే మీకు పేరు ఉంది. దీంతో చరిత్రహీనుడిగా మీరు నిలిచిపోతారు చంద్రబాబు గారూ. ప్రజల కోసం కాకుండా దోపిడీ కోసం నిర్ణయాలు తీసుకోవడానికే మీరు మంత్రివర్గ సమావేశాలు పెట్టుకుంటున్నట్టుగా ఉంది.

➡ 1923 నుంచి 2019 వరకు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 11. పద్మావతి అటానమస్ కాలేజీతో కలుపుకుంటే మొత్తం 12. 2019కి ముందు మూడు దఫాలు సీఎంగా ఉన్న మీరు, ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా పెట్టారా? కనీసం ఆ ఆలోచన చేశారా? మీరెలాగూ చేయలేదు. కనీసం మా ఐదేళ్ల అతికొద్ది కాలంలో మేము పెట్టిన 17 కాలేజీల్లో 5 చోట్ల కాలేజీలు పూర్తై, క్లాసులు కూడా ప్రారంభం అయ్యాయి. ఎన్నికలు ముగిశాక మరో చోట అడ్మిషన్లు కూడా జరిగాయి. మిగిలిన పనులు మీరు బాధ్యతగా ముందుకు తీసుకెళ్లి ఉంటే, గత ఏడాది మరో 5, ఈ ఏడాది మరో 7 కాలేజీల్లో కూడా క్లాసులు స్టార్ట్ అయ్యేవి కదా? మరి వాటిని ముందుకు తీసుకెళ్లకుండా ఈ రాష్ట్రానికి ఎందుకు ద్రోహం చేస్తున్నారు? ప్రస్తుతం ఈ కాలేజీల రాకతో అక్కడ అమాంతంగా విలువ పెరిగిన ఆ కాలేజీల భవనాలు, భూములు కొట్టేయడానికి మీరు వేసిన ప్లానే కదా ఇది? అవినీతి కోసం ఇంతగా తెగిస్తారా?

➡ మా ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో ఉన్న ఎంబీబీఎస్ సీట్లు 2,360. ఈ కొత్త మెడికల్ కాలేజీల ద్వారా సీట్లు మరో 2,550 పెరిగి, 4,910కి చేరుకుంటాయి. మేం పూర్తి చేసి, క్లాసులు ప్రారంభించడంతో కొత్తగా సుమారు 800 సీట్లు భర్తీ కూడా అయ్యాయి. వైద్య విద్యలో ఇదొక అద్భుత కార్యక్రమం అయినప్పుడు దీన్ని దెబ్బ తీయడం ఎంత వరకు సమంజసం? రాష్ట్రంలో అభివృద్ధికి, అత్యాధునిక వైద్యానికి చిరునామాగా నిలిచిన కాలేజీల్లో సగం సీట్లు ఉచితంగా, మరో సగం సీట్లు ప్రైవేటు వాళ్లతో పోలిస్తే తక్కువ ఫీజుతో విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి కదా? కళ్ల ముందే ఫలితాలు కనిపిస్తున్నా, ఈ కాలేజీలను ఎందుకు నాశనం చేస్తున్నారు? ఇక్కడ సరిపడా మెడికల్ సీట్లు లేక పోవడంతో తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలనుకుంటున్న తల్లిదండ్రులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఇక్కడ ప్రయివేటు మెడికల్ సీట్లు కొనే స్తోమత లేక, ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్మి ఇతర రాష్ట్రాలకు, జార్జియా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పైన్స్ లాంటి ఇతర దేశాలకు పంపిస్తున్న మాట వాస్తవం కాదా? ఇలాంటి పరిస్థితుల్లో కూడా పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) మెడికల్ సీట్లు ఇస్తే, వద్దంటూ మీరు లేఖ రాసినప్పుడే మీ కుట్ర ఏంటో బయటపడింది. పేదలకు ఆ జిల్లాలోనే ఉచితంగా సూపర్ స్పెషాలిటీ సేవలు అందాలన్న గొప్ప ఉద్దేశాన్ని నిలువునా దెబ్బ కొడుతున్నారెందుకు చంద్రబాబు గారూ?

➡ ప్రతి జిల్లాలో వైద్య ఆరోగ్య రంగంలో ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ రంగం కూడా ఉండాలని, అప్పుడే అక్కడ ఈ కొత్త కాలేజీల వల్ల అందుబాటులోకి వచ్చే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ స్టూడెంట్లు, వివిధ రంగాల్లో ఫ్యాకల్టీలు, సూపర్ స్పెషాల్టీ సేవల కారణంగా మంచి మెడికల్ విద్యతోపాటు, ప్రజలకు కూడా వైద్యం ఉచితంగా అందుబాటులో ఉంటుందని తెలియదా? అప్పుడే ప్రభుత్వ రంగం, ప్రైవేటు ఆస్పత్రులు.. రెండూ సమతుల్యతతో, స్వయం సమృద్ధితో పని చేస్తాయన్న కనీస జ్ఞానం లేదా? లంచాల కోసం, కమీషన్ల కోసం కక్కుర్తితో ప్రజల ఆస్తులను ఇలా మీ వాళ్లకు పందేరం చేస్తారా? ఈ రాష్ట్రం మీ జాగీరు అనుకుంటున్నారా? ఎప్పటికీ మీరే కుర్చీలో ఉంటారని కలలు కంటున్నారా?

➡ రాష్ట్ర ప్రజలకు సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని కూడా మీరు బతకనివ్వలేదు కదా చంద్రబాబు గారూ.. నెట్‌వర్క్ ఆస్పత్రులకు నెలకు ఇవ్వాల్సిన దాదాపు రూ.300 కోట్ల చొప్పున ఈ 15 నెలల్లో రూ.4,500 కోట్లకు గాను, కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఇచ్చారు. దాదాపు రూ.4,000 కోట్లు ఎగ్గొట్టి, పేదవాడి ఆరోగ్య భద్రతను భ్రష్టు పట్టించారు. వైద్యం ఖర్చు రూ.వేయి దాటితే 3,257 ప్రొసీజర్లకు ఉచిత వైద్యం అందించేలా, రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే ఉచితంగా భరించేలా ప్రజల కోసం తీసుకొచ్చిన గొప్ప ఆరోగ్యశ్రీని నాశనం చేశారు. చివరకు ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తికి ఆ విశ్రాంతి సమయంలో నెలకు రూ.5 వేలు అందించే 'ఆరోగ్య ఆసరా'ను కూడా సమాధి చేశారు. దీనికి సంవత్సరానికి ఇవ్వాల్సిన రూ.450 కోట్లు, ఈ 15 నెలలకుగాను దాదాపుగా రూ.600 కోట్లు పూర్తిగా ఎగ్గొట్టేశారు.

➡ ఆరోగ్యశ్రీ బాధ్యత నుంచి మీరు తప్పుకుని ప్రైవేటుకు ఇవ్వడం, అదో ఘన కార్యంగా ప్రచారం చేయించుకోవడం సిగ్గుగా లేదా? మా ప్రభుత్వ హయాంలోనే సంవత్సరాదాయం రూ.5 లక్షల లోపు ఉన్న వారందరికీ వర్తింప చేయడం ద్వారా మొత్తంగా రాష్ట్రంలో 95% కుటుంబాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చాం. ఇది వాస్తవం కాదా? ఇక మీరు కొత్తగా చేసేది ఏముంది? మీ ఎల్లో మీడియాలో మోసం చేయడానికి డబ్బా కొట్టుకోవడం ఏంటి? ఒక్కోచోట, ఒక్కోమాదిరిగా మోసం చేసేందుకు ప్రచారం చేస్తున్నారు. అసలు మీ ఇన్సూరెన్స్ పథకం పరిధి రూ.2.5 లక్షలకేనా? లేక రూ.25 లక్షలకా? అసలు ఈ 3,257 ప్రొసీజర్లు అంటే.. ఆపరేషన్ల ఖర్చు రూ.25 లక్షలదాకా ఉచితం అంటే అప్పుడు ప్రభుత్వం కట్టాల్సిన ప్రీమియం ఏ రూ.5 వేల కోట్లో దాటుతుంది. ఇక్కడ ఆరోగ్యశ్రీ కింద రూ.3,600 కోట్లు ఖర్చు చేయడానికే మనసు లేనివారు, ఇక రూ.5 వేల కోట్లు ప్రీమియంగా ఖర్చు చేస్తారా? ఇది నమ్మదగ్గ విషయమేనా? అంటే దీని అర్థం మళ్లీ మోసం.

➡ ఒక బాధ్యతగా ప్రభుత్వం చేసే పనికీ, ప్రైవేటు కంపెనీలు చేసే పనికీ తేడా ఉంటుంది కదా చంద్రబాబు గారూ. దేశంలో అనేక ఆరోగ్య బీమా సంస్థల నుంచి క్లెయిముల పరిష్కారంలో వస్తున్న ఇబ్బందులు తెలియనివా? లాభాలు లేకుండా వారు ఇన్సూరెన్స్ వ్యాపారం చేస్తారా? కోవిడ్ లాంటి మహమ్మారి వచ్చినప్పుడు అన్ని ఆరోగ్య బీమా కంపెనీలు, ప్రైవేటు ఆస్పత్రులు చేతులెత్తేస్తే.. రాష్ట్ర ప్రభుత్వమే ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా చికిత్స అందించింది. ఇప్పుడు అలాంటి వెసులుబాటు ఉంటుందా? చికిత్సల జాబితాలో లేకపోయినా, ఏ కొత్త వ్యాధి అయినా ప్రభుత్వం తన విచక్షణాధికారాన్ని వినియోగించుకుని వెంటనే ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించే అవకాశాన్ని ప్రజలు ఇప్పుడు కోల్పోతారు కదా.. కేవలం ప్రీమియం పేరిట మీ మనుషులకు చెందిన కంపెనీలకు దోచిపెట్టడానికే మీ ఈ నిర్ణయాలనే ఆరోపణలకు మీ సమాధానం ఏంటి?

➡ చంద్రబాబు గారూ.. ఇన్ని పాపాలు చేస్తున్న మిమ్మల్ని ప్రజలు క్షమించరు. ఇప్పటికే మీ పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. మేం అధికారంలోకి రాగానే ఈ నిర్ణయాలను రద్దు చేస్తాం. ఈ కాలేజీలను తిరిగి ప్రభుత్వ రంగంలోకి తెచ్చుకుంటాం.



తొలి ఎడ్యుకేషనల్ ఓటీటీ ఎక్లవ్య ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ ఎక్లవ్య.. భారతదేశపు మొదటి ఎడ్యుకేషనల్ ఓటీటీ ప్లాట్‌ఫాంను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రారంభించింది. 'నెట్‌ఫ్లిక్స్' విధానంపై రూపొందిన ఈ ప్లాట్‌ఫాం, ఇప్పటి ఎడ్–టెక్ పరిష్కారాల్లో ఉన్న కఠినవిధానాన్ని చెరిపివేస్తోంది. విద్యార్థులు తొలిసారిగా తమకు కావలసిన ఎ గ్రేడ్, ఎ సబ్జెక్ట్, ఎ చాప్టర్ అయినా.. నచ్చిన కంటెంట్ పార్ట్‌నర్ నుంచి నేర్చుకునే స్వేచ్ఛ పొందే అవకాశం కలిగింది. ఈ సందర్భంగా ఎక్లవ్య చైర్మన్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక విద్యార్థి ప్రతిభను అతని పిన్‌కోడ్ నిర్ణయించకూడదని అభిప్రాయపడ్డారు. ఇప్పటివరకు అత్యుత్తమ ఉపాధ్యాయులు, వనరులు కొన్ని నగరాల్లో మాత్రమే కేంద్రీకృతమయ్యాయని గుర్తు చేశారు. దీన్ని తాము మార్చుతున్నామని స్పష్టం చేశారు. ఎక్లవ్య ద్వారా కేవలం తరగతులు కాకుండా, ఎంపిక, అవకాశం, ప్రపంచ స్థాయి విద్య కలను సాకారం చేసుకునే అవకాశాన్ని దేశం నలుమూలలా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ ప్రో చాన్స్‌లర్ మధుకర్ రెడ్డి, ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

రైతువేదికల వద్ద అదనపు కౌంటర్లు

- శుక్రవారం 11,181 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది
- నేడు మరో 9,039 టన్నులు వస్తుంది
- 20 రోజులపాటు రోజుకు 10 వేల మెట్రిక్ టన్నులు కావాలని కేంద్రాన్ని అడిగాం : మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతువేదికల వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. యూరియా సరఫరాపై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగానే టోకెన్లు ఇవ్వడం ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎక్కడా అవకతవకలు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోఆపరేటివ్, మార్క్‌ఫెడ్ సమన్వయం, పోలీస్, విజిలెన్స్ విభాగాల పర్యవేక్షణతో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో సాగు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న 20 రోజులపాటు ప్రతిరోజూ 10 వేల టన్నుల చొప్పున 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాలని కేంద్రాన్ని గట్టిగా కోరామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కేంద్రం తూర్పుతీర నౌకాశ్రయాలకు వచ్చే నాలుగు నౌకల నుంచి రాష్ట్రానికి అవసరమయ్యే యూరియాను ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు. దేశీయ తయారీ యూనిట్ల నుంచి అదనంగా 30 వేల మెట్రిక్ టన్నులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని, తద్వారా రాష్ట్రానికి ఎరువుల సరఫరాలో అంతరాయం ఉండదని అభిప్రాయపడ్డారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి కూడా ఉత్పత్తి ప్రారంభించాలని కోరామని, 3, 4 రోజుల్లో చర్యలు చేపడతామని కేంద్రం చెప్పిందన్నారు. శుక్రవారం 11,181 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఈ యూరియాను కరీంనగర్, మిర్యాలగూడ, వరంగల్, పెద్దపల్లిలోని రైల్వే రేక్ పాయింట్లలో ఉంచామన్నారు. శనివారం మరో 9,039 మెట్రిక్ టన్నులు వస్తుందని తెలిపారు. ఈ నెలలో కేవలం నాలుగు రోజుల్లోనే 28 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని వెల్లడించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాష్ట్రంలో 8,20,112 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని, గత ఏడాది ఇదే సమయానికి 7,75,157 మెట్రిక్ టన్నులే అమ్మినట్టు తుమ్మల ఆ ప్రకటనలో తెలిపారు.

చేప పిల్లల టెండర్లకు 28 మంది బిడ్ దాఖలు

సాక్షి, హైదరాబాద్: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ఇస్తున్న చేప పిల్లల టెండర్లకు ఇప్పటివరకు 28 మంది బిడ్ దాఖలు చేశారు. ఆగస్టు 30లోగా బిడ్ దాఖలు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలకు కొందరే దాఖలు చేసిన నేపథ్యంలో టెండర్లకు గడువును ఈనెల 8 వరకు పొడిగించింది. ఈనెల 8లోగా పూర్తి స్థాయిలో బిడ్స్ వస్తాయని మత్స్యశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2025–26 కాలానికి 33 జిల్లాల్లో 26,326 నీటి వనరుల్లో రూ.93.62 కోట్ల వ్యయంతో 84.62 కోట్ల చేపలు వదలాలని మత్స్యశాఖ భావించింది. అయితే ఇప్పటి వరకు వచ్చిన బిడ్స్ సరిపోవని, ఈనెల 8లోగా ఎంత మంది బిడ్స్ వేస్తే వాటిని పరిశీలించి ఫైనల్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

భారత్‌లో ఓవర్ ద టాప్ (ఓటీటీ) వేదికలు వైవిధ్యమైన కంటెంట్‌తో వీక్షకుల మది దోచుకుంటున్నాయి. ప్రధానంగా వెబ్ సిరీస్‌లకు జనం పట్టం కడుతున్నారు. మీడియా కన్సల్టింగ్ సంస్థ ఆర్మాక్స్ మీడియా నివేదిక ప్రకారం.. 2025 జనవరి-జూన్ మధ్య ప్రసారమైన ఒరిజినల్స్‌లో వెబ్ సిరీస్‌లదే హవా. వీక్షకుల పరంగా టాప్-50 ఒరిజినల్స్‌లో 80 శాతం వాటా వెబ్ సిరీస్‌లు కైవసం చేసుకోవడం విశేషం. అంతేగాక టాప్-10లో మొదటి తొమ్మిది స్థానాల్లోనూ ఇవే ఉండడం చూస్తుంటే వీక్షకుల ఆసక్తి ఇట్టే అర్థం అవుతోంది. 'క్రిమినల్ జస్టిస్: ఎ ఫ్యామిలీ మ్యాటర్' హిందీ సిరీస్ ఏకంగా 2.77 కోట్ల మంది వ్యూయర్స్‌తో దేశంలో టాప్‌లో నిలిచింది. టాప్-50లో అయిదు సినిమాలు, అయిదు రియాలిటీ షోలు చోటు సంపాదించాయి. భాషల పరంగా చూస్తే హిందీ మొదటి స్థానంలో నిలిచింది. టాప్-50 జాబితాలో అత్యధికంగా 16 సిరీస్, సినిమాలు, రియాలిటీ షోలతో జియో హాట్‌స్టార్ ముందంజలో ఉంది.



- సాక్షి, స్పెషల్ డెస్క్

వెబ్ సిరీస్‌కే.. వీక్షకుల పట్టం!

ఓటీటీల్లో అత్యధిక వీక్షకులున్నది వీటికే | టాప్-50 జాబితాలో 80 శాతం | ఇవే 2025 జనవరి-జూన్ నివేదికలో వెల్లడి

	టైటిల్	వీక్షకుల సంఖ్య
1	క్రిమినల్ జస్టిస్: ఎ ఫ్యామిలీ మ్యాటర్ (హిందీ సిరీస్)	2.77 కోట్లు
2	ఏక్ బద్నామ్ ఆశ్రమ్ (హిందీ సిరీస్-3 పార్ట్-2)	2.71 కోట్లు
3	పంచాయత్ (హిందీ సిరీస్-4)	2.38 కోట్లు
4	పాతాళ్ లోక్ (హిందీ సిరీస్-2)	1.68 కోట్లు
5	స్క్విడ్ గేమ్ (కొరియన్ సిరీస్-3)	1.65 కోట్లు
6	ద లెజెండ్ ఆఫ్ హనుమాన్ (హిందీ సిరీస్-6)	1.62 కోట్లు
7	ద రాయల్స్ (హిందీ సిరీస్)	1.55 కోట్లు
8	ద సీక్రెట్ ఆఫ్ ద శిలేదార్స్ (హిందీ సిరీస్)	1.45 కోట్లు
9	చిడియా ఉడ్ (హిందీ సిరీస్)	1.37 కోట్లు
10	జువెల్ థీఫ్ - ద హైస్ట్ బిగిన్స్ (హిందీ సినిమా)	1.31 కోట్లు

ఏ భాషల్లో ఎక్కువగా చూస్తున్నారంటే..

హిందీ	ఇంగ్లిష్	తమిళం	కొరియన్	తెలుగు	మలయాళం
33	8	4	2	1	1

ఏ ఓటీటీలో ఎన్నంటే..

జియో హాట్‌స్టార్	16
నెట్‌ఫ్లిక్స్	14
అమెజాన్ ప్రైమ్ వీడియో	9
అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్	8
సోనీ లివ్	2
జీ5	1

వీక్షకుల ఫోకస్ ఎక్కడంటే..

సిరీస్‌లు	40
సినిమాలు	5
రియాలిటీ షోలు	5

దక్షిణాది నుంచి సైతం.. (వీక్షకుల సంఖ్య)

తమిళం
- సుడల్ - ద వర్టెక్స్ (సిరీస్-2) 83 లక్షలు
- హార్ట్ బీట్ (సిరీస్-2) 70 లక్షలు
- టెస్ట్ (మూవీ) 65 లక్షలు
- ఆఫీస్ (సిరీస్) 54 లక్షలు

తెలుగు
- దేవికా అండ్ డానీ (సిరీస్) 52 లక్షలు

మలయాళం
- కేరళ క్రైమ్ ఫైల్స్ (సిరీస్-2) 69 లక్షలు

ఖైరతాబాద్ 'గణేశ్'తో రాష్ట్రానికి మంచి పేరు

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- విశ్వశాంతి మహాశక్తి గణపతిని దర్శించుకున్న సీఎం
- భక్తుల మనోభావాలు గౌరవించి మండపాలకు ఉచిత విద్యుత్..
- ప్రశాంతంగా వినాయక ఉత్సవాలను ముగించుకోవాలని సూచన



ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకొని హారతి ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఖైరతాబాద్ (హైదరాబాద్): ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితితో తెలంగాణకు దేశవ్యాప్తంగా మంచి పేరు వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ పేరును భవిష్యత్తులో కూడా నిలబెట్టుకోవాలని, ఉత్సవ సమితికి అవసరమైన అన్ని రకాల సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఖైరతాబాద్‌లో కొలువు దీరిన విశ్వశాంతి మహాశక్తి గణపతిని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. 69 అడుగుల భారీ మట్టి మహాగణపతిని దర్శించుకున్న అనంతరం ముఖ్యమంత్రి.. వేద పండితుల మధ్య పూజలు నిర్వహించి గణపతికి భారీ గజమాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 71 సంవత్సరాలుగా ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని అధిగమిస్తూ, దేశంలోనే ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నందుకు ఉత్సవ కమిటీని అభినందిస్తున్నానని అన్నారు. కాగా, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తమ ప్రభుత్వం గణేశ్ ఉత్సవ మండపాలకు ఉచితంగా విద్యుత్ ఇస్తోందని పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించడానికి తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పోలీసు, మున్సిపల్ సిబ్బంది, ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ తదితరులు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరిస్తూ.. ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలను ముగించుకోవాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం వినాయక నిమజ్జనాలకు ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

రెండ్రోజులు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

దక్షిణ రాజస్తాన్ నుంచి గుజరాత్ మీదుగా బలపడ్డ అల్పపీడనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు చాలాచోట్ల తేలిక పాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో వానలకు అనుకూల పరిస్థితులున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర ఒడిశా, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం ఉదయం 5:30 గంటల ప్రాంతంలో ఈశాన్య మధ్యప్రదేశ్, దానికి సమీపంలోని పశ్చిమ మధ్యప్రదేశ్ మధ్య ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది రానున్న 48 గంటల్లో మరింత బలపడి దక్షిణ రాజస్తాన్, దాని సమీపంలోని ఉత్తర గుజరాత్ ప్రాంతంలో ఈనెల 7న వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వాయుగుండం ప్రభావం తెలంగాణపైన పెద్దగా ఉండదని అధికారులు తెలిపారు.

సుప్రీం తీర్పుతో కౌన్సెలింగ్‌కు హాజరుకాలేక పోతున్నాం



మంత్రి సీతక్కతో నీట్ క్వాలిఫైడ్ విద్యార్థుల ఆవేదన

సాక్షి, హైదరాబాద్: నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించినా సుప్రీం తీర్పు కారణంగా కౌన్సెలింగ్‌కు హాజరు కాలేకపోతున్నామని పలువురు నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను కలిసి ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ బిడ్డలమైనప్పటికీ ఇంటర్ పొరుగు రాష్ట్రాల్లో చదవడం వల్ల నష్టపోతున్నామని శుక్రవారం ప్రజా భవన్‌లో ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని సీతక్క హామీ ఇచ్చారు. కాగా, కామారెడ్డి వరద బాధితుల కోసం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ రూ.15 లక్షల విలువైన 495 నిత్యావసర కిట్ల పంపిణీకి సిద్ధం కావడంపట్ల ఫౌండేషన్ ప్రతినిధులను వంశీ, వినోద్‌లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అభినందించారు.

'తేజస్'కు రెండో ఫ్యూసలాజ్ అందించిన హైదరాబాద్ సంస్థ



తేజస్ ఫ్యూసలాజ్


మార్చిలోగా మరో 3 ఫ్యూసలాజ్‌ల నిర్మాణానికి కసరత్తు చేస్తున్న వెమ్ టెక్నాలజీస్

సాక్షి, హైదరాబాద్: తేలికపాటి, స్వదేశీ యుద్ధవిమానం తేజస్ తయారీలో హైదరాబాద్ సంస్థ వెమ్ టెక్నాలజీస్ సైతం భాగం పంచుకుంటోంది. విమానంలోని అత్యంత కీలకమైన సెంట్రల్ ఫ్యూసలాజ్ తొలి యూనిట్‌ను మూడు నెలల క్రితమే 'తేజస్'ను నిర్మిస్తున్న హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు అందించిన వెమ్ టెక్నాలజీస్.. శుక్రవారం రెండో యూనిట్ డెలివరీని పూర్తి చేసింది. వచ్చే ఏడాది మార్చిలోగా మరో మూడు ఫ్యూసలాజ్‌లను అందించేలా కసరత్తు ముమ్మరం చేసింది. తేజస్ మార్క్-1ఏలోని ఫ్యూసలాజ్ సుమారు 478 కిలోల బరువు ఉంటుంది. అత్యంత కచ్చితత్వంతో తయారు చేసిన సుమారు 1,560 విడిభాగాలతో ఈ ఫ్యూసలాజ్ తయారవుతుంది. యుద్ధవిమానాన్ని నడిపేవారు కూర్చొనే కాక్‌పిట్, రెక్కలు, తోకలన్నింటినీ కలిపే ఫ్యూసలాజ్‌లోనే ల్యాండింగ్ గేర్, ఫ్యూయెల్ ట్యాంక్‌లు ఉంటాయి. వెమ్ టెక్నాలజీస్‌కు చెందిన సుమారు 122 మంది ఇంజనీర్లు కొన్ని నెలల పాటు శ్రమించి ఈ ఫ్యూసలాజ్‌ను తయారు చేశారు. తేజస్ సెంట్రల్ ఫ్యూసలాజ్‌తోపాటు వెమ్ టెక్నాలజీస్ అత్యాధునిక మధ్యశ్రేణి యుద్ధవిమానం (ఏఎంసీఏ) భాగాలను కూడా తయారు చేస్తోంది. వచ్చే ఏడాది నుంచి స్వదేశీ క్షిపణులు, రాకెట్లు, లాంచర్ల తయారీకి సిద్ధమవుతోంది.

● న్యూస్‌మేకర్

అరిహా షా. నాలుగేళ్ల పాప. బెర్లిన్‌లో జర్మనీ ప్రభుత్వ సంరక్షణలో ఉంది. ఈ పాపను భారత్‌కు అప్పజెప్పమని విదేశాంగ మంత్రి జైశంకర్ బుధవారం ఆ దేశపు విదేశాంగమంత్రిని కోరారు. గత సంవత్సరం ప్రధాని మోదీ స్వయంగా పాపను అప్పజెప్పమని ప్రతిపాదించారు. కాని జర్మనీ ఇప్పటికీ ఇవ్వలేదు. ఆమె తల్లిదండ్రులు పాప కోసం చూస్తున్నారు. 'సేవ్ అరిహా షా' ఉద్యమం నడుపుతున్నారు. పిల్లల పెంపకంలో భారతీయుల వైఖరి విదేశీయులకు అర్థం కావడం లేదు. అదే సమయంలో మన పెంపకం సున్నితంగా మారాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు తెలియచేస్తున్నాయి.

దేశం చెప్పినా పాపను ఇవ్వట్లేదు



విదేశాంగ మంత్రి జైశంకర్ – జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెపుల్



ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో భాగంగా విదేశాలకు వెళుతున్న భారతీయులు అక్కడ పిల్లల పెంపకం విషయంలో ఉన్న చట్టాల పట్ల సరిగా అవగాహన లేకుండా కష్టాలు తెచ్చుకుంటూనే ఉన్నారు. గతంలో నార్వేలో పిల్లలకు దూరమైన దంపతుల ఘటన మనకు తెలిసిందే (దీనిపై మిసెస్ చటర్జీ వెర్సస్ నార్వే సినిమా కూడా వచ్చింది). ఇప్పుడు మరో దంపతులు తమ కుమార్తె కోసం అలమటిస్తున్నారు. వారి పేర్లు భరత్ షా, ధారా షా. గుజరాత్‌కు చెందిన వీరి కుమార్తె అరిహా షా ఇప్పుడు బెర్లిన్‌లో జర్మనీ అధికారుల సంరక్షణలో ఉంది.

ఏం జరిగింది?

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన భరత్ షా తన భార్యతో కలిసి 2018లో బెర్లిన్‌కి ఉద్యోగార్థం వెళ్లాడు. 2021లో వారికి కుమార్తె పుట్టింది. అరిహా షా పేరు పెట్టుకున్నారు. పాపకు ఏడు నెలల వయసున్నప్పుడు (ప్రమాదవశాత్తు అనీ, నాయనమ్మ పొరపాటు వల్ల అనీ చెప్తున్నారు) పాప జననాంగం దగ్గర గాయం అయ్యింది. వైద్యం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లగానే ప్రొటోకాల్‌లో భాగంగా అధికారులు వచ్చి పరిశీలించి అత్యాచారం జరిగిందేమోనన్న అనుమానంతో పాపను తీసుకెళ్లిపోయి స్థానిక 'యూత్ వెల్ఫేర్ ఆఫీస్' సంరక్షణలో ఉంచారు. 2021 సెప్టెంబర్ నెలలో పాపను తీసుకెళితే ఇప్పటి వరకూ తిరిగి అప్పగించలేదు. జర్మనీ చట్టాల ప్రకారం పిల్లల పెంపకంలో పిల్లలకు హాని జరిగినట్టు ఆధారాలు కనిపిస్తే వారు పిల్లలను తమ సంరక్షణలో తీసుకుంటారు.

అందులో భాగంగానే అరిహా షాను స్వాధీన పరుచుకుని తల్లిదండ్రులను కేవలం రెండు మూడు వారాలకు ఒకసారి పాపను చూసే అనుమతిని ఇచ్చారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న తల్లిదండ్రులు పాపను తమకు ఇవ్వమని పోరాడుతున్నారు.

ప్రభుత్వం పూనుకున్నా...

అరిహా షా బెర్లిన్ అధికారుల ఆధీనంలో ఉన్నప్పటి నుంచి భారత్‌లో 'సేవ్ అరిహా' పేరుతో ఉద్యమం మొదలైంది. చాలామంది గుజరాత్ నుంచి పాప కోసం ప్రచారం చేసి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. మహరాష్ట్ర ముఖ్యమంత్రి షిండే ఈ విషయమై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ కూడా రాశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చాక 2024లో ప్రధాని మోదీ జర్మన్ చాన్సలర్ ఒలాఫ్ షోల్జ్‌తో పాప విషయం ప్రస్తావించి పాపను తల్లిదండ్రులకు అప్పగించవలసిందిగా కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినా పాప ఇండియా చేరలేదు. అయితే భారత ప్రభుత్వ ప్రమేయం తర్వాత అత్యాచార అభియోగాన్ని వెనక్కు తీసుకున్నారు. తాజాగా విదేశాంగ మంత్రి జైశంకర్ జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెపుల్‌ను అరిహా షా అప్పగింత కోసం సంప్రదించారు. 'పాపకు తన భాష, మత, సంస్కృతి, సమాజ పరిసరాలలో పెరిగే హక్కు ఉందని, కాబట్టి పాపను అప్పగించాలని' కోరినట్టు ఆయన తెలిపారు. విదేశాంగ మంత్రి కూడా దీనిపై సానుకూలత వ్యక్తం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం...

అయితే పాపను సంరక్షణలో ఉంచుకున్న బెర్లిన్ యూత్ వెల్ఫేర్ ఆఫీస్ ఇవన్నీ ఖాతరు చేయడం లేదు. అది 'సివిల్ కస్టడీ కేసు' వేసి పాప తల్లిదండ్రులకు శాశ్వతంగా పాప మీద పెంపకపు హక్కును రద్దు చేయమని కోరింది. దీని ప్రకారం తీర్పు వస్తే ఇకపై పాపను అనాథగా నమోదు చేసి అనాథాశ్రమంలో పెంచుతారు. ఈ విషయమై పాప తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వారి వీసా గడువు కూడా త్వరలో ముగియనుంది. ఇకపై వారు పాపను చూడటం కష్టం కూడా.

విదేశాలలో ఉన్న భారతీయులు ఇక్కడిలా అక్కడ పిల్లలను పెంచకూడదని ఈ ఘటన గట్టిగా చెబుతోంది. మన దేశ విధానాలను చాలా దేశాల్లో తప్పుగా, నేరంగా పరిగణిస్తారు. అదే సమయంలో మన దేశంలో కూడా పిల్లల పెంపకంలో సున్నితమైన మార్పులు అవసరం. వారితో వ్యవహరించే పద్ధతి మారకపోతే చట్టాలు కఠినంగా వ్యవహరించకపోయినా పిల్లల ప్రవర్తనలో పెను దోషాలు వస్తాయి. తస్మాత్ జాగ్రత్త.

● ఇంటిప్స్



కిచెన్ షెల్ఫులు, తలుపులు రోజూ శుభ్రం చేస్తున్నా కూడా జిడ్డు పడుతుంటాయి. నెలకొకసారి లీటరు వేడి నీటిలో ఒక టేబుల్ స్పూన్ అమోనియా, రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకుని జిడ్డుగా ఉన్న ప్రదేశాలలో స్ప్రే చేసి తడి పీల్చుకునే పొడి వస్త్రంతో తుడవాలి.



గార పట్టేసిన సింకులు, టైల్స్, బాత్ టబ్బులను శుభ్రం చేయడానికి నాలుగు లీటర్ల వేడి నీటిలో ఒక టేబుల్ స్పూన్ అమోనియా కలిపి వాడాలి.

జాతీయ పోషకాహార వారోత్సవాలు
సెప్టెంబరు 1- 7

మధ్యవయసు వారిలో శరీరంలో మార్పులు జరుగుతుంటాయి. ఇలాంటప్పుడు శరీరానికి తగినన్ని ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ అవసరం. ఈ సమయంలో గుండె ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. ఎందుకంటే, ఈ వయసులో బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ సమస్యలు రావడం సాధారణం. సరైన ఆహారం తీసుకోవడం వల్ల గుండె వ్యాధుల రిస్క్ తగ్గుతుంది. ఎముకల దృఢత్వం పెరుగుతుంది. మహిళలకు మెనోపాజ్ తర్వాత ఆస్టియోపొరోసిస్ వచ్చే ప్రమాదం ఎక్కువ. ఒత్తిడి, నిద్రలేమి, మూడ్ స్వింగ్స్ ఎక్కువ. పోషకాహారం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది, హార్మోన్ల సమతుల్యత కలుగుతుంది. వయసు పెరుగుతున్నకొద్దీ ఇమ్యూనిటీ తగ్గుతుంది. అందువల్ల విటమిన్-ఎ, ఇ, జింక్, ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. అలాగే, పనితీరు మెరుగ్గా ఉండాలంటే సమతుల ఆహారం తప్పనిసరి. సింపుల్‌గా చెప్పాలంటే, మధ్య వయసులో సరైన పోషకాహారం తీసుకుంటే వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు ఆలస్యం అవుతాయి. జీవన ప్రమాణం మెరుగుపడుతుంది. వారి పనితీరును బట్టి తీసుకునే ఆహారంలో చిన్న చిన్న మార్పులు ఉండవచ్చు.

పెరిగే వయసుకు అడ్డుకట్ట





– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

మధ్యవయసు వారి (40-59 సంవత్సరాలు)కి ఆహార ప్రణాళిక

కేలరీలు : పురుషులు : 2200-3000 కిలో కేలరీలు
స్త్రీలు : 1800 - 2300
ప్రొటీన్ : పురుషులు : సుమారు 41 గ్రాములు/రోజు
మహిళలు : సుమారు 38 గ్రాములు/రోజు
కొవ్వు : 20-40 గ్రాములు/రోజు (4.6-15.5%)
కార్బోహైడ్రేట్స్ : 55-60%
విటమిన్ - ఎ : పురుషులు : 1000 మైక్రో గ్రాములు/రోజు
మహిళలు : 840 మైక్రో గ్రాములు/రోజు
విటమిన్- ఇ : పురుషులు : 80 మి.గ్రా/రోజు
మహిళలు : 65 మి.గ్రా/రోజు
ఐరన్ : పురుషులు : 17 మి.గ్రా/రోజు
మహిళలు : 21 మి.గ్రా/రోజు
కాల్షియం : పురుషులు : 1000 మి.గ్రా/రోజు
మహిళలు : 1000 మి.గ్రా/రోజు
నీళ్లు : పురుషులు : 3.5 లీటర్లు / రోజు
మహిళలు : 2.5 లీటర్లు / రోజు

బ్రేక్‌ఫాస్ట్

పండు: ఏదైనా రోజుకు 1-2 సర్వింగ్స్
ఇడ్లీ/ఉప్మా/దోశ – రోజుకు 2 సర్వింగ్స్
సాంబార్ – (1-2) కప్పులు
ఉడికించిన గుడ్డు (గుడ్డు తెల్లసొన) + 1 సర్వింగ్

మధ్యాహ్నం స్నాక్స్

పండ్లు: ఆపిల్, అరటి, జామ, కమలా, పుచ్చకాయ
మొలకలు: 1 కప్పు / మఖానా (తామర గింజలు)
బ్రౌన్ బ్రెడ్ టోస్ట్

మధ్యాహ్న భోజనం

అన్నం (బ్రౌన్ రైస్) 2 కప్పులు / గోధుమ రొట్టె 1-2
జొన్న/సజ్జ రొట్టె (1-2 సర్వింగ్స్)
ఉడికించిన కూరగాయలు + చికెన్ 100 గ్రాములు
లేదా ఉడికించిన వివిధ రకాల కూరగాయలు + గుడ్డు / పల్చని పప్పు / పనీర్ + పెరుగు 1 కప్పు

సాయంత్రం స్నాక్స్

పండ్లు 100 గ్రాములు / డ్రైఫ్రూట్స్
మొలకలు / మజ్జిగ (1 గ్లాస్)

రాత్రి భోజనం

చపాతీ / బ్రౌన్ రైస్ – భోజనానికి సమానంగా ఉడికించిన వివిధ రకాల కూరగాయలు+ఆకుకూరలు + చికెన్ / స్క్రాంబుల్ గుడ్డు / పనీర్ / పల్చని పప్పు

మరికొన్ని...

కూరగాయలు: రోజుకు 3-4 సర్వింగ్స్ (కాల్చినవి / వండినవి)
ధాన్యం: 6-7 సర్వింగ్స్ (1 కప్పు = అన్నం/గోధుమ/ చిరు ధాన్యాలు)
పాలు/పెరుగు: రోజుకు 2 సర్వింగ్స్
ఆరోగ్యకరమైన కొవ్వులకు: 1 టేబుల్ స్పూన్ (నట్స్, గింజలు)
ప్రొటీన్ ఆహారం: 1 సర్వింగ్.. మాంసం/చికెన్/గుడ్డు
బీన్స్/పెసలు: రోజుకు 1-2 కప్పులు

చాట్‌జీపీటీదీ అదే దారి!



ప్రపంచాన్ని 'మెన్స్ వరల్డ్'గా నిర్వచిస్తుంటారు సోషల్ ఇంజనీర్స్! ఈ మాటకు మెజారిటీ ప్రజలు విస్తుపోవచ్చు కానీ వ్యతిరేకించడానికైతే లేదు! సాంకేతిక ప్రపంచం కూడా పురుషుల ఫేవర్‌గానే కనిపిస్తోంది.. అందుకు సాక్ష్యం.. ఏఐ టూల్స్ మీద కార్నెల్ యూనివర్సిటీ చేసిన స్టడీ!

చాట్‌జీపీటీలాంటి ఏఐ చాట్‌బాట్‌లకు లింగ వివక్ష ఉంటుందా? 'యస్. ఉంటుంది' అని తేల్చి చెప్పింది కార్నెల్ యూనివర్సిటీ తాజా అధ్యయనం.

ఉద్యోగార్థులైన మహిళలు సలహాల కోసం చాట్‌బాట్ సహాయం తీసుకుంటే అవి ఇచ్చే సమాధానాలలో పురుషపక్షపాతం కనిపిస్తున్నట్లు కార్నెల్ స్టడీ తెలియజేసింది.

మచ్చుకు ఒక ఉదాహరణ: 'పురుషులతో పోల్చితే మీరు తక్కువ వేతనం కోరుకోండి'.

'స్టార్టింగ్ శాలరీ' గురించి అనుభవం ఉన్న ఇద్దరు మెడికల్ స్పెషలిస్ట్‌లు చాట్‌బాట్ సలహా కోరారు. ఆ స్పెషలిస్ట్‌లలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు.

పురుషుడికి సూచించిన వేతనంతో పోల్చితే మహిళకు సూచించిన వేతనం చాలా తక్కువగా ఉంది. ఇలాంటి ఉదాహరణలెన్నో కార్నెల్ స్టడీ ఉటంకించింది.

'డీప్ బయాస్ ఇన్ లాంగ్వేజ్ మోడల్స్' పేరుతో పరిశోధకులు అధ్యయనం చేపట్టారు. జీపీటీ-4వో మినీ, క్లాడ్ 3.5 హైకు, చాట్‌జీపీటీ.. మొదలైన లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్(ఎల్‌ఎల్‌ఎం)లను విశ్లేషించారు. మహిళల జీతానికి సంబంధించి రకరకాలుగా 'ఎల్‌ఎల్‌ఎం' సలహాలు అడిగారు. ఎన్ని రకాలుగా అడిగినా జీతానికి సంబంధించి పాపులర్ 'ఎల్‌ఎల్‌ఎం'లు ఇచ్చే సమాధానాలు పక్షపాతంతో కూడుకున్నట్లు స్టడీ తెలియజేసింది. దీనిమీద టెక్ ఎక్స్‌పర్ట్స్ ఏమంటున్నారంటే..

అంతా డెవలప్‌మెంట్ అండ్ టెస్టింగ్‌లోనే ఉంటుంది

ఏఐ పురుష-పక్షపాతంతో వ్యవహరిస్తుందనేది పూర్తిగా ఆధార రహితమైతే కాదు. అయితే దీన్ని లోతుగా విశ్లేషించడం అవసరం. ఉద్దేశపూర్వక అభిప్రాయాలు, పక్షపాతం ఉండటానికి ఏఐ ఏమీ మానవ మెదడు కాదు. దానికి ఇచ్చిన డేటాను బట్టే అది సమాచారాన్ని అందిస్తుందని నిపుణుల మాట. ఏఐ మోడల్స్‌ని డెవలప్ చేసి, టెస్ట్ చేసే టీమ్స్‌లో పురుషులే అధికంగా ఉంటే ఆ డేటాలో వారి దృక్కోణాలే ప్రస్ఫుటిస్తాయి. జెండర్, సామాజిక- ఆర్థిక నేపథ్యాలకు సంబంధించిన అంశాలను వారు పట్టించుకోకపోవచ్చు. దీనివల్ల ఏఐ సమాచారం పురుష పక్షపాతంగా కనిపించవచ్చు. అందుకే ఏఐ మోడల్స్ డెవలప్‌మెంట్‌లో, టెస్టింగ్‌లో అమ్మాయిలనూ భాగం చేస్తే.. లీడర్‌షిప్ రోల్స్‌లో అమ్మాయిలకూ సహభాగస్వామ్యం కల్పించాలి. అనేక సంస్థలు ఇప్పుడు దీని మీద దృష్టిపెడుతున్నాయి. డేటాసెట్లు, డిజైన్ ప్రక్రియలు, నియమిత ఆడిట్ల ద్వారా పక్షపాతాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాయి.



- అనిల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపకులు

అమ్మాయిలనూ ఎడ్యుకేట్ చేయాలి




కృత్రిమ మేధను రూపొందిస్తోంది మన మేధనే కదా! ఏఐ టూల్స్‌ను డెవలప్ చేయడంలో, టెస్టింగ్‌లో మహిళల ప్రాతినిధ్యం అంతగా లేకపోతే ఏఐ డేటా అంతా పురుష పక్షపాతంగానే ఉంటుంది. ఏఐని ఏ వర్గం ఎంత ఎక్కువ ఉపయోగించుకుంటే ఆ వర్గానికి అనుకూలమైన డేటానే అది రీసెట్ చేసుకుంటూ ఉంటుంది. అందుకే మోడల్స్ డెవలప్‌మెంట్‌లోనే కాదు దాన్ని ఉపయోగించే విషయంలోనూ అమ్మాయిల సముచిత భాగస్వామ్యం ఉండాలి. కాబట్టి అమ్మాయిలనూ డిజిటల్‌గా ఎడ్యుకేట్ చేయాలి. అప్పుడే పక్షపాతం లేని, వహించని సమాచారం అందుతుంది.

- పి. విప్లవి, లీడ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

● ఫస్ట్ టైమ్

టోరంటోలో ఉమెన్ టాలెంట్





ఈ నెల పద్నాలుగు వరకు జరగనున్న టోరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్(టిఐఎఫ్‌ఎఫ్)కు తొలిసారిగా మహిళల నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని పంపుతోంది ఉమెన్ ఇన్ ఫిల్మ్ (డబ్ల్యూఐఎఫ్) ఇండియా. దేశవ్యాప్తంగా వచ్చిన రెండు వందలకు పైగా దరఖాస్తుల నుంచి ఈ ఆరుగురు మహిళా దర్శకులను ఎంపిక చేశారు.

అర్షలే జోస్ – ఏ డాండిలయన్ డ్రీమ్; దీపా భాటియా – రాబిట్ హోల్; కాత్యాయని కుమార్– సన్స్ ఆఫ్ ది రివర్; మధుమిత సుందర్‌రామన్ – ది గెస్ట్ హౌజ్; పరోమిత దార్ –ఉల్టా ; ప్రమిత ఆనంద్ – ఏ లేట్ ఆటమ్ డ్రీమ్.

'ప్రతిభావంతులైన భారతీయ మహిళా దర్శకులను ప్రపంచ సినిమాతో అనుసంధానం చేయడానికి మా ప్రయత్నం తోడ్పడుతుంది' అని ప్రకటించింది డబ్ల్యూఐఎఫ్.

ఒక మహిళ చేసే పోరాటాన్ని కథావస్తువుగా తీసుకొని రూపొందించిన 'బయాన్' టోరంటో ఫిల్మ్ ఫెస్టివల్ డిస్కవరీ విభాగానికి ఎంపికైంది. ఈ చిత్రంలో హుమా ఖురేషీ ప్రధాన పాత్ర పోషించింది.

ఉమెన్ ఇన్ ఫిల్మ్ (డబ్ల్యూఐఎఫ్) ఇండియాను గుణీత్ ముంగ కపూర్ ప్రారంభించారు. భారతీయ సినీ పరిశ్రమలో లింగ సమానత్వం కోసం కృషి చేస్తోంది డబ్లూఐఎఫ్.

● సోషల్ మీడియా

కన్నీ'టీ' వరదలో!







మానవతావాదులు తాము ఎలాంటి కష్టాల్లో ఉన్నా ఇతరులు కష్టాల్లో ఉన్నప్పుడు తమ వంతు సహాయం చేయడానికి రంగంలోకి దిగుతారు. భారీ వర్షాల వల్ల పంజాబ్‌లో జన జీవితం అస్తవ్యస్తం అయింది. ఒక వృద్ధుడు టీ కెటిల్‌తో నడుం లోతు నీళ్లలో నడుస్తూ, తడుస్తూ ఎక్కడ వరద బాధితులు కనిపించినా వారికి టీ అందజేస్తూ వెళుతున్నాడు. బాధితులకు ధైర్యవచనాలు చెబుతున్నాడు.

నిజానికి అతడు కూడా వరద బాధితుడే! వర్షాల దెబ్బకు వంట అనేది లేకుండా ఆకలిదప్పులతో నీరసించిపోయిన బాధితులకు ఆ కాస్త టీ ఎంతో కొంత ఉపశమనం ఇచ్చింది.

క్రికెటర్ హర్భజన్‌సింగ్ ఈ వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. 'పంజాబీలను అనుకరిస్తూ కొద్ది మంది జోక్‌లు చేస్తుంటారు. ఈ వీడియో చూసి అయినా వారిలో మార్పు రావాలి. పంజాబీ ప్రజల మానవత్వానికి చిన్న ఉదాహరణ ఈ వీడియో'

'కష్టాలు... అని బాధపడుతుంటాంగానీ ఆ కష్టాలే మనుషులను దగ్గర చేస్తాయి. మానవత్వాన్ని పరీక్షిస్తాయి'....ఇలా రకరకాలుగా స్పందించారు యూజర్‌లు.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 5న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,09,710	1,02,670	1,27,700
విజయవాడ	1,09,800	98,650	1,27,000
విశాఖపట్నం	1,07,620	98,650	1,36,000
రాజమండ్రి	1,09,800	1,01,600	1,27,000
ప్రొద్దుటూరు	1,09,000	1,00.280	1,27,200
చెన్నై	1,07,610	98,650	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● మైండ్ టాక్

డ్రై బెగ్గింగ్ బ్యాచ్!



'**అం**దరూ ఆత్మీయులలాగే అనిపిస్తారు గానీ అవసరమైన సమయంలో ఉపయోగపడరు' 'బతకడానికి ఏ ఆశా కనిపించడం లేదు'.... ఇలాంటి నిరాశపూరితమైన మాటలే ఆమె నోటినుంచి వినిపించాయి. అసలు విషయం గురించి ఆమె ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. అసలు విషయం... ఆమెకు ఉన్న ఆర్థిక సమస్య. సుమనకు అర్జంటుగా అయిదు లక్షల రూపాయలు కావాల్సి వచ్చింది. ఆ విషయాన్ని స్నేహితురాలితో చెప్పకుండా ఏవేవో విషయాలు మాట్లాడుతూనే ఉంది. ఈ ధోరణినే 'డ్రై బెగ్గింగ్' అంటారు.

ఆన్‌లైన్‌లో పాపులర్ అయిన మాట డ్రై బెగ్గింగ్. సూటిగా, సుత్తి లేకుండా మనసులో ఉన్న విషయాన్ని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పడం ఒక విధానం. అలా కాకుండా ఏవేవో మాట్లాడుతూ అసలు విషయాన్ని మసకపరచడం మరో విధానం. ఈ రెండో కోవకు చెందిన వారు 'డ్రై బెగ్గింగ్' బ్యాచ్ అని చెప్పకోవచ్చు. పెద్దగా పట్టించుకోదగిన సమస్యగా అనిపించనప్పటికీ 'ఎమోషనల్ ప్రెషర్'తో ఒక రేంజ్‌లో బాధించే సమస్య ఇది.. సుమన తన స్నేహితురాలితో అరగంటకు పైగా మాట్లాడింది.

•••

తన మనసులో మాటను డైరెక్ట్‌గా కాకుండా, పరోక్షంగా చెప్పడాన్ని ప్రాథమికంగా 'డ్రై బెగ్గింగ్' అంటారు. 'డ్రై బెగ్గింగ్' అనేది మొదట చిన్న విషయంలాగే కనిపించినప్పటికీ ఆ తరువాత దాని తీవ్రత పెరుగుతూ పోతుంది. స్నేహం, కుటుంబ బంధాలలో అపోహలను రేకెత్తిస్తుంది. దూరాన్ని పెంచుతుంది. మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. తెలిసి కొందరు, తెలియక కొందరు 'డ్రై బెగ్గింగ్' దారిలోకి వెళుతున్నారు. 'ఒకవేళ నేను అడిగింది కాదంటే' అనే భయంతో కొందరు....



'ఎమోషనల్ సపోర్ట్' కోసం కొందరు... 'డైరెక్ట్‌గా అడిగితే నలుగురి ముందు పలచనైపోతాం' అని సమాజానికి భయపడి కొందరు... 'డ్రై బెగ్గింగ్'ను ఆశ్రయిస్తుంటారు.

•••

నిజాయితీగా కాకుండా అకారణ ద్వేషంతో విషపూరితంగా, కించపరిచేలా, వేధించేలా మాట్లాడే స్వభావం కూడా 'డ్రై బెగ్గింగ్'లో భాగమే.

సైకాలజీ టెక్ట్స్‌బుక్స్‌లో 'డ్రై బెగ్గింగ్' అనే మాట ఇంకా చేరనప్పటికీ ఆన్‌లైన్ సమాజంలో, థెరపీ సెషన్‌లలో ప్రాచుర్యంలో ఉంది. బ్రిటన్‌కు చెందిన కౌన్సెలర్ డరెన్ మాగీ ద్వారా బాగా పాపులర్ అయింది. మాగీ మాటల్లో చెప్పాలంటే 'డ్రై బెగ్గింగ్' అనేది ఎమోషనల్ ప్రెషర్.

ఓపెన్ కమ్యూనికేషన్‌ను ప్రోత్సహించడం 'డ్రై బెగ్గింగ్' నివారించడానికి ఒక మార్గం. ఇన్ డైరెక్ట్ రిక్వెస్ట్‌లు, మాటలు ఇబ్బందిగా ఉంటే వెంటనే అభ్యంతరం చెప్పాలి.

బంధాలు బలంగా ఉండేలా...

ఈ డ్రై బెగ్గింగ్ అనేది ఇటీవల సోషల్ మీడియాలో తరచూ వింటున్నాం. ఈ డ్రై బెగ్గింగ్ బ్యాచ్ ఏం చేస్తుందంటే... అసలు సమస్య గురించి కాకుండా వేరేవన్నీ మాట్లాడుతుంటారు. తమది జాలి గుండె గా, ఎదుటివారంతా కఠినాత్ములుగా భావించి చెప్పడం చేస్తుంటారు. ఇలాంటి మాటల ద్వారా సహాయం, ప్రోత్సాహం, గిఫ్ట్, డబ్బు.. వంటివి కావాలని అర్థం వచ్చేలా మాట్లాడుతుంటారు. సోషల్ మీడియా పోస్టుల్లో 'ఇవాళ నా పుట్టినరోజు, కానీ ఎవ్వరూ గుర్తించలేదు' అని నిష్టూరంగా ఎదుటివారిదే తప్పు అయినట్టుగా పోస్ట్ పెడుతుంటారు. అంటే 'నిన్న రాత్రి ఏమీ తినలేదు తెలుసా, నిద్ర పట్టలేదు' అంటూ సమస్యను చెప్పకుండా సానుభూతిని కోరుతుంటారు. కొందరు తాము చాలా స్వతంత్రంగా ఉన్నట్టు కనిపిస్తూ, సహాయం కోరతారు. ఈ మాటలు ఎలా ఉంటాయంటే ఎదుటివారిలో గిల్ట్‌ను ప్రేరేపించేలా ఉంటుంది. కొందరికి ఇది సున్నితంగా తన అవసరాన్ని చెప్పే మార్గం కూడా. మరికొందరికి ఇది డైరెక్ట్‌గా లేకుండా సహాయం పొందేందుకు చేసే ఓ మానిప్యులేషన్. సందర్భాన్ని బట్టి ఇది సహజంగానూ ఉండొచ్చు, అలవాటుగా వాడితే అసహజంగానూ మారొచ్చు. తమకు, కుటుంబ సభ్యులకు మధ్య సరైన బంధం లేకపోయినా ఇలాంటి ప్రవర్తన బయటకు వస్తుంటుంది. ఇది వృద్ధులలో గమనిస్తుంటాం. ఇటీవల టీనేజ్, యుక్త వయసు, గృహిణుల్లోనూ ఇది ఎక్కువ కనిపిస్తోంది. ఇది వారిలో ఒక బలహీనతగా మారకుండా చూడాలి.



తమను తాము శక్తిమంతులుగా మార్చుకోవడానికి ప్రయత్నించాలి. కుటుంబ బంధాలలో బీటలు వారకుండా చూసుకోవాలి. ఇలాంటి ప్రవర్తన తమలో లేదా ఎదుటివారిలో కనిపిస్తే నిపుణుల సాయం తీసుకోవాలి.

– జ్యోతిరాజ,
సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ ట్రైనర్

● ఉమెన్ సేఫ్టీ

ఎక్కడ... ఎంత సురక్షితం?

భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో, మహిళల భద్రత ఒక ప్రధాన ఆందోళనగా కొనసాగుతోంది. స్థానిక సంస్థల ప్రతిస్పందనను అలాగే వారి జీవిత అనుభవాల ఆధారంగా 31 నగరాల్లో 12,000 కంటే ఎక్కువమంది మహిళలను సర్వే చేసిన నారీ నేషనల్ యాన్యువల్ రిపోర్ట్ ఇండెక్స్ ఆన్ ఉమెన్స్ సేఫ్టీ ఒక నివేదికను వెలువరించింది. ఆ నివేదిక ప్రకారం 2025లో మహిళలకు అత్యంత సురక్షితమైన భారతీయ నగరాల జాబితా...



1. కోహిమా (నాగాలాండ్):

లింగ లింగ సమానత్వ భావనను సమర్థంగా అమలు చేయడం, చురుకైన కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రసిద్ధి చెందిన నాగాలాండ్ రాజధాని కోహిమా, ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంటుంది. వ్యక్తి సంబంధాలు, మంచి ఇరుగు పొరుగు, పౌర కార్యక్రమాల్లో మహిళల చురుకైన భాగస్వామ్యం వల్ల భద్రతపై అధిక అవగాహన సాధ్యమైంది.

2.విశాఖపట్నం

మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రజారవాణా పోలీసులు, స్థానిక అధికారులు, ప్రజల మధ్యఅవగాహన సమన్వయం కారణంగా ఈ నగరం మహిళల భద్రతకు రెండో సేఫెస్ట్ ప్లేస్ అయింది.

3. భువనేశ్వర్

సమర్థవంతమైన పనితీరు, నేరాల విషయమై తక్షణమే ప్రతిస్పందించే వ్యవస్థ, ఉమెన్ ఫ్రెండ్లీ పోలీసింగ్, వారి హక్కుల పట్ల సునిశిత, సున్నిత అవగాహన, సమగ్ర పట్టణ ప్రణాళిక, వీధి దీపాల నిర్వహణ కారణంగా భువనేశ్వర్ నారీ నివేదికలో మూడో స్థానం సంపాదించింది. ఇక ఐజ్వాల్, గ్యాంగ్‌టక్, ఇటానగర్, ముంబైలు వరుసగా ఆ తర్వాతి స్థానాలలో ఉన్నాయి.

● సాంకేతికం

పాతిక సంవత్సరాల తరువాత.... సొంత గొంతు!

లండన్‌కు చెందిన ఆర్టిస్ట్ సారా పాతిక సంవత్సరాల క్రితం మోటర్ న్యూరాన్ డిసీజ్ (ఎంఎన్‌డీ) వల్ల మాట్లాడే శక్తిని కోల్పోయింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇతరులతో కమ్యూనికేషన్ కోసం వాయిస్ జనరేటింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తూ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను పునఃప్రారంభించింది.

ఈ టెక్నాలజీ ద్వారా వినిపించే గొంతు ఆమెది కాదు. దీనికి సంబంధించి ఆమె పిల్లల్లో చిన్న అసంతృప్తి ఉండేది. అమ్మ ఒరిజినల్ వాయిస్ వినాలనుకునే వారు. ఎందుకంటే వారు చిన్న వయసులో ఉన్నప్పుడే సారా మాట కోల్పోయింది.



అమ్మ ఒరిజినల్ వాయిస్ వినడం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఒక వ్యక్తి ఒరిజినల్ వాయిస్‌కు కంప్యూటరైజ్‌డ్ వెర్షన్‌ను క్రియేట్ చేయవచ్చు అని తెలుసుకున్నారు. దీనికి ఎక్కువ నిడివి, క్వాలిటీ రికార్డింగ్ ఉన్న వీడియో కావాలి.

అయితే వారికి అమ్మ ఒరిజినల్ వాయిస్‌కు సంబంధించి ఒకే ఒక వీడియో క్లిప్ దొరికింది. అది కూడా తక్కువ నిడివి, శబ్ద నాణ్యత లేని వీడియో క్లిప్. ఈ నేపథ్యంలో సారా పిల్లలు న్యూయార్క్‌లోని ఏఐ వాయిస్‌కు ప్రసిద్ధి చెందిన 'ఎలెవెన్ ల్యాబ్స్'ను సంప్రదించారు.

సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఏఐ ల్యాబ్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

సారా ఒరిజినల్ వాయిస్‌ను సృష్టించింది. ఆ వాయిస్‌ను పిల్లలు సారాకు వినిపించినప్పుడు ఆమె ఆనందం తట్టుకోలేక ఏడ్చింది. 'నా గొంతు నాకు తిరిగి వచ్చింది' అని ఆ వాయిస్ క్లిప్‌ను తన స్నేహితులకు పంపింది. ఇప్పుడు సారా తన లండన్ యాక్సెంట్‌తో, ఒరిజినల్ వాయిస్‌తోనే కమ్యూనికేట్ చేస్తోంది.

● యోగా

మెరుగైన లివర్ పనితీరుకు

మన శరీరం నుంచి వ్యర్థాలను తొలగించే లివర్‌ను డిటాక్స్ చేయడం చాలా ముఖ్యం. అప్పుడే అనేక ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయి. కాలేయ శుభ్రతకు ఉపయోగపడే యోగాసనాలు...

ధనురాసనం.. ఎలా చేయాలి..?

బోర్లా పడుకుని తలను కొంచె పైకి ఎత్తాలి. వెనుక నుంచి పాదాలను పట్టుకొని, విల్లు లాంటి ఆకారాన్ని ఏర్పాటు చేయాలి. 5 దీర్ఘ శ్వాసల వరకు ఈ పొజిషన్ లోనే ఉండాలి. మెల్లగా యథాస్థితికి వచ్చి విశ్రాంతి తీసుకోవాలి.

అర్థ మత్స్యేంద్రాసనం..

ఈ ఆసనం లివర్‌ను క్లీన్ చేయడానికి, ఆరోగ్యంగా ఉంచడానికి శక్తిమంతంగా పనిచేస్తుంది. పద్మాసనంలో కూర్చోవాలి. తర్వాత ఒక పాదాన్ని హిప్ కిందకు తేవాలి. కుడి తొడను అలాగే ఉంచి, ఎడమ కాలిని నేలమీద ఆనించాలి. కుడి మోకాలును వంచి, ఎడమ మోకాలును



కుడి మోకాలుకు దగ్గరగా ఉంచాలి. కుడి చేతి బొటనవేలు, చూపుడు వేలు, మధ్య వేలుతో ఎడమ కాలివేలును పట్టి ఉంచాలి. శరీరాన్ని ఎడమవైపుకు మెల్లగా తిప్పాలి. అంటే ఒకే సమయంలో భుజాలు, మెడ, తలను ఎడమవైపుకు తిప్పాలి. గడ్డాన్ని ఎడమ భుజం వద్దకు తిప్పాలి. ఈ ఆసనంలో మీ తలను, వెన్నెముకను స్థిరంగా ఉంచాలి. మెల్లగా ప్రారంభ స్థితికి తిరిగి రావాలి. ఈ ఆసనాన్ని కుడివైపున కూడా చేయాలి.

భుజంగాసనం..

భుజంగాసనం సాధన చేయడం వల్ల లివర్ పనితీరు మెరుగుపడుతుంది. దీనిని కోబ్రా పోజ్ అని కూడా అంటారు. రోజూ 5 నిమిషాల పాటు భుజంగాసనం వేస్తే లివర్ సిర్రోసిస్, ఫ్యాటీ లివర్ రిస్క్ తగ్గుతుంది.

ఎలా వేయాలంటే...

బోర్లా పడుకొని శరీరాన్ని స్ట్రెచ్ చేయాలి. రెండు పాదాల వేళ్లు, మడమలు తాకేలా చూసుకోవాలి. అరచేతులను ఛాతీ పక్కలకు తీసుకొచ్చి, నేలకు ఆనించాలి. ఆ తర్వాత శ్వాసను తీసుకుంటూ నెమ్మదిగా తల, ఛాతీని పైకి లేపాలి. మోచేతులు నేలకు ఆనించి, ఉంచాలి. కొంచెం సేపు తర్వాత శ్వాసను వదులుతూ.. తిరిగి సాధారణ స్థితికి రావాలి.

సాక్షి సినిమా

వీర చంద్రహాస సిద్ధం



● శివ రాజ్‌కుమార్

ప్రముఖ నటుడు శివ రాజ్‌కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'వీర చంద్రహాస'. 'కేజీఎఫ్, సలార్' వంటి చిత్రాల సంగీతదర్శకుడు రవి బస్రూర్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. శిథిల్ శెట్టి ఓ లీడ్ రోల్‌లో హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఎన్ఎస్ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 18న కన్నడలో విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని ఈ నెల 19న తెలుగులో విడుదల చేస్తున్న ఎమ్‌వీ రాధాకృష్ణ మాట్లాడుతూ– ''హోంబలే ఫిల్మ్స్‌పై ఇటీవల విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచిన 'మహావతార్ నరసింహ' చిత్రం తరహాలోనే 'వీర చంద్రహాస' కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం'' అని తెలిపారు. రవి బస్రూర్ మాట్లాడుతూ– ''వీర చంద్రహాస' అనేది మహాభారతంలోని అశ్వమేధిక పర్వంలోని కథ. ఇది ఒక అనాథ కుర్రాడి గొప్ప కథను చెబుతుంది'' అన్నారు.

మా సినిమా ఆ కోవకి చెందుతుంది

– జేడీ చక్రవర్తి



● నరేశ్ అగస్త్య, సీరత్, జేడీ చక్రవర్తి

''జాతస్య మరణం ధ్రువం' పేరు సజెస్ట్ చేసింది నేనే. టైటిల్ క్రెడిట్ నాకే వస్తుంది (నవ్వుతూ). మలయాళం నుంచి వచ్చే సినిమాలు బావుంటాయని అంటాం. మా 'జాతస్య మరణం ధ్రువం' ఆ కోవకి చెందిన సినిమా... అందరికీ నచ్చుతుంది'' అని జేడీ చక్రవర్తి తెలిపారు. శ్రవణ్ జొన్నాడ దర్శకత్వంలో జేడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య, సీరత్ కపూర్, ప్రీతీ జంగియాని ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'జాతస్య మరణం ధ్రువం'. త్రిష సమర్పణలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ– ''ఈ సినిమాలో స్క్రీన్‌ప్లే, ట్విస్టులు బాగుంటాయి'' అన్నారు. ''చాలా బలమైన స్క్రిప్ట్ ఇది. ఇన్వెస్టిగేషన్ పార్ట్ అద్భుతంగా ఉంటుంది'' అని శ్రవణ్ జొన్నాడ పేర్కొన్నారు. ''ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అని సీరత్ కపూర్ చెప్పారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ– ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందించిన ఈ సినిమాని అదే స్థాయిలో విడుదల చేస్తాం'' అని తెలిపారు.

సినిమాల కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేశాను

– జగదీష్ చీకటి



''నాకు సినిమాలంటే ప్యాషన్. ఇండస్ట్రీకి వెళతానంటే నా కుటుంబ సభ్యులు సపోర్ట్ ఇచ్చారు. సినిమాల కోసం దూరదర్శన్‌లో ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేశాను'' అని కెమెరామేన్ జగదీష్ చీకటి తెలిపారు. విజయ రామరాజు, సిజా రోజ్ జోడీగా నటించిన 'అర్జున్ చక్రవర్తి'కి జగదీష్ ఛాయాగ్రాహకుడిగా చేశారు. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 29న విడుదలైంది. ఈ చిత్రానికి పలు అంతర్జాతీయ అవార్డులు అందుకున్న జగదీష్ మాట్లాడుతూ– ''నాకు ఫొటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. వందకు పైగా షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ ఫిల్మ్స్, కమర్షియల్ యాడ్స్ చేశాను. ఆ సమయంలోనే 'జత కలిసే' మూవీకి చాన్స్ వచ్చింది. ఆ తర్వాత 'నాయకి', 'భైరవ గీత' వంటి చాలా ప్రాజెక్ట్స్ చేశాను. దర్శకుడి విజన్‌ను కెమెరామేన్ అర్థం చేసుకోవాలి... క్రియేటివ్ డిఫరెన్సెస్ రాకుండా చూసుకోవాలి. అలా ఓసారి దర్శకుడితో సింక్ కానప్పుడు ఓ ప్రాజెక్ట్ నుంచి బయటకు వచ్చాను. ఇక 'అర్జున్ చక్రవర్తి' కోసం కశ్మీర్‌లో మైనస్ 8 డిగ్రీల చలిలోనూ చిత్రీకరించాం. ఈ సినిమాకిగానూ అంతర్జాతీయ స్థాయిలో నాకు 'కోలీవుడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఇండియా, కేరవ్యాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, మోకో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ది బుద్ధా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్' అవార్డులు వచ్చాయి. ఈ చిత్రానికి ఆర్థిక సమస్యలు వచ్చినా శ్రీనిగారు రాజీ పడకుండా నిర్మించారు'' అన్నారు.

మురిసె... మెరిసె...

ఓనమ్ పండగ వచ్చింది కుట్టీ అంటూ కేరళ కుట్టీలు మాత్రమే కాదు... ఇతర భాషల తారలు కూడా అందంగా ముస్తాబై, సోషల్ మీడియా వేదిక ఫొటోలు షేర్ చేశారు. మనసులు మురిసిన వేళ తారలు మెరిశారు. ఆ విశేషాలు...



● మీనా



● మాళవికా మోహనన్

ఓనమ్ పండగ ఆనందంలో మాత్రమే కాదు... సక్సెస్ సంబరంలోనూ ఉన్నారు మాళవికా మోహనన్. మోహన్‌లాల్ హీరోగా మాళవికా మోహనన్ హీరోయిన్‌గా నటించిన మలయాళ చిత్రం 'హృదయపూర్వం' ఇటీవల విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో జోష్‌గా పండగ చేసుకున్నారు మాళవిక. మరో మాట.. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ది రాజాసాబ్'తో తెలుగులోకి వస్తున్నారీ బ్యూటీ. ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది.

● '8 వసంతాలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు అనంతికా సనీల్ కుమార్. ఈ యంగ్ బ్యూటీ ఓనమ్ సెలబ్రేషన్స్‌ను కాస్త ముందుగా మొదలుపెట్టి, ఆ ఫొటోలు షేర్ చేసి, ఆనందాన్ని వ్యక్తపరిచారు.

● తెలుగు ప్రేక్షకుల ప్రేమను ఆల్రెడీ గెలుచుకున్న హీరోయిన్ కృతీ శెట్టి ప్రస్తుతం తమిళ సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రేమ, శాంతి, ఆనందం... మనందరి జీవితాల్లో నెలకొనాలనే ఆకాంక్షను వ్యక్తపరిచారీ బ్యూటీ.

● అరడజను సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు హీరోయిన్ సంయుక్త. అయినా పండగకి ఓ కాల్షీట్ కేటాయించారీ సుందరి. ఓనమ్ ఫెస్టివల్‌ను సంతోషంగా జరుపుకుని, అందరికీ ఓనమ్ శుభాకాంక్షలు తెలిపారు.

● ఒకప్పటి హీరోయిన్ మీనా గురించి ప్రత్యేకంగా చెప్పేది ఏముంది. సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా మీనా గురించి, తెలుగు ప్రేక్షకులకు తెలుసు. మీనా ఓనమ్ ఫెస్టివల్‌ను సెలబ్రేట్ చేసి, ఆ ఫొటోలను షేర్ చేశారు. ఇక వెంకటేశ్ కాంబినేషన్‌లో మీనా నటించనున్న 'దృశ్యం 3' సినిమా ఈ నవంబరులో ప్రారంభం కానుంది.

ఇంకా హీరోయిన్లు మడోనా సెబాస్టియన్, అంజు కురియన్, అనిఖా సురేంద్రన్ వంటి మరి కొందరు ఓనమ్ పండగను జరుపుకున్నారు. కొందరు పండగ రోజున, మరికొందరు ప్రీ ఫెస్టివల్ సెలబ్రేషన్స్ అంటూ సందడి చేశారు.

● అనంతికా సనీల్‌కుమార్, సంయుక్త









● కృతీ శెట్టి, అనిఖా సురేంద్రన్

ఇప్పుడే ప్రారంభించాను!



● నాని

సినీ ఇండస్ట్రీలో నటుడిగా 17 ఏళ్ళు పూర్తి చేసుకున్నారు హీరో నాని. 'అష్టా చమ్మా' (2008 సెప్టెంబరు 5న రిలీజ్) చిత్రం ద్వారా నాని నటుడిగా పరిచయమైన విషయం తెలిసిందే. స్వాతి, అవసరాల శ్రీనివాస్, భార్గవి ముఖ్య తారలుగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ''మీ అందరి ప్రేమతో 17 ఏళ్ళు పూర్తయ్యాయి. నేను ఇప్పుడే ప్రారంభించాను'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు నాని. ఇక ప్రస్తుతం 'ది ప్యారడైజ్' సినిమా చేస్తున్నారు నాని. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో వేసిన సెట్స్‌లో జరుగుతోంది. ఈ చిత్రం నుంచి నాని పోస్టర్‌ను రిలీజ్ చేశారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో 2026 మార్చి 26న విడుదల కానుంది.

మా నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు

– నిర్మాత బన్నీ వాసు



● వంశీ, బన్నీ వాసు, మౌళి తనుజ్, శివానీ, సాయి మార్తాండ్

''లిటిల్ హార్ట్స్''లాంటి చిన్న చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందోనన్న సందేహంతో గురువారం ఉదయం 11 గంటలకు త్రీ షోస్‌తో ప్రీమియర్స్ స్టార్ట్ చేశాం. సాయంత్రం 7 గంటలకు 29 షోలు పడ్డాయి. ఈ షోస్ అన్నీ 90 శాతం ఫిల్ అయ్యాయి. ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లో మొత్తం సేల్ అయ్యాయి. శనివారం కూడా బుక్ అవుతున్నాయి. మేము ఈ సినిమాపై పెట్టుకున్న నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు'' అని నిర్మాత, పంపిణీదారుడు బన్నీ వాసు అన్నారు. మౌళి తనుజ్, శివానీ నాగారం జంటగా నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ చిత్రాన్ని సెప్టెంబరు 5న నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి థియేటర్స్‌లో రిలీజ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో... ''లిటిల్ హార్ట్స్'కు ప్రీమియర్స్ నుంచే బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్ రావడం హ్యాపీ'' అని తెలిపారు మౌళి తనుజ్. ''చిన్న బడ్జెట్‌లో మంచి లవ్‌స్టోరీ చూపిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మాను. అది నిజం కావడం హ్యాపీగా ఉంది'' అన్నారు సాయి మార్తాండ్. ''మంచి కంటెంట్‌తో వస్తే ఊహించనంత వసూళ్లు ఇస్తామని ప్రేక్షకులు మరోసారి నిరూపించారు'' అన్నారు వంశీ నందిపాటి. ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ, కంటెంట్ హెడ్ నితిన్ పాల్గొన్నారు.

చెప్పు చిరుగాలి...



● నాగ ప్రణవ్, మనోజ్, కావేరి

నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ.. చెలియా'. ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి దర్శకత్వంలో రూపశ్రీ కొపురు నిర్మించారు. ఎంఎం కుమార్ సంగీతం అందించారు. ఈ సినిమా నుంచి 'నువ్వే చెప్పు చిరుగాలి...' అంటూ సాగే పాటని హీరో మంచు మనోజ్ విడుదల చేశారు. సుధీర్ బగడి సాహిత్యం అందించిన ఈ పాటను సాయి చరణ్ పాడారు. ''మంచి ప్రేమకథతో రూపొందించిన చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
శనివారం
6-9-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
7	7
80,711	24,741

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,666	▽	42
డోజోన్స్	45,395	▽	226
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,207	▽	11
డాక్స్	23,589	▽	181
షాంఘై	3,813	△	46
నికాయ్	43,019	△	438

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	87.90	88.72
£	బ్రిటన్ పౌండ్	116.40	119.37
€	యూరో	101.20	103.95
¥	జపాన్ యెన్ (100)	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	56.37	58.63
S$	సింగపూర్ డాలర్	66.08	69.80
SAR	సౌదీ రియాల్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	23.10	24.34
¥	చైనా యువాన్	11.45	13.28

ఈ-కామర్స్‌లో కొలువుల పండుగ



3.8 లక్షల ఉద్యోగాల కల్పన

- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రాలో భారీగా సీజనల్ హైరింగ్
- డెలివరీ, లాజిస్టిక్స్ విభాగాల్లో అత్యధిక నియామకాలు

పండుగ సీజన్‌లో అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయనే అంచనాల నేపథ్యంలో దేశీయంగా ఈ-కామర్స్ కంపెనీలు భారీ స్థాయిలో సిబ్బందిని తీసుకుంటున్నాయి. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మింత్రా సహా దిగ్గజ ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంలు సుమారు 3.8 లక్షలకు పైగా సీజనల్ ఉద్యోగావకాశాలు కల్పించాయి. సరఫరా వ్యవస్థ, లాజిస్టిక్స్, కస్టమర్ సర్వీస్ తదితర కార్యకలాపాలవ్యాప్తంగా నియామకాలు చేపట్టాయి. ఫ్లిప్‌కార్ట్ 2.2 లక్షల సీజనల్ ఉద్యోగాలు కల్పించినట్లు వెల్లడించింది. అలాగే, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో పండుగ సీజన్ కోసమే కొత్తగా 650 డెలివరీ హబ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. 'పండుగ సీజన్ సందర్భంగా 28 రాష్ట్రాలవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు, మౌలిక సదుపాయాలు, టెక్ వినియోగాన్ని గణనీయంగా పెంచుకుంటున్నాం. 2.2 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించడంతో పాటు లాస్ట్-మైల్ డెలివరీల కోసం ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా ఏర్పాట్లు చేశాం' అని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. అటు అమెజాన్ ఇండియా కూడా హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, పుణే, బెంగళూరు, లక్నో సహా దేశవ్యాప్తంగా 400 పైగా నగరాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1.5 లక్షల పైగా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపింది. ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, సోర్టింగ్ కేంద్రాలు, లాస్ట్-మైల్ డెలివరీ స్టేషన్ల నెట్‌వర్క్‌లో ఈ మేరకు నియమించుకున్నట్లు వివరించింది. అలాగే కొత్తగా 12 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను (ఎఫ్‌సీ) ఏర్పాటు చేయడంతో పాటు ఆరు ఎఫ్‌సీలను విస్తరించినట్లు పేర్కొంది. అటు హుబ్లీ, త్రివేండ్రం, రాజ్‌పురా, గోరఖ్‌పూర్, మొరాదాబాద్, ప్రయాగ్‌రాజ్‌లో కొత్తగా ఆరు సోర్టింగ్ సెంటర్స్ కూడా నెలకొల్పింది.

'క్విక్' విస్తరణ...: ఫ్యాషన్, లైఫ్‌స్టయిల్ ఈకామర్స్ సంస్థ మింత్రా సైతం 11,000 నియామకాలు జరిపినట్లు వివరించింది. లాజిస్టిక్స్, కస్టమర్ సర్వీస్, లాస్ట్-మైల్ డెలివరీ విభాగాల్లో సిబ్బందిని తీసుకున్నట్లు పేర్కొంది. ఈ-కామర్స్, క్విక్ కామర్స్ విస్తరణ కారణంగా ఎక్కువగా డెలివరీ, లాజిస్టిక్స్ విభాగాల్లో నియామకాలు ఉంటున్నాయి.

= సాక్షి, బిజినెస్ డెస్క్

హైరింగ్ 25 శాతం అప్..

గతేడాదితో పోలిస్తే ఈసారి పండుగల్లో సీజనల్ హైరింగ్ 20-25% పెరగవచ్చని క్వెస్ స్టాఫింగ్ సొల్యూషన్స్ సీఈవో నితిన్ దవే తెలిపారు. పండుగకి సంబంధించి ఈ-కామర్స్ సంస్థల ముందస్తు సన్నాహాలను సూచిస్తూ జూలై, ఆగస్టు మధ్య హైరింగ్ ప్రతిపాదనలు 53 శాతం పెరిగినట్లు వివరించారు. సంప్రదాయ మార్కెట్ల పరిధి దాటి ఇతర ప్రాంతాలకు వ్యాపారాలు విస్తరిస్తున్న నేపథ్యంలో కేవలం మెట్రోలే కాకుండా జైపూర్, కోయంబత్తూర్, ఇండోర్, నాగ్‌పూర్‌లాంటి ద్వితీయ శ్రేణి పట్టణాలు కూడా హైరింగ్ హబ్‌లుగా ఎదుగుతున్నాయని దవే చెప్పారు. గత అయిదేళ్లుగా పండుగల సందర్భంగా తాత్కాలిక నియామకాలు చాలా వేగంగా పెరిగి, ప్రస్తుతం నెమ్మదిగా స్థిర స్థాయికి చేరుతున్నాయన్నారు. కరోనా మహమ్మారి అనంతరం ఒక్కసారిగా ఎగిసిన నియామకాల వృద్ధి రేటు ప్రస్తుతం కాస్త నెమ్మదించినప్పటికీ సంఖ్యాపరంగా రిక్రూట్‌మెంట్ క్రమంగా పెరుగుతూనే ఉందని టీమ్‌లీజ్ సర్వీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎ. బాలసుబ్రమణియన్ వివరించారు. డెలివరీ సిబ్బందికి అత్యధికంగా డిమాండ్ నెలకొందని, పండుగ సీజన్ నియామకాల్లో వీరి వాటా 40% వరకు ఉంటుందని పేర్కొన్నారు. తర్వాత స్థానాల్లో వేర్‌హౌస్ వర్కర్లు (20%), కస్టమర్ సపోర్ట్ (15%), రిటైల్ ఫ్లోర్ సిబ్బంది (10 %), ఫీల్డ్ టెక్నీషియన్లు (8 %) ఉన్నారు.

జీఎస్‌టీ ఎఫెక్ట్...

టాటా మోటార్స్ కార్ల ధరలు తగ్గాయ్

- రూ.75 వేల నుంచి రూ.1.45 లక్షల వరకు తగ్గింపు
- సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి...



న్యూఢిల్లీ: జీఎస్‌టీ తగ్గింపు పూర్తి ప్రయోజనాలను కస్టమర్లకు అందించేందుకు టాటా మోటార్స్ సిద్ధమైంది. తన ప్యాసింజర్ వాహనాల ధరలను రూ.75 వేల నుంచి రూ.1.45 లక్షల వరకు తగ్గించనున్నట్లు శుక్రవారం తెలిపింది. తగ్గింపు ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది. చిన్న కార్ల విభాగంలోని టియాగోపై రూ.75వేల తగ్గింపు, టిగోర్‌పై రూ.80 వేలు, ఆల్ట్రోజ్‌పై రూ.1.10 లక్షల తగ్గింపు ఉంటుంది. కాంపాక్ట్ ఎస్‌యూవీ పంచ్‌పై రూ.85 వేలు, నెక్సాన్ కారుపై రూ.1.55 లక్షల తగ్గింపు అమలులోకి రానుంది. మిడ్ సైజ్ మోడల్ కర్వ్‌పై రూ.65 వేలు, ప్రీమియం ఎస్‌యూవీలు హారియర్‌పై రూ.1.40 లక్షలు, సఫారీపై రూ.1.45 లక్షల తగ్గింపు ఉండనుందని కంపెనీ పేర్కొంది. ''దేశ ప్రధాని, ఆర్థిక మంత్రి ఉద్దేశాలకు అనుగుణంగా... 'వినియోగదారునికే తొలి ప్రాధాన్యత' అనే మా సిద్ధాంతాన్ని అవలంబిస్తూ, జీఎస్టీ తగ్గింపుతో వచ్చిన లాభాన్ని ఎటువంటి కోత లేకుండా కస్టమర్లకే పూర్తిగా అందజేస్తున్నాం'' అని టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్ చంద్ర తెలిపారు. జీఎస్‌టీ తగ్గింపు నిర్ణయం కొత్తగా వాహనాలను కొనుగోలు చేయాలనుకునే వారికి ప్రోత్సాహాన్నిస్తుందన్నారు.

అనిల్ అంబానీపై మరో 'ఫ్రాడ్' ముద్ర!

- ఈసారి బ్యాంక్ ఆఫ్ బరోడా వంతు..
- ఆర్‌కామ్ రూ. 1,656 కోట్ల ఎగవేత కేసులో చర్యలు



న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ రంగంలో ఓ వెలుగువెలిగిన అనిల్ అంబానీని రుణ ఎగవేత కేసులు వెంటాడుతున్నాయి. దివాలా చర్యలు ఎదుర్కొంటున్న రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను, అదేవిధంగా ఆ కంపెనీలో మాజీ డైరెక్టర్ అయిన అనిల్ అంబానీని తాజాగా బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) మోసపూరితం (ఫ్రాడ్)గా వర్గీకరించింది. దాదాపు దశాబ్దం క్రితం ఆర్‌కామ్ తీసుకున్న రుణాలను దుర్వినియోగం చేసిన ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్ఛేంజీలకు తెలిపిన సమాచారంలో బీవోబీ పేర్కొంది. దేశీ బ్యాంకింగ్ అగ్రగామి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో పాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) కూడా ఇవే ఆరోపణలతో ఆర్‌కామ్, అనిల్‌ను 'ఫ్రాడ్' జాబితాలో చేర్చడం తెలిసిందే. ఆర్‌కామ్‌కు బీవోబీ రూ.1,600 కోట్ల రుణాన్ని, మరో రూ.862.5 కోట్లను లైన్ ఆఫ్ క్రెడిట్ కింద మంజూరు చేసింది. ఈ మొత్తం రూ.2,462.5 కోట్లలో ఈ ఏడాది ఆగస్ట్ 28 నాటికి రూ.1,656.07 కోట్లు బకాయి పడింది. ఈ నేపథ్యంలో కంపెనీతో పాటు ప్రమోటర్ అనిల్ అంబానీని 'ఫ్రాడ్'గా వర్గీకరిస్తూ బీవోబీ నుంచి సెప్టెంబర్ 2న లేఖ అందినట్లు ఆర్‌కామ్ వెల్లడించింది. ఈ లేఖ ప్రకారం.. 2017, జూన్ 5 నుంచి బీవోబీ ఈ ఖాతాను మొండిబకాయిగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఆర్‌కామ్‌పై దివాలా చట్టం ప్రకారం ఎన్‌సీఎల్‌టీలో కేసు నడుస్తోంది. కాగా, బ్యాంకింగ్ చట్టాల ప్రకారం ఖాతాను 'ఫ్రాడ్'గా ప్రకటించిన తర్వాత, దానిపై క్రిమినల్ చర్యల నిమిత్తం దర్యాప్తు సంస్థలకు కూడా సంబంధిత బ్యాంక్ ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఐదేళ్ల పాటు కొత్తగా ఎలాంటి రుణం పుట్టకుండా రుణగ్రహీతను నిషేధించాలి. ఈ ఏడాది మార్చి నాటికి ఆర్‌కామ్ మొత్తం అప్పులు రూ.40,400 కోట్లుగా లెక్కతేలింది.

మాపై ప్రభావం లేదు: ఆర్‌పవర్

ఆర్‌కామ్ ఖాతా విషయంలో బీవోబీ చేపట్టిన చర్యల వల్ల తమ వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక పనితీరుపై ఎలాంటి ప్రభావం లేదని రిలయన్స్ పవర్ (ఆర్‌పవర్) పేర్కొంది. ఇది కూడా అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీయే. కాగా, తమది ప్రత్యేక, స్వతంత్ర లిస్టెడ్ కంపెనీ అని, ఆర్‌కామ్‌తో వ్యాపార, ఆర్థిక లావాదేవీలు ఏవీ లేవని ఆర్‌పవర్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది.

ఓయో లాభం రెట్టింపు


1:1 బోనస్ షేర్లు



న్యూఢిల్లీ: ట్రావెల్ టెక్ ప్లాట్‌ఫామ్ ఓయో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 200 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 87 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 47 శాతం జంప్‌చేసి రూ. 2,019 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 1,371 కోట్ల టర్నోవర్ అందుకుంది. హోటళ్ల ఇన్వెంటరీని ప్రీమియమైజ్(మెరుగైన ధరలు) చేయడంతోపాటు.. గదుల వినియోగం పుంజుకోవడం ఇందుకు సహకరించినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ పేర్కొన్నారు. ఈ కాలంలో స్థూల బుకింగ్ విలువ(జీబీవీ) రూ. 7,227 కోట్లను తాకింది. గత క్యూ1లో నమోదైన రూ. 2,966 కోట్ల జీబీవీతో పోలిస్తే 144 శాతం దూసుకెళ్లింది. కాగా.. వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయనున్నట్లు ఓయో వెల్లడించింది. తద్వారా అధీకృత వాటా మూలధనం రెట్టింపుకానుంది. దీంతోపాటు ఐసాప్‌లో భాగంగా 8.8 కోట్ల స్టాక్ ఆప్షన్స్‌కు తెరతీయనుంది. కంపెనీ త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానున్న సంగతి తెలిసిందే.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
సిమెంట్‌పై జీఎస్‌టీ కోత.. మౌలిక రంగానికి బూస్ట్!
సెన్సెక్స్ మైనస్.. నిఫ్టీ ప్లస్

అదానీ పవర్ షేర్ల విభజన



1:5 నిష్పత్తిలో విడదీతకు ఓకే

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం అదానీ పవర్ షేర్ల విభజనకు వాటాదారులు అనుమతించారు. 1:5 నిష్పత్తిలో విడదీసేందుకు పోస్టల్ బ్యాలట్ ద్వారా మెజారిటీ సభ్యులు అంగీకారం తెలిపినట్లు కంపెనీ తాజాగా వెల్లడించింది. వెరసి రూ. 10 ముఖ విలువ గల ఒక్కో షేరునీ రూ. 2 ముఖ విలువగల 5 షేర్లుగా విభజించనుంది. ఇందుకు సెప్టెంబర్ 22 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. రిటైల్, చిన్న ఇన్వెస్టర్లు సైతం కంపెనీ షేర్లలో లావాదేవీలు చేపట్టేందుకు వీలుగా షేర్ల ముఖ విలువను విభజించేందుకు కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు అదానీ పవర్ బోర్డు పేర్కొంది.

అదానీ పవర్ షేరు నామమాత్ర లాభంతో రూ. 610 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో పోరాడి ఓడిన యూకీ-వీనస్ జోడీ

కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ డబుల్స్ విభాగంలో ఫైనల్ చేరుకోవాలని ఆశించిన భారత డబుల్స్ నంబర్‌వన్ యూకీ బాంబ్రికి నిరాశ ఎదురైంది. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో యూకీ బాంబ్రి (భారత్)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ పోరాటం ముగిసింది. న్యూయార్క్‌లో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో 14వ సీడ్ యూకీ-వీనస్ ద్వయం 7-6 (7/2), 6-7 (5/7), 4-6తో ఆరో సీడ్ జో సాలిస్‌బరీ-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-కివీస్ జంట ఏడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 55 విన్నర్స్ కొట్టి, 16 అనవసర తప్పిదాలు చేసింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. సెమీస్‌లో ఓడిన యూకీ-వీనస్‌లకు 2,50,000 డాలర్ల (రూ. 2 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది.

భారత్ భారీ విజయం

- థాయ్‌లాండ్‌పై 11-0 గోల్స్‌తో గెలుపు
- రెండేసి గోల్స్ చేసిన ముంతాజ్, బ్యూటీ డుంగ్‌డుంగ్, ఉదిత



ముంతాజ్

హాంగ్జౌ (చైనా): ప్రపంచ కప్ బెర్త్ సాధించడమే లక్ష్యంగా... ఆసియా కప్ మహిళల హాకీ టోర్నీలో బరిలోకి దిగిన భారత జట్టు భారీ విజయంతో బోణీ కొట్టింది. థాయ్‌లాండ్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో సలీమా టెటె సారథ్యంలోని టీమిండియా 11-0 గోల్స్ తేడాతో గెలిచింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు తరఫున 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముంతాజ్ ఖాన్ (7వ, 49వ నిమిషాల్లో), ఉదిత (30వ, 52వ నిమిషాల్లో), బ్యూటీ డుంగ్‌డుంగ్ (45వ, 54వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. సంగీత కుమారి (10వ నిమిషంలో), నవ్‌నీత్ కౌర్ (18వ నిమిషంలో), లాల్‌రెమ్‌సియామి (18వ నిమిషంలో), షర్మిలా దేవి (57వ నిమిషంలో), రుతుజా (60వ నిమిషంలో) టీమిండియాకు ఒక్కో గోల్ అందించారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో ఉన్న భారత జట్టు విరామ సమయానికి 5-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఓవరాల్‌గా తమకు లభించిన తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లలో ఐదింటిని గోల్స్‌గా మలిచిన భారత జట్టు నాలుగింటిని వృథా చేసింది. మరోవైపు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 30వ స్థానంలో ఉన్న థాయ్‌లాండ్ జట్టుకు ఒక్క పెనాల్టీ కార్నర్ కూడా దక్కలేదు. పూల్ 'బి'లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో జపాన్ 9-0తో సింగపూర్ జట్టును ఓడించగా... పూల్ 'ఎ'లో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో దక్షిణ కొరియా 9-0తో చైనీస్ తైపీపై, చైనా 8-0తో మలేసియాపై విజయం సాధించాయి. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జపాన్‌తో భారత్; థాయ్‌లాండ్‌తో సింగపూర్ తలపడతాయి.

అజిత్ 'సిక్సర్'

ఒకే రెయిడ్‌లో 6 పాయింట్లు సాధించిన యు ముంబా ప్లేయర్



విశాఖ, స్పోర్ట్స్: యు ముంబా రెయిడర్ అజిత్ చౌహాన్ సంచలన ప్రదర్శనతో తమ జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ముంబా ఏకంగా 20 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. శుక్రవారం ఏకపక్షంగా సాగిన పోరులో ముంబా 48-28తో బెంగళూరు బుల్స్‌పై ఘన విజయం సాధించింది. అజిత్ చౌహాన్ ఒక్కడే 13 పాయింట్లతో అదరగొట్టాడు. 13వ నిమిషంలో అజిత్ సంచలన ప్రదర్శన కనబర్చాడు. ఒకే రెయిడ్‌లో అతను ఏకంగా ఆరుగురు ఆటగాళ్లను అవుట్ చేయడం విశేషం. పీకేఎల్ చరిత్రలో ఒకే రెయిడ్‌లో ఆరు లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లు సాధించిన మూడో ప్లేయర్‌గా అజిత్ నిలిచాడు. గతంలో పట్నా పైరేట్స్ తరఫున ప్రదీప్ నర్వాల్ (ఒకే రెయిడ్‌లో 8 పాయింట్లు; 2017లో హరియాణా స్టీలర్స్‌పై)... తమిళ్ తలైవాస్ తరఫున అజింక్య పవార్ (ఒకే రెయిడ్‌లో 6 పాయింట్లు; 2022లో తెలుగు టైటాన్స్‌పై) ఈ ఘనత సాధించారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 37-32తో యూపీ యోధాస్‌ను ఓడించింది. హరియాణా ఆటగాళ్లలో నవీన్ కుమార్, రాహుల్ చెరో 6 పాయింట్లు నమోదు చేయగా, యూపీ తరఫున గగన్ గౌడ 13 పాయింట్లు స్కోర్ చేసినా జట్టును గెలిపించలేక పోయాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో బెంగళూరు బుల్స్, తమిళ్ తలైవాస్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడతాయి.

సబలెంకా X అనిసిమోవా

యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం అమీతుమీ

హోరాహోరీ సెమీఫైనల్స్‌లో పోరాడి ఓడిన జెస్సికా పెగూలా, నయోమి ఒసాకా



సబలెంకా
అనిసిమోవా

న్యూయార్క్: కెరీర్‌లో నాలుగో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ సాధించేందుకు సబలెంకా (బెలారస్)... కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకునేందుకు అమండ అనిసిమోవా (అమెరికా) ఒక్క విజయం దూరంలో ఉన్నారు. టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో సబలెంకా, అనిసిమోవా ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, వరల్డ్ నంబర్‌వన్ సబలెంకా 4-6, 6-3, 6-4తో నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)పై నెగ్గగా... ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ అనిసిమోవా 6-7 (4/7), 7-6 (7/3), 6-3తో నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత, ప్రపంచ 24వ ర్యాంకర్ నయోమి ఒసాకా (జపాన్)లపై విజయం సాధించారు. సబలెంకా, అనిసిమోవా మధ్య ఫైనల్ భారత కాలమానం ప్రకారం ఈరోజు అర్ధరాత్రి గం. 1:30 నుంచి జరుగుతుంది. ముఖాముఖి రికార్డులో అనిసిమోవా 6-3తో సబలెంకాపై ఆధిక్యంలో ఉంది.

27 ఏళ్ల సబలెంకా తన కెరీర్‌లో ఇప్పటి వరకు మూడు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ (2023, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్), యూఎస్ ఓపెన్ (2024) సాధించి... మూడుసార్లు రన్నరప్‌గా (2025 ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్; 2023 యూఎస్ ఓపెన్) నిలిచింది. మరోవైపు అనిసిమోవా తన కెరీర్‌లో ఒక్క గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనే ఫైనల్ (ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ) చేరి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.

గత ఏడాది జెస్సికాను ఓడించి యూఎస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సబలెంకా ఈసారి సెమీఫైనల్లోనే అమెరికా ప్లేయర్ ఆట కట్టించింది. 2 గంటల 5 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా తొలి సెట్‌ను కోల్పోయినా కంగారు పడలేదు. పట్టుదలతో ఆడి ఆ తర్వాత వరుసగా రెండు సెట్‌లు గెలిచి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఎనిమిది ఏస్‌లు సంధించిన ఈ బెలారస్ స్టార్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 27 సార్లు దూసుకొచ్చి 15 సార్లు పాయింట్లు నెగ్గిన సబలెంకా 43 విన్నర్స్ కొట్టింది. మరోవైపు జెస్సికా మూడు ఏస్‌లు కొట్టి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు, 15 అనవసర తప్పిదాలు చేసింది.

నయోమి ఒసాకాతో 2 గంటల 56 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో అనిసిమోవా ఏడు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. 50 విన్నర్స్ కొట్టిన అనిసిమోవా 45 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు ఒసాకా 15 ఏస్‌లు సంధించినా, కేవలం 32 విన్నర్స్‌తో సరిపెట్టుకుంది.

2 యూఎస్ ఓపెన్ చరిత్రలో రెండు సెమీఫైనల్స్ విజేతలు తొలి సెట్‌ను కోల్పోయి నెగ్గడం ఇది రెండోసారి మాత్రమే. 1993లో స్టెఫీ గ్రాఫ్ (జర్మనీ) 4-6, 6-1, 6-0తో మలీవా (స్విట్జర్లాండ్)పై; హెలెనా సుకోవా (చెక్ రిపబ్లిక్) 6-7 (7/9), 7-5, 6-2తో అరంటా శాంచెజ్ వికారియో (స్పెయిన్)పై గెలిచారు.

ఒక్కో మ్యాచ్‌కు రూ. 3 కోట్ల 50 లక్షలు

టీమిండియా జెర్సీ స్పాన్సర్‌షిప్ విలువ



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ప్రధాన (జెర్సీ) స్పాన్సర్‌షిప్ విలువను బీసీసీఐ మరింత పెంచింది. ఇటీవలే 'డ్రీమ్ 11'ను తప్పించడంతో కొత్త స్పాన్సర్‌షిప్ వేటలో ఉన్న బోర్డు ఈసారి మరింత పెద్ద మొత్తాన్ని ఆశిస్తోంది. కొత్త విలువ ప్రకారం భారత్ ఆడే ద్వైపాక్షిక సిరీస్‌లో ఒక్కో మ్యాచ్‌కు స్పాన్సర్ రూ. 3 కోట్ల 50 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కువ దేశాలు పాల్గొనే ఐసీసీ లేదా ఏసీసీ టోర్నీలో అయితే ఇది ఒక్కో మ్యాచ్‌కు రూ. 1 కోటీ 50 లక్షలుగా ఉంది. 'డ్రీమ్ 11' ఇప్పటి వరకు రూ. 3 కోట్ల 17 లక్షలు, రూ.1 కోటీ 12 లక్షలు చెల్లిస్తూ వచ్చింది. ఆసియా కప్ ముగిసిన తర్వాతే జెర్సీ స్పాన్సర్‌షిప్ ఒప్పందం ఖరారు కానుంది. బోర్డు ఆశించిన విధంగా జరిగితే ఏడాదికి సుమారు రూ. 400 కోట్లు బీసీసీఐ ఖాతాలో చేరతాయి. స్పాన్సర్‌షిప్ కోసం బిడ్‌లను కోరుతూ మంగళవారం బోర్డు ప్రకటన ఇచ్చింది. దీనికి ఆఖరి తేదీ సెప్టెంబరు 16 కావడంతో జెర్సీ స్పాన్సర్ లేకుండానే టీమిండియా బరిలోకి దిగనుంది.

సుమిత్ శుభారంభం



లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు సుమీత్ కుందు, నీరజ్ ఫొగాట్ తొలి రౌండ్‌లో విజయం సాధించి ముందంజ వేశారు. శుక్రవారం జరిగిన పురుషుల 74 కేజీల కేటగిరీలో సుమిత్ 5:0తో జోర్డాన్‌కు చెందిన మొహమ్మద్ అల్‌హుసేన్‌ను చిత్తు చేశాడు. మూడు రౌండ్లలోనూ సుమిత్ ఆధిపత్యం ప్రదర్శించాడు. మహిళల 65 కేజీల విభాగంలో నీరజ్ ఫొగాట్‌కు కాస్త ప్రతిఘటన ఎదురైంది. క్రిస్టా కొవలైనెన్ (ఫిన్‌లాండ్)తో జరిగిన పోరులో నీరజ్ 3:2 తేడాతో గెలిచింది. ఇతర బౌట్‌లలో భారత మహిళా బాక్సర్లు సనమచ చాను (70 కేజీలు), సాక్షి (54 కేజీలు) విజయాలు అందుకోగా...పురుషుల విభాగంలో హర్ష్ (90 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మీ ఫోన్‌లో వైరస్ ఉందా?



హిడెన్ యాప్‌లతో పొంచి ఉన్న ముప్పు

జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న సైబర్ నిపుణులు.. కొద్దిపాటి చిట్కాలతో గుర్తించే వీలుందని సూచన

సాక్షి, హైదరాబాద్: ఇంటర్నెట్‌తో అనుసంధామైన స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే అరచేతిలో ప్రపంచం ఉన్నట్టే.. అలాగే మన స్మార్ట్‌ఫోన్‌లోకి రహస్య నిఘా (హిడెన్ స్పై) యాప్‌లు ప్రవేశిస్తే మన కదలికలను ఒక వేగు వెంటాడుతున్నట్టే.. అందుకే 'మీ ఫోన్‌లో వైరస్ ఉందా..!' అని చెక్ చేసుకోమని చెబుతున్నారు సైబర్ భద్రత నిపుణులు. స్పైవేర్ యాప్ మీ ఫోన్‌లోకి చొరబడితే అది మీ పూర్తి డేటాను రహస్యంగా సేకరించి తీవ్రమైన సమస్యలను కలిగిస్తుందని హెచ్చరిస్తున్నారు. స్పైవేర్ యాప్‌లను గుర్తించడం కూడా కష్టమేనని అంటున్నారు. అవి చూడడానికి సాధారణ గేమింగ్ యాప్‌ల మాదిరిగా ఐకాన్‌తో కొన్ని ఉంటాయని, మరికొన్ని మనకు కనిపించకుండానే తెరవెనుక రన్ అవుతుంటాయని చెబుతున్నారు.

ప్రధాన అనర్థాలు ఇవీ

➤ **డేటా ట్రాన్స్‌మిషన్:** మీ ఫోన్‌లోని కీలక సమాచారాన్ని మీ అనుమతి లేకుండా థర్డ్‌పార్టీకి (హ్యాకర్లు, ప్రకటనదారులు, హానికరమైన సంస్థలకు) ఎప్పటికప్పుడు పంపుతాయి.

➤ **ఫోన్ పనితీరులోనూ సమస్యలు:** స్పైవేర్ చేరిన తర్వాత అది మీ ఫోన్ వేగాన్ని తగ్గించవచ్చు. తరచూ ఫోన్ వేడెక్కడం.. బ్యాటరీ త్వరగా డిశ్చార్జి అవడం జరుగుతుంది.

➤ **ప్రైవసీ పోతుంది:** ఫోన్‌లోకి వైరస్ చేరితే ఫొటోలు, కాంటాక్ట్ నంబర్లు, ఇతర ఆర్థిక వివరాలు వంటి వ్యక్తిగత డేటా దొంగిలించబడే ప్రమాదం ఉంది. మన వ్యక్తిగత సమాచారం, వీడియోలు.. ఫొటోలతో ఐడెంటిటీ థెఫ్ట్‌తోపాటు ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీల సమాచారం తెలిస్తే ఆర్థిక నష్టానికి దారితీయవచ్చు.



➤ **అనధికార యాక్సెస్:** స్పైవేర్ మీ ఫోన్‌ను అనధికారికంగా యాక్సెస్ చేసే ప్రమాదం ఉంది. మరిన్ని మాల్వేర్‌లను ఇన్‌స్టాల్ చేయడానికి, మీ ఫోన్ కెమెరా, మైక్‌ను యాక్సెస్ చేయడానికి లేదా యాప్‌లను మార్చటానికి సైబర్‌నేరగాళ్లకు వీలు కల్పిస్తుంది.

➤ **ఫోన్ మన కంట్రోల్ తప్పుతుంది:** ఫోన్‌లో యాప్‌లు వాటంతట అవే తెరవడం లేదా మూసివేయబడడం. మనకు తెలియకుండానే ఇతర నంబర్లకు టెక్స్ట్ మెసేజ్‌లు పంపడం. వింత పాప్-అప్‌లు వస్తుండడం మీరు గమనించవచ్చు.

ఫోన్‌లోకి స్పైవేర్, వైరస్‌లు ఎలా వస్తాయి?

అవగాహన లేకుండా చేసే పనులతో మనమే మన ఫోన్‌లోకి వైరస్‌లను ఆహ్వానిస్తున్నామని సైబర్ భద్రత నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నిసార్లు మనం అనధికారిక మూలాల నుంచి (థర్డ్‌పార్టీ లింక్‌ల నుంచి) అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడంతో వైరస్ చేరవచ్చు. ఈ- మెయిల్‌లు, టెక్స్ట్ మెసేజ్‌లు, వాట్సాప్ మెసేజ్‌లలోని అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయడం ద్వారా కూడా హిడెన్ యాప్‌లు మన ఫోన్లలోకి వచ్చే ప్రమాదం ఉందని సైబర్ భద్రత నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నిసార్లు సోషల్ మీడియాలోని హానికరమైన లింకులను క్లిక్ చేసినా వైరస్ వచ్చే ప్రమాదం ఉందని అంటున్నారు.

ఫోన్ వైరస్ బారిన పడకుండా ఎలా కాపాడుకోవాలి?	గుర్తింపు పొందిన యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ఫోన్‌ను స్కాన్ చేసుకోవాలి.	ఫోన్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడంతో సెక్యూరిటీ ప్యాచ్‌అప్‌లు, నూతన సెక్యూరిటీ అప్‌డేట్‌లు వస్తాయి. దీని వల్ల వైరస్‌లను అడ్డుకోవచ్చు.	మీరు ఉపయోగించని, అనుమానాస్పద యాప్‌లను వెంటనే అన్ ఇన్‌స్టాల్ చేయండి.	ఏవైనా యాప్‌లను డౌన్‌లోడ్ చేసేటప్పుడు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ వంటి నమ్మదగిన స్టోర్స్ నుంచే యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ రేటింగ్, రివ్యూలు తప్పక పరిశీలించాలి.	టు ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను వినియోగించాలి.

ఈ విఘ్నాధిపతి.. కోట్లాధిపతి




రూ.1.5 కోట్లతో అలంకరణ

పాల్వంచ: గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రాంనగర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం, విగ్రహాన్ని కరెన్సీ నోట్ల మాలలతో అలంకరించారు. రూ.1.5 కోట్ల విలువైన రూ.500ల నుంచి రూ.10 నోట్లతో అలంకరించడం ఆకట్టుకుంది.

హైదరాబాద్‌కు సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్

- వ్యక్తిగత పర్యటనలో భాగంగానే రాక!
- కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగించిన నేపథ్యంలో ఆయన రాకకు ప్రాధాన్యం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించిన నేపథ్యంలో శుక్రవారం సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, వ్యక్తిగత పర్యటనపై ప్రవీణ్ సూద్ ఇక్కడికి వచ్చినట్టు తెలిసింది. శ్రీశైల క్షేత్ర దర్శనం అనంతరం ఆయన నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారని విశ్వసనీయంగా తెలిసింది. శుక్రవారం సాయంత్రం ప్రవీణ్ సూద్ శ్రీశైలానికి వెళ్లారు. తిరిగి రాత్రి హైదరాబాద్‌కు చేరుకుని ఎన్‌పీఏలో బస చేస్తారని, శనివారం ఉదయం ఒక ఉపన్యాస కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఢిల్లీకి వెళతారని సమాచారం. అయితే, ప్రవీణ్ సూద్ కాళేశ్వరం కేసు దర్యాప్తులో భాగంగానే హైదరాబాద్ వచ్చారని, సీబీఐ అధికారులతో కేసు దర్యాప్తుపై చర్చించారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ మా లక్ష్యం

విద్యారంగంపై ఊహించని రీతిలో పెట్టుబడులు..
మా అప్పుడు ఇసుకలో అక్షరాలు దిద్దాం..
ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో అడ్మిషన్ తీసుకోవాలని ఉంది
ఐఎస్‌బీలో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ రైజింగ్- 2047, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ వైపు తెలంగాణ వేగంగా పరుగులు తీస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన గచ్చిబౌలిలోని ఇండియన్‌స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. విద్యారంగంపై ఊహించని రీతిలో తాము పెట్టుబడులు పెడుతున్నామన్నారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర నిర్మాణానికి ఉపయోగపడుతుందని ప్రజాప్రభుత్వం సంపూర్ణంగా భావిస్తుందని వివరించారు.

మా అప్పుడు రాసుకునేందుకు పలకలు కూడా లేవు

తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకున్నానని భట్టి చెప్పారు రాసుకునేందుకు పలకలు కూడా లేకపోవడంతో మా గురువులు ఇసుక పైనే అక్షరాలు దిద్దిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఆశయాలు, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచే మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం తనకు గౌరవంగా, సంతోషంగా ఉంది అన్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ ఇచ్చిన సహకారం ఒక విరాళం మాత్రమే కాదు..అది జ్ఞానం, నాయకత్వం, మన సమష్టి భవిష్యత్‌పై ఉంచిన విశ్వాసానికి ప్రతీక అన్నారు. ఐఎస్‌బీని ఒక సంస్థగానే కాక భాగస్వామిగా తాము చూస్తున్నామన్నారు. సెంటర్ ఫర్ అనలిటికల్ ఫైనాన్స్ మాతో కలిసి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వామ్యం అవుతోందని, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తమ ప్రయాణం అని పేర్కొన్నారు. నేర్చుకోవడం ఎప్పటికీ ముగియదని మనకు గుర్తు చేస్తే..తాను కూడా ఐఎస్‌బీలో విద్యార్థిగా అడ్మిషన్ తీసుకోవాలని భావిస్తున్నానని డీన్ మదన్ గమనించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈ కేంద్రంలో ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను డిప్యూటీ సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో మోతీలాల్ ఓస్వాల్ డీన్ మదన్ పిల్లుట్ల, ప్రభాత్ సిన్హా పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు జ్ఞాపికను అందజేస్తున్న మోతీలాల్ ఓస్వాల్ ప్రతినిధులు

పెట్టుబడిదారులు రాష్ట్రాభివృద్ధిలో భాగమే

గల్ఫ్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం.. సౌత్ ఇండియన్ బిజినెస్ అచీవర్స్ అవార్డుల ప్రదానం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చేవారిని కేవలం వ్యాపారవేత్తలుగా చూడకుండా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా పరిగణిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణలో పలు రంగాల్లో పెట్టుబడులకు భారీగా అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పెట్టుబడులతో వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ వీకెండ్ – దుబాయ్ 2025'లో భాగంగా యూఏఈలో నిర్వహించిన సౌత్ ఇండియన్ బిజినెస్ అచీవర్స్ అవార్డు (సైబా)ల కార్యక్రమంలో శ్రీధర్‌బాబు అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో సాధిస్తున్న పురోగతి, రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఇప్పటికే తెలంగాణలో యూఏఈ పెట్టుబడిదారులు రూ.2 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టడం దుబాయ్‌తో బలపడుతున్న వాణిజ్య సంబంధాలకు అద్దం పడుతోందని మంత్రి అన్నారు.



రిచ్‌మండ్ విల్లాస్ గణేష్ లడ్డూ.. రూ. 2.31 కోట్లు

రికార్డు స్థాయిలో లడ్డూల వేలం
ఏటా వేలం పాటలో పెరుగుతున్న ధర
వచ్చిన మొత్తం సామాజిక సేవకే వినియోగం

బండ్లగూడ: గణనాథుడి లడ్డూల వేలం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. వేలు.. లక్షలు దాటి కోట్లలోకి చేరింది. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డు ఈసారి వేలంలో ఏకంగా రూ.2.31 కోట్ల ధర పలికింది. గత సంవత్సరం ఇక్కడి ఏకదంతుడి లడ్డు రూ.1.87 కోట్ల ధర పలికింది. సాధారణంగా లడ్డు వేలం పాట అంటే ఎవరో ఒక వ్యక్తి అధిక ధరకు పాడి దక్కించుకుంటారు. కానీ, రిచ్‌మండ్ విల్లాస్‌లో అక్కడి వారంతా నాలుగు గ్రూపులుగా విడిపోయి వేలం పాట పాడుతారు. ఎక్కువ మొత్తం పాడిన ఒక గ్రూప్‌ను వేలంలో గెలిచినట్లు ప్రకటిస్తారు. అయితే ఇక్కడ ట్విస్ట్ ఎమిటంటే మిగిలిన గ్రూపుల వాళ్లు పాడిన మొత్తం కూడా వేలంలో కలిపేస్తారు. దీంతో భారీ మొత్తం సమకూరుతోంది. ఆ డబ్బుతో ఆర్‌వీ దియా చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య తదితర అవసరాలను తీర్చుతున్నారు. అపార్ట్‌మెంట్ వాసులతోపాటు విదేశాల్లో ఉన్న ట్రస్ట్ సభ్యుల స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా ఈ వేలం పాటలో డబ్బులు ఇస్తారు. ఈ డబ్బులో నుంచి ఒక్క రూపాయి కూడా ఎవరి సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించరు. ఆర్‌వీ దియా ట్రస్ట్ సేవలను మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ ప్రశంసించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శనివారం। 6-9-2025



శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమం సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కేకే తదితరులు

ఫైవ్‌స్టార్ సింగరేణి

ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించిన నాలుగు గనులు

- ఫోర్‌స్టార్ గనులు 14 ..
- త్రీస్టార్‌లోనూ 20 గనులు
- పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానంలో ప్రతిభ
- రక్షణ, ఉత్పత్తిలో అత్యుత్తమ పనితీరు



అవార్డులు అందుకుంటున్న సింగరేణి సీఎండీ బలరాం, అధికారులు

గోదావరిఖని: అత్యుత్తమ పనితీరు.. ఆధునిక పరిజ్ఞానం.. అత్యాధునిక సాంకేతికత.. పర్యావరణ పరిరక్షణ.. ఇలా అన్నింటా సింగరేణి బొగ్గు గనుల సంస్థ తనకంటూ ప్రత్యేకత చాటుతూ ఫైవ్‌స్టార్ రేటింగ్‌లో నిలుస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల నాలుగు బొగ్గు గనులు ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించడం కార్మిక వర్గంలో మరింత ఉత్సాహం నింపినట్లయ్యింది. మరో 14 గనులు ఫోర్‌స్టార్, ఇంకో 20 గనులు త్రీస్టార్ రేటింగ్‌తో విశిష్టత చాటుకున్నాయి.

2019 నుంచి..

కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ 2019 నుంచి ఏటా ఫైవ్‌స్టార్ రేటింగ్ అమలు చేస్తూ వస్తోంది. ప్రాజెక్టు ఆర్థిక పనితీరు, ఉద్యోగి సంక్షేమం, రక్షణ, ఉద్యోగ భద్రత వంటి ప్రమాణాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన నాలుగు గనులను ఈసారి ఎంపిక చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో కోల్ కంట్రోలర్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్, బొగ్గు, గనుల మంత్రిత్వ

శాఖ కార్యాలయం ప్రకటించిన జాబితాలో ప్రాజెక్టుకు చోటు లభించింది. గురువారం ముంబైలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నుంచి సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, అధికారులు అవార్డులు అందుకున్నారు. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1, ఇల్లెందు ఏరియా జేకే ఓసీపీ, భూగర్భ గనుల్లో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–6గని, ఆర్కే న్యూటెక్ గనులు ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులు అందుకున్న వాటిలో ఉన్నాయి.

84 అంశాలతో..

బొగ్గుగని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫైవ్‌స్టార్ అవార్డు కోసం మార్కులు కేటాయిస్తారు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పిన గనులపై కేంద్ర బొగ్గుశాఖ నుంచి వచ్చిన పరిశీలన బృందం.. ప్రత్యక్షంగా పరిశీలించి పలు అంశాలను లెక్కిస్తుంది. ప్రాథమిక మూల్యాంకనం తర్వాత వీటినుంచి అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపిక చేసిన వాటిలో ఇంకా అత్యుత్తమమైన వాటిని మరో కమిటీ ద్వారా ఎంపిక చేస్తారు. మొత్తం 100 మార్కుల్లో 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్‌స్టార్ రేటింగ్ ప్రకటించారు. గతేడాది మూడు గనులకు ఫైవ్‌స్టార్ రేటింగ్ రాగా ఈసారి మరో గని కూడా ఆ జాబితాలో చేరింది.

సంతోషంగా ఉంది



కోలిండియా బొగ్గు గనులకు దీటుగా సింగరేణి ముందుకు సాగుతోంది. నాలుగు గనులు ఫైవ్‌స్టార్ రేటింగ్, మరో 24 గనులు త్రీ టూస్టార్ రేటింగ్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. అధికారులకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి.
– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

ఫోర్‌స్టార్, త్రీస్టార్‌లో కూడా..

సింగరేణి ఫైవ్‌స్టార్‌తోపాటు మరో 14 గనులు 80 నుంచి 90 మార్కులు సాధించి ఫోర్‌స్టార్ రేటింగ్ అందుకున్నాయి. ఇరవై గనులు 3 స్టార్ రేటింగ్, కొన్ని గనులు 2 స్టార్ రేటింగ్‌లోనూ నిలిచాయి.



సీఎంతో అవార్డులు అభినందనీయం

ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి నుంచి తమ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం అభినందనీయమని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య ఆనందం వ్యక్తం చేశారు. శిల్పకళా వేదికలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి నుంచి వర్సిటీ అధ్యాపకులు ఈ అవార్డులను అందుకున్నారు. అవార్డు అందుకున్న వారిలో డాక్టర్ జె.హేమంత్ కుమార్, డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, డాక్టర్ వి.హేమలత, డాక్టర్ జె.రాజేందర్, డాక్టర్ జె.సాయి ప్రసాద్ ఉన్నారు.

ఓఆర్ఆర్‌పై టోల్ చార్జీలు తగ్గించాలి

...బీజేపీ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల్లో టోల్ చార్జీల తగ్గింపుపై కీలక నిర్ణయం తీసుకున్నందున, అదే విధానాన్ని ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)పై కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ డిమాండ్ చేసింది. కేంద్ర నిర్ణయం వల్ల ఒక్కొక్క వాహనదారు ఏటా దాదాపు రూ.15 వేల వరకు ప్రయోజనం పొందుతారని ఆ పార్టీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. కానీ, ఇది ఓఆర్ఆర్‌పై అమలు కావడం లేదని తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను ప్రైవేట్‌కు అమ్ముకుందన్నారు. దీంతో ఇప్పుడు ఓఆర్ఆర్‌పై టోల్ రూ.100, రూ.180 దాకా వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

భుక్తికి లేకున్నా.. భక్తిలో మిన్న



గణనాథుడిని పూజిస్తున్న చరణ్‌తోపాటు గుడిసెల నివాసితులు

- గుడిసెలో గణనాథుడు
- ధనసామర్థ్యానికి మించింది భక్తి అని నిరూపించిన బీద బాలుడు
- నవరాత్రుల పాటు గణపతిని కొలిచిన చరణ్

కోల్‌సిటీ (రామగుండం): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎల్బీనగర్ మాతంగి కాంప్లెక్స్ ఎదుట రోడ్డు పక్కన ప్లాస్టిక్ కవర్లను పైకప్పుగా వేసుకున్న చిన్న గుడిసెలు కనిపిస్తాయి. మట్టి నేలలు, మూటలు, చీపుర్లు, గిన్నెలతో నిండిన చిన్నగదులే అక్కడివారికి నివాసాలు. తాము కడు బీదలమైనా.. మనసు ఎంత గొప్పదో ఓ గుడిసెలోని తొమ్మిదో తరగతి విద్యార్థి చరణ్ నిరూపించాడు. తమ గుడిసెల ముందు గణపతి విగ్రహం ప్రతిష్ఠించి నవరాత్రులు పూజించాలని భావించాడు. కానీ కూలిపని చేసుకునే తల్లిదండ్రులకు స్తోమత లేదు. అయినా, ఆ బాలుడు వెనకడుగు వేయలేదు. పాఠశాలకు సెలవులు వచ్చినప్పుడల్లా ఓ దుకాణంలో పనిచేసి కొంతడబ్బు కూడగట్టుకున్నాడు. ఇందులోంచి రూ.1,500 వెచ్చించి వినాయకుడి విగ్రహాన్ని కొనుగోలు చేశాడు. ఇంటి ఎదుట తడకలతో మండపం నిర్మించాడు. వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. అర్చకుడిగా అవతారం ఎత్తాడు. తొమ్మిది రాత్రుల పాటు గణపతికి ప్రత్యేక పూజలు చేశాడు. భగవంతుడు విగ్రహంలో కాదు.. భావంలో ఉంటాడు.



ప్రసాదాన్ని పంచుతున్న చరణ్

భక్తికి సామర్థ్యం అవసరం లేదు.. హృదయం చాలు.. అని చరణ్ నిరూపించాడు. నవరాత్రులకు తగ్గ ఏర్పాట్లు, అలంకరణలు చేసే స్తోమత లేకపోయినా.. ఆ బాలుడి భక్తి ముందు అవన్నీ దిగదుడుపే అయ్యాయి. తొమ్మిదిరోజుల పాటు రోజూ పూజలు చేసి, నైవేద్యం సమర్పించాడు. నిత్యం భక్తిపాటలతో అర్చించాడు. చివరకు శుక్రవారం శోభాయాత్ర ఘనంగా నిర్వహించాడు. సమీపంలోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశాడు. ఈ సందర్భంగా పులిహోర, మిఠాయిలు కూడా గుడిసెలోనే తయారు చేసి అందరికీ పంచిపెట్టాడు. ఇది చూసిన ప్రతీఒక్కరూ కదిలిపోయారు. ఇది డబ్బుతో చేసేది కాదు.. మనసుతో చేసిన పూజ.. ఈ దృశ్యం మానవాళికి, సమాజానికి ఒక శిక్షణ.. ఈ బాలుడు చూపించిన భక్తి, ధనసామర్థ్యానికి మించిన ఆధ్యాత్మిక సంపదని ప్రశంసలు కురిపించారు.

యూనిఫామ్ హెచ్ఆర్ పాలసీపై స్టేటస్‌కో

పీఏసీఎస్‌లపై ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) కోసం యూనిఫామ్ హెచ్ఆర్ పాలసీ అమలుకు సంబంధించి తదుపరి ఆదేశాలిచ్చే వరకు యథాతథస్థితి కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్, హైదరాబాద్‌లోని నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్, ఎస్ఎల్ఈసీ సభ్యుడు సహా మరో ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణ ఈనెల 7కు వాయిదా వేసింది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ కన్వీనర్/రాష్ట్ర స్థాయి సాధికార కమిటీ (ఎస్ఎల్ఈసీ), పీఏసీఎస్ సెల్ హెడ్.. బదిలీలకు సంబంధించి గత నెల 22న జారీ చేసిన సర్క్యులర్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం తరఫున అధ్యక్షుడు బోసుపల్లి గణేశ్, 11 మంది ఇతరులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అభ్యంతరాలకు అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ సర్క్యులర్ సహకార సంఘాల చట్టం, ఆర్‌బీఐ మార్గదర్శకాలు, నాబార్డ్ చట్టాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాతే బదిలీకు సంబంధించి యూనిఫామ్ హెచ్ఆర్ పాలసీపై నిర్ణయం తీసుకోవాలని జూన్ 9 హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా.. అవేమీ పట్టించుకోకుండా ఎస్ఎల్‌బీసీ సర్క్యులర్ జారీ చేసిందన్నారు.



న్యాయశాఖ కార్యదర్శిగా సెక్రటేరియట్‌లో బాధ్యతలు చేపట్టిన పాపిరెడ్డి

విద్యారంగానికి తీవ్ర అన్యాయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉపాధ్యాయులు, విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం) సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. ఇప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందడం లేదన్నారు. రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగుల పెన్షన్ల విషయంలో కూడా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

న్యాక్ ట్రైనర్ లతకు అవార్డు భేష్

మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ట్రైనర్ స్నేహలతకు జాతీయ అవార్డు రావడంపై రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్న స్నేహలతను శుక్రవారం మంత్రి అభినందించారు. ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డు దక్కడం.. న్యాక్ ఫ్యాకల్టీ, సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. స్నేహలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతిని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

విహార యాత్రలా వచ్చి వెళ్లారు

మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్

సాక్షి, హైదరాబాద్: ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సీఎం, మంత్రులు విహారయాత్రకు వచ్చినట్టు వచ్చి వెళ్లారని మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ ఎద్దేవాచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మేకల, గొర్రెల మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, ఎల్లారెడ్డి బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రూ.10 లక్షల నష్టం జరిగిన చిన్న బ్రిడ్జిని చూడటానికి సీఎం వచ్చారని, పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో సీఎం తిరగలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 20 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినా సీఎం సరిగా స్పందించలేదన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 18 వేల మంది రైతులు నష్టపోయారని, వారికి ఎకరాకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం లైన్లలో నిలబడ్డ రైతులను.. సినిమా టికెట్లకు నిలబడ్డ వారితో సీఎం పోల్చడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. బాలరాజ్ మాట్లాడుతూ యూరియా అడిగిన రైతులను పోలీసులు కొడుతున్నారని ఇదేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు.



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గ్రామపాలనాధికారుల (జీపీఓ)కు నియామక పత్రాలు అందజేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతూ జ్ఞాపికను బహూకరిస్తున్న రెవెన్యూ సంఘాల ప్రతినిధులు



లండన్‌లో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ యూకే విభాగం గురువారం రాత్రి నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

క్లుప్తంగా...

17 నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు

సాక్షి, అమరావతి : ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 17 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు బీజేపీ సేవా కార్యక్రమాల పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సేవా పక్షోత్సవాలపై శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వర్కుషాపు నిర్వహించారు. జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయండి

రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి

సాక్షి, అమరావతి: రివల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) 10వ రాష్ట్ర మహాసభలను విజయవాడలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విజయవాడలోని కార్యాలయంలో నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా ఆర్ఎస్‌యూ పోరాటం చేస్తోందని తెలిపారు.

అమ్మవారి సొమ్ము తిరిగొచ్చింది!

బుక్కరాయసముద్రం: ఆలయ హుండీలో డబ్బు ఎత్తుకెళ్లిన దుండగులు నెలన్నర తరువాత అదే ఆలయంలో వదిలి వెళ్లారు. అక్కడ ఒక లేఖ కూడా ఉంచారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ తల్లి దేవాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ముసలమ్మ ఆలయంలో ఈ ఏడాది జూలై 22న గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి హుండీని పగలగొట్టి అందులోని నగదుతో పాటు ఆలయంలోని సీసీ కెమెరాలను సైతం ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై అప్పట్లోనే ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. శుక్రవారం ఉదయం పూజారి ఆలయం తలుపులు తీసి పూజలు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా కరెన్సీ నోట్లు కన్పించాయి. వెంటనే ఆలయ ధర్మకర్తకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించగా.. డబ్బుతో పాటు లేఖ కూడా కనిపించింది. డబ్బు లెక్కించగా రూ.1.86 లక్షలు ఉంది. ఇక లేఖలో.. 'మేము నలుగురు కలసి అమ్మవారి డబ్బులు ఎత్తుకెళ్లాము. తరువాత మా కుటుంబాల్లో పిల్లలు అనారోగ్యం పాలయ్యారు. అమ్మవారి సొమ్ములో కొంత తీసుకుని మా పిల్లలను బాగు చేయించుకుంటున్నాము. అమ్మా.. మమ్మల్ని క్షమించాల'ని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారమిచ్చారు. కొత్తగా అమర్చిన సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులను పట్టుకునే పనిలో పోలీసులు ఉన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

పోలవరంరూరల్: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి చేరుతున్న నీటితో వరద ప్రవాహం కొనసాగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 32.250 మీటర్లకు నీటిమట్టం కొనసాగుతోంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 9.10 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోంది. భద్రాచలం వద్ద 40.90 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. వరద మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నేడు తిరుమలలో అనంత పద్మనాభ వ్రతం

తిరుమల: తిరుమలలో శనివారం అనంత పద్మనాభ వ్రతాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా శ్రీభూవరాహస్వామి ఆలయం పక్కనున్న స్వామివారి పుష్కరిణి చెంతకు తీసుకువెళ్లి అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్వామి పుష్కరిణిలో అభిషేకాదులు నిర్వహించి తిరిగి ఆలయానికి వేంచేపు చేస్తారు. కాగా అనంతుడు అనగా ఆదిశేషుడు. ఆదిశేషుడుపై అనంత పద్మనాభ స్వామివారి అవతారంలో ఉన్న శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తూ గృహస్తులు సౌభాగ్యం కోసం ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ప్రతి ఏటా ఈ పర్వదినాన దేశవ్యాప్తంగా ఉన్న 108 శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రాల్లో అనంత పద్మనాభ వ్రతం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

సేవా ప్రమాణాలు పెంపొందించే దిశగా సంస్కరణలు

శ్రీవారి సేవకుల గ్రూప్ మాడ్యూల్‌పై టీటీడీ ఈవో సమీక్ష

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీలోని పలు విభాగాల్లో సేవలందిస్తున్న శ్రీవారి సేవకులకు సంబంధించి గ్రూప్ సూపర్‌వైజర్లు, ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై ఈవో జె.శ్యామల రావు పలు సూచనలు ఇచ్చారు. శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో ఏపీ ప్లానింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేంకటేశ్వరరావు, జేఈవో వీరబ్రహ్మంతో, వర్చువల్‌గా ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు విశ్వనాథ్, రామ్మోహన్, అడిషనల్ ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సీఎం సూచనల మేరకు, శ్రీవారి సేవా ప్రమాణాలను మరింత పెంపొందించాలనే దిశగా పలు సంస్కరణలు చేపట్టినట్టు తెలిపారు. ఇందులో గ్రూప్ సూపర్‌వైజర్లు, సేవకుల ట్రైనర్ల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక యాప్‌ను సెప్టెంబర్ 3న ప్రారంభించామన్నారు. శ్రీవారి సేవకుల ట్రైనర్లకు శిక్షణ ఇచ్చేందుకు మరింత పటిష్ట ప్రణాళికలు, బోధన పాఠ్యాంశాలను రూపొందించాలని సూచించారు. శిక్షణ పొందిన ట్రైనర్లు, సూపర్‌వైజర్లు సేవకులకు శిక్షణ ఇస్తారన్నారు. మొదటి విడత శిక్షణ కార్యక్రమం ఈ నెల 24 నుంచి ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు.

రైతుల కంట్లో తగ్గని మిర్చి మంట

2024-25 సీజన్ చేదు అనుభవం నుంచి కోలుకోని దైన్యం

- 2025-26లో ధరల నిలకడపై అనుమానాలు
- ప్రభుత్వంపై అణు మాత్రం లేని ఆశలు
- భారీ నష్టాలు తప్పవన్న అంచనాలు
- దీనితో దారుణంగా పడిపోయిన సాగు విస్తీర్ణం
- సగటున ఇప్పటికి కనీసం 30 శాతం కూడా సాగవ్వని దుస్థితి
- విత్తనాలు కొనేవారు లేక వ్యాపారులు డీలా



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వ తొలి ఏడాది పాలన కాలం.. గత 2024-25 సీజన్ పంచిన చేదు అనుభవం నుంచి ఇంకా కోలుకోని మిర్చి రైతులు, కొత్త సీజన్ (2025-26)పై కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అప్పుల భారం...ధరల నిలకడపై సందేహాలు.. మద్దతు ధర అమలుకు సంబంధించి ప్రభుత్వంపై లేని విశ్వాసం.. భారీ నష్టాల భయం.. వెరసి ప్రస్తుత సీజన్‌లో మిరప సాధారణ సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. సగటు సాగు అంచనాల్లో ఇప్పటికి కనీసం 30 శాతానికి కూడా చేరుకోని దైన్య పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వం 'దొంగాట'..

ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర పేరిట కపట నాటకమాడింది. కనీస మద్దతు ధర క్వింటా రూ.11,781గా ప్రకటించిన కూటమి ప్రభుత్వం, ఈ ధర తగ్గకుండా చూస్తామని, అవసరమైతే తామే కొనుగోలు చేస్తామని గొప్పలు చెప్పింది. ఈ ధర కంటే తక్కువగా అమ్ముకున్న వారికి ఆ వ్యత్యాసాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాకు నేరుగా జమ చేస్తామంది. కానీ ఆచరణలో ఒక్క రైతు నుంచి కూడా ఈ మద్దతు ధరకు కొనుగోలు చేయలేదు. మార్కెట్-మద్దతు ధరల మధ్య వ్యత్యాసానికి సంబంధించిన సొమ్ములో ఒక్క పైసా కూడా జమ చేసిన పాపాన పోలేదు.



గుంటూరులో వ్యాపారాల్లేక వెలవెలబోతున్న మిర్చి విత్తన దుకాణాలు

ఇప్పటికి సాగు 1.25 లక్షల ఎకరాలకు పరిమితం

2024-25 సీజన్ చేదు అనుభవంతో మిరప సాగంటే రైతులు హడలెత్తిపోతున్నారు. సాధారణ సాగు విస్తీర్ణం 5 లక్షల ఎకరాలు. 2025-26లో 6 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయినా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా, 1.25 లక్షల ఎకరాలకు మించి సాగవని పరిస్థితి. ఇక ఈ పరిస్థితుల్లో విత్తనాలు కొనేవారు లేక వ్యాపారులూ డీలా పడుతున్నారు. ఇంత దారుణ పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఏటా సీజన్‌లో రూ.150-200 కోట్లకు పైగా విత్తన వ్యాపారం జరగడం గమనార్హం. ప్రస్తుతం ఇందులో పావువంతైనా జరుగుతుందన్న విశ్వాసం లేని పరిస్థితి.

గత సీజన్ దారుణ పరిస్థితులు ఇలా...

- 2023-24 సీజన్‌లో దాదాపు 6 లక్షల ఎకరాల్లో మిరప సాగవగా, 12.50 లక్షల టన్నుల దిగుబడులొచ్చాయి. ధర కూడా రికార్డు స్థాయిలో పలికింది. మేలు రకం కాయలు రూ. 20-27వేల మధ్య పలకగా, తాలుకాయలకు రూ.14-16వేల మధ్య పలికింది.
- గత 2024-25 సీజన్‌లో దాదాపు 5 లక్షల ఎకరాలకు పైగా మిరప సాగు చేశారు. ఎకరాకు 20-25 టన్నుల చొప్పున 11.65 లక్షల టన్నుల దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. చీడపీడలు, నల్లతామర ప్రభావంతో ఎకరాకు 15-20 క్వింటాళ్ల చొప్పున 8 లక్షల టన్నుల దిగుబడులే వచ్చాయి.
- దిగుబడులు తగ్గినప్పుడు మార్కెట్‌లో డిమాండ్, ధరలు కూడా పెరగాలి. అయితే అందుకు భిన్నమైన పరిస్థితి. మేలు కాయలు సగటున క్వింటా రూ.6-9వేలు, తాలు కాయలకు రూ.2-4 వేలకు మించి పలకలేదు. అయినా సరే కొనే వారు లేక రైతులు కనివినీ ఎరుగని నష్టాలను చవి చూశారు.

పెట్టుబడి లేక.. ఖాళీగా వదిలేశాను



2024-25 ఖరీఫ్ సీజన్‌లో 4 ఎకరాల్లో మిరప సాగు చేశాను. ఎకరాకు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాను. ఎకరాకు 15-20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే తాలు కాయల ధర రూ.3 వేలకు మించి పలకలేదు. 2023-24 సీజన్ విషయంలో ఈ ధర ఏకంగా రూ.14 వేలు వచ్చింద. ఇదే కాలంలో క్వింటా తేజా రకం కాయల ధర రూ.20-27 వేలు ఉంది. గతేడాది రూ.6 వేల-రూ.8 వేల శ్రేణికి పడిపోయింది. దీంతో చేసేది లేక 16 క్వింటాళ్ల తాలుకాయలు అమ్ముకొని 60 క్వింటాళ్ల మేలు రకం కాయలు ధర లేక కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టాను. కోల్డ్ స్టోరేజ్‌లో దాచేందుకు క్వింటాకు ఏడాదికి రూ.700 చెల్లించాలి. 2024-25 సీజన్ విషయంలో దాదాపు రూ.4 లక్షలకు పైగా నష్టం వచ్చింది. 2025-26 సీజన్‌లో పెట్టుబడి పెట్టే ఓపికలేక, అప్పు చేసి పెట్టినా తగిన ధర లభించే పరిస్థితి లేక, పంట పొలాలన్నీ ఖాళీగా వదిలేశాను.

– దారం ఎలిసా రెడ్డి, దారంవారిపాలెం, ప్రకాశం జిల్లా

భద్రం బీ కేర్ ఫుల్ బ్రదరూ..!

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మోసాలు

అప్రమత్తంగా లేకుంటే ఖాతాలు



శ్రీకాకుళం క్రైమ్: పెరుగుతున్న సాంకేతికతతో పాటు రోజురోజుకీ సైబర్ మోసాలు పెచ్చుమీరుతున్నాయి. రోజుకో మోసంతో సైబరాసురులు రూ.కోట్లలో భారీగా సొమ్ము కొల్లగొడుతున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు పట్టిపీడించిన ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలే ప్రస్తుతం ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి. ప్రముఖ వైద్యులు, ఉపాధ్యాయ, రాజకీయ, వ్యాపారవర్గాలు, ఇంజినీర్లు సైతం సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకొని దారుణంగా మోసపోతున్నారు. మోసపోయాక పరువు పోతుందేమోనని కొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోయినా.. మరి కొందరు భారీ అమౌంట్లు కావడంతో నేరుగా జిల్లా ఉన్నతాధికారి వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ లెక్కకు మించి సైబర్ కేసులు వివిధ స్టేషన్లలో పెండింగ్‌లోనే ఉంటున్నాయి. మరికొన్ని స్టేషన్లలో అయితే కనీసం కేసు కట్టడానికి సాహసించలేని స్థితిలో ఉండడం గమనార్హం.

నమ్మారో.. నట్టేటా మునిగినట్లే..

➡ శ్రీకాకుళం సబ్ డివిజన్ కేంద్రంగా ఇటీవల ఒక ప్రముఖ వైద్యుడు ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.37.50 లక్షలు మోసపోయాడు. ఎప్పటినుంచో స్టాక్ మార్కెట్‌లోనే కాకుండా వివిధ మార్గాల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తున్న ఆ వైద్యుడికి ఒక అపరిచిత వ్యక్తి వాట్సాప్ కాల్‌చేసి చిట్కాలు చెబుతాననడంతో సరే అన్నాడు. ముందుగా ఓ గ్రూపు క్రియేట్ చేసి అందులో సభ్యులను పరిచయం చేశాడు. రూ.10 లక్షలు పెడితే అదనంగా మరో రూ.10 లక్షలు వస్తుందని, రూ.20 లక్షలు పెడితే రూ.20 లక్షలు, రూ.30 లక్షలు పెడితే రూ.30 లక్షలు వస్తుందని మాయమాటలు చెప్పాడు. తన చిట్కాల ద్వారా గ్రూపులో సభ్యులకొస్తున్న అమౌంట్ స్క్రీన్‌షాట్లు తీసి వైద్యుడికి పెట్టసాగాడు. నమ్మకం కుదిరాక వైద్యుడు పలుమార్లు రూ.2 లక్షలు, రూ.3 లక్షలు.. ఇలా వేస్తూనే ఉన్నాడు.. విత్‌డ్రా ఆప్షన్‌లో డబ్బులు అదనంగా కనిపిస్తుండడం తన అకౌంట్‌లో యాడ్ అవుతున్నట్లు ఆశ పుట్టింది. అలా ఒక రూ.15 లక్షల వరకు వేశాడు. డబ్బులైతే ఆప్షన్‌లో కనిపించి విత్ డ్రా అవ్వకపోవడంతో అపరిచిత వ్యక్తిని అడగగా.. మీరు కడుతుంటే ఒకేసారి వస్తాయనడంతో రూ.37 లక్షల వరకు కట్టేశాడు. కానీ అప్పటికీ విత్ డ్రా అవ్వకపోవడంతో పాటు అపరిచిత వ్యక్తికి ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. గ్రూపులో కూడా వైద్యుడిని రిమూవ్‌చేసేశారు. ఇక చేసేదేమీలేక వైద్యుడు పోలీసులను ఆశ్రయించాడు.

➡ ఇదే తరహాలో కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఆర్మీకి చెందిన ఒక వ్యక్తి రూ.కోటికి పైగా సైబరాసురుల చేతిలో నష్టపోయానని ఫిర్యాదు చేయడంతో భారీ అమౌంట్ కావడంతో విచారణ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నా.. ఇప్పటివరకు కేసు అయితే నమోదు చేయలేకపోయారు.

➡ రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన దుంప కృష్ణ చిత్తూరు జిల్లా మెట్టూరు ఎస్‌బీఐలో ఒప్పంద ఉద్యోగిగా చేస్తున్నాడు. వాట్సాప్ ద్వారా వచ్చే వీడియోలు చూసి సబ్‌స్క్రైబ్ చేసుకున్న కృష్ణకు సైబర్ కేటుగాళ్లు టెలిగ్రామ్ ద్వారా లింకులు పంపించి గేమ్‌లు ఆడించారు. బహుమతులు, డబ్బులొస్తున్నట్లు ఆన్‌లైన్‌లో చూపించడంతో కృష్ణ రూ.11.50 లక్షల వరకు ట్రేడింగ్ చేశాడు. చివరికి డబ్బులు ఎంతకీ అకౌంట్‌లో పడకపోవడంతో జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేయగా జీరో అఫైర్ నమోదు చేసి చిత్తూరు జిల్లా మెట్టూరుకు కేసు బదిలీ చేశారు.

కేసులు నమోదు చేయలేని దుస్థితి

ఈ తరహానే కాకుండా వివిధ సైబర్ మోసాలపై జిల్లాలో భారీస్థాయిలో కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒక్కో స్టేషన్‌లో 4 నుంచి 6 వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. మోసం చేసే కేటుగాళ్లు వివిధ రాష్ట్రాలు, దేశాలు వారు కావడంతో అక్కడికి వెళ్లి ఆ అధికారులతో సమన్వయం చేసుకుని నోటీసులిచ్చేవరకే చేయగలుగుతున్నారు. ఈలోగా దారి ఖర్చులు, వసతి ఖర్చులు అన్నీ వీరిపైనే భారంగా పడుతున్నాయి. పోనీ కోర్టు వరకు నేరస్తులు వస్తున్నారంటే అదీ లేదు. ఒకట్రెండు సార్లు వచ్చి ఆ తర్వాత వారి జాడే కనిపించనంతగా మాయమవుతున్నారు. దీంతో ఇటువంటి కేసులు కట్టాలంటేనే తమకు తలనొప్పిగా మారుతున్నాయంటూ కొంతమంది పోలీసు అధికారులే చెబుతుండడం శోచనీయం.

అత్యాశే కారణం



ప్రస్తుతం సైబర్ నేరాలు జిల్లాలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. ప్రజలు అత్యాశతో వారి వలలో పడుతున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, డిజిటల్ అరెస్టు వంటి మోసాలకు ఎక్కువగా చదువుకున్నవారే బలవుతున్నారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో గతంలో కంటే ఇప్పుడు కేసులు ఎక్కువగా నమోదు చేస్తున్నాం. క్షణాల్లో సైబర్ సెల్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసి పోలీసులను, బ్యాంకు ప్రతినిధులను సంప్రదిస్తే మంచిది.

– డీఎస్పీ వివేకానంద, శ్రీకాకుళం

జీఎస్టీ మార్పులతో ఖజానా గలగల

- అదనంగా రూ.16,759 కోట్ల రాబడి అంచనా
- సంస్కరణలకు ముందు 2025-26లో రాష్ట్ర జీఎస్టీ అంచనా రూ.35,863 కోట్లు
- ఇప్పుడు రూ.52,622 కోట్లు దాటుతుందని అంచనా
- జీఎస్టీ రేట్ల సవరణపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: జీఎస్టీ రేట్ల సవరణతో ఆదాయం పడిపోతుందని ఒకపక్క రాష్ట్రాలు గగ్గోలు పెడుతుంటే.. రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరగనుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన పరిశోధనాత్మక పత్రంలో వెల్లడించింది. సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా రూ.16,759 కోట్లు జీఎస్టీ ఆదాయం వస్తుందని ఎస్‌బీఐ అంచనా వేసింది. 2025-26లో ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ ఆదాయం రూ.35,863 కోట్లని అంచనా వేయగా.. అది సంస్కరణల తర్వాత రూ.52,622 కోట్లకు చేరుతుందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఈ సంస్కరణల ద్వారా అన్ని రాష్ట్రాల జీఎస్టీ ఆదాయం ఏడాది మొత్తం మీద 4.14 లక్షల కోట్లు పెరుగుతుందని తెలిపింది. 2025-26లో రాష్ట్రాల జీఎస్టీ ఆదాయం రూ.9,96,500 కోట్లు వస్తుందని సంస్కరణలకు ముందు అంచనా వేసింది. సంస్కరణల తర్వాత ఈ ఆదాయం మరో రూ.4,14,110 కోట్లు పెరిగి, మొత్తం రూ.14,10,610 కోట్లు వస్తుందని తెలిపింది. జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయంలో కేంద్రం, రాష్ట్రం 50 శాతం చొప్పున తీసుకుంటుండగా, కేంద్రం తీసుకున్న జీఎస్టీలో వికేంద్రీకరణ (డివల్యూషన్) కింద రాష్ట్రాలకు 41 శాతం తిరిగి ఇచ్చేయడం ద్వారా రాష్ట్రాల జీఎస్టీ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని పేర్కొంది. 2025-26లో ఎస్‌జీఎస్టీ ద్వారా రాష్ట్రాలకు రూ.9,96,500 కోట్లు, సీజీఎస్టీలో రాష్ట్రాల వికేంద్రీకరణ ద్వారా అదనంగా రూ.4.1 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది.

రెండు నెలలు తగ్గినా..

గతంలో జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చినప్పుడు కూడా జీఎస్టీ ఆదాయం గణనీయంగా పెరిగిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అక్టోబర్ 2018, జూలై 2019ల్లో జీఎస్టీ రేట్లను సవరించినప్పుడు ఒకటి రెండునెలలు రాష్ట్రాల ఆదాయం స్వల్పంగా తగ్గి, ఆ తర్వాత గణనీయంగా పెరిగిందని ఎస్‌బీఐ గణాంకాలతో వివరించింది. ఈ రెండు సంస్కరణల తర్వాత జీఎస్టీ ఆదాయం లక్ష కోట్లు పెరిగిందని, ఇప్పుడు అదేవిధంగా అదనపు వినియోగం పెరగకుండానే జీఎస్టీ ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తోంది. అన్ని శ్లాబులను పరిగణనలోకి తీసుకుంటే సగటున 9.5 శాతం పన్నురేటు వస్తోందని, సంస్కరణల తర్వాత ఎటువంటి అదనపు వినియోగం పరిగణనలోకి తీసుకోకుండానే ఈ రేటు ప్రకారం రూ.52 వేలకోట్ల అదనపు ఆదాయం.. అంటే కేంద్రానికి, రాష్ట్రాలకు చెరో రూ.26 వేలకోట్లు వస్తుందని ఎస్‌బీఐ పేర్కొంది. సంస్కరణల తర్వాత పెరిగే పన్ను చెల్లింపుదారుల సంఖ్య, రిటర్న్స్ సులభతరం చేయడం వంటి వాటితో ఈ ఆదాయం మరింత పెరుగుతుందని పేర్కొంది.

2025-26లో దక్షిణాది రాష్ట్రాల ఆదాయం ఇలా పెరుగుతుంది (రూ.కోట్లలో)

రాష్ట్రం	సంస్కరణలకు ముందు	సంస్కరణల అనంతరం	తేడా
ఆంధ్రప్రదేశ్	35,863	52,622	16,759
తెలంగాణ	42,075	50,779	8,704
కర్ణాటక	99,137	1,14,240	15,103
తమిళనాడు	72,309	89,200	16,891
కేరళ	24,786	32,758	7,972



పుష్టి.. నష్టి..

చిన్నారుల్లో పౌష్టికాహార లోపం

రాష్ట్రంలో అత్యధికంగా అల్లూరి జిల్లాలో 37.60 శాతం పిల్లల్లో ఎదుగుదల సమస్య

పౌష్టికాహార లోపంతో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, సత్యసాయి జిల్లాలు

కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడి



సాక్షి, అమరావతి: పౌష్టికాహార లోపంతో బాల్యం బక్కచిక్కిపోతోంది. ఎదుగుదల లోపం, బరువు తక్కువ, బక్కచిక్కిపోవడం వంటి సమస్యలతో ఐదేళ్లలోపు చిన్నారులు సతమతమవుతున్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఇదే దైన్యం. రాష్ట్రంలో పౌష్టికాహార లోపంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా ఎదుగుదల లోపం, బరువు తక్కువ, బక్కచిక్కిపోయిన పిల్లలు ఉన్నారు. అనంతరం కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఐదేళ్లలోపు పిల్లల పోషకాహార లోపం సూచికలను కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ ట్రాకర్ డేటా నుంచి ఈ వివరాలు సేకరించారు. జూన్‌లో దేశంలో 37.07 శాతం మంది ఐదేళ్లలోపు పిల్లలు ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. 15.93 శాతం పిల్లలు బరువు తక్కువగా ఉన్నారు. 5.46 శాతం మంది పిల్లలు బక్కచిక్కిపోయి ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహార లోపాలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ అభియాన్ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పోషణ్ ట్రాకర్ ద్వారా పౌష్టికాహారలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందిస్తున్నట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో దేశం మొత్తంమ్మీద 7.36 కోట్ల మంది పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరారని, వీరిలో 7 కోట్ల మందిలో ఎత్తు, బరువు, పెరుగుదల, పౌష్టికాహార లోపాలను గుర్తించడంతో పాటు వాటి నివారణకు అవసరమైన చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తీసుకుంటున్నాయని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఈ ఏడాది జూన్‌లో రాష్ట్రంలోని జిల్లాల్లో పోషణ్ ట్రాకర్ డేటా ద్వారా పోషకాహార లోపం సూచికలు ఇలా(శాతాల్లో)..

జిల్లా	ఎదుగుదల లోపం	బక్కచిక్కిన బాలలు	బరువు తక్కువ ఉన్న పిల్లలు
తూర్పు గోదావరి	11.12	3.36	4.80
విజయనగరం	12.39	3.82	5.80
పార్వతీపురం మన్యం	14.14	4.16	6.48
ఎన్టీఆర్	19.44	3.49	7.05
పశ్చిమగోదావరి	12.40	4.23	6.11
విశాఖపట్నం	12.11	4.78	5.30
బాపట్ల	15.26	3.96	5.58
అనకాపల్లి	18.91	5.98	8.05
ఏలూరు	17.20	4.71	8.05
కృష్ణా	21.87	4.68	7.60
నంద్యాల	19.82	4.36	9.43
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	19.63	7.08	9.65
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	17.14	4.08	6.84
కర్నూలు	14.26	3.21	5.68
కాకినాడ	17.55	4.77	7.32
గుంటూరు	24.45	4.83	7.84
చిత్తూరు	13.06	4.98	6.24
అన్నమయ్య	11.82	4.22	4.49
శ్రీకాకుళం	19.29	5.08	7.39
తిరుపతి	17.89	5.00	6.68
అనంతపురం	19.90	5.31	8.64
పల్నాడు	21.42	5.48	7.83
అల్లూరి సీతారామరాజు	37.60	11.55	21.87
వైఎస్సార్ కడప	23.00	5.32	8.38
ప్రకాశం	21.25	4.63	7.50
శ్రీ సత్య సాయి	22.08	6.15	8.25

• సాగర యాత్ర



ముగ్గురు అన్నదమ్ముల సాహసం



ఈ ముగ్గురున్నారే... వీరు స్కాట్‌లాండ్‌కు చెందిన అన్నదమ్ములు. పేర్లు లాచ్లాన్, జేమీ, ఈవాన్... వీళ్లు ఏం చేశారో తెలుసా? ఒక రోయింగ్ బోట్ తీసుకుని పెరు నుంచి ఆస్ట్రేలియా వరకు పసిఫిక్ మహా సముద్రంలో ప్రయాణించారు. ఎన్ని మైళ్లు? 9000 మైళ్లు. ఎన్ని రోజులు? 139 రోజులు. గంట సేపు నీళ్ల మీద ఉంటే ఎప్పుడు నేల మీదకు వద్దామా అనుంటుంది... అలాంటిది 139 రోజులు ఒక చిన్న పడవ మీద చేపలు పట్టుకు తింటూ, నిల్వ ఆహారం తింటూ తుఫాన్లను, రాకాసి అలలను తట్టుకుంటూ రావడం మాటలా? పైగా గ్రౌండ్ నుంచి వారికి ఎటువంటి సహాయమూ లేదు... సాంకేతిక సమాచారమూ లేదు. అయినా సరే ఈ అన్నదమ్ములు మొండిగా ప్రయాణించారు. వరల్డ్ రికార్డు సాధించారు. నీరు అందని ప్రజలకు శుభ్రమైన నీరు అందించేందుకు ఫండ్స్ సేకరించేందుకు వీరు ఈ యాత్ర చేశారు. వీరి సాహసాన్ని మెచ్చి 7 లక్షల పౌండ్లు (సుమారు ఎనిమిదిన్నర కోట్లు) జనం ఇచ్చారు. ఏప్రిల్‌లో మొదలైన వీరి యాత్ర ఆగస్టు 30న ముగిసింది. తీరం చేరుకుంటున్న ముగ్గురు అన్నదమ్ములు ఆనందంతో కేరింతలు కొట్టడం చూడండి. అందుకే సాహసం సేయరా ఢింబరా విజయం వరించునులే అన్నారు పెద్దలు.

• మహనీయులు

వచన కవితకు పితామహుడు...

కుందుర్తి ఆంజనేయులు



తెలుగునేలపై అనేకమంది కవులు రచనలు చేసి చిరస్థాయిగా నిలిచిపోయారు.అటు వంటివారిలో ఒకరు కుందుర్తి ఆంజనేయులు. ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఆయన్ని 'వచన కవితా పితామహుడు' అని పిలుస్తారు.

కుందుర్తి ఆంజనేయులు 1922లో గుంటూరు జిల్లా కోట వారిపాలెంలో జన్మించారు. చిన్ననాటి నుంచి ఆయనకు సాహిత్యంపై మక్కువ ఎక్కువ. వినుకొండలో చదువుకుంటున్న కాలంలో ప్రముఖ కవి గుర్రం జాషువా ఆయనకు తెలుగు పాఠాలు బోధించేవారు. అనంతరం విజయవాడ ఎస్.ఆర్.ఆర్.కళాశాలలో ప్రముఖ రచయిత విశ్వనాథ సత్యనారాయణ దగ్గర పాఠాలు నేర్చుకున్నారు. ఆ తరువాత గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల నుండి బీఏ చేశారు కుందుర్తి ఆంజనేయులు.

నరసరావుపేటలో నవ్యకళా పరిషత్తు స్థాపించిన కుందుర్తి అనంతరం దేవేంద్రపాడు గ్రామంలోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా, ప్రిన్సిపాలుగా పనిచేశారు. కొన్నాళ్ళు గుంటూరు పొగాకు మార్కెట్టులో పని చేశారు. 1958లో 'ఫ్రీవర్స్ ఫ్రంట్' స్థాపించారు. 1944లో ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి కందుర్తి అంజనేయులు మొట్టమొదటి కవితా సంకలనం నయగారా ప్రకటించాడు. వీరు నయగారా కవులుగా ప్రసిద్ధి చెందారు. కుందుర్తి అంజనేయులు 'సౌప్తికం', 'రసధుని', 'అమావాస్య', 'నా ప్రేయసి', 'తెలంగాణ', 'దండియాత్ర, 'నగరంలో వాన.... తదితర రచనలు చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డుతోపాటు 1969లో సోవియట్ లాండ్ నెహ్రూ పురస్కారాలు అందుకున్నారు ఆంజనేయులు. 1982లో ఆయన మరణించారు. ఏటా ఆయన పేరిట కవులకు పురస్కారాలు అందిస్తున్నారు.

నిర్మల్ కొయ్యబొమ్మలోచ్!

• హస్తకళలు











నిర్మల్ కొయ్యబొమ్మలు ఎప్పుడైనా చూశారా? చూసేందుకు ముచ్చటగా, అందంగా ఉన్న ఈ బొమ్మలు పిల్లలతో పాటు పెద్దలకూ చాలా నచ్చుతాయి. మరి వీటి గురించి తెలుసుకుందామా?

తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నిర్మల్ పట్టణంలో తయారు చేసే బొమ్మలనే 'నిర్మల్ బొమ్మలు' అంటారు. ఈ బొమ్మలకు సుమారు 400 సంవత్సరాల చరిత్ర ఉంది. 17వ శతాబ్దంలో నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమ ప్రారంభమైంది. ఈ బొమ్మలను తయారు చేసేవారిని 'నకాషీలు' అంటారు. వీటిని పొనికి కొయ్య(కర్ర)తో తయారు చేస్తారు. కాబట్టే వీటికి ఆ అందం వస్తుంది. 1830లో ఈ ప్రాంతాన్ని దర్శించిన యాత్రాచరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య నిర్మల్ బొమ్మల గురించి చాలా గొప్పగా రాశారు. 1955లో అప్పటి ప్రభుత్వం నిర్మల్ కొయ్య బొమ్మల సహకార సంస్థను ఏర్పాటు చేసింది. ఈ బొమ్మల తయారీలో వనమూలికలు, సహజమైన రంగులు ఉపయోగిస్తారు. అడవుల్లో దొరికే ఆకు పసర్లు ఉపయోగించి బంగారు రంగును తయారు చేస్తారు. అందుకే వీటిలో జీవకళ ఉట్టిపడుతుంది. ఈ బొమ్మలు మనదేశంలోనే కాక అంతర్జాతీయంగా కూడా ఖ్యాతిని గడించాయి. ఇక్కడి కళాకారులు తయారు చేసే బొమ్మల్లో పక్షులు, జంతువులు, కూరగాయలు, ద్రాక్షపండ్లు, లవంగాలు, యాలకులు, అగ్గిపెట్టె తదితరమైనవి ప్రసిద్ధి పొందాయి. దీంతోపాటు ఇక్కడి కళాకారులు వేసే పెయింటింగ్స్ కూడా అందర్నీ ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా నిర్మల్ కళాకారుల దేవతా చిత్రాలు ఎంతో పేరు పొందాయి.

• వండర్ కిడ్

ఏడేళ్లకే ఆపరేషన్ చేసిన

బాలమేధావి



చిన్నపిల్లలు ఆసుపత్రికి వెళ్లాలంటే భయపడతారు. అక్కడ డాక్టర్ తమకు ఇంజెక్షన్ ఇస్తాడేమోనని వణికిపోతారు. మందులు మింగాల్సి వస్తుందని, చేదుగా ఉంటాయని అనుకుంటారు. అయితే ఏడేళ్ల వయసులో డాక్టర్‌గా మారి ఆపరేషన్ చేసిన బాలుడి గురించి మీకు తెలుసా? అతనే అక్రిత్ ప్రాణ్ జస్వాల్.

హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని నూర్పూర్ అనే చిన్న పట్టణంలో పుట్టాడు అక్రిత్. చిన్న వయస్సు నుండే అతనిలో అసాధారణ ప్రతిభ ఉందని తల్లిదండ్రులు గుర్తించారు. ఇతర చిన్నారుల కంటే వేగంగా అన్ని అంశాలను నేర్చుకునేవాడు. రెండేళ్ల వయసులోనే పూర్తిగా చదవడం, రాయడం ప్రారంభించాడు. ఐదేళ్ల వయసులో రావాల్సిన సామర్థ్యం రెండేళ్లకే అతనికి సాధ్యమవడం విశేషం. అనంతరం ఆంగ్ల సాహిత్యం, గణితం వంటి అంశాలను సాధనం చేయడం ప్రారంభించాడు. ఐదేళ్లకే ఇంగ్లీష్ క్లాసిక్ పుస్తకాలను చదివాడు.

ఏడేళ్ల వయసులో అక్రిత్ కీలకమైన విజయం సాధించాడు. అది ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. 8 ఏళ్ల బాలిక చేతులపై కాలిన గాయాలతో ఇబ్బంది పడుతుండగా అతను విజయవంతంగా ఆపరేషన్ చేశాడు. అప్పటికే అతను వైద్యరంగానికి సంబంధించిన పుస్తకాలు బాగా చదివి ఉండటం చేత ఆ క్లిష్టమైన శస్త్రచికిత్సను ధైర్యంగా పూర్తి చేశాడు. వైద్యులు అతని ప్రతిభ చూసి ఆశ్చర్యపోయారు. ఆ బాలిక గాయాల నుంచి కోలుకోవడంతో అక్రిత్ పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగింది. విజయవంతమైన ఆపరేషన్ చేసిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. అనేక ఛానెళ్లు అతని ఇంటర్వ్యూ తీసుకున్నాయి. అలా అతని గురించి ప్రపంచానికి తెలిసింది. స్కూల్ చదువు పూర్తి చేసుకున్న తర్వాత ప్రస్తుతం అక్రిత్ ఐఐటీ కాన్పూర్‌లో చేరాడు. అక్కడ కూడా ప్రతిభ చాటుతూ అందరి ప్రశంసలూ పొందుతున్నాడు.

• కథ

ఆత్మానందం అంటే..







అనగనగా ఓ ఊరిలో రామయ్య అనే యువరైతు ఉండేవాడు. అతనికి ఆత్మానందం అంటే ఏమిటో తెలుసుకోవాలని, దాన్ని పొందాలని ఆశగా ఉండేది. తన ఊరికి ఎవరైనా స్వామీజీలు వస్తే ఆ విషయం అడిగేవాడు. అయితే ఎవరూ అతనికి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అతని సందేహం తీరలేదు.

ఒకసారి ఊరికి యోగీంద్రుడు అనే యువ సన్యాసి వచ్చాడు. అంత చిన్నవయసులో సన్యాసం తీసుకున్న అతణ్ని ఊరంతా గౌరవించి, ఆతిథ్యం ఇచ్చింది. రామయ్య ఆయన్ని కలిసి ఆత్మానందం అంటే ఏమిటని, అది పొందాలంటే ఏం చేయాలని అడిగాడు. దానికి యోగీంద్రుడు 'తప్పకుండా వివరిస్తాను. అయితే నేను ప్రస్తుతం కాశీకి ప్రయాణమవుతున్నాను. నా వెంట వస్తే మార్గమధ్యంలో వివరిస్తాను' అన్నాడు. రామయ్య మొహమాటపడుతూ 'అయ్యా! కాశీకి వెళ్తే తిరిగిరారని పెద్దలు అంటారు. నేనింకా బ్రహ్మచారిని. పెళ్లి చేసుకున్న తర్వాత తప్పకుండా మీ వెంట వస్తాను' అన్నాడు. సరేనని ఆత్మానందుడు కాశీకి వెళ్లాడు.

ఆ తర్వాత కొన్నేళ్ల తర్వాత యోగీంద్రుడు మరోసారి ఆ ఊరికి వచ్చాడు. అప్పటికి రామయ్యకు పెళ్లయ్యింది. ఈసారి కూడా రామయ్య ఆయన్ని కలిసి మరోసారి తన మనసులో సందేహాన్ని బయటపెట్టాడు. 'రామయ్యా! రేపు నేను ప్రయాగ వెళ్తున్నాను. ఈసారి నువ్వు నా వెంటరా. దారిలో నీకు ఆత్మానందం అంటే ఏమిటో చెప్తాను' అన్నాడు. దానికి రామయ్య 'అయ్యా! నా భార్య ప్రస్తుతం కడుపుతో ఉంది. ఈ సమయంలో తనను వదిలేసి రాలేను. ఈసారి తప్పక వస్తాను' అన్నాడు. సరేనన్నాడు యోగీంద్రుడు.

మరికొన్నేళ్ల తర్వాత యోగీంద్రుడు మరోసారి ఊరికి వచ్చాడు. ఈసారి రామయ్య మరోసారి ఆయన్ని కలిశాడు. తాను రామేశ్వరం వెళ్తున్నానని, ఈసారైనా తన వెంట రమ్మని పిలిచాడు యోగీంద్రుడు. 'స్వామీ! ఆడపిల్ల పెళ్లికి ఎదుగుతోంది. కొడుకులు చేతికొచ్చారు. ఈ సమయంలో నేను వారికి అండగా ఉండాలి. ఈసారి కూడా వదిలేయండి. వచ్చేసారి తప్పకుండా వస్తాను' అన్నాడు. సరేనని యోగీంద్రుడు తలాడించాడు.


ఆ తర్వాత చాలా ఏళ్లకు యోగీంద్రుడు ఆ ఊరికి వచ్చాడు. అప్పటికి యోగీంద్రుడు వృద్ధుడయ్యాడు. రామయ్యకు సైతం వృద్ధాప్యం మీదపడింది. కానీ మనసులో 'ఆత్మానందం' గురించిన సందేహం మాత్రం పోలేదు. యోగీంద్రుణ్ని కలిసి కుశలం అడిగాడు. అన్నీ వివరించాక 'ఈసారి తీర్థయాత్రలకు వెళ్తున్నాను రామయ్యా! మళ్లీ తిరిగి వస్తానన్న నమ్మకం లేదు. కాబట్టి ఈసారైనా నా వెంట వస్తే ఆత్మానందం అంటే ఏమిటో చెప్తాను' అన్నాడు ఆత్మానందుడు. దానికి రామయ్య 'అయ్యా! నా పెద్ద కొడుక్కి మొన్నే రెండో కొడుకు పుట్టాడు. చిన్నకొడుక్కి పాప పుట్టి నెలైంది. వారి ముద్దూముచ్చట చూడకుండా నేను మీ వెంట తీర్థయాత్రలకు వస్తే ఎలా? క్షమించండి' అన్నాడు.

దానికి యోగీంద్రుడు నవ్వి 'రామయ్యా! ఆత్మానందం అంటే ఏమిటని ఇన్నేళ్ల నుంచి సందేహపడుతున్నావు కానీ, ఇదే ఆత్మానందం అని తెలుసుకోలేకపోతున్నావు. ఎవరి పని వారు సక్రమంగా చేసి, అందులో తృప్తి పొందడమే ఆత్మానందం. పెళ్లి చేసుకొని, భార్యను పోషించి, బిడ్డల్ని సరైన రీతిలో పెంచి, వారికి బతుకుదెరువు చూపించి, చివరకు వారి పిల్లల ముద్దుముచ్చట్లు కూడా చూస్తున్నావు. ఇన్నేళ్లపాటు నువ్వు పొందిందంతా ఆత్మానందమే' అని వివరించాడు. ఆత్మానందం అంటే తన సంతోషమే, సంతృప్తి అని గ్రహించి సంతోషపడ్డాడు రామయ్య.

• మన పుస్తకాలు

బాలలకు మంచిని నేర్పే

పరోపకారి పాపన్న



తెలుగు బాల సాహిత్యంలో ప్రసిద్ధి పొందిన కథలు 'పరోపకారి పాపన్న కథలు'. చందమామ మాసపత్రికలో 1962 నుండి సీరియల్ రూపంలో ఈ కథలు ప్రచురితమయ్యాయి. కన్నడ జానపద సంప్రదాయాల నుండి పుట్టిన ఈ కథలు తెలుగు చిన్నారులకు చాలా ప్రియమైన కథలుగా మారాయి. ఇందులో ప్రతి కథ బాలలకు మంచిని నేర్పి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తోడ్పడుతుంది.

పావురాన్ని బస్సు నడపనిద్దామా.. వద్దా



మో విల్లెమ్స్ అనే అమెరికన్ రచయిత రాసిన పిల్లల పుస్తకం 'డోన్ట్ లెట్ ది పిజియన్ డ్రైవ్ ద బస్'. 2003లో డిస్నీ-హైపెరియన్ ప్రచురించిన ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా పేరు పొందింది. ఓ డ్రైవర్ బస్సును వదిలి బయటకు వెళ్లేటప్పుడు అక్కడ ఉన్న పావురాన్ని చూసి, దాన్ని బస్సు నడపనివ్వవద్దని పాఠకుడిని అడుగుతాడు. అయితే పావురం మాత్రం ఒక్కసారైనా బస్సు నడుపుతానని పాఠకులకు రకరకాల సాకులు చెప్తుంది. ఆద్యంతం ఆసక్తిగా సాగే ఈ పుస్తకానికి బొమ్మలు ప్రధాన బలం.

బిజినెస్ రీల్

యాంఫి కొత్త చైర్మన్‌గా సందీప్ సిక్కా
వైస్ చైర్మన్‌గా విశాల్ కపూర్



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) నూతన చైర్మన్‌గా నిప్పన్ ఇండియా లైఫ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ (ఏఎంసీ) సీఈవో అయిన సందీప్ సిక్కా ఎంపికయ్యారు. వైస్ చైర్మన్‌గా బంధన్ ఏఎంసీ సీఈవో విశాల్ కపూర్ ఎన్నికైనట్టు యాంఫి ప్రకటించింది. యాంఫి 30 వార్షిక సమావేశంలో వీరిని ఎన్నుకోగా, వెంటనే బాధ్యతలు చేపటినట్టు తెలిపింది. సందీప్ సిక్కా యాంఫి చైర్మన్ బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. 2013 నుంచి 2015 మధ్య కాలంలోనూ రెండేళ్ల పాటు ఆయన సేవలు అందించారు. దేశ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు రూ.75 లక్షల కోట్లకు దాటిపోవడం తెలిసిందే. ఈ తరుణంలో ఎన్నికైన నూతన నాయకత్వం.. పరిశ్రమను మరింత వృద్ధి దశలోకి తీసుకెళ్లాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. దేశంలోని మరిన్ని ప్రాంతాలకు మ్యూచువల్ ఫండ్స్‌ను విస్తరించడానికి ప్రాధాన్యం ఇస్తానని సందీప్ సిక్కా తెలిపారు. మరింత పారదర్శకత ద్వారా ఇన్వెస్టర్ల విశ్వాసం పొందుతామని.. సెబీ, విధాన నిర్ణేతలతో మరింత సమన్వయం చేసుకుని అందరికీ ఆర్థిక సేవల చేరువకు కృషి చేస్తామని చెప్పారు.

సీఎఫ్‌వో మోసంతో గేమ్స్‌క్రాఫ్ట్ లాభం డౌన్

న్యూఢిల్లీ: దాదాపు రూ. 231 కోట్లు స్వాహా చేశారన్న ఆరోపణలతో మాజీ సీఎఫ్‌వోపై ఆన్‌లైన్ గేమింగ్ సంస్థ గేమ్స్‌క్రాఫ్ట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్నాళ్లుగా ఆయన అనధికారిక ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు అందులో పేర్కొంది. వ్యక్తిగతంగా ఈక్విటీ, డెరివేటివ్స్ ట్రేడింగ్ కోసం కంపెనీ నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆయన ఓ ఈమెయిల్‌లో 'స్వచ్ఛందంగా అంగీకరించారు' అని గేమింగ్‌క్రాఫ్ట్ వెల్లడించింది. సదరు ఉద్యోగిని ఈ ఏడాది మే నెలలో కంపెనీ తొలగించింది. మాజీ సీఎఫ్‌వో మోసం నేపథ్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 4,009 కోట్ల ఆదాయంపై కంపెనీ లాభం రూ. 706 కోట్లకు పరిమితమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 28 శాతం జీఎస్‌టీ శ్లాబు కింద పూర్తి ఆర్థిక సంవత్సరానికి పన్నులు కట్టాల్సి రావడంతో పాటు సుమారు రూ. 231 కోట్ల మొత్తాన్ని ఖాతాల్లో సర్దుబాటు చేయాల్సి రావడం వల్ల లాభం తగ్గినట్లు కంపెనీ పేర్కొంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 3,475 కోట్లు కాగా లాభం రూ. 947 కోట్లుగా నమోదైంది. 2017లో ఏర్పాటైన గేమ్స్‌క్రాఫ్ట్ దశాబ్దం కన్నా తక్కువ వ్యవధిలోనే దేశీయంగా గేమింగ్ రంగ దిగ్గజంగా ఎదిగింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-9-2025	
విశాఖ	555-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
EICHERMOT	6,580.00	2.41
M&M	3,562.90	2.34
SHRIRAMFIN	595.65	1.68
MARUTI	14,903.00	1.64
DRREDDY	1,269.70	1.33

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ITC	407.9	-1.92
CIPLA	1,551.10	-1.69
HCLTECH	1,420.10	-1.61
TCS	3,048.00	-1.54
TECHM	1,478.00	-1.49

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,317
ఎన్‌ఎస్‌ఈ	81,938
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,44,788
ఎఫ్ఐఐ	- 1,305
డీఐఐ	+ 1,821

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	61.70	$ 63.48
బ్రెంట్	65.36	$ 66.99

సిమెంట్‌పై జీఎస్‌టీ కోత.. మౌలిక రంగానికి బూస్ట్!



- తగ్గనున్న ప్రాజెక్టుల వ్యయం
- నిర్మాణం వేగవంతం
- ప్రభుత్వ నిర్ణయంతో పరిశ్రమలో ఉత్సాహం

న్యూఢిల్లీ: సిమెంట్‌పై జీఎస్‌టీ రేటు తగ్గింపు మౌలిక రంగ ప్రాజెక్టులపై వ్యయ భారాన్ని తగ్గించనుంది. దీనివల్ల నగదు ప్రవాహాలు మెరుగుపడతాయని నిర్మాణ రంగ కంపెనీలు అభిప్రాయపడుతున్నాయి. మౌలిక రంగ ప్రాజెక్టుల నిర్మాణంలో సిమెంట్ కీలక ముడిపదార్థం అన్న విషయం విదితమే. ప్రస్తుతం సిమెంట్‌పై 28% జీఎస్‌టీ అమల్లో ఉండగా, దీన్ని 18 శాతానికి తగ్గిస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ఈ నెల 22 నుంచి అమల్లోకి రానుండడం గమనార్హం. ప్రభుత్వ నిర్ణయంతో పరిశ్రమలో ఉత్సాహం నెలకొంది. తమ నగదు ప్రవాహాలు మెరుగుపడతాయని ఇన్‌ఫ్రా కంపెనీలు పేర్కొన్నాయి.

ఆర్థిక వృద్ధికి ప్రేరణ...

''నిర్మాణంలోకి వినియోగించే కీలక ముడిపదార్థం అయిన సిమెంట్‌పై జీఎస్‌టీని తగ్గించాలన్నది చరిత్రాత్మక నిర్ణయం. రేట్ల క్రమబద్ధీకరణ మౌలిక వసతుల అభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి ప్రేరణనిస్తుంది'' అని పటేల్ ఇంజనీరింగ్ ఎండీ కవితా శివకుమార్ తెలిపారు. కీలక ముడిపదార్థంపై పన్ను తగ్గించడం రహదారుల రంగానికి ఊతం లభిస్తుందని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ పేర్కొంది. నిర్మాణ వ్యయాలను తగ్గిస్తుందని, తద్వారా నగదు ప్రవాహాలు పెరుగుతాయని, డెవలపర్ల ఆర్థిక పరిస్థితి బలోపేతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేసింది.

సకాలంలో ప్రాజెక్టుల నిర్మాణం

కేఈసీ ఇంటర్నేషనల్ ఎండీ విమల్ కేజ్రీవాల్ సైతం ఇదే విధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సిమెంట్‌పై జీఎస్‌టీ తగ్గింపుతో మూలధన నిధుల పరమైన వెసులుబాటు లభిస్తుందని (తక్కువ కేటాయింపులు), నగదు ప్రవాహాలు మెరుగుపడతాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం సకాలంలో పూర్తి అవుతాయని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధకు తోడు రేట్ల తగ్గింపుతో ప్రైవేటు మూలధన వ్యయాలకు ప్రేరణ లభిస్తుందని, ఈ రంగంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం సాధ్యపడుతుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం జాప్యంలో నిధుల పరమైన అవసరాలు కూడా ఒక కారణంగా ఉంటుండడం గమనార్హం. నిర్మాణంలోకి వినియోగించే కీలక ముడి పదార్థాలపై జీఎస్‌టీ తగ్గించడం వల్ల తయారీ వ్యయాలు గణనీయంగా తగ్గుతాయని, దీంతో ప్రాజెక్టుల నిర్మాణం వేగం పుంజుకుంటుందని యాక్షన్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (ఏసీఈ) ఈడీ సోరభ్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగం పరికరాలపై పన్ను రేటును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడాన్ని చరిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. దీనివల్ల రైతులకు, ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ''ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో 40–45 శాతం సిమెంట్ స్టీల్ కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. జీఎస్‌టీ రేటు మార్పుతో పన్ను భారం 10 శాతం మేర తగ్గుతుంది. దీంతో ప్రాజెక్టుల నిర్మాణం లాభదాయకంగా మారుతుంది. నిర్మాణం వేగవంతం అవుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి ఊతం లభిస్తుంది'' అని రోడిక్ డిజిటల్ అండ్ అడ్వైజరీ ఎండీ నాగేంద్ర నాథ్ సిన్హా పేర్కొన్నారు.

అదానీని వెనక్కినెట్టిన వేదాంతా
జైప్రకాష్ కొనుగోలు రేసులో ముందంజ



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న జైప్రకాష్ అసోసియేట్స్(జేఏఎల్) కొనుగోలు రేసులో అదానీ గ్రూప్‌ను మైనింగ్ దిగ్గజం వేదాంతా వెనక్కి నెట్టింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం విజయవంతంకాగలస్థాయిలో రూ. 17,000 కోట్ల విలువైన బిడ్ దాఖలు చేసింది. దీంతో జేఏఎల్ నికర విలువ రూ. 12,505 కోట్లకు చేరింది. రియల్టీ, సిమెంట్, విద్యుత్, హోటళ్లు, రహదారులు తదితర రంగాలలో కార్యకలాపాలు కలిగిన జేఏఎల్ రుణ చెల్లింపుల్లో విఫలంకావడంతో దివాలా చట్ట(ఐబీసీ) చర్యలకు లోనైన సంగతి తెలిసిందే. మరోపక్క ఐబీసీలో భాగంగా జేఏఎల్ విక్రయంపై రుణదాతలు సమావేశమవుతున్నారు. కాగా.. జేఏఎల్ రుణ పరిష్కార చర్యలలో భాగంగా పలు దిగ్గజాలు బిడ్స్ దాఖలు చేశాయి. అయితే అదానీ, వేదాంతా గ్రూప్‌లు మాత్రమే రేసులో ముందువరుసలో నిలిచాయి. జేఏఎల్ మొత్తం రూ. 57,185 కోట్ల రుణాలు చెల్లించవలసి ఉన్నట్లు రుణదాత సంస్థలు పేర్కొంటున్నాయి. పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ అధ్యక్షతన ఏర్పడిన రుణదాతల కన్సార్షియం నుంచి జాతీయ ఆస్తుల పునర్వ్యవస్థీకరణ కంపెనీ(ఎన్ఏఆర్‌సీఎల్) జేఏఎల్ రుణాలను సొంతం చేసుకున్న విషయం విదితమే. దీనిలో భాగంగా రుణదాతల జాబితాను సిద్ధం చేసింది.



గురుగ్రామ్‌లో కార్ల్స్‌బర్గ్ గ్రూప్ జీసీసీ

అంతర్జాతీయ బ్రూవరీ దిగ్గజం కార్ల్స్‌బర్గ్ గ్రూప్ భారత్‌లో తమ తొలి ఐటీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని గురుగ్రామ్‌లో ప్రారంభించింది. జీస్పాన్ నిర్వహించే ఈ సెంటర్‌ను గ్రూప్ సీఐవో ఎస్తేర్ వూ ప్రారంభించారు. తొలి దశలో గురుగ్రామ్, హైదరాబాద్ కార్యాలయాల్లో 300 మంది పైగా ప్రొఫెషనల్స్‌ను తీసుకోనున్నట్లు ఆమె వివరించారు. కార్ల్స్‌బర్గ్ గ్రూప్ సీటీవో అనురాగ్ పాండే, జీస్పాన్ ప్రెసిడెంట్ ఏపీ గ్రోవర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెక్స్‌మాకోతో జేవీకి ఆర్‌వీఎన్‌ఎల్ రెడీ

- ఆధునిక రైల్వే వ్యవస్థల అభివృద్ధికి సై
- నవంబర్‌కల్లా కార్యకలాపాలు షురూ



న్యూఢిల్లీ: ఆధునిక రైల్వే వ్యవస్థల అభివృద్ధికి నవంబర్‌కల్లా భాగస్వామ్య కంపెనీ(జేవీ)కి తెరతీయనున్నట్లు నవరత్న పీఎస్‌యూ.. రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్‌ఎల్) తాజాగా పేర్కొంది. ఇందుకు ప్రయివేట్ రంగ సంస్థ టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్‌తో ఇటీవలే ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనిలో భాగంగా జేవీ ఏర్పాటుకు అవసరమైన చట్టబద్ధ అనుమతులు తీసుకోవడంతోపాటు.. ఇతర కార్యక్రమాలను పూర్తి చేయనున్నట్లు ఆర్‌వీఎన్‌ఎల్ మెకానికల్ విభాగ ప్రధాన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనీష్ అగర్వాల్ తెలియజేశారు. తద్వారా నవంబర్‌కల్లా జేవీ కార్యకలాపాలు ప్రారంభించే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇకపై దేశ, విదేశాలలో తెరతీయనున్న రైల్వే ప్రాజెక్టులలో జేవీ పాలు పంచుకోనున్నట్లు వెల్లడించారు. ఇందుకు రెండు సంస్థలు ప్రాధాన్యతా ప్రాజెక్టులతోపాటు, వ్యాపార అవకాశాలను గుర్తించేందుకు సమాంతరంగా కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. యాడ్వెంట్ గ్రూప్ సంస్థ టెక్స్‌మాకోతో ఏర్పాటు చేయనున్న జేవీ ద్వారా రైల్వే రంగ తయారీ, డిజైన్ తదితర కార్యకలాపాలు చేపట్టనుంది. వీటిలో భాగంగా సరుకు రవాణా వేగన్ల నిర్వహణ, ప్రయాణికుల కోచ్‌లు, లోకోమోటివ్స్, మెట్రో కోచ్‌లు తదితరాల తయారీ, డిజైన్, నిర్వహణకు తెరతీయనుంది. అంతేకాకుండా రైల్వేలుసహా అనుబంధ విభాగాలలో ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టనుంది. రూ. 200 కోట్లతో జేవీ నెలకొల్పే ప్రణాళికలున్నట్లు మనీష్ వెల్లడించారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్ దాతృత్వం

హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ మరోసారి దాతృత్వం చాటుకుంది. చెన్నైలోని వర్షిని ఇల్లం ట్రస్ట్‌కి రూ.58,24,758 విరాళం అందజేసింది. తద్వారా సమాజంలోని నిరుపేద పిల్లలకు మొబైల్ పీడియాట్రిక్ థెరపీ సేవలు చేరవేసి, అవసరమైన సంరక్షణ, అభివృద్ధికి తన వంతు సాయం చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఆపదలో ఉన్న పిల్లలను ఆదుకొని జీవితాల్లో వెలుగులు నింపడం కోసం బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొంది.

లక్ష మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ: ఏఎండీ



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్లలో 1 లక్ష మంది గ్రాడ్యుయేట్లకు కృత్రిమ మేధ (ఏఐ), గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ) ప్రోగ్రామింగ్ నైపుణ్యాల్లో శిక్షణనివ్వనున్నట్లు కంప్యూటర్ చిప్స్ తయారీ సంస్థ ఏఎండీ తెలిపింది. అలాగే భారతీయ పరిశోధకులు, స్టార్టప్‌లకు 1 లక్ష గంటల పైగా డెవలపర్ క్లౌడ్ యాక్సెస్‌ను ఉచితంగా అందిస్తామని పేర్కొంది. కంప్యూటింగ్ సామర్థ్యాలను అందరికీ అందుబాటులోకి తేవడమనేది కొత్త తరం ఆవిష్కర్తలకు ప్రోత్సాహకరంగా ఉంటుందని, ఓపెన్-సోర్స్ కమ్యూనిటీని బలోపేతం చేసేందుకు తోడ్పడుతుందని ఏఎండీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మార్క్ పేపర్‌మాస్టర్ తెలిపారు. ప్రతిభావంతులైన భారతీయ ఇంజినీర్లు ఇప్పటికే అంతర్జాతీయంగా హై–పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, ఏఐని భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు తీర్చిదిద్దుతున్నారని ఏఎండీ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయా జగదీశ్ చెప్పారు. ఇందుకు అవసరమయ్యే అధునాతన సాధనాలు, పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు తమ ప్రోగ్రాం ఉపయోగపడుతుందని వివరించారు.

రెండు రోజుల పీఎస్‌బీ మంథన్
12న కేంద్ర ఆర్థిక శాఖ నిర్వహణ



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీలు) రెండు రోజుల మంథన్ కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ఈ నెల 12, 13వ తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనుంది. ప్రభుత్వరంగ బ్యాంక్‌ల చీఫ్‌లు, ఇతర ముఖ్య అధికారులు ఇందులో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తదుపరి తరం సంస్కరణలపై చర్చించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. చివరిగా 2022 ఏప్రిల్‌లో ఇదే తరహా కార్యక్రమం జరిగింది. సేవల అందుబాటును పెంచడం, అత్యుత్తమ సేవలకు సంబంధించి (ఈఏఎస్ఈ) సంస్కరణలను ఆర్థిక సేవల విభాగం మార్గదర్శకంలో చేపట్టొచ్చని పేర్కొన్నాయి. కస్టమర్ సేవలను ఎలా మెరుగుపరచాలి, డిజిటైజేషన్, హెచ్‌ఆర్ ప్రోత్సాహకాలు, కార్పొరేట్ గవర్నెన్స్, సహకారం విషయమైన తీసుకోవాల్సిన చర్యలను సూచించాలంటూ చివరి పీఎస్‌బీ మంథన్‌లో ఆరు వర్కింగ్ గ్రూప్‌లను ఏర్పాటు చేయడం గమనార్హం.

అర్బన్ కంపెనీలో 500 కోట్ల పెట్టుబడులు
జాబితాలో ఎస్‌బీఐ ఎంఎఫ్, ఆర్కోబాట్ క్యాపిటల్

న్యూఢిల్లీ: యాప్ ఆధారంగా బ్యూటీ, హోమ్ సర్వీసులందించే అర్బన్ కంపెనీలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్‌సహా మూడు సంస్థలు దాదాపు రూ. 500 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. జాబితాలో ఆర్కోబాట్ క్యాపిటల్ ఫండ్–1, టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ సంస్థ, ఇంటర్నెట్ ఫండ్ 5 పీటీఈ సైతం చేరాయి. వచ్చే వారం పబ్లిక్ ఇష్యూ చేపట్టనున్న అర్బన్ కంపెనీలో గత నెలలో ప్రైమీరా, ప్రోజస్ సైతం పెట్టుబడులు చేపట్టిన సంగతి తెలిసిందే. షేరుకి రూ. 103 ధరలో తాజా పెట్టుబడులకు తెరతీసినట్లు అర్బన్ కంపెనీ వెల్లడించింది. కాగా.. రూ. 1,900 కోట్ల సమీకరణకు కంపెనీ చేపడుతున్న ఐపీవో ఈ నెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ. 98–103కాగా.. కంపెనీ విలువ దాదాపు రూ. 15,000 కోట్లకు చేరనుంది. ఐపీవోలో భాగంగా రూ. 472 కోట్ల విలువైన షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 1,428 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. వీటిని యాక్సెల్ ఇండియా, ఎలివేషన్ క్యాపిటల్, బెసెమర్ ఇండియా క్యాపిటల్ హోల్డింగ్స్ తదితరాలు విక్రయించనున్నాయి.

20 ఏళ్ల పాత విమానాల దిగుమతికి డీజీసీఏ సుముఖత



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సరఫరా సమస్యల వల్ల విమానాల డెలివరీలపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో 20 ఏళ్ల పాత విమానాలను దిగుమతి చేసుకునేందుకు అనుమతించే అంశాన్ని ఏవియేషన్ రంగ నియంత్రణ సంస్థ డీజీసీఏ పరిశీలిస్తోంది. ఇందుకోసం సంబంధిత నిబంధనలను సడలించడంపై దృష్టి సారిస్తున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం ప్రెజరైజ్డ్ తరహా విమానాల దిగుమతికి 18 ఏళ్ల వరకు, అన్–ప్రెజరైజ్డ్ విమానాలకు 20 ఏళ్ల వరకు పరిమితులు ఉన్నాయి. ఈ పరిమితులను వరుసగా 20 ఏళ్లు, 25 ఏళ్లకు పెంచాలని ముసాయిదా ప్రతిపాదనల్లో పేర్కొన్నట్లు అధికారి వివరించారు. 10,000 అడుగుల పైన అత్యధిక ఎత్తులో ప్రయాణించగలిగే విమానాలను ప్రెజరైజ్డ్ విమానాలుగా, అంతకన్నా దిగువన ప్రయాణించే విమానాలను అన్‌ప్రెజరైజ్డ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా వ్యవహరిస్తారు. దేశీయంగా షెడ్యూల్డ్, నాన్–షెడ్యూల్డ్ కార్యకలాపాల కోసం విమానయాన సంస్థలు లీజుకు తీసుకున్న ఎయిర్‌క్రాఫ్ట్‌ల సంఖ్య 800 పైచిలుకు ఉన్నాయి. ఇటీవలి కాలంలో దేశీ విమానయాన సంస్థలు కార్యకలాపాలను విస్తరించేందుకు 1,400పైగా విమానాలకు ఆర్డర్లిచ్చాయి. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఏవియేషన్ మార్కెట్ అయిన భారత్‌లో 2030 నాటికల్లా ప్యాసింజర్ల రద్దీ రెట్టింపై 50 కోట్లకు చేరుతుందనే అంచనాలు నెలకొన్నాయి.

సెన్సెక్స్ మైనస్.. నిఫ్టీ ప్లస్

- మిశ్రమంగా ముగిసిన స్టాక్ సూచీలు
- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలు



ముంబై: రోజంతా లాభ, నష్టాల మధ్య ట్రేడైన సూచీలు, చివరికి ఫ్లాటుగా ముగిశాయి. సెన్సెక్స్ ఏడు పాయింట్లు నష్టపోయి 80,711 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏడు పాయింట్లు పెరిగి 24,741 వద్ద నిలిచింది. దీంతో వరుస రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 715 పాయింట్లు పెరిగి 80,321 – 81,037 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 24,621 వద్ద కనిష్టాన్ని, 24,832 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు, అమెరికా ఉద్యోగ గణాంకాల వెల్లడి ముందు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, టెక్, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి. ఆటో, టెలికమ్యూనికేషన్, మెటల్, కన్జూమర్ డిస్క్రెషనరీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ 0.09% పెరగ్గా, మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.10% నష్టపోయింది.
- జీఎస్‌టీ క్రమబద్ధీకరణ కారణంగా వాహన విక్రయాలు పుంజుకోవచ్చనే ఆశలతో ఆటో షేర్లు రాణించాయి. హ్యుందాయ్ మోటార్ 2.69%, ఐషర్ మోటార్స్ 2.43%, ఎంఅండ్ఎం 2.34%, అశోక్ లేలాండ్ 2.22% లాభపడ్డాయి. మారుతీ సుజుకీ 1.70%, టీవీఎస్ మోటార్ 1.28%, సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్ ఫోర్జింగ్స్ 0.80%, భారత్ ఫోర్జ్ 0.77%, టాటా మోటార్స్ 0.63%, బజాజ్ ఆటో 0.22%, హీరో మోటోకార్ప్ 0.21 శాతం పెరిగాయి.
- కార్బొనేటెడ్ పానీయాలకు 40% పన్ను వర్తింపజేయడంతో వరుణ్ బేవరేజెస్ షేర్ల పతనం కొనసాగింది. బీఎస్‌ఈలో ఈ షేరు 4% నష్టపోయి రూ.470 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 4.28% పతనమై రూ.468 వద్ద కనిష్టాన్ని తాకింది. గురువారం ట్రేడింగ్‌లోనూ ఈ షేరు 3% నష్టపోయిన సంగతి తెలిసిందే.
- జీఎస్‌టీ సంస్కరణల ప్రతిపాదన, ప్రకటనలతో ఈ వారమంతా పరుగులు తీసిన ఎఫ్ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఐటీసీ 3%, ఇమామి 3%, కాల్గేట్ 2.50% పతనమయ్యాయి. పతంజలి ఫుడ్స్, డాబర్ ఇండియా, హిందుస్తాన్ యూనిలివర్, గోద్రేజ్ కన్జూమర్ ప్రొడక్ట్స్, నెస్లే ఇండియా ఒకటిన్నర శాతం నష్టపోయాయి.

రికార్డు కనిష్టం నుంచి తేరుకున్న రూపాయి

ఇంట్రాడేలో రికార్డు కనిష్ట స్థాయి (88.38) నుంచి తేరుకున్న రూపాయి డాలర్ మారకంలో స్వల్పంగా మూడు పైసలు పెరిగి 88.09 వద్ద స్థిరపడింది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 88.11 వద్ద రూపాయి ట్రేడింగ్ మొదలైంది. భారత ఐటీ రంగ ఎగుమతులపై అమెరికా సుంకాలు విధించేందుకు సిద్ధమైందనే వార్తల నేపథ్యంలో 23 పైసలు క్షీణించి 88.38 వద్ద ఇంట్రాడే రికార్డు స్థాయి కనిష్టాన్ని నమోదు చేసింది. అయితే సంబంధిత వార్తా సంస్థ ఖండనతో దేశీయ కరెన్సీ తిరిగి కోలుకుంది.

భారీ నష్టాలలో స్పైస్‌జెట్
క్యూ1లో రూ. 238 కోట్లు



న్యూఢిల్లీ: అందుబాటు ధరల విమానయాన సర్వీసుల కంపెనీ స్పైస్‌జెట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 238 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 150 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం దాదాపు సగానికి క్షీణించి రూ. 1,191 కోట్లకు పరిమితమైంది. గతేడాది క్యూ1లో రూ. 2,067 కోట్ల టర్నోవర్ సాధించింది. విమానాలు నిలిచిపోవడం, విహార యాత్రలు(లీజర్ ట్రావెల్) నీరసించడం తదితరాలు ఆర్థికంగా దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది. పొరుగు దేశంతో తలెత్తిన అనిశ్చిత పరిస్థితుల కారణంగా కీలక మార్కెట్లలో విమాన రాకపోకలపై ఆంక్షలకు తెరలేవడం కంపెనీపై ప్రతికూల ప్రభావాన్ని చూపినట్లు స్పైస్‌జెట్ తెలియజేసింది. వెరసి లీజర్ ట్రావెల్ డిమాండ్ పడిపోయినట్లు వెల్లడించింది. వీటికి అంతర్జాతీయ సరఫరా సవాళ్లు, ఇంజిన్ ఓవర్‌హాల్ సమస్యలు, నిలిచిపోయిన విమానాల సర్వీసులు జత కలసినట్లు వివరించింది. అయితే కార్యకలాపాల పటిష్టతకు వ్యయ నియంత్రణ, నెట్‌వర్క్ విస్తరణ, విమాన సర్వీసుల పెంపు తదితర చర్యలను తీసుకుంటున్నట్లు స్పైస్‌జెట్ చైర్మన్, ఎండీ అజయ్ సింగ్ తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో స్పైస్‌జెట్ షేరు బీఎస్‌ఈలో 1.6 శాతం నష్టంతో రూ. 34 వద్ద ముగిసింది.

కరూర్ వైశ్యా బ్యాంక్ రుణ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: కరూర్ వైశ్యా బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్ఆర్) 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఆటో, వ్యక్తిగత రుణాలకు వర్తించే ఏడాదికాల ఎంసీఎల్ఆర్ రేటు 9.55 శాతం నుంచి 9.45 శాతానికి దిగొచ్చింది. ఒక నెల, మూడు నెలలు, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేట్లు 9.30–9.45 శాతం మధ్య ఉన్నాయి. ఎంసీఎల్ఆర్ ఓవర్‌నైట్ రేటు 9.25 శాతం నుంచి 9.15 శాతానికి తగ్గింది. కొత్త రేట్లు ఈ నెల 7 నుంచి అమల్లోకి వస్తాయని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కరూర్ వైశ్యా బ్యాంక్ వెల్లడించింది.



అర్జున్‌కు తొలి గెలుపు

సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): గ్రాండ్ స్విస్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి విజయం అందుకున్నాడు. శుక్ర వారం జరిగిన రెండో రౌండ్‌లో తెలంగాణకు చెందిన అర్జున్ 54 ఎత్తుల్లో హైక్ మార్టిరోస్యాన్ (అర్మేనియా)పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద, లియోన్, ఆర్యన్ చోప్రా, నిహాల్ సరీన్ కూడా రెండో రౌండ్‌లో విజయం సాధించారు. ప్రపంచ చాంపియన్ గుకేశ్, విదిత్, అభిమన్యు, రౌనక్, ప్రణవ్, నారాయణన్, పెంటేల హరికృష్ణ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. మహిళల విభాగం రెండో రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్ వైశాలి 22 ఎత్తుల్లో ఎలీనా (నెదర్లాండ్స్)పై గెలుపొందగా... జీజీసారా అనబయేవా (కజకిస్తాన్)తో జరిగిన గేమ్‌ను వంతిక అగర్వాల్ 84 ఎత్తుల్లో... నుర్గుల్ సలీమోవా (బల్గేరియా)తో జరిగిన గేమ్‌ను ద్రోణవల్లి హారిక 30 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు.

సాక్షి ప్లస్
శనివారం। 6-9-2025


శార్దుల్ ఠాకూర్ రజత్ పాటీదార్ శుభమ్ శర్మ

సౌత్‌జోన్ 536 ఆలౌట్

జగదీశన్ డబుల్ సెంచరీ మిస్ • రికీ భుయ్, తనయ్ ఫిఫ్టీలు • నార్త్ జోన్‌తో దులీప్ ట్రోఫీ సెమీస్

బెంగళూరు: నార్త్‌జోన్ బౌలర్లపై సౌత్ జోన్ బ్యాటర్లు సమష్టిగా ప్రతాపం చూపారు. దులీప్ ట్రోఫీలో భాగంగా ఇక్కడ జరుగుతున్న సెమీఫైనల్లో సౌత్ జోన్ సత్తా చాటింది. తొలిరోజు ఆటలో సెంచరీ సాధించిన ఓపెనర్ నారాయణ్ జగదీశన్ (352 బంతుల్లో 197; 16 ఫోర్లు, 2 సిక్సర్లు) త్రుటిలో డబుల్ సెంచరీ అవకాశాన్ని కోల్పోయాడు. అయితే ఆంధ్ర ప్లేయర్ రికీ భుయ్ (131 బంతుల్లో 54; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), హైదరాబాద్ ఆటగాడు తనయ్ త్యాగరాజన్ (116 బంతుల్లో 58; 4 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 169.2 ఓవర్లలో 536 పరుగుల భారీస్కోరు వద్ద ఆలౌటైంది. నార్త్ బౌలర్ నిశాంత్ సింధు 5 వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కంబోజ్‌కు 2 వికెట్లు దక్కాయి.

3 పరుగుల దూరంలో రనౌట్

రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 297/3తో శుక్ర వారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్‌కు బ్యాటర్లు బాధ్యతగా ఆడి భారీస్కోరు కట్టబెట్టారు. **మొదటి రోజు శతక్కొట్టిన** జగదీశన్ రెండో రోజు **ద్విశతకంగా మలచుకు**నే ప్రయత్నంలో సఫలం **కాలేకపోయాడు. ఓవర్‌**నైట్ బ్యాటర్లలో అజహరుద్దీన్ (11) **తన క్రితం** రోజు స్కోరుకే అవుట **య్యాడు. ఈ దశలో** జగదీశన్‌కు జతయిన రికీ **భుయ్ చక్కని భాగస్వామ్యా**నికి బాట వేశాడు. **ఇద్దరు క్రీజులో పాతుకు**పోవడంతో నార్త్ బౌలర్లు **పడరాని పాట్లే పడ్డారు.** ఈ జోడీ విడగొట్టేందుకు **చేసిన ప్రయత్నాలేవీ** ఫలించలేదు. చివరకు జట్టు **స్కోరు 385 వద్ద జగదీశ**న్ మూడు పరుగుల స్వల్ప **తేడాతో డబుల్ సెంచరీ** అవకాశాన్ని రనౌట్ రూపంలో **చేజార్చుకున్నాడు.** దీంతో ఐదో వికెట్‌కు 87 **పరుగుల భాగస్వామ్యం** ముగిసింది. తర్వాత కాసే **పటికే జట్టు స్కోరు 400** దాటగా, రికీ భుయ్ అర్ధ **సెంచరీ పూర్తి చేసుకు**న్న అనంతరం నిష్క్రమించాడు. తర్వాత తనయ్... సల్మాన్ (29; 4 ఫోర్లు) సహా... లోయర్ ఆర్డర్ బ్యాటర్లు గుర్జన్ ప్రీత్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) కౌశిక్ (11) సహకారంతో జట్టు స్కోరును 500 దాటించాడు. ఫిఫ్టీ పూర్తయ్యాక 528 స్కోరు వద్ద ఆఖరి వికెట్‌గా తనయ్ త్యాగరాజన్ నిష్క్రమించడంతో సౌత్ తొలి ఇన్నింగ్స్‌కు తెర పడింది.


జగదీశన్ రికీ భుయ్


తనయ్


నిశాంత్

సెంట్రల్ జోన్ దీటైన జవాబు

దానిశ్, శుభమ్ అర్ధ సెంచరీలు • వెస్ట్ జోన్ 438 ఆలౌట్ • దులీప్ ట్రోఫీ సెమీఫైనల్


బెంగళూరు: క్రీజులోకి దిగిన టాపార్డర్ బ్యాటర్లంతా రాణించడంతో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సెంట్రల్ జోన్ దీటైన జవాబిచ్చింది. వెస్ట్‌జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో దానిశ్ మాలేవర్ (136 బంతుల్లో 76; 12 ఫోర్లు, 1 సిక్స్), శుభమ్ శర్మ (148 బంతుల్లో 60 బ్యాటింగ్; 5 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసింది. వెస్ట్ బౌలర్లలో అర్జన్ నగ్వాస్‌వాలా, ధర్మేంద్రసింగ్‌లకు చెరో వికెట్ దక్కింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 363/6తో ఆట కొనసాగించిన వెస్ట్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 108 ఓవర్లలో 438 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ శార్దుల్ ఠాకూర్ (98 బంతుల్లో 64; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకం సాధించాడు. సారాంశ్ జైన్, హర్ష్ దూబే చెరో 3 వికెట్లు తీయగా, ఖలీల్ అహ్మద్‌కు 2 వికెట్లు దక్కాయి.

నడిపించిన శార్దుల్

వెస్ట్‌జోన్‌ను నాయకుడు శార్దుల్ ఠాకూర్ నడిపించాడు. **క్రితం రోజే అర్ధసెంచరీ బాదిన ఓవర్ నైట్ బ్యాటర్ తనుశ్ కొటియాన్ (166 బంతుల్లో 76; 6 ఫోర్లు) మరో 11 పరుగులే జత చేసినప్పటికీ ఇతని అండతో శార్దుల్ ధాటిగా ఆడాడు. ఓ భారీ** సిక్సర్‌తో అలరించిన ఠాకూర్, బౌండరీలతో వేగంగా పరుగులు రాబట్టాడు. దీంతో జట్టు స్కోరు 400 పరుగులు దాటింది. కాసేపటికి లేని పరుగుకు ప్రయత్నించి శార్దుల్ రనౌట్ కావడంతో ఆఖరి 4 వికెట్లు 27 పరుగుల వ్యవధిలోనే కూలాయి. తనుశ్‌తో పాటు ఆఖరి బ్యాటర్ అర్జన్ (3)లను హర్ష్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ధర్మేంద్రసింగ్ జడేజా (1) ఎల్బీ కాగా, తుషార్ దేశ్‌పాండే (18 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఓవర్‌నైట్ స్కోరుకు వెస్ట్ 75 పరుగులు జతచేసింది.

టాప్-4 సూపర్

అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలు పెట్టిన సెంట్రల్ జోన్‌కు టాప్-4 బ్యాటర్లు గొప్ప ఆరంభాన్నిచ్చారు. దానిశ్ మాలేవర్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆయుశ్ పాండే (59 బంతుల్లో 40; 8 ఫోర్లు) వన్డే తరహా ఆటతీరుతో బౌండరీలతో విరుచుకుపడ్డాడు. **వేగంగా ఆడే క్రమంలో జట్టు స్కోరు 67 పరుగుల వద్ద పాండే అవుట్ కాగా... తర్వాత వచ్చిన శుభమ్ శర్మ, దానిశ్‌లు చక్కని సమన్వయంతో జట్టు స్కోరును పెంచారు. ఇద్దరు ఆటు వికె**ట్‌ను కాపాడుకుంటూనే ఎంచక్కా పరుగులు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో వెస్ట్ బౌలర్లు వికెట్ల తీసేందుకు నానాకష్టాలు పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఓపెనర్ మాలేవర్ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. దుర్భేద్యంగా మారుతున్న ఈ భాగస్వామ్యాన్ని ఎట్టకేలకు ధర్మేంద్రసింగ్ విడగొట్టడంతో 160 పరుగుల వద్ద సెంట్రల్ రెండో వికెట్‌ను కోల్పోయింది. 93 పరుగుల రెండో వికెట్‌కు భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులో పాతుకుపోయిన శుభమ్ శర్మకు కెప్టెన్ రజత్ పాటీదార్ జతయ్యాడు. వీరిద్దరు కూడా అవలీలగా పరుగులు సాధిస్తూ జట్టు స్కోరును 200 పైచిలుకు పెంచారు. శుభమ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకొని అజేయగా నిలువగా... పాటీదార్ (59 బంతుల్లో 47 బ్యాటింగ్; 8 ఫోర్లు) 3 పరుగుల దూరంలో ఉన్నారు. ప్రస్తుతం 209 పరుగులు వెనుకబడి ఉన్న సెంట్రల్ జోన్ చేతిలో ఇంకా 8 వికెట్లున్నాయి.



అబ్రార్ 4-0-9-4

యూఏఈపై గెలుపుతో ఫైనల్లోకి పాకిస్తాన్

షార్జా: బ్యాటింగ్‌లో ఫఖర్ జమన్ (44 బంతుల్లో 77 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్సర్లు), స్పిన్ బౌలింగ్‌తో అబ్రార్ అహ్మద్ (4-0-9-4) పాకిస్తాన్‌ను గెలిపించి ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు చేర్చారు. టి20 ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ సిరీస్‌లో భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ 31 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై గెలుపొందింది. మొదట పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫర్హాన్ (16), అయూబ్ (11) విఫలమైనా... ఫఖర్ ధాటిగా ఆడాడు. ఆఖర్లో మొహమ్మద్ నవాజ్ (27 బంతుల్లో 37 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడాడు. అనంతరం 172 పరుగుల లక్ష్యంతో దిగిన యూఏఈ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 140 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ అలీషాన్ (51 బంతుల్లో 68; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. మిగిలిన బ్యాటర్లలో ఏ ఒక్కరు చెప్పుకోదగ్గ పరుగులే చేయలేకపోవడంతో జట్టుకు ప్రతికూలంగా మారింది. లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ యూఏఈ బ్యాటర్లకు స్పిన్ ఉచ్చు బిగించాడు. రేపు పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌ల మధ్య టైటిల్ పోరు జరుగనుంది.


స్టబ్స్‌ను రనౌట్ చేస్తున్న ఆర్చర్

27 ఏళ్ల తర్వాత...

ఇంగ్లండ్ గడ్డపై వన్డే సిరీస్ గెలిచిన దక్షిణాఫ్రికా

రెండో వన్డేలో 5 పరుగులతో ఓడిన ఇంగ్లండ్ • రాణించిన బ్రిట్జ్‌కీ, స్టబ్స్ • రేపు ఆఖరి వన్డే

లండన్: ఆఖరిదాకా ఉత్కంఠ రేపిన రెండో వన్డేలోనూ దక్షిణాఫ్రికానే విజయం సాధించింది. తద్వారా వరుస విజయాలతో మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో ఇంగ్లండ్‌పై సిరీస్‌ను కైవసం చేసుకుంది. 1998 తర్వాత ఇంగ్లండ్ గడ్డపై దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌ను సొంతం చేసుకోవడం విశేషం. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన రెండో వన్డేలో సఫారీ జట్టు 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ముందుగా దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 330 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మాథ్యూ బ్రిట్జ్‌కీ (77 బంతుల్లో 85; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (62 బంతుల్లో 58; 2 ఫోర్లు, 1 సిక్స్), మార్క్‌రమ్ (64 బంతుల్లో 49; 6 ఫోర్లు, 1 సిక్స్), బ్రెవిస్ (20 బంతుల్లో 42; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), కార్బిన్ బాష్ (32 నాటౌట్; 3 ఫోర్లు) సమష్టిగా రాణించారు. తన కెరీర్‌లో ఐదో వన్డే ఆడిన బ్రిట్జ్‌కీ వరుసగా నాలుగో అర్ధ సెంచరీ చేయడం విశేషం. న్యూజిలాండ్‌తో ఫిబ్రవరి 10న అరంగేట్రం వన్డేలో సెంచరీ (150) చేసిన బ్రిట్జ్‌కీ ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో 83, 57, 88, 85 పరుగులు చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్ 4, ఆదిల్ రషీద్ 2 వికెట్లు తీశారు. తర్వాత భారీ లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ దాదాపు గెలుపుతీరం దాకా కష్టపడింది. చివరకు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 325 పరుగులకు పరిమితమైంది. కేవలం 5 పరుగుల దూరంలో ఆగిపోయింది. ఆర్చర్ (14 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆఖరి దాకా జట్టును గెలిపించేందుకు విఫల ప్రయత్నం చేశాడు. అంతకుముందు రూట్ (72 బంతుల్లో 61; 8 ఫోర్లు), బట్లర్ (51 బంతుల్లో 61; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), బెతెల్ (40 బంతుల్లో 58; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీలు సాధించారు. బర్గర్ 3, కేశవ్ మహరాజ్ 2 వికెట్లు తీశారు. రేపు ఇరు జట్ల మధ్య ఆఖరి వన్డే జరుగుతుంది.


బ్రిట్జ్‌కీ

రాస్ టేలర్ రిటైర్మెంట్ వెనక్కి

సమోవా జట్టు తరఫున బరిలోకి

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ రాస్ టేలర్ 41 ఏళ్ల వయసులో మళ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేస్తున్నాడు. సమోవా జాతీయ జట్టు తరఫున అతను టి20 క్రికెట్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఒమన్‌లో జరిగే 2026 టి20 వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ కోసం ప్రకటించిన 15 మంది సభ్యుల సమోవా టీమ్‌లో టేలర్‌కు చోటు దక్కింది. ఒమన్‌లో ఈ టోర్నీ జరుగుతుంది. 2020 నవంబర్‌లో తన చివరి అంతర్జాతీయ టి20 ఆడిన టేలర్...కివీస్ తరఫున 102 మ్యాచ్‌లలో 122.37 స్ట్రయిక్‌రేట్‌తో 1909 పరుగులు చేశాడు. సుదీర్ఘ కెరీర్‌లో అతను మరో 112 టెస్టులు, 236 వన్డేల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. న్యూజిలాండ్‌కు సమీపంలోనే దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో సమోవా దేశం ఉంటుంది. 'పాలినేషియన్స్'గా పిలవబడే పురాతన తెగకు చెందిన టేలర్ తల్లి సమోవాలోనే పుట్టింది. అదే కారణంగా తన వంతుగా ఆ దేశానికి ఏదైనా చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టేలర్ వెల్లడించాడు.



జాబితా పెద్దదే...

టెస్టు క్రికెట్‌లో నవాబ్ ఆఫ్ పటౌడీ ఇఫ్తికార్ అలీ ఖాన్ భారత్, ఇంగ్లండ్ జట్లకు ప్రాతినిధ్యం వహించడం మొదలు పెద్ద సంఖ్యలో ఆటగాళ్లు వేర్వేరు కారణాలతో రెండేసి అంతర్జాతీయ జట్ల తరఫున ఆడారు. ఐసీసీలో శాశ్వత సభ్యత్వం ఉన్న రెండు పెద్ద దేశాలకు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లు ఇద్దరు మాత్రమే ఉండగా... ఎక్కువ మంది ఒక పెద్ద టీమ్, ఒక చిన్న టీమ్ తరఫున ఆడారు. కెప్లర్ వెసెల్స్ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తరఫున... ల్యూక్ రోంచి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తరఫున బరిలోకి దిగారు. ఇయాన్ మోర్గాన్, టిమ్ డేవిడ్, డేవిస్ వీస్, గ్యారీ బలాన్స్, వాన్ డర్ మెర్వ్, రస్టీ థెరాన్, జో బర్న్స్, డెర్న్‌బాక్, రాన్‌కిన్, ఎడ్ జాయిస్, కోరీ అండర్సన్, మార్క్ చాప్‌మన్, డర్క్ నేన్స్, గేరియంట్ జోన్స్, ర్యాన్ క్యాంప్‌బెల్ తదితరులు ఉన్నారు.



సొంతగడ్డపై ఆఖరి మ్యాచ్‌లో...

2 గోల్స్ చేసిన అర్జెంటీనా దిగ్గజం మెస్సీ

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ సొంతగడ్డకు ఘనంగా వీడ్కోలు పలికాడు. కెరీర్‌కు ఇంకా రిటైర్మెంట్ ప్రకటించనప్పటికీ అర్జెంటీనాలో మాత్రం ఇదే తన ఆఖరి పోరని ఇది వరకే స్పష్టం చేసిన మెస్సీ సొంత అభిమానులను 2 గోల్స్‌తో మురిపించాడు. దీంతో శుక్ర వారం జరిగిన దక్షిణ అమెరికా జోన్ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో అర్జెంటీనా 3-0తో వెనిజులాపై ఘనవిజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 39వ నిమిషంలో, ద్వితీయార్ధంలో 80వ నిమిషంలో మెస్సీ గోల్స్ కొట్టాడు. మరో గోల్‌ను మార్టినెజ్ (76వ నిమిషంలో) చేశాడు. మెస్సీ కుమారులు, కుటుంబసభ్యులు ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా మైదానానికి వచ్చి తిలకించారు. వచ్చే ఏడాది ప్రపంచకప్ కోసం దక్షిణ అమెరికా నుంచి తాజాగా ఉరుగ్వే, కొలంబియా, పరాగ్వే జట్లు మెగా ఈవెంట్‌కు అర్హత సాధించాయి. అర్జెంటీనా మార్చిలోనే క్వాలిఫై అయ్యింది.



రన్నరప్ అలీషా-వైష్ణవి జోడీ

ముగిసిన సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ టోర్నీ



సాక్షి, హైదరాబాద్: 79వ సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ కన్హ శాంతి వనంలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శుక్రవారం ముగిసింది. మహిళల డబుల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన అలీషా మహమూద్ ఖాన్-వైష్ణవి ఖడ్కేకర్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో తమిళనాడుకు చెందిన టాప్ సీడ్ రిదువర్షిణి రామస్వామి-సానియా సిందర్ జోడీ 21-16, 21-15తో అలీషా-వైష్ణవి జంటపై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వి.వెంకట హర్షవర్ధన్ రాయుడు-కండెరి నవ్య విజేతలుగా నిలిచారు. ఫైనల్లో హర్షవర్ధన్-నవ్య జంట 21-14, 21-14తో ప్రకాశ్ రాజ్-కర్నిక శ్రీ (కర్ణాటక) జోడీని ఓడించారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో కె. గోవింద్ (కేరళ)ను 21-12, 21-19తో ఓడించి సంజీవి రిత్విక్ (తమిళనాడు) విజేతగా నిలవగా... మహిళల సింగిల్స్ ఫైనల్లో మణిముత్తు షైనా (కర్ణాటక) 21-10, 21-23, 21-16తో రాజేశ్ లక్ష్య (కర్ణాటక)పై నెగ్గి టైటిల్ సాధించింది. పురుషుల డబుల్స్‌లో వి.వెంకట హర్షవర్ధన్ రాయుడు-కోడె విష్ణు కేదార్ (ఆంధ్రప్రదేశ్) జోడీ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో హర్షవర్ధన్-విష్ణు జంట 21-10, 20-22, 21-16తో మిథిలేశ్ కృష్ణన్-ప్రేజన (పుదుచ్చేరి)పై గెలుపొందారు. అండర్-19 కేటగిరీ బాలుర డబుల్స్‌లో తిప్పన చరణ్ రామ్-వీరంరెడ్డి హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్)...బాలికల డబుల్స్‌లో దేవనబోయిన దీపిక-దేవనబోయిన స్రవంతి (ఆంధ్రప్రదేశ్) టైటిల్స్ గెలుచుకున్నారు.

నీకు ఎంత ధైర్యం?

- ఐపీఎస్ అధికారిణిపై అజిత్ పవార్ ఆగ్రహం
- వీడియో వైరల్, తప్పుగా అర్థం చేసుకున్నారన్న ఎన్సీపీ



అంజనా కృష్ణ　　అజిత్ పవార్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నాయకుడు అజిత్ పవార్ వివాదంలో చిక్కుకున్నారు. ఐపీఎస్ అధికారిణిని ఆయన ఫోన్‌లో బెదిరించారు. 'నీకెంత ధైర్యం? నీపై చర్యలు తీసుకుంటాను'అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వీడియో వైరల్ కావడంతో ఎన్సీపీ స్పందించింది. పవార్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించింది. రెండు రోజుల కిందట షోలాపూర్‌లోని కర్మలా తాలూకా కుర్దు గ్రామంలో అక్రమంగా మొరం (రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే మట్టి)తవ్వకాలు జరుగుతున్నాయని అక్కడి సబ్-డివిజనల్ పోలీసు అధికారి అయిన అంజనా కృష్ణకు ఫిర్యాదు అందింది. వెంటనే ఆమె సంఘటనా స్థలానికి వెళ్లారు. గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈలోపు స్థానిక ఎన్సీపీ కార్యకర్తలు జోక్యం చేసుకుని.. అజిత్ పవార్‌కు ఫోన్ చేసి ఐపీఎస్ అధికారితో మాట్లాడించారు. ఈ సందర్భంగా అంజనా కృష్ణ మాట్లాడుతూ.. 'మీరు ఏమి చెబుతున్నారో నాకు అర్థమవుతోంది. కానీ నేను ఉప ముఖ్యమంత్రితో మాట్లాడుతున్నానో లేదో నాకు అర్థం కావడం లేదు. దయచేసి నా నంబర్‌కు నేరుగా కాల్ చేయండి'అని అన్నారు. ఆమె సమాధానం పవార్‌ను ఆగ్రహానికి గురిచేసింది. ఆయన ఎదురు దాడి చేశారు. 'నేను మీతో మాట్లాడుతుంటే.. మీరు నన్ను కాల్ చేయమని చెబుతున్నారు. మీరు నన్ను చూడాలనుకుంటున్నారు. మీకు ఎంత ధైర్యం?. నా నంబర్ తీసుకొని వాట్సాప్ కాల్ చేయండి'పవార్ అన్నారు. అయితే.. ఐపీఎస్ అధికారిణి ఆమే తన నంబర్‌ను ఉప ముఖ్యమంత్రికి ఇచ్చారు. ఆ తరువాత వీడియో కాల్ చేసిన పవార్.. మట్టి తవ్వకాలపై చర్యలు నిలిపేయాలని మందలించారు. అయితే.. తాను పవార్‌తో మాట్లాడుతున్నానని గుర్తు పట్టలేకపోయానని ఆమె చెప్పగా.. 'ఇప్పుడు ముఖం చూసి అయినా గుర్తు పట్టారా?'అని ప్రశ్నించారు.

ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పవార్‌ను రాజకీయంగా అప్రతిష్ట పాలు చేసేందుకు ఈ క్లిప్‌ను ఉద్దేశపూర్వకంగా లీక్ చేశారని ఎన్సీపీ ఆరోపించింది. అజిత్ పవార్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపింది. పార్టీ కార్యకర్తలను శాంతింపజేయడానికి అజిత్ దాదా ఐపీఎస్ అధికారిని మందలించి ఉండవచ్చని చర్యలను పూర్తిగా ఆపేయాలనేది ఆయన ఉద్దేశం కాదని రాష్ట్ర పార్టీ చీఫ్ సునీల్ తత్కరే అన్నారు. పవార్ ఎప్పుడూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వరని నొక్కి చెప్పారు. పరిస్థితిని అదుపు చేయడానికి మాత్రమే పవార్ ప్రయత్నించారని, వీడియోకు తప్పుగా చూపిస్తున్నారని పార్టీ ప్రతినిధి ఆనంద్ పరంజపే ఆరోపించారు.

జుకర్‌బర్గ్‌ల మధ్య కేసు

జుకర్‌బర్గ్‌పై జుకర్‌బర్గ్‌కేసు వేయడమేంటి? అనుకుంటున్నారు కదా! అవును నిజమే. అయితే.. ఇక్కడ కేసు వేసింది మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్‌పై అమెరికాకు చెందిన న్యాయవాది మార్క్ జుకర్‌బర్గ్ దావా వేశారు. ఇంతకీ కారణమేంటంటే.. నకిలీదంటూ తన ఖాతాను ఫేస్‌బుక్ బ్లాక్ చేయడంపై ఆయన కోర్టుకెక్కారు.

మార్క్ ఎస్ జుకర్‌బర్గ్ ఇండియానాకు చెందిన న్యాయవాది. గత ఎనిమిదేళ్లలో ఆయన ఫేస్‌బుక్ ఖాతా ఐదు సార్లు సస్పెండ్ అయ్యింది. ప్రతిసారీ నకిలీ ఖాతా అనే కారణాలతోనే బ్లాక్ చేసింది. ఇలా పదేపదే నిషేధాలు విధించడం వల్ల తన ప్రాక్టీస్‌కు హాని కలుగుతోందని, వేల డాలర్ల వ్యాపారం కూడా నష్టపోయానని మారియన్ సుపీరియర్ కోర్టులో కేసు దాఖలు చేశారు. తన ఫోటో ఐడీ, క్రెడిట్ కార్డులు, తన అనేక చిత్రాలతో సహా అన్ని రకాల గుర్తింపు రుజువులను అందించానని జుకర్‌బర్గ్ తెలిపారు. 'నేను మార్క్ స్టీవెన్ జుకర్‌బర్గ్, ఆయన మార్క్ ఎలియట్ జుకర్‌బర్గ్.. ఆయన బిలియనీర్‌గా ఎదగడానికంటే ముందునుంచే నేనున్యాయవాదిగా ఉన్నాను'అని మార్క్ ఎస్ జుకర్‌బర్గ్ తెలిపారు.



మెటా సీఈఓ జుకర్‌బర్గ్　　లాయర్ జుకర్‌బర్గ్

ఈ ఏడాది మే నెలలో ఆయన ఖాతా సస్పెండ్ అయ్యింది. ఆయన దావా వేసిన తర్వాత ఖాతా పునరుద్ధరించారు. మెటా తన తప్పును అంగీకరించింది. ఆయన ఖాతా పొరపాటున నిలిపివేశామని, ఆ తర్వాత పునరుద్ధరించామని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అంతేకాదు.. ఈ సమస్యపై మిస్టర్ జుకర్‌బర్గ్ చూపిన సహనాన్ని అభినందించిన కంపెనీ.. భవిష్యత్తులో ఇలా జరగకుండా చూసుకుంటామని తెలిపింది.

– ఇండియానాపొలిస్

ఆక్స్‌ఫర్డ్‌లో పెరియార్ చిత్రం

ఆవిష్కరించిన ఎంకే స్టాలిన్ • గొప్ప గౌరవమని వ్యాఖ్య



పెరియార్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్

లండన్: ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సామాజిక సంస్కర్త ఇ.వి. రామసామి పెరియార్ చిత్రపటాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఇది తన జీవితంలో గొప్ప గౌరవమని, ద్రవిడ నాయకుడి తత్వశాస్త్రానికి ప్రపంచ ఇచ్చిన గుర్తింపుగా అభివర్ణించారు. లండన్ ఆత్మగౌరవ ఉద్యమ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ, తమిళనాడు ముఖ్యమంత్రిగా, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) నాయకుడిగా మాత్రమే కాకుండా, ఆదర్శాల్లో పెరియార్ మనవడిగా కూడా తాను హాజరయ్యానన్నారు. పెరియార్ జాతి మొత్తానికి ఆత్మగౌరవాన్ని నేర్పించారని, అతని తత్వశాస్త్రం తమిళనాడు దాటి ప్రపంచవ్యాప్తంగా మానవాళిని ప్రేరేపించిందని చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ జ్ఞానాన్ని ఇవ్వడం మాత్రమే కాకుండా మానవ హక్కులను కూడా గౌరవిస్తోందని ప్రశంసించారు. లండన్‌లో ఉన్నప్పటికీ తాను తమిళనాడులోనే ఉన్నట్లుందని, అలాంటి అంతర్జాతీయ సదస్సును నిర్వహించినందుకు ప్రొఫెసర్లు ఫైసల్ దేవ్‌జీ, జేమ్స్ మాలిన్సన్, ఇతరులకు స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు. 1983లో ఆక్స్‌ఫర్డ్‌లో జరిగిన శతాబ్ది ఉత్సవాల తరువాత మరోసారి పెరియార్ హేతువాదం వెలుగు ఇక్కడ ప్రకాశించడం గర్వకారణమన్నారు. పెరియారిజం ఆత్మగౌరవం, హేతువాదం, సమానత్వం, మానవత్వం, మహిళా సాధికారత, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం నేర్పిస్తుందని, కుల, లింగ వివక్షతలను తిరస్కరిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. పెరియార్ గౌరవించే పదం ఆత్మగౌరవమని, ప్రపంచంలో ఏ నిఘంటువు తీసుకున్నా అంతకంటే శక్తివంతమైన పదం దొరకదని చెప్పారు. సామాజిక న్యాయం, మహిళల ఆస్తి హక్కులు, వితంతు పునర్వివాహం, కులాంతర వివాహాలు, అంటరానితనం నిర్మూలన కోసం ఆయన చేసిన ప్రచారాన్ని గుర్తుచేసుకున్నారు. సామాజిక సంస్కరణ ఉద్యమం రాజకీయ శక్తిగా ఎదిగిన ఏకైక రాష్ట్రం తమిళనాడని ఉద్ఘాటించారు. సిఎన్ అన్నాదురై ప్రవేశపెట్టిన ఆత్మగౌరవ వివాహ చట్టం నుంచి ఎం కరుణానిధి అమలు చేసిన సామాజిక న్యాయ సంస్కరణల వరకు పెరియార్ ఆలోచనలు అనేకం వరుసగా వచ్చిన ద్రావిడ ప్రభుత్వాల హయాంలో చట్టాలుగా మారాయని స్టాలిన్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో పండితులు ఎ.ఆర్. వెంకటాచలపతి, కార్తీక్ రామ్ మనోహరన్ సంకలనం చేసిన 'ది కేంబ్రిడ్జ్ కంపానియన్ టు పెరియార్'అనే ఆంగ్ల పరిశోధనా సంపుటిని కూడా ఆవిష్కరించారు.

9న భారత్‌కు మారిషస్ ప్రధాని

న్యూఢిల్లీ: మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర రామ్‌గులామ్ తొమ్మిది రోజుల పర్యటనకు గాను ఈ నెల 9వ తేదీన భారత్‌కు రానున్నారు. 16వ తేదీ వరకు జరిగే ఈ పర్యటనతో రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులు వంటి పలు కీలక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కానున్నాయి. ప్రధాని మోదీతో వివిధ అంశాలపై విస్తృత స్థాయి చర్చలు జరుపుతారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రామ్‌గులామ్ ముంబై, వారణాసి, అయోధ్య, తిరుపతిలను సందర్శిస్తారని పేర్కొంది. ముంబైలో జరిగే వ్యాపార కార్యక్రమంలో పాల్గొంటారంది. ప్రధాని మోదీ మార్చిలో మారిషస్‌లో పర్యటించడం తెల్సిందే.

ఆస్పత్రిలో చేరిన పంజాబ్ సీఎం మాన్

చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్(51) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. అలసట, పల్స్ రేటు పడిపోవడంతో మొహాలీలోని ఫోర్టిస్ ఆస్పత్రిలో చేరారని సీఎం కార్యాలయం తెలిపింది. ఆయనను వైద్యులు పరిశీలించి, వైద్య చికిత్సలు ప్రారంభించారని ఆస్పత్రి ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం హృదయ స్పందన మెరుగైందని తెలిపింది. నిపుణుల పర్యవేక్షణ కొనసాగుతోందని వెల్లడించింది. సీఎం మాన్ గురువారం నుంచి వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారని, పరిస్థితి మెరుగవకపోవడంతో ఆస్పత్రికి తీసుకు వచ్చారని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, పంజాబ్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఆప్ చీఫ్ కేజ్రీవాల్ సీఎం మాన్ శుక్రవారం ఉదయం ఆయన అధికార నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాలకు భారత్ సిద్ధం

- యూఎన్ జనరల్ అసెంబ్లీలో భారత రాయబారి పునరుద్ఘాటన

న్యూయార్క్: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించడానికి చర్చలు, దౌత్యమే పరిష్కారమని భారత్ మరోమారు స్పష్టం చేసింది. ఈ సంఘర్షణకు త్వరగా ముగింపు పలకడానికి అవసరమైన అన్ని దౌత్య ప్రయత్నాలకు భారత్ సహకరించడానికి సిద్ధంగా ఉందని ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారి పి. హరీశ్ పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్ ఆక్రమిత భూభాగాలపై యూఎన్ జనరల్ అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ఉక్రెయిన్ పరిస్థితిపై భారత్ ఆందోళన చెందుతూనే ఉంది. అమాయకుల ప్రాణాలుపోవడం ఆమోదయోగ్యం కాదని, యుద్ధభూమిలో ఎలాంటి పరిష్కారం దొరకదని మేం భావిస్తున్నాం' అని ఆయన అన్నారు. అంతేకాదు.. 'ఇది యుద్ధాల యుగం కాదు'అంటూ ప్రధానమంత్రి పదేపదే చెప్పిన విషయాన్ని హరీశ్ నొక్కి చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఇటీవల జరిగిన అలాస్కా శిఖరాగ్ర సమావేశాన్ని భారత్ ఆమోదించిందని, ఉక్రెయిన్, యురోపియన్ నాయకులతో తదుపరి చర్చలను స్వాగతించిందని ఆయన పేర్కొన్నారు. చర్చల ద్వారా యుద్ధం ముగించడమే లక్ష్యంగా పుతిన్‌తో, జెలెన్‌స్కీతో, యురోపియన్ నాయకులతో భారత ప్రధాని నరేంద్ర మోదీ సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. ఈ ప్రయత్నాలన్నీ ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణను ముగించి శాశ్వత శాంతికి నెలకొల్పుతాయని తాము విశ్వసిస్తున్నామన్నారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై ప్రభావం చూపుతోందని హరీశ్ హెచ్చరించారు.

మాకు 40 సీట్లివ్వాల్సిందే..!

- చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ పట్టు
- 25 వరకు ఇచ్చేందుకు బీజేపీ–ఆర్‌జేడీ సిద్ధం

సాక్షి, న్యూఢిల్లీ: మరికొద్ది రోజుల్లో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్డీయే భాగస్వామ్య పక్షం, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్ పాశ్వాన్)తో సీట్ల పంపకాలు కొలిక్కి రావడం లేదని తెలుస్తోంది. బిహార్ భవిష్యత్ ముఖచిత్రంలో తన మార్కును చాటుకునేందుకు ఉవ్విళ్లూరుతున్న చిరాగ్ తన పార్టీకి ఎక్కువ సీట్లు సాధించుకునేందుకు బీజేపీ, ఆర్‌జేడీలతో బేరసారాలు సాగిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల ఆధారంగా 40 సీట్లు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడంతో సీట్ల పంపిణీ పెండింగ్‌లో పడిందని సమాచారం.

పాశ్వాన్ అడుగులు పెద్ద పదవి వైపే...

2020 బిహార్ ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జేపీ 134 స్థానాల్లో పోటీ చేసినా ఒకే ఒక్క సీటును గెలుచుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం ఎల్‌జేపీ ఎన్డీయే కూటమి పొత్తుతో 6 శాతం ఓట్లతో 5 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుంది. హాజీపూర్ స్థానం నుంచి చిరాగ్ ఆర్‌జేడీ అభ్యర్థిపై ఏకంగా 1.70 లక్షల ఓట్ల తేడాతో గెలిచారు. కేంద్రమంత్రి అయ్యారు. బిహార్ ఎన్నికల్లో సైతం బీజేపీ, జేడీయూ నేతృత్వంలోని ఎన్డీయే కూటమితో కలిసి పోటీ చేసే అవకాశాలున్నాయి. బీజేపీ, జేడీయూలకు చెరో 100 సీట్ల చొప్పున 200 సీట్లు పోగా మిగిలిన 20–25 స్థానాలను ఎల్‌జేపీకి ఇస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆయన కనీసంగా 40 సీట్లు అడుగుతున్నారనే వాదనలు వినిపించాయి. ఇదే సమయంలో చిరాగ్ పాశ్వాన్ అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని, ఆయనకు డిప్యూటీ సీఎం పదవి లభించవచ్చనే వార్తలూ వస్తు న్నాయి. ఈ సమయంలోనే ఆయన 'బిహార్ ఫస్ట్..బిహారీ ఫస్ట్'నినాదాన్ని ఎత్తుకొని తనకు బిహార్ రాష్ట్రంలోనే రాజకీయాలు ఎక్కువ మక్కువని చెప్పకనే చెబుతున్నారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పేరును చెప్పకుండానే, తనను రాష్ట్రానికి రాకుండా ఆపేందుకు కుట్ర జరుగుతోందని గతంలో ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఎవ్వరికీ భయపడబోనని పేర్కొన్నారు. పట్నాలో ఇటీవల జరిగిన వ్యాపారవేత్త గోపాల ఖేమ్కా హత్యను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, సుపరిపాలను పేరుగాంచిన రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం ఏంటని నితీశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాశ్వాన్ ప్రకటనల వెనక ప్రధానంగా రాష్ట్రంలో బలహీన వర్గాల్లో తమ పార్టీకి ఉన్న పట్టు కోల్పోరాదని, ఢిల్లీ పేరు చెప్పి..క్షేత్రస్థాయిలో తమ ఉనికినే ప్రశ్నార్థకం చేసుకోరాదనే ఉద్దేశం ఉన్నట్లు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పట్టున్న తమ వర్గాలను జేడీయూ పూర్తిగా తనవైపు తిప్పుకుంటుండటం, మరికొందరు కీలక నేతలు ఎన్డీయే కూటమిలో ఇమడలేక ఆర్‌జేడీ వైపు మొగ్గు చూపుతుండటాన్ని ఇష్టపడని పాశ్వాన్ రాష్ట్రంలో పట్టును నిలుపుకునేందుకే 40 సీట్లపై పట్టు వదలడం లేదని అంటున్నారు. అయితే, సీట్ల పంపకాలపై మరో వారం పది రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



జపాన్‌కు చెందిన 102 ఏళ్ల కొకిచి అకుజవా ఇటీవల ఆ దేశంలోని ఫుజి పర్వత శిఖరాన్ని అధిరోహించారు. ఈ ఘనత సాధించిన అత్యంత వృద్ధుడైన వ్యక్తిగా ఈయన పేరు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చేరింది. ఆ సర్టిఫికెట్‌ను సగర్వంగా చూపుతున్న అకుజవా.

జోథ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ భేటీ ప్రారంభం

జోథ్‌పూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్ ఎస్), అనుబంధంగా ఉన్న 32 విభాగాల అగ్ర నేతల భేటీ శుక్రవారం రాజస్తాన్‌లోని జోథ్‌పూర్‌లో మొదలైంది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలెల సారథ్యంలో సంఘటన్ మంత్ర పారాయణంతో ఈ కార్యక్రమం మొదలైంది. జాతీయ సమైక్య త, జాతీయ భద్రత, విద్య, సమాజానికి సంబంధించిన అంశాలపై జరిగే చర్చల్లో ఆయా విభాగాల అధిపతులు ప్రతినిధులు సహా 320 మంది పాలుపంచుకోనున్నారు. జాతీయ విద్యా విధానం–2020కి సంబంధించి వివిధ విభాగాలు చేపట్టిన చర్యలపై సమీక్ష జరపనున్నారు. మూడు రోజులు కొనసాగే ఈ భేటీలో గిరిజనులను సాధారణ జన జీవన స్రవంతిలోకి తీసుకురావడంపైనా చర్చించనున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవ కార్యక్రమాలను నిర్ణయించనున్నారు. నాగ్‌పూర్‌లో అక్టోబర్ 2న జరిగే వందో అవతరణ వేడుకలకు ముఖ్య అతిథిగా మాజీ రాష్ట్రపతి కోవింద్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా లక్ష హిందూ సమ్మే ళనాలు, వేల సంఖ్యలో చర్చాగోష్ఠులను నిర్వ హించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది.

ఉప రాష్ట్రపతి పదవి రాజకీయ సంస్థ కాదు

- అది అత్యున్నత రాజ్యాంగ విభాగం
- ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధిస్తానన్న నమ్మకం ఉంది
- విపక్ష 'ఇండియా'అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి వెల్లడి

గౌహతి: ఉప రాష్ట్రపతి పదవి అనేది దేశంలో అత్యున్నత రాజ్యాంగ విభాగమే తప్ప రాజకీయపరమైన సంస్థ కాదని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి స్పష్టంచేశారు. త్వరలో జరుగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన విపక్ష 'ఇండియా'కూటమి అభ్యర్థిగా పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం అస్సాం రాజధాని గౌహతిలో మీడియాతో మాట్లాడారు. ఉప రాష్ట్రపతి పదవిలో కూర్చొనే వ్యక్తికి ఒక న్యాయమూర్తికి ఉండాల్సిన లక్షణాలు ఉండాలని చెప్పారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, మాటల్లో, చేతల్లో, ప్రవర్తనలో నిజాయతీ, పారదర్శకత ఉండాలని తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవికి సంబంధించి ఇవి తన అభిప్రాయాలని స్పష్టం చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పదవీ కాలం ముగియకముందే హఠాత్తుగా రాజీనామా చేయడంపై మీ అభిప్రాయం ఏమిటని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... వ్యక్తుల గురించి తాను మాట్లాడబోనని బదులిచ్చారు.

ఓటు హక్కును నిరాకరించొద్దు

భారత ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. అనుమానాలకు తావులేకుండా ఎన్నికల సంఘం పనిచేయాలన్నారు. ఓటు హక్కు వచ్చిన తర్వాతే దేశ పౌరులుగా మారినట్లు చాలామంది భావిస్తుంటారని గుర్తుచేశారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని పేర్కొన్నారు. ఓటు వేసే హక్కును నిరాకరించడానికి వీల్లేదన్నారు. ఓటర్ల జాబితాల్లో మార్పులు చేర్పులు సహజమేనని, రాజ్యాంగంలోనే ఆ అంశం పొందుపర్చారని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మధ్య ఎన్నో అంశాల్లో అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ.. ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించే విషయంలో వారు ఏకాభిప్రాయం వ్యక్తంచేశారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పౌరులంతా కచ్చితంగా పాల్గొనాలని వారు సూచించారని చెప్పారు. ఎన్నికల నుంచి ఓ వర్గాన్ని లేదా కులాన్ని పక్కనపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తాను భావించడం లేదన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అంశం ఇప్పుడు కోర్టు పరిధిలో ఉందని, దానిపై మాట్లాడడం సరైంది కాదని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి స్పష్టంచేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానన్న నమ్మకం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేసే సంప్రదాయం లేదన్నారు. నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవచ్చని చెప్పారు. పలు రాజకీయపార్టీలతోపాటు స్వతంత్ర్య ఎంపీలు సైతం తన అభ్యర్థిత్వానికి మద్దతు పలుకుతున్నారని వివరించారు. అస్సాం రాష్ట్రం ఒకప్పుడు తన కర్మభూమి అని చెప్పారు.

మైనర్‌ను 'నాన్-ఎర్నింగ్'గా పరిగణించరాదు

కనీస వేతనాల ఆధారంగానే ప్రమాద పరిహారం ఉండాలి

గుజరాత్ హైకోర్టు నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో శాశ్వత వైకల్యం పొందిన చిన్నారిని 'నాన్-ఎర్నింగ్'కేటగిరీలో చేర్చడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 90 శాతం వైకల్యం కలిగిన ఆ చిన్నారికి భారీ పరిహారం ఇవ్వాలని తీర్పు వెలువరించింది. కనీస వేతనం ఆధారంగా లెక్కించి పరిహారాన్ని రూ.35.90 లక్షలుగా నిర్ణయించింది. 2012లో ప్రమాదం జరిగిన సమయంలో బాలుడి వయస్సు 8 ఏళ్లు. నిర్లక్ష్యంగా అతివేగంతో ఓ వ్యక్తి వాహనం నడుపుతూ ఢీకొనడంతో బాలుడి మెదడులో రక్తస్రావమైంది. ఎడమ కాలును తీసేయాల్సి వచ్చింది. మోటారు వాహన ప్రమాదాల ట్రిబ్యునల్ పరిహారాన్ని రూ.3.9 లక్షలుగా నిర్ణయించగా, గుజరాత్ హైకోర్టు రూ.8.65 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చింది. దీనిపై బాలుడి తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల ధర్మాసనం.. చిన్నారులు ప్రమాదాల్లో శాశ్వత వైకల్యానికి గురైన, మృత్యువాతపడిన కేసులను నాన్ ఎర్నింగ్‌గా పరిగణించరాదని పేర్కొంది. ఈ మేరకు గుజరాత్ హైకోర్టు వెలువరించిన తీర్పును పక్కన బెట్టింది. 2012లో ప్రావీణ్య కార్మికుడి కనీస వేతనం రోజుకు రూ.227.85, నెలకు రూ.6,836గా ఉంది. ధర్మాసనం దీనినే ఆదాయంగా పరిగణించింది. దీనిపై 40 శాతం భవిష్యత్ అవకాశాలు కలిపి, పరిహారాన్ని 18 రెట్లుగా నిర్ణయించింది. పరిహారంలో భాగంగా నొప్పి, బాధలకు రూ.5 లక్షలు, వివాహ అవకాశాల నష్టానికి రూ.3 లక్షలు, కృత్రిమ అవయవానికి రూ.5 లక్షలు మంజూరు చేసింది. అంతేగాక ఇకపై మోటార్ యాక్సిడెంట్ కేసుల్లో ఆదాయం నిరూపించలేని పరిస్థితుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు కనీస వేతనాల షెడ్యూల్‌ను ట్రిబ్యునల్ ముందు సమర్పించడం తప్పనిసరని స్పష్టం చేసింది. ఈ ఆదేశం అన్ని హైకోర్టుల ద్వారా రాష్ట్రాల మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్ ట్రిబ్యునల్స్‌కు చేరాలని కూడా సూచించింది. పరిహారం మొత్తాన్ని సెప్టెంబర్ 30వ తేదీలోగా బాధిత బ్యాంకు అక్కౌంట్‌లో నేరుగా జమ చేయాలని ఆదేశించింది.



రామ్‌లల్లా సన్నిధిలో పూజలు చేస్తున్న త్సెరింగ్ టాబ్గే

అయోధ్యలో భూటాన్ ప్రధాని

అయోధ్య: భూటాన్ ప్రధానమంత్రి దషో త్సెరింగ్ టాబ్గే శుక్రవారం అయోధ్యలోని భవ్య మందిరంలో బాలరాముడిని దర్శించుకున్నారు. ఉదయం 9.30 గంటలకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానంలో అయోధ్యకు చేరుకున్న త్సెరింగ్‌కు ఉత్తరప్రదేశ్ మంత్రి సూర్యప్రతాప్ షాహీ, ఎమ్మెల్యే వేద్ ప్రకాశ్ గుప్తా ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన లక్నో–గోరఖ్‌పూర్ మార్గంలో ప్రత్యేక కాన్వాయ్‌లో అయోధ్య ఆలయానికి చేరుకున్నాయి. అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. రామ్‌లల్లా ఆలయంతోపాటు అయోధ్యలోని హనుమాన్ గార్హీని త్సెరింగ్ దర్శించుకున్నారు. ఆయన గౌరవార్థం అధికారులు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. అయోధ్యలో పర్యటన ముగిసిన తర్వాత త్సెరింగ్ మధ్యాహ్నం 1.30 గంటలకు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. భూటాన్ ప్రధానమంత్రి పర్యటనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేకంగా పర్యవేక్షించినట్లు అధికారులు తెలిపారు. భారత్, భూటాన్ మధ్య దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలున్నాయని ఉత్తరప్రదేశ్ మంత్రి సూర్యప్రతాప్ షాహీ పేర్కొన్నారు. భూటాన్ ప్రధాని పర్యటనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు.

శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలపై లుకౌట్ నోటీస్

ముంబై: రూ.60 కోట్ల మేర మోసానికి పాల్పడిన ఆరోపణలపై బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, భర్త రాజ్ కుంద్రాలపై ముంబై పోలీసులు శుక్రవారం లుకౌట్ నోటీస్ జారీ చేశారు. ఈ దంపతులు తరచూ విదేశీ ప్రయాణాలు చేస్తున్నందునే ఈ మేరకు నోటీసిచ్చినట్లు ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్(ఈవోడబ్ల్యూ) తెలిపింది. జుహూకు చెందిన దీపక్ కొఠారి అనే వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసగించారనే ఆరోపణల మేరకు వీరిపై ఆగస్ట్ 14న కేసు నమోదు చేసినట్లు పేర్కొంది. లుకౌట్ నోటీసు జారీ అయిన వ్యక్తి దేశం విడిచి వెళ్లేందుకు అవకాశముండదు. ఈ నోటీసుపై బోర్డర్, ఇమిగ్రేషన్ విభాగాలు ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాయి. శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలు బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఆన్‌లైన్ రిటైల్ కంపెనీకి డైరెక్టర్లుగా ఉన్నారు. వీరు రాజేశ్ ఆర్య అనే మధ్యవర్తి ద్వారా దీపక్ నుంచి పెట్టుబడి పేరుతో 2015లో రూ.75 కోట్లను రుణంగా తీసుకున్నారు. ఈ మొత్తాన్ని నెలవారీగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. అయితే, బెస్ట్ డీల్ కంపెనీ దివాలా తీయగా, తన నుంచి రుణంగా తీసుకున్న డబ్బును దంపతులు సొంత అవసరాలకు వాడుకున్నట్లు దీపక్ ఆరోపిస్తున్నారు. అయితే, శిల్పా శెట్టి దంపతులు ఆరోపణలను ఖండిస్తున్నారు. వివాదాన్ని ఎప్పుడో సెటిల్ చేసుకున్నామంటున్నారు.

రోడ్డు ప్రమాదంతో మహిళకు అబార్షన్

రూ.40.91 లక్షల పరిహారం ఇవ్వాలని ట్రిబ్యునల్ తీర్పు

న్యూఢిల్లీ: 2018లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కారణంగా అబార్షన్ అయిన మహిళ(41)కు పరిహారంగా రూ.40.91 లక్షల పరిహారం చెల్లించాలని మోటారు వాహన ప్రమాదాల ట్రిబ్యునల్ తీర్పు వెలువరించింది. ఓ వ్యక్తి అజాగ్రత్తతో వేగంగా వాహనం నడిపి తనను ఢీకొట్టాడని అన్ను కశ్యప్ అనే మహిళా టీచర్ ఫిర్యాదు చేశారు. ఈమె అప్పటికే మరుగుజ్జుతనం కారణంగా 40 శాతం వైకల్యంతో ఉన్నారు. ప్రమాదం వల్ల ఆరు నెలల గర్భ విచ్ఛిత్తి జరగడంతోపాటు తన వైకల్యం శాతం 84 శాతానికి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వహించలేని స్థితికి చేరుకున్నానన్నారు. కేసును పరిశీలించిన ప్రిసైడింగ్ అధికారి షెల్లీ అరోరా..'ఆమె వయస్సు, శారీరక వైకల్య తీవ్రత, మరోసారి గర్భం దాల్చేందుకు తక్కువగా ఉండే అవకాశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమె ప్రస్తుతం సొంతంగా ఎక్కడికీ వెళ్లలేని స్థితిలోకి చేరుకున్నారని వివరించారు. ఆమెకు అన్ని విధాలుగా కలిగిన నష్టాన్ని పరిగణనలోకి తీసుకుంటూ రూ.40.91 లక్షలు పరిహారంగా ఇవ్వాలని వాహన బీమా కంపెనీ అయిన ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్‌కు ఆదేశాలు జారీ చేశారు.

మద్యం అమ్మకాల్లో ఉత్తరప్రదేశ్ కొత్త రికార్డు



లక్నో: ఈ ఏడాది మద్యం అమ్మకాల్లో ఉత్తరప్రదేశ్ కొత్త రికార్డు సృష్టించింది. 2025 జనవరి నుంచి ఆగస్టు వరకు రూ.22,337 కోట్లు ఆదాయాన్ని సంపాదించింది. గతేడాది ఇదే సమయానికి వచ్చిన ఆదాయం కంటే.. రూ.3,021.41 కోట్లు అధిక ఆదాయం వచ్చింది. మద్యం వినియోగం పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం గణనీయంగా పెరిగింది. ఒక్క ఆగస్టు నెలలోనే ఆగస్టు నెలలోనే ఆ శాఖ రూ.3,754.43 కోట్లు ఆదాయం ఆర్జించింది. గతేడాది ఇదే నెలలో వచ్చిన ఆదాయం కంటే రూ.174.24 కోట్లు ఎక్కువ సాధించి.. తన ఆదాయ రికార్డును తానే బద్దలు కొట్టిందని ఎక్సైజ్ శాఖ సహాయ మంత్రి నితిన్ అగర్వాల్ చెప్పారు.

పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్ ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర

వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది పోర్చుగీసు వర్తకులు భారతదేశానికి వచ్చారు. 1503లో ఫ్రాన్సిస్-డి-అల్మీడా భారతదేశంలోని పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్‌గా నియామకమయ్యాడు. ఇతడు నీలి నీటి విధానం (Blue Water Policy)ను విస్తరింపజేశాడు. ఆల్ఫోన్సో-డి-ఆల్బ్‌కర్క్ 1509 నుంచి 1515 వరకు భారత్‌లో రెండో పోర్చుగీసు గవర్నరుగా పని చేశాడు. ఇతడు పోర్చుగీస్ సామ్రాజ్యానికి పునాదులు వేశాడు. గోవాను, పర్షియా సింధుశాఖలోని హార్మోజ్‌ను 1510లో ఆక్రమించాడు.

ఆంగ్లేయుల రాక..

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఫాదర్ థామస్ స్టీవెన్స్. ఇతడు 1579లో గోవా చేరాడు. 1600లో ఎలిజబెత్ రాణి (లండన్) అనుమతితో భారతదేశంలో వాణిజ్యం చేయడానికి 'ఈస్టిండియా కంపెనీ'ని స్థాపించాడు. 1611లో కెప్టెన్ జేమ్స్ హాకిన్స్ భారతదేశం వచ్చి మొదటి జేమ్స్ ఉత్తరంతో మొగలు పాదుషా జహంగీర్‌ను కలుసుకున్నాడు. జహంగీర్ అనుమతితో ఇతడు 1612లో సూరత్‌లో మొదటి కర్మాగారం స్థాపించాడు. తర్వాత అహ్మదాబాద్, ఆగ్రా, హుబ్లీ, కాశింబజార్, ఢాకాలో కర్మాగారాలు ఏర్పాటు చేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో ప్రధానంగా దుస్తులు, నల్లమందు వ్యాపారం చేసేవారు. పోర్చుగీసువారితో బ్రిటిషర్లకు ఆధిపత్య పోరు మొదలైంది. 1614లో ఈస్టిండియా కంపెనీవారు పోర్చుగీసువారిని 'సూరత్' సమీపంలో ఓడించారు. 1618లో మొదటి జేమ్స్ రాయబారిగా సర్ థామస్ (1615–19) జహంగీర్ ఆస్థానానికి వచ్చి రెండు 'ఫర్మానా'లు పొందాడు. వీటిలో మొదటిది భారతదేశంలో వాణిజ్యం చేసుకోవడానికి అనుమతించడం. రెండోది స్వదేశీ వాణిజ్యంపై సుంకాలు తగ్గించడం. దక్షిణ భారతదేశంలో మొదటి కర్మాగారాన్ని మచిలీపట్నంలో స్థాపించారు. 1641లో సెయింట్-జార్జికోట (మద్రాసు) ను నిర్మించారు. 1654లో ఇంగ్లిష్ కంపెనీ వాణిజ్య ఆధిపత్యాన్ని పోర్చుగీస్ గుర్తించింది. 1661లో పోర్చుగీస్‌వారు బ్రిటిష్ రాజైన రెండో చార్లెస్‌కు బొంబాయిని కట్నంగా ఇచ్చారు. 1698లో ఈస్టిండియా కంపెనీ సత్నాటి, కాలికట, గోవిందపూర్ ప్రెసిడెన్సీల్లో జమీందారీ హక్కులు పొందింది.

ఆ తర్వాత ఈ మూడు ప్రెసిడెన్సీలను కలిపి 'కలకత్తా' నగరాన్ని ఏర్పాటు చేశారు. 1690లో జాబ్ చార్నాక్ కలకత్తాకు శంకుస్థాపన చేశాడు. 1696లో ఇక్కడ జార్జి విలియం కోట నిర్మాణం మొదలైంది. 1746 నుంచి 1763 వరకు బ్రిటిషర్లు, ఫ్రెంచివారి మధ్య ఆధిపత్యం కోసం మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి. ఇందులో మూడో కర్ణాటక యుద్ధం (1758–63) ముఖ్యమైంది. 1760లో వాండివాష్ యుద్ధంలో ఇంగ్లిషువారు, ఫ్రెంచివారిని ఓడించి పూర్తి ఆధిపత్యం సాధించారు. 1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా కలకత్తా పోర్టును ఆక్రమించి చీకటి గది ఉదంతానికి కారకుడయ్యాడు. 1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి ఇంగ్లిషువారు కలకత్తాను తిరిగి ఆక్రమించుకున్నారు. 1759లో ఇంగ్లిష్ కంపెనీవారు డచ్‌వారిని బెదరా యుద్ధంలో ఓడించారు. 1764 బక్సార్ యుద్ధం విజయంతో ఉత్తర భారతంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఈ విజయం కారణంగా 1767లో బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటైంది. 1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని 14వ లూయీ మంత్రి కోల్బర్ట్ స్థాపించాడు. 1667లో ఫ్రాంకోయిస్ కరన్ 'సూరత్' ఫ్యాక్టరీని స్థాపించాడు. ఫ్రాన్సిస్కో మార్టిన్ 1673లో ముస్లిం గవర్నర్ నుంచి అనుమతి పొంది పాండిచ్చేరికి పునాదులు వేశాడు. ఇతడు 1764లో గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారు 1674లో షాయిస్థాఖాన్ నుంచి అనుమతి పొంది బాలాసోర్, కాశిం బజార్, చంద్రనాగూర్ వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. 1674లో డూప్లే పాండిచ్చేరి గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఇతడు రెండు ఆస్ట్రియా వారసత్వ యుద్ధాలు చేశాడు.

డచ్ కంపెనీ

డచ్చివారు యూరప్‌లోని హాలెండ్ (నెదర్లాండ్స్) దేశానికి చెందినవారు. వీరు 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వీరు తూర్పు ఇండియా సుగంధ దీవులపై దృష్టి కేంద్రీకరించారు. 1604లో గోల్కొండ నవాబు అనుమతితో మచిలీపట్నంలో మొదటి డచ్చి వర్తక స్థావరం ఏర్పాటు చేశారు. 1610లో పులికాట్ వద్ద స్థావరాన్ని నిర్మించుకున్నారు..

వారన్ హేస్టింగ్స్ (1772-85)

వారన్ హేస్టింగ్స్ 1772లో బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాడు. ఇతడు 1773 నుంచి 1785 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1773లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేశాడు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేశారు. దీంతో కంపెనీకి తూర్పుదేశ వర్తకంపై గుత్తాధిపత్యం లభించింది. వారన్ హేస్టింగ్స్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి భారతీయుడిని న్యాయాధిపతిగా నియమించాడు. న్యాయ సంస్కరణలలో భాగంగా ముఖ్యంగా జిల్లాల్లో 'దివానీ', 'ఫౌజ్‌దారీ' అదాలత్‌లను ప్రవేశపెట్టాడు. ప్రెసిడెన్సీ (కలకత్తా)లలో సాదర్, దివానీ సాదర్, నిజామత్ అదాలత్‌లను ఏర్పాటు చేసి హిందూ, ముస్లిం చట్టాలు అమలు చేశాడు. 1784లో బ్రిటిషర్లు పిట్స్ ఇండియా చట్టం చేశారు.

కారన్ వాలిస్ (1786-93)

ఇతడు సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. వివిధ స్థాయిల్లో కోర్టులను ఏర్పాటు చేశాడు. న్యాయశాఖ నుంచి పరిపాలన శాఖను వేరుపరిచాడు. 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాడు. న్యాయ విచారణ పద్ధతిని రాయించాడు. న్యాయ పద్ధతిపై కారన్ వాలీస్ కోడ్‌ను పొందుపరిచాడు. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించి రాజ్యంలో సగభాగాన్ని తీసుకున్నాడు.

సర్ జాన్‌షోర్ (1793-98)

శాశ్వత శిస్తు విధానంలో ఇతడి పాత్ర ప్రధానమైంది. జాన్‌షోర్ కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ 1793లో చార్టర్ చట్టం చేసింది.

లార్డ్ వెల్లస్లీ (1798-1805)

ఇతడు ఉద్యోగుల శిక్షణ కోసం 1800లో ఫోర్ట్ విలియం కళాశాల స్థాపించాడు. సంస్థానాధీశులను సామంతులుగా చేసుకున్నాడు. నాలుగో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించాడు. 1798లో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి మొదటగా హైదరాబాద్ నిజాం అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. వెల్లస్లీ రెండో మరాఠా యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఏర్పడింది.

◗ 1805 నుంచి 1807 వరకు జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా పని చేశాడు. ఇతడి కాలంలో వెల్లూరు తిరుగుబాటు జరిగింది.



మొదటి లార్డ్ మింటో (1807-1813)

ఇతడి కాలంలో 1813లో చార్టర్ చట్టం చేశారు. రంజిత్ సింగ్‌తో అమృత్‌సర్ ఒప్పందం చేసుకున్నాడు.

లార్డ్ హేస్టింగ్స్ (1813-1823)

ఇతడు నేపాల్ యుద్ధం, మూడో మరాఠా యుద్ధం చేశాడు. పీష్వా పదవి రద్దు చేశాడు. బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశాడు. పిండారులు అనే దారి దోపిడీదారులను అదుపులోకి తెచ్చాడు. బొంబాయి, మద్రాసులో రైత్వారీ పద్ధతి అమలుపరిచాడు. దీనికి సర్ థామస్ మన్రో, ఎల్ఫిన్‌స్టోన్ సహకరించారు. 1817లో కలకత్తాలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే హిందూ కళాశాలను స్థాపించాడు. 1813 చట్టంతో ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి చైనాతో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం చేసుకునే వెసులుబాటు కలిగింది. హేస్టింగ్స్ 1799లో పత్రికలపై ఆంక్షలు రద్దు చేశాడు.

లార్డ్ అమ్హెర్స్ట్ (1823-1828)

ఇతడి కాలంలో మొదటి బర్మా యుద్ధం జరిగింది. భరత్‌పూర్‌ను ఆక్రమించాడు.

విలియం బెంటింక్ (1828-1835)

ఇతడు గవర్నర్ జనరళ్లలో గుర్తింపు పొందిన వాడు. విలియం బెంటింక్ 'థగ్గులు' అనే దారి దోపిడీ దొంగలను అణచివేశాడు. మైసూర్ రాజును పదవి నుంచి తొలగించాడు. కాచర్, జైంషియా, కూర్గ్‌ను ఆక్రమించాడు. 1828లో బెంగాల్ రాష్ట్రానికే కాకుండా భారతదేశమంతటికీ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. 1829లో సతీసహగమనాన్ని నిషేధించాడు. పురిటిలో ఆడ పిల్లలను చంపడం లాంటి దురాచారాలను అదుపు చేశాడు. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు అర్హులని ప్రకటించాడు. బెంటింక్ కలకత్తాలో వైద్య కళాశాలను స్థాపించాడు. 1835లో మెకాలే అధ్యక్షతన న్యాయ సంఘాన్ని నియమించాడు. దీనికి సంబంధించి ఇంగ్లిష్ భాషలో విద్యా బోధన ప్రవేశపెట్టాడు. 1833లో చార్టర్ చట్టంతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఎత్తేశారు.

◗ 1835 నుంచి 1836 వరకు సర్ చార్లెస్ మెట్‌కాఫ్ గవర్నర్ జనరల్‌గా పని చేశాడు.

◗ 1836–42 మధ్య లార్డ్ ఆక్లాండ్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. ఇతడు అఫ్గానిస్తాన్‌లో బ్రిటిషర్ల పరాజయం ఫలితంగా పదవి కోల్పోయాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

మొదటి లార్డ్ హార్డింజ్ (1844-48)

ఇతడి కాలంలో మొదటి సిక్కు యుద్ధం జరిగింది. ఆంగ్ల మాధ్యమంలో చదివిన భారతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాడు. ఇతడు నరమేధాన్ని అణచివేశాడు.

లార్డ్ డల్హౌసి (1848-56)

ఇతడు రెండో సిక్కు యుద్ధం తర్వాత పంజాబ్‌ను ఆక్రమించాడు. రెండో బర్మా యుద్ధం తర్వాత బర్మా దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, సంబల్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్‌ను ఆక్రమించాడు. అయోధ్యను ఆక్రమించాడు. ఇతడి హయాంలో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో సంతాలులు తిరుగుబాటు చేశారు. ప్రతి రాష్ట్రంలో పబ్లిక్ వర్క్స్ శాఖను ప్రవేశపెట్టారు. 1854లో చార్లెస్ ఉడ్స్ అధ్యక్షుడిగా విద్యకు సంబంధించిన అంశాలపై కమిటీ ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ సూచనలతో విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయాల వరకు కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. 1853లో రైళ్లు, తంతి తపాలా, రోడ్డు రవాణా సౌకర్యాలు ప్రవేశపెట్టాడు. బొంబాయి నుంచి థానే వరకు మొదటి రైల్వే లైన్ వేశారు. కలకత్తా నుంచి పెషావర్ వరకు మొదటి తంతి నిర్మించాడు. 1854లో మొదటిసారిగా తపాలా బిళ్లలను ప్రవేశపెట్టాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. 1853లో చార్టర్ చట్టంతో పోటీ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం వ్యాపార సంస్థలకు.. వ్యాపారంలో తప్ప మిగతా విషయాలతో సంబంధం లేకుండా చేసింది. 1854లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు, కలకత్తాలో జనపనార మిల్లును స్థాపించారు.

లార్డ్ కానింగ్ (1856-62)

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ 1858లో ఒక చట్టం చేసింది. దీని ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 'వైస్రాయ్' పదవిని ఏర్పాటు చేశారు. లార్డ్ కానింగ్ 1858 చట్టం ప్రకారం తొలి రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. 1861లో ఇండియా కౌన్సిళ్ల చట్టం ప్రవేశపెట్టారు. 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేశారు. 1858లో భారత శిక్షాస్మృతి, 1861లో హైకోర్టు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1865లో లారెన్స్ మూడు హైకోర్టులను స్థాపించాడు. 1857లో కానింగ్ కలకత్తా, బొంబాయి, మద్రాసులో విశ్వవిద్యాలయాలు స్థాపించాడు. ఇతడి కాలంలో 1859లో శ్వేత సైనికుల విప్లవం, 1860లో నీలి మందు రైతుల తిరుగుబాటు, 1863లో పాబ్నా రైతుల తిరుగుబాటు చెలరేగాయి.

చెవులలోని మొత్తం ఎముకల సంఖ్య?

అస్థిపంజర వ్యవస్థ

అస్థిపంజరం.. ఎముకలతో నిర్మితమైన చట్రం. దీనిలో కొన్ని మృదులాస్థి నిర్మాణాలు కూడా ఉంటాయి. దేహభాగాలకు నిర్దిష్టమైన ఆకృతి, దృఢత్వాన్ని, మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్షణనిస్తూ శరీర కదలికల్లో అస్థిపంజర వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. మానవుడి దేహంలోని మొత్తం ఎముకలన్నింటినీ కలిపి అస్థిపంజరం అంటారు. అస్థిపంజరం అధ్యయనాన్ని ఆస్టియాలజీ అంటారు. ఎముకల్లో ఉండే ప్రొటీన్ ఆస్టిన్. మానవుడి అస్థిపంజరంలో 206 ఎముకలు ఉంటాయి.ఎముకలను ఏర్పర్చే కణాలు ఆస్టియోసైట్స్. ఎముకల్లో ఉండే మూలకాలు కాల్షియం, ఫాస్ఫరస్. ఎముకల్లో కాల్షియం ఫాస్ఫేట్ ఎక్కువగా, కాల్షియం కార్బొనేట్ తక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకకు దృఢత్వాన్నిస్తుంది. మానవ శరీరంలో అత్యధికంగా ఉండే మూలకం కాల్షియం. పాలు, గుడ్లు, ఆకుకూరల్లో కాల్షియం అధికంగా లభిస్తుంది. విటమిన్-డి కూడా చర్మం, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఎముకల మధ్య భాగంలో అస్థిమజ్జ ఉంటుంది. ఎరుపు రంగు అస్థిమజ్జ ఎర్ర రక్తకణాల (ఆర్‌బీసీ)ను ఉత్పత్తి చేస్తుంది. పక్షుల ఎముకల్లో అస్థిమజ్జ ఉండదు. వీటిలో గాలి ఉంటుంది. వీటిని వాతులాస్థులు (న్యుమాటిక్ బోన్స్) అంటారు. పక్షుల్లో ఆర్‌బీసీలను ఉత్పత్తి చేసే అవయవం బర్సా.

అస్థిపంజరం - రకాలు

1) బాహ్యాస్థిపంజరం
2) అంతరాస్థిపంజరం.

బాహ్యాస్థిపంజరం

బాహ్యాస్థిపంజరం జీవి దేహం బయట ఉంటుంది.

వివిధ జీవుల్లోని బాహ్యాస్థిపంజరం..

1) చేపలు - పొలుసులు
2) పక్షులు - ఈకలు
3) కోడిగుడ్లు - పెంకు
4) నత్తలు, ఆల్చిప్పలు, ప్రవాళాలు (కోరల్స్)- కర్పరం
5) కీటకాలు - స్క్లీరైట్స్
6) సకశేరుకాలు - రోమాలు, నఖాలు, కొమ్ములు, గిట్టలు మొదలైనవి. వీటిలో ఉండే ప్రొటీన్ ఆల్ఫాకెరాటిన్.

నోట్: క్యారెట్‌లోని విటమిన్-ఏను బీటా కెరోటిన్ అంటారు.

గోర్లను కత్తిరించినప్పుడు నొప్పి, బాధ అనిపించకపోవడానికి కారణం అవి మృతకణ జాలంతో తయారైన కొమ్ము వంటి పదార్థంతో ఏర్పడటం.

అంతరాస్థిపంజరం

అంతరాస్థిపంజరం దేహం లోపల ఉంటుంది. అస్థిపంజరంలోని ఎముకలు రెండు రకాలు. ఎ) మృదులాస్థి బి) అస్థి

మృదులాస్థి

మెత్తగా ఉండే ఎముకలను మృదులాస్థి ఎముకలు అంటారు. పిండదశలో ఎముకలన్నీ మృదులాస్థి నిర్మితాలు. శిశువు ఎదిగిన తర్వాత ఈ మృదులాస్థులు అస్థులుగా రూపొందుతాయి. మృదులాస్థిలో ఉండే ప్రొటీన్ 'కాండ్రిన్'. మృదులాస్థి అధ్యయనాన్ని కాండ్రాలజీ అంటారు.

మృదులాస్థి ఉండే భాగాలు..

1) ముక్కుకొన (నాసికాగ్రం)
2) వెలుపలి చెవి
3) వాయునాళంలోని 'సి' ఆకారపు ఉంగరాలు
4) కొండనాలుక
5) అంగిలి (ఇది నాసికాకుహరం, ఆస్యకుహారాన్ని వేరు చేస్తుంది)
6) సొరచేప అస్థిపంజరం

షార్క్ చేప కాలేయ నూనెలో విటమిన్ - ఎ, డిలు లభిస్తాయి.

అస్థి (బోన్)

అస్థి అంటే దృఢంగా ఉండే ఎముక.
చిన్నపిల్లల్లో 300 పైగా ఎముకలు ఉంటాయి.

	శరీర భాగం	ఎముకల సంఖ్య
1.	తల	29 (పుర్రె-22 హయాయిడ్ ఎముక-1, రెండు చెవులు-6)
2.	వెన్నుపూసలు	26 (చిన్నపిల్లల్లో- 33)
3.	పక్కటెముకలు/రిబ్స్	24
4.	రెండు చేతులు	60
5.	రెండు కాళ్లు	60

మొత్తం ఎముకల సంఖ్య (పెద్ద వారిలో) 206

గమనిక: ఉరి వేసుకున్న వారిలో హయాయిడ్ ఎముక విరుగుతుంది.

శైశవ దశలో 33 వెన్నుపూసలుంటాయి. తర్వాత వాటిలో చివరి 9 వెన్నుపూసలు (ఐదు కలిసి ఒక త్రికంగా, 4 కలిసి అనుమత్రికంగా) 2 వెన్నుపూసలుగా ఏర్పడతాయి.

కాబట్టి పెద్ద వారిలో ఉండే మొత్తం వెన్నుపూసల సంఖ్య 26

తలలోని ఎముకల గూడును పుర్రె అంటారు. పుర్రెలో మెదడు ఉండే పెట్టెవంటి నిర్మాణం కపాలం (క్రేనియం). కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు.

- కపాలంలోని ఎముకలు- 8
- ముఖంలోని ఎముకలు -14
- పుర్రెలో కదిలే ఎముక - 1
- కింది దవడ కదులుతుంది
- పుర్రెలో కదలని ఎముకలు- 21
- అతిపెద్ద ఎముక - ఫీమర్ (తొడ ఎముక)
- అతిచిన్న ఎముక - స్టెపిస్ (కర్ణాంతరాస్థి)



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

- పుర్రెలో అతిదృఢమైన ఎముక - కింది దవడ (మాండిబ్యూల్)
- అతి మెత్తని ఎముక - మృదులాస్థి

చేతి ఎముకలు:
ప్రతి చేయిలో 30 ఎముకలుంటాయి.
చేయిలో మూడు భాగాలు ఉంటాయి.

1) పై చేయి (భుజాస్థి ఎముక - హ్యూమరస్ 1)
2) ముంజేయి (రత్ని, అరత్ని ఎముకలు -2)
3) హస్తం
ఎ) మణిబంధాస్థులు -8
బి) కరబాస్థులు - 5
సి) చేతివేళ్లు - 14

గమనిక: రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్ల ఎముకలను ఫాలింజెస్ అంటారు.

కాలు ఎముకలు: ప్రతికాలులో 30 ఎముకలుంటాయి. కాలులో మూడు భాగాలున్నాయి.

1) తొడ: ఫీమర్ - 1
2) మోకాలు: టిబియా, ఫిబులా (అంతర్‌జంగిక, బహిర్జంగిక- 2)
3) పాదం
ఎ) చీలమండలం (టార్సల్స్)-7
బి) ప్రపాదాస్థులు-మెటాటార్సల్స్-5
సి) కాలివేళ్లు - ఫాలింజస్-14
డి) మోకాలి చిప్ప - పటెల్లా - 1

ఉరోమేఖల (పెక్టోరల్ గిర్డిల్): ఇది చేతులను అంటిపెట్టుకుని ఉంటుంది. ఉరోమేఖల / భుజ వలయంలో రెండు ఎముకలుంటాయి. అవి..

ఎ) జత్రుక (కాలర్ బోన్)
బి) అంస ఫలకం (స్కాపులా)
(ఇది త్రిభుజాకారంలో ఉంటుంది)

ఉరఃపంజరం: ఉరోస్థి ముందువైపు (రొమ్ము ఎముక), పక్కటెముకల ఇరువైపులా, వెన్నెముక వెనుకవైపు ఉండి గుండె, ఊపిరితిత్తులను రక్షిస్తుంది

శ్రోణిమేఖల (పెల్విస్ గిర్డిల్): ఇది కాలి ఎముకలను అంటుకుని ఉదరం కింది భాగంలో ఉంటుంది. కూర్చోవడానికి ఉపయోగపడుతుంది.

కీళ్లు (జాయింట్స్)

రెండు ఎముకలు కలిసే ప్రాంతాన్ని కీలు అంటారు.

రెండు ఎముకలను బంధించే కొల్లాజెన్ పోగులను లిగ్మెంట్ (స్నాయువు) అంటారు. ఎముకను కండరంతో బంధించే కొల్లాజెన్ పోగును టిండాన్ (స్నాయుబంధనం) అంటారు. కీళ్ల మధ్యలో సైనోవియల్ కుహరం ఉంటుంది. దీనిలో సైనోవియల్ ద్రవం ఉంటుంది. సైనోవియల్ ద్రవం కీళ్ల కదలికలో కందెనలా ఉపయోగపడుతుంది. ఎముకలు, దేహం కదలడానికి కీళ్లు తోడ్పడతాయి. కీళ్ల అధ్యయనాన్ని ఆర్థ్రాలజీ అంటారు. శరీరంలోమొత్తం 230 కీళ్లుంటాయి. కీళ్ల, ఎముకల వైద్య నిపుణుడ్ని ఆర్థోపెడిక్ డాక్టర్ అంటారు.

కీళ్లు - రకాలు

కీళ్లు రెండు రకాలు.

1) కదలని (స్థిరమైన) కీళ్లు

పుర్రెలో పైదవడ, కపాలానికి మధ్య ఉండే వి కదలని కీళ్లు

2) కదిలే కీళ్లు

పుర్రెలో కింది దవడ కదిలే కీలు.
ఇవి నాలుగు రకాలు. అవి..

బొంగరపు కీలు: ఇది మెడలో పుర్రె, వెన్నెముక కలిసే ప్రాంతంలో ఉంటుంది. మెడలో 7 ఎముకలు ఉంటాయి. బొంగరపు కీలు చేసే కోణం 180 డిగ్రీలు

నోట్: భరతనాట్యం చేసే వారిలో ఈ కీలు ఎక్కువగా ఉపయోగపడుతుంది.

బంతిగిన్నె కీలు: ఇది భుజం-దండచేయి, తొడ-కటివలయం ప్రాంతంలో ఉంటుంది. ఈ కీలు చేసే కోణం 360 డిగ్రీలు

నోట్: చేతులు, కాళ్లను ఈ కీలు వృత్తాకారంగా (గుండ్రంగా) తిప్పుతుంది.

మడతబందు కీలు: ఇది మోచేయి, మోకాలు, కాలు, చేతి వేళ్లకు మధ్య ఉంటుంది. ఈ కీలు చేసే కోణం – 90 డిగ్రీలు

నోట్: ఈ కీలు మోచేయి, మోకాలును ఒకేవైపు వంచుతుంది. తలుపులు, కిటికీలకు బంధించే నిర్మాణాలు మడతబందులు.

జారుడు కీలు: ఇది వెన్నెముకలోని వెన్నుపూసల మధ్య పక్కటెముకలు, మణికట్టులో ఉంటుంది.

నోట్: తాళం వేసేటప్పుడు, తీసేటప్పుడు, ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస సమయంలో అవసరమయ్యే కీలు జారుడు కీలు. నేలమీది ఉన్న వస్తువును వంగి తీసుకునేటప్పుడు (వెన్నుపూసలు) ఉపయోగపడేది జారుడు కీలు.

ఎముకలను నిర్వాత స్వేదనం చేసి ఎముకల బొగ్గును తయారుచేస్తారు. ఎముకల బొగ్గును చక్కెర పరిశ్రమలో విరంజనకారి (డీ కలరింగ్ ఏజెంట్)గా ఉపయోగిస్తారు..

ఎముకలు, కీళ్ల వ్యాధులు- వ్యాధి లక్షణాలు

- ఆర్థ్రైటిస్: కీళ్లవాపు, దీని నివారణకు తేనెటీగల విషాన్ని ఔషధంగా వాడుతారు.
- సర్వైకల్ స్పాండలైటిస్: మెడనొప్పి
- స్పాండలైటిస్: వెన్నునొప్పి
- ఆస్టియోఆర్థ్రైటిస్ : కీళ్లనొప్పి
- రుమటాయిడ్ ఆర్థ్రైటిస్: సైనోవియల్ ద్రవం లోపంతో వచ్చే కీళ్ల నొప్పి.
- ఆస్టియోపోరోసిస్: ఎముకలు పెలుసుగా మారడం.
- గౌట్ వ్యాధి: కీళ్లవాపు
- రికెట్స్ వ్యాధి: విటమిన్ డి లోపం వల్ల చిన్న పిల్లల్లో ఎముకలు వంగిపోవడం
- ఆస్టియోమలేషియా: విటమిన్ డి లోపంతో పెద్దవారిలో ఎముకలు పెలుసుగా మారడం
- ఫ్లోరోసిస్: ఫ్లోరిన్ నీటితో దంతాలు పసుపు రంగులోకి, ఎముకలు వికృత రూపంలోకి మారడం
- సైనోవిటిస్: చికెన్ గున్యా వ్యాధి వల్ల కీళ్లవాపు. ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మానవుడి శరీరంలో (పెద్దవారిలో) ఎముకల సంఖ్య?
1) 330 2) 260
3) 206 4) 220

2. మానవ శరీరంలోని అతి కఠిన భాగం?
1) దంతాలు 2) గోర్లు
3) ఎముకలు 4) ఎనామిల్

3. జంతువులలోని అస్థిమజ్జ నిర్వహించే క్రియ?
1) మూత్రపిండాలకు సహాయం
2) రక్తకణోత్పత్తి
3) కాలేయానికి సహాయం
4) రక్తపీడన నియంత్రణ

4. గోర్లను కత్తిరించినప్పుడు ఎందుకు నొప్పి కలగదు?
1) మృతకణజాలంతో తయారైన కొమ్మువంటి పదార్థం ఉండటం
2) శరీరంలో అనవసర భాగం
3) బహిష్కృత భాగంగా రూపాంతరం చెందడం
4) కాల్షియం ఫాస్ఫేట్‌తో తయారు కావడం

5. మనం చేతితో రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్లలోని ఎముకలు?
1) కార్పెల్స్
2) మెటాకార్పెల్స్
3) టార్సల్స్ 4) ఫాలింజెస్

6. ఎముకల అధ్యయన శాస్త్రం?
1) ఓటాలజీ 2) ఆస్టియాలజీ
3) ఆర్నిథాలజీ 4) అంకాలజీ

7. అప్పుడే పుట్టిన శిశువులో ఉండే ఎముకల సంఖ్య?
1) 300 2) 320
3) 330 4) 340

8. కింది వాటిలో మానవుడి వెన్నెముకకు సంబంధించిన వ్యాధి?
1) హైపోథార్మియా
2) కాటరాక్ట్
3) హెర్నియా
4) సర్వైకల్ స్పాండలైటిస్

9. మానవ శరీరంలో అతిపెద్ద ఎముక?
1) ఫిబులా 2) టిబియా
3) స్టెపిస్ 4) ఫీమర్

10. నీటిలో ఏ పదార్థం ఎక్కువ ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
1) ఫ్లోరిన్ 2) క్లోరైడ్
3) లెడ్ 4) ఏదీకాదు

11. చెవులలోని మొత్తం ఎముకల సంఖ్య?
1) 2 2) 4
3) 6 4) 8

12. మానవుడి పుర్రెలోని మొత్తం ఎముకల సంఖ్య?
1) 24 2) 22
3) 20 4) 21

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 1;
5) 4; 6) 2; 7) 1; 8) 4;
9) 4; 10) 1; 11) 3; 12) 2.

ఉస్మానియా ఆసుపత్రిని ఏ శైలిలో నిర్మించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాన్యుమెంట్స్ ఆఫ్ అసఫ్ జాహీ పీరియడ్

అసఫ్ జాహీలు 17వ శతాబ్దంలో మధ్యాసియా ప్రాంతం నుంచి భారతదేశానికి వచ్చి మొగల్ సామ్రాజ్యంలో ఉన్నత పదవులు అలంకరించారు. కుతుబ్‌షాహీల పతనం తర్వాత 1687-1724 వరకు హైదరాబాద్ నగరం మొగలుల ఆధీనంలో ఉంది. మొగల్ గవర్నర్ ఔరంగబాద్ నుంచి పరిపాలన చేపట్టాడు. చార్మినార్ వద్ద కుతుబ్‌షాహీలు నిర్మించిన అనేక కట్టడాలను మొగల్ సైన్యం నాశనం చేసింది. మరాఠాల దాడుల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు మొగలులు 1724లో నగరం చుట్టూ గోడల నిర్మాణాన్ని ప్రారంభించారు.

మొగల్ గవర్నర్‌గా మీర్ ఖమ్రుద్దీన్ నిజాం ఉల్ ముల్క్ 1724లో హైదరాబాద్‌లో 'అసఫ్‌జా' వంశాన్ని స్థాపించాడు. అసఫ్‌జాల నిర్మాణాలు హైదరాబాద్ నగర రక్షణ గోడలతోనే ప్రారంభమయ్యాయి. మీర్ ఖమ్రుద్దీన్ నిజాం-ఉల్-ముల్క్ ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్ రాజ్యాన్ని పరిపాలించాడు. 1740 నాటికి హైదరాబాద్ చుట్టూ రక్షణ గోడల నిర్మాణం పూర్తైంది. 1908లో మూసీ నదికి వచ్చిన వరదల వల్ల మొదటిసారిగా రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కొన్ని ద్వారాలు మాత్రమే ఉండగా, అవి కూడా అవసాన దశలో ఉన్నాయి.

డాబిర్‌పుర ద్వారం

హైదరాబాద్ చుట్టూ 17 ద్వారాలను నిర్మించారు. అందులో ముఖ్యమైన డాబిర్‌పుర ద్వారాన్ని 1724-40 మధ్య కాలంలో నిర్మించారు. హైదరాబాద్ రాజ్యంలోని పండితుల్లో ఒకరైన అబుస్ సమద్ డాబిర్-ఉల్-ముల్క్ పేరును ఈ ద్వారానికి పెట్టారు. 1750 నాటికి హైదరాబాద్ నగరం 2.25 లక్షల జనాభాతో దేశంలోనే ఎక్కువ జనాభా ఉన్న నగరంగా ఆవిర్భవించింది. 1763 తర్వాత అసఫ్ జాహీల కట్టడాల నిర్మాణం ఊపందుకుంది. అసఫ్ జాహీల కాలంలో నిర్మించిన కట్టడాల్లో పాయెగా సమాధులు, సైదానిమా సమాధి, చౌమొహల్లా ప్యాలెస్, పురానా హవేలి, బేగం బజార్, రేమండ్ సమాధి, గన్‌ఫౌండ్రి, బ్రిటిష్ రాజప్రతినిధి కోట, హైకోర్టు భవనం, ఆర్ట్స్ కాలేజీ భవనం, దివాన్ దేవిడీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి భవనం ముఖ్యమైనవి.

1748లో మీర్ ఖమ్రుద్దీన్ అసఫ్‌జా లాడ్ బజార్‌లో షాహీ జీలుఖానా ద్వారాన్ని నిర్మించాడు. ఈ నిర్మాణంలో రాజస్థానీ శైలిని వాడి పందిళ్లు, కిటికీలను నిర్మించారు. మరి మొగలుల శైలిలో తోరణాలు, ముఖద్వారాన్ని నిర్మించారు. 1724-40 మధ్య కాలంలో నిర్మించిన హైదరాబాద్ నగర కోటల్లో భాగంగా అలియాబాద్ సరాయిని మొదటి అసఫ్‌జా నిర్మించాడు. పాత నగర రక్షణ కోట



భాగాలను ఇప్పటికీ అలియాబాద్ పరిసర ప్రాంతాల్లో చూడవచ్చు.

రెండో అసఫ్‌జా కాలంలోని నిర్మాణాలు

1795లో మన్సీ రేమండ్ సహాయంతో ఫిరంగుల తయారీ పరిశ్రమను గన్‌ఫౌండ్రి పేరుతో అబిడ్స్ వద్ద నిజాం అలీఖాన్ నిర్మించాడు. గన్‌ఫౌండ్రి నిర్మాణంలో ఇటుకలు, మోర్టార్‌ను వాడారు.

మన్సీ రేమండ్ సమాధి

రెండో నిజాం రాజు నిజాం అలీఖాన్ సైన్యంలో ముఖ్యమైన ఫ్రెంచ్ అధికారి మన్సీ రేమండ్. ప్రజలు ఇతణ్ని ముసారాముడని పిలిచేవారు. ఇతడి పేరు మీద ముసారాంబాగ్ నిర్మాణం జరిగింది. 1798లో మన్సీ రేమండ్ మరణించాడు. ఇతడి సమాధిని యురోపియన్ శైలిలో 28 పిల్లర్లతో ముసారాంబాగ్ వద్ద నిర్మించారు. ఈ నిర్మాణంలో ఊదారంగు గ్రానైట్ రాయిని వాడారు.

పాయెగా (పాయిగా) సమాధులు

వీటి నిర్మాణాన్ని 1786లో ప్రారంభించారు. పాయిగా సమాధులను షమ్స్-ఉల్-ఉమ్రా సమాధులని కూడా అంటారు. హైదరాబాద్ రాజ్యంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులు పాయెగాలు. నిజాం అలీఖాన్ కాలంలో 1760 నుంచి 1803 వరకు షమ్స్-ఉల్-ఉమ్రా సర్వసైన్యాధ్యక్షుడిగా పనిచేశాడు. పాయెగా సమాధుల నిర్మాణంలో మొగల్, మూరిష్ శైలులను వాడారు. ఈ సమాధుల నిర్మాణంలో సున్నం, మోర్టార్‌ను ఉపయోగించారు. ఈ సమాధుల్లో రేఖాగణిత చిత్రాలు, పూలమొక్కల డిజైన్లు, పందిరి నిర్మాణాలు చూడవచ్చు.

పురానా హవేలి

రెండో నిజాం కాలంలో పురానా హవేలి నిర్మాణం ప్రారంభమైంది. పురానా హవేలి ప్రాంతాన్ని రుకును-ఉద్-దౌలా నుంచి నిజాం అలీ తీసుకొని తన కుమారుడైన సికిందర్ జా కోసం హవేలి (అంతఃపురం)ని నిర్మించాడు. ఈ హవేలిలోని ప్రధాన భవనాన్ని 18వ శతాబ్దం నాటి యురోపియన్ శైలిలో నిర్మించారు. పురానా హవేలి U ఆకారంలో ఉంటుంది. ప్రధాన భవనానికి రెండు వైపులా దీర్ఘచతురస్రాకారంలో ఒకదానికొకటి సమాంతరంగా ఈ భవనాలను నిర్మించారు. ఈ హవేలిలో ప్రపంచంలోనే అతిపెద్ద దుస్తుల అల్మారాను ఏర్పాటు చేశారు. సికిందర్ జా కొన్ని రోజులు ఇక్కడ నివసించి తర్వాత కిల్వత్ మహల్‌కు మారాడు. సికందర్ జా ఈ హవేలిని వదిలి పెట్టడం వల్ల పురానా హవేలి అని పేరొచ్చింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ పురానా హవేలిలో మ్యూజియంను ఏర్పాటు చేశాడు. పురానా హవేలిలోని అద్దాల భవనం చీని ఖానా (చైనా నుంచి తెచ్చిన అద్దాలతో నిర్మించిన భవనం) చెప్పుకోదగింది.

సికిందర్ జా (1803-1829) కాలంలోని నిర్మాణాలు

నిజాం రాజు సైన్య సహకార సంధిపై సంతకం చేసిన తర్వాత బ్రిటిషర్లు హైదరాబాద్‌లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ రాజప్రతినిధి అధికార నివాసాన్ని సుల్తాన్ బజార్‌లో నిర్మించారు. 1803లో జాన్ శామ్యూల్ రస్సెల్ రెసిడెన్సీ భవన డిజైన్ (ప్రణాళిక)ను రూపొందించాడు. 1803-04లో రెసిడెన్సీ భవన నిర్మాణం పూర్తైంది. ఆ సమయంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ రాజప్రతినిధిగా జేమ్స్ అకిలీస్ కిర్క్‌పాట్రిక్ ఉన్నాడు. ఈ నిర్మాణంలో యురోపియన్ శైలి కన్పిస్తుంది. ఈ భవనంలోని ప్రధాన కేంద్ర బ్లాక్‌ను జార్జియన్ శైలిలో నిర్మించారు. ఈ శైలిని అమెరికా అధ్యక్ష భవనమైన శ్వేతభవనంలో చూడవచ్చు. బ్రిటిష్ రాజప్రతినిధి నివసించే కోట ప్రాంతం వల్ల దానికి కోఠి అనే పేరొచ్చింది. ప్రస్తుతం ఈ భవనంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉమెన్స్ కాలేజీని నిర్వహిస్తున్నారు. 1803-29 మధ్య కాలంలో సికిందర్ జా వద్ద మిలటరీ అధికారిగా పనిచేసిన జామ్ సింగ్ కార్వాన్‌లో రాజస్థానీ శైలిలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

నాసిరుద్దౌలా (1829-57) కాలంలో నిర్మాణాలు

1839లో చాదర్‌ఘాట్ వద్ద మూసీనదిపై వంతెన నిర్మించారు. 1840-50 మధ్య కాలంలో సికింద్రాబాద్‌లో సెయింట్ మేరీ క్యాథడల్‌ను డేనియల్ మర్ఫి నిర్మించాడు. 1845లో హైదరాబాద్ రాజ్య పేష్కర్ రాజా చందులాల్ ఆల్వాల్ ప్రాంతంలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

భగవాన్ దాస్ గార్డెన్

భగవాన్ దాస్ గుజరాత్‌కు చెందిన వైశ్యుడు. ఇతడు కార్వాన్ వద్ద భగవాన్ దాస్ గార్డెన్ పెవిలియన్ నిర్మించాడు. రెండు అంతస్తుల ఈ భవనంలో ఆర్కేడ్ వరండాలు, బాల్కనీలను టిప్పు ప్యాలెస్ తరహాలో నిర్మించారు. ఈ గార్డెన్‌లో మొగల్, గుజరాతీ శైలిలో మేలు రకం టేకుతో చెక్క స్తంభాలు, పందిళ్లు, కిటికీలను నిర్మించారు.

అఫ్జల్-ఉద్-దౌలా కాలంలో నిర్మాణాలు (1857-69)

1857-61 మధ్య నయాపూల్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మించారు.

చౌమొహల్లా ప్యాలెస్

పర్షియా భాషలో చౌ అంటే నాలుగు అని అర్థం. అరబిక్ భాషలో మొహల్లా అంటే మహల్. చౌమొహల్లా అంటే నాలుగు మహల్‌లు ఉన్న ప్రాంతమని అర్థం. 1750లో సలాబత్‌జంగ్ చౌమొహల్లా ప్యాలెస్‌కు పునాది వేశాడు. 1869లో అఫ్జల్‌ద్దౌలా బహదూర్ చౌమొహల్లా నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని షా మహల్ తరహాలో చౌమొహల్లా ప్యాలెస్‌ను నిర్మించారు. ఈ ప్యాలెస్‌లో రెండు ప్రాంగణాలు ఉన్నాయి. ఉత్తర, దక్షిణ ప్రాంగణాల్లో సొగసైన రాజభవనాలు, గొప్ప రాజదర్బారు హాలు, ఫౌంటెన్లు, తోటలు ఉన్నాయి. ఉత్తర ప్రాంగణంలో బారా ఇమామ్ ఉంది. ఇందులో తూర్పువైపు పొడవైన కారిడార్, దాని పక్కనే విశాలమైన గదులు ఉన్నాయి. గతంలో పరిపాలన కోసం ఈ గదులను ఉపయోగించారు.

దక్షిణ ప్రాంగణంలో నాలుగు మహల్‌లు ఉన్నాయి. అవి అఫ్జల్ మహల్, మహతబ్ మహల్, తహ్నియత్ మహల్, అఫ్తాబ్ మహల్. వీటిలో అఫ్తాబ్ మహల్ అందమైంది. ఈ మహల్ ఉన్న గడియారాన్ని కిల్వత్ గడియారం అంటారు. చౌమొహల్లాలోని దర్బారు హాల్లో అతి ముఖ్యమైన అధికారులను నిజాం రాజులు కలుసుకునేవారు. ఈ దర్బారులో పురాతన రాత ప్రతులు, పుస్తకాలను ఉంచారు. ఆరో నిజాం గౌరవార్థం రోషన్ మహల్‌ను ఉత్తర ప్రాంగణంలో నిర్మించారు. కిల్వత్ మహల్‌లోని అతిగొప్ప నిర్మాణం గ్రాండ్ దర్బారు హాలు. ఇందులో మొగల్ శైలిలో గుమ్మటాలు (డోమ్‌లు), తోరణాలు నిర్మించారు. గోడలను పర్షియన్ శైలిలో అలంకరించారు. గ్రాండ్ దర్బారులో నిజాం రాజు సింహాసనం తక్త్-ఇ-నిషాన్‌ను ఉంచారు. దర్బారు హాలు ఫ్లోర్ అంతటినీ స్వచ్ఛమైన పాలరాయితో నిర్మించారు. 19 బెల్జియన్ క్రిస్టల్ షాండ్లియర్‌లను గ్రాండ్ దర్బారులో ఏర్పాటు చేశారు. నిజాం రాజులు తమ రాజకీయ, మత సమావేశాలు, పండుగలను గ్రాండ్ దర్బారులో నిర్వహించేవారు. 1906లో వేల్స్ రాకుమారుడు భారత్ వచ్చినప్పుడు అతడి గౌరవార్థం గ్రాండ్ దర్బారులో విందు ఏర్పాటు చేశారు.

మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911) కాలంలో నిర్మాణాలు

1874లో తొలి రైల్వేలైన్‌ను హైదరాబాద్ నుంచి వాడి వరకు బ్రాడ్‌గేజ్ నిర్మించారు. 1886లో బ్రిటిషర్లు చార్మినార్‌ను రక్షించాల్సిన కట్టడాల జాబితాలో చేర్చారు.

హజ్రత్ సైదానిమా సాహెబా సమాధి

మీర్ మహబూబ్ అలీఖాన్ ప్రభుత్వంలో ఉన్నతాధికారి అబ్దుల్ హక్ దిలేర్ జంగ్ తన తల్లి సైదానిమా సాహెబా మరణానంతరం హుస్సేన్ సాగర్ వద్ద ఆమె సమాధి నిర్మించారు. ఈ సమాధిని రెండు అంతస్తులుగా నిర్మించారు. గ్రాండ్ ఫ్లోర్‌లోని తోరణాలు, అలంకరణలు మొగల్ శైలిలో ఉన్నాయి. మొదటి అంతస్తు, గుమ్మటాన్ని కుతుబ్ షాహీల వాస్తుకళ లేదా శైలిలో నిర్మించారు.

ఛాత్తాబజార్‌లో సాలార్‌జంగ్-1 పేరు మీద దివాన్ దేవిడిని నిర్మించారు. ఇందులో మొగల్ శైలిలో రెండు ముఖద్వారాలు, అర్ధచంద్రాకార తోరణాలను నిర్మించారు.

అసెంబ్లీ భవనం

మీర్ మహబూబ్ అలీఖాన్ 40వ జన్మదినాన్ని పురస్కరించుకొని 1905లో టౌన్‌హాల్ నిర్మాణాన్ని ప్రారంభించి 1923లో పూర్తి చేశారు. దీన్ని పర్షియన్, రాజస్థానీ శైలిలో నిర్మించారు. తర్వాతి కాలంలో నిజాం ప్రభుత్వం ఈ హాలును శాసనసభగా మార్చింది.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-1948) కాలంలో నిర్మాణాలు

1866లో రాజ కుటుంబీకులు, భూస్వాముల కోసం అఫ్జల్‌గంజ్‌లో 30 పడకల ఆసుపత్రిని నిర్మించారు. 1908లో మూసీనదికి వచ్చిన వరదల వల్ల ఈ ఆసుపత్రి ధ్వంసమైంది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ రూ. 20 లక్షల వ్యయంతో నూతన ఆసుపత్రి భవనాన్ని అఫ్జల్‌గంజ్‌లో నిర్మించాడు. ఆయన పేరుమీద ఈ ఆస్పత్రికి ఉస్మానియా జనరల్ ఆసుపత్రిగా నామకరణం చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని ఇండో-సార్సనిక్ శైలిలో నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి విన్సెంట్ జెరోమ్ ఏస్స్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశాడు. ఇతడు నగర ఉన్నత పాఠశాల, హైదరాబాద్ రైల్వేస్టేషన్, హైకోర్టు భవనాలను కూడా రూపొందించాడు.

కింగ్ కోఠి ప్యాలెస్

1911లో కమల్ ఖాన్ తన సొంత అవసరాల కోసం సుల్తాన్‌బజార్ ప్రాంతంలో నూతన ప్యాలెస్‌ను నిర్మించాడు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు ఈ ప్యాలెస్ నచ్చింది. దాంతో కమాల్ ఖాన్ వద్ద నుంచి ప్యాలెస్‌ను పొందాడు. ఉస్మాన్ అలీఖాన్ ఒక ఫర్మానా ద్వారా ఆ ప్రాంతానికి కింగ్ కోఠి అని నామకరణం చేశాడు. ఈ ప్యాలెస్‌లో మూడు ప్రధాన భవనాలు ఉన్నాయి. పశ్చిమ భాగంలో ఉన్న భవనాన్ని నజరిబాగ్ అని పిలుస్తారు. ప్రస్తుతం ప్యాలెస్ తూర్పు భాగంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు.

బషీర్‌బాగ్ ప్యాలెస్

పాయెగా వంశానికి చెందిన ఆస్మాన్ జా బషీర్-ఉద్-దౌలా ఫతేమైదాన్ వద్ద బషీర్‌బాగ్ ప్యాలెస్‌ను నిర్మించాడు.

సిటీ కాలేజీ

1895లో మీర్ మహబూబ్ అలీఖాన్, మదరసా దార్-ఉల్-ఉలూమ్ అనే మొదటి సిటీ స్కూల్‌ను ప్రారంభించాడు. తర్వాతి కాలంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ దాన్ని విస్తరించాడు. ప్రస్తుతం ఉన్న సిటీ కాలేజీ భవనానికి ఈ స్కూల్‌ను 1921లో మార్చారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ 16 ఎకరాల స్థలంలో ఇండో-సార్సనిక్ శైలిలో సిటీ కాలేజీని రెండు అంతస్తులుగా నిర్మించాడు.

మొజంజాహీ మార్కెట్

1935లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన రెండో కుమారుడైన మొజంజా పేరు మీద మొజంజాహీ మార్కెట్‌ను నిర్మించాడు. దీన్ని పూర్తిగా రాళ్లతో నిర్మించారు. దీనికి ఒక మూలన మినార్‌ను నిర్మించి, అందులో ఒక గడియారాన్ని పొందుపర్చారు.

An E-R diagram is a graphic method of presenting

BANK EXAMS

COMPUTER AWARENESS

Computer Network

A computer network consists of two or more autonomous computers that are connected together in order to share resources(files, printers, modem etc), share application, allow electronic communication etc.

A computer network includes the network operating system in the client and server machines, the cables, which connect different computers and all supporting hardware in between such as bridges, routers & switches. In wireless system, antennas and towers are also part of the network.

Types of Computer Network: Computer network are generally classified according to their structure and the area.

Local Area Network (LAN)

In LAN, computers are connected locally within a room, building or in a small area. LAN can range from simple (two computers) to complex (hundred of computers and peripherals). LANs connect workstations and personal computers. User can share data as well as devices like printers, fax etc and can use LAN to



communicate with each other, by sending e-mail or chatting.

Examples of LAN Technology: Ethernet, Token Ring, and Fiber Distributed Data Interconnect (FDDI).

Characteristics of LAN are:

- Configured to small area i.e. it connects several devices over a distance of 5 to 10 KM.
  - High Speed
  - Low error rates
  - Data and hardware sharing between users.
  - Operates at speed ranging from 10 Mbps to 100 Mbps. Now a day's 1000 Mbps are available.

Network Topology

Topology is physical arrangement of computer system in a network. Or refers to the shape of networks. Some of the most common network topologies are

Bus topology

In bus topology, all devices are connected to a central cable, called the bus or backbone. The bus topology connects workstations using a single cable. Each workstation is connected to the next workstation in a point to point fashion. All workstation connect to the same cable. An extension to the bus topology is tree topology.

Advantage of Bus topology: Installation is easy and cheap. Connections are simple and easy to use. Data can be transmitted from the both sides.

Disadvantage of Bus topology: A single fault in the cable stops all transmission. Fault identification is difficult.

Ring topology

In ring topology, all devices are connected to one another in the shape of a closed loop; so that each device is connected directly to each other i.e. the ring topology connects workstations in a closed loop. Data is transmitted around the ring in one direction only. Each station passing on the data to the next station till it reaches its destination. The common implementation of this topology is token ring.

Advantage of Ring topology: Easy to install and modify the network and fault isolation is simplified.

Disadvantage of Ring Topology: Adding or removing computer disrupts the entire network. A break in the ring can stop the transmission in the entire network. Finding fault is difficult.

Star Topology

Star topology uses a central hub through which, all components are connected. A central hub is the host computer and at the end of each connection is a terminal. Communication on the connecting links between the stations and the central station of star topology can be bi-directional and are point to point.

Advantage of Star Topology: Expansion or modification is easy. Single computer failure does not affect the network.

Disadvantage of Star Topology: Failure in the central hub brings the entire network to halt.

Tree topology

Tree topology is LAN topology in which only one route exists between any two nodes on the network. It is similar to the star topology but the nodes are connected to the secondary hub, which in turn is connected to the central hub.

Advantage of Tree Topology: Installation and configuration of tree network is easy. Less expensive when compared to mesh topology.

Disadvantage of tree Topology: Failure in central hub brings the entire network to a halt. More cabling is required when compared to bus topology.

Mesh topology

Devices are connected with many redundant interconnections between network nodes. In a well connected topology, every node has a connection to every other node in the network. Mesh topology are used in critical connection of host computers [typically telephone exchange]. Alternate path allow each computer to balance the load to other computer systems in the network by using more than one connection path available.

Advantage of Mesh topology: Failure in one of the computers does not affect the entire network. Privacy between computers is maintained as messages travel along dedicated path.

Disadvantage of Mesh Topology: Amount of caballing required is high. A large number of I/O ports are required.

MODEL BITS

1. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is ____.
   1) Generalization
   2) Inheritance
   3) Encapsulation
   4) Information hiding
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting ____.
   1) Primary keys and their relationships
   2) Primary keys and their relationships to instances
   3) Entity classes and their relationships
   4) Entity classes and their relationships to primary keys
   5) None of these
3. ____ is a primary key of one file that also appears in another file.
   1) Physical key 2) Primary key
   3) Foreign key
   4) Logical key 5) None of these
4. SMTP, FTP and DNS are applications of the ____ layer.
   1) Data link 2) Network
   3) Transport 4) Application
   5) None of these
5. Which of the following is the smallest and fastest computer imitating human brain working?
   1) Supercomputer
   2) Quantum Computer
   3) Param-10,000 4) IBM chips
   5) None of these
6. Which of the following statement is wrong?
   1) Windows XP is an operating system
   2) Linux is owned and sold by Microsoft
   3) Photoshop is a graphical design tool by Adobe
   4) Linux is free and open source software
   5) None of these
7. What is the full form of SDRM?
   1) Shift Dynamic random access memory
   2) Synchronous Dynamics random access memory
   3) System Dynamic random access memory
   4) Serial Dynamic random access memory
   5) Synchronous Dynamic random access memory
8. First microprocessor was used in which of the following?
   1) Computer 2) Calculator
   3) Telephones 4) Printers
   5) None of these
9. Which of the following transforms input data into output data?
   1) Peripherals 2) RAM
   3) ROM
   4) CPU 5) None of these
10. BSNL, Reliance, Shaw cable, AOL, Tata Indicom all can be kept in which one of the following groups?
    1) ISDN 2) IRC 3) ISP
    4) ICONS 5) None of these
11. In windows XP, which shortcut is used you lock the computer?
    1) Ctrl + L 2) Windows Key + k
    3) Ctrl + K 4) Scroll Lock key
    5) Windows Key + L
12. What is a 'tuple'?
    1) Another name for a table in an RDBMS.
    2) Another name for the key linking different tables in a database.
    3) Initial seed value of field.
    4) A row or record in a database table.
    5) An attribute attached to a record
13. A spooler is a (n):
    1) Location in memory that maintains the contents of a document until it prints out
    2) Print job
    3) Program that coordinates the print jobs that are waiting to print
    4) Message sent from the printer to the operating system when a print job is completed
    5) None of these
14. A scientific institution performing intensive mathematical operations for a complex model that required extremely powerful computing capabilities will most likely use a (n):
    1) Supercomputer 2) PC
    3) Mainframe 4) ISP
    5) None of these
15. The process ___ involves automated study of consumer buying patterns in order to support marketing, inventory replenishment and pricing decisions.
    1) Transaction processing
    2) Data mining
    3) Simulation
    4) Information processing
    5) None of these
16. Press the ___ button to have the window fill the entire screen.
    1) Close
    2) Maximize
    3) Minimize
    4) All of the above
    5) None of these

KEY

1) 2	2) 3	3) 3	4) 4
5) 2	6) 2	7) 5	8) 2
9) 4	10) 3	11) 5	12) 4
13) 3	14) 1	15) 2	16) 2